వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

VEEKSHANAM, TELUGU MONTHLY

సంపుటి : 19 సంచిక : 4 హైదరాబాద్ 234 ఏప్రిల్ 2021 పేజీలు : 68 రు. 25

- తెలంగాణ బడ్జెట్: అంకెలూ అబద్ధాలూ
- యాదాద్రి డ్రీమ్ ప్రాజెక్టు ఎవరి కోసం?
- ఉక్కు ఉద్యమం - పాలనా వైఫల్యాల నిరసన
- ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ ఎన్నికల ఫలితాలు
- పెట్రోల్ భగ భగ - సామాన్యుడు విల విల
- పెట్టుబడి - స్వేచ్ఛ: వర్తమాన భారతం
- మయన్మార్‌లో సైనిక పాలన బీభత్సం

వీక్షణం రచయితల, మిత్రుల సమావేశం-మార్చ్ 7, 2021 హైదరాబాద్







234

ISSN 2231-6892

వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

ఏప్రిల్ 2021
సంపుటి : 19
సంచిక : 04

'వీక్షణం' పేరిట రచనలు, ఎం.ఓలు, చెక్కులు,డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం
VEEKSHANAM
మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040-66843495
Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

ప్రింటర్స్ : **చరితా ఇంప్రెషన్స్**
ఆజామాబాద్, హైదరాబాద్. ఫోన్ : 040 - 27678411

వీక్షణం చందా వివరాలు

	సంస్థలకు / లైబ్రరీలకు	**వ్యక్తులకు**
విడి ప్రతి	రు. 25	రు. 25
సంవత్సరం	రు. 300	రు. 250
మూడు సంవత్సరాలు	రు. 900	రు. 650
ఐదు సంవత్సరాలు	రు. 1500	రు. 1100
పది సంవత్సరాలు	రు. 3000	రు. 2000

ఆన్‌లైన్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్వారా డబ్బులు పంపేవారు బ్యాంక్ స్లిప్‌లపై '**VEEKSHANAM**' అని రాసి తమ పేరు కూడా రాయాలి. వీక్షణం అకౌంట్ నెంబర్ – **013911011002175** యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్ పేరు మీద వేయాలి. ఇతర బ్యాంకులలో వేసేవారు **UBIN0801399** నెంబర్‌తో పాటు తమ పేరు కూడా రాసి వేయాలి.

పాఠకుల వీక్షణం

వీక్షణం ఆర్థిక పరిస్థితిని వివరిస్తూ చేసిన విజ్ఞప్తికి స్పందిస్తూ వీక్షణంను నిలబెట్టుకోవాలనే తపనతో ఆర్థిక సహాయం అందించిన రోహిత్, హైదరాబాద్ - రు. 3,000; లోచన్, వరంగల్ - రు. 5,000; రాంమోహన్, హైదరాబాద్ - రు. 5,000; ఏలేశ్వరం వెంకటేశ్వర్లు, గోదావరిఖని - రు. 10,000; చిమ్మె జాన్ బర్నబాస్, కర్నూలు - రు. 1,000; ఏనుగు మల్లారెడ్డి, కరీంనగర్ - రు. 5,000; ముత్తన్నగారి రాజేందర్ రెడ్డి, భూంపల్లి-సిద్ధిపేట్ - రు. 500; డి.ఎస్.ఎస్.ఆర్. క్రిష్ణ, రంగారెడ్డి - రు. 1,000; ముత్తన్నగారి సంపదరెడ్డి, భూంపల్లి-సిద్ధిపేట్ - రు. 200; మిత్రులకు కృతజ్ఞతలు - సం.

వీక్షణం ఫిబ్రవరి 2021 సంచికలోని నా వ్యాసం 'జడలు విప్పుకున్న ట్రంపిజం'పై హైదారాబాద్ నుండి షాగిర్ద్ గారు రాసిన విమర్శను వినమ్రంగా స్వీకరిస్తున్నాను. వాజపేయి హయాంలో పార్లమెంట్‌పై దాడి వాస్తవంగా జరిగిందా అన్నది ఇప్పటికీ సందిగ్ధమే. అయితే, ఒక వేళ నిజంగా ఆ దాడి జరిగి ఉంటే ఆ దాడి ప్రభావం దేశంపై ఎలా ఉండేది అన్న ఊహనే నన్ను కలిచి వేసింది. దేశ విభజన సమయంలో జరిగిన విషాద ఘట్టం మరోసారి పునరావృతమయ్యేది కదా అన్న ఆలోచనే ఆ వ్యాసం రాస్తున్నప్పుడు నన్ను డామినేట్ చేసింది. షాగిర్ద్ గారన్నట్టు కాపిటల్ పై దాడికి భారత పార్లమెంట్ పై దాడి అని చెప్పబడుతున్న సంఘటనకు చాలా వ్యత్యాసం ఉంది.

అఫ్జల్ గురు పై ఆ దాడి నేరం మోపి ఉరి తీశారని జరిగిన సంఘటనను ప్రస్తావించానే తప్ప అఫ్జల్ గురు నిష్టాపరుడని, సామాజిక చింతన కలవాడని, చేగువేరా అభిమాని అన్న విషయంలో నాకు రెండవ అభిప్రాయం లేదు. షాగిర్ద్ గారు స్పందించినందుకు కృతజ్ఞతలు. పాఠకులు ఈ రకంగా స్పందిస్తేనే వీక్షణంలో వ్యాసాలూ ఇంకా పదునెక్కుతాయి.

– రాజేంద్రబాబు అర్విణి,
వీక్షణం ఎడిటోరియల్ కలెక్టివ్, హైదరాబాద్

వీక్షణం పత్రిక ప్రతినెలా క్రమం తప్పకుండా అందుతుంది. పత్రికను పదిమందితో చదివించాలనే దానితో నాతోటి మిత్రులకు కూడా వీక్షణాన్ని పరిచయం చేయడం జరిగింది. కాని కొందరికి పత్రిక సరిగ్గా అందడం లేదు. కారణం పోస్టల్ డిపార్ట్‌మెంట్ సమస్య. నేను ఆ విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. వారు అక్కడి పోస్టాఫీసులో కంప్లైంట్ చేసినప్పటి నుంచి పత్రిక కొంచెం ఆలస్యమైనప్పటికీ కొందరికి అందుతుందని చెప్పారు. ఒక్కోసారి పత్రికలు అందకపోవడంతో వీక్షణం కార్యాలయానికి ఫోన్ చేసి తెలిపినప్పుడు తిరిగి మళ్లీ పంపించడం జరిగింది. వీక్షణాన్ని ఇంకా చాలా మందికి పరిచయం చేసి చదివించాలనేది నా కోరిక. సరియైన సమయంలో అందరికి అందేలాగా చూస్తారని ఆశిస్తున్నాను. అలాగే రైతు ఉద్యమంపై కేంద్రం అనుసరిస్తున్న విధానాల పట్ల, విశాఖలోని ఉక్కుపరిశ్రమను ప్రైవేట్ పరం చేయాలని చూస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల పట్ల, దేశంలో రోజు రోజుకు ఎక్కడో ఒకచోట మహిళలపై, దళితులపై దాడులు, ఇంకా వివిధ అంశాల పట్ల ఇంకా సుదీర్ఘమైన వ్యాసాలు రావాల్సిన అవసరం ఎంతో ఉంది.

– కృష్ణహరి
మహబూబ్‌నగర్

వీక్షణం అందిన వెంటనే ఒక్క వ్యాసం వదలకుండా అన్ని వ్యాసాలు చదువుతుంటాను. మార్చ్ సంచికలో లాస్ట్ కవర్ పేజీలో 'వీక్షణం రచయితల, అభిమానుల సమావేశం' ప్రకటన చూశాను. ఈ ప్రకటన చూసిన తర్వాత వీక్షణం పాఠకుడిగా, అభిమానిగా వచ్చి పత్రికపై నా సూచనలను, అభిప్రాయాలను డైరెక్టుగా పంచుకుందామని అనుకున్నాను. కాని అనివార్య కారణాల వల్ల కుదరలేదు. సమావేశం మంచిగా జరిగిందని అనుకుంటున్నాను. వీక్షణంలో మంచి మంచి వ్యాసాలు తేవడంతో పాటు ఇలాంటి సమావేశాలు జరిపి మా లాంటి వారిని ప్రోత్సహించడం నిజంగా అభినందనీయం. దేశంలో జరుగుతున్న రాజకీయ పరిణామాల గురించి, పాలకులు అనుసరిస్తున్న తప్పుడు విధానాల గురించి ఇంకా మెరుగైన వ్యాసాలు సామాన్య పాఠకులకు అర్థమయ్యే విధంగా తీసుకొస్తారని ఆశిస్తున్నాను.

– మాధవ్ కుమార్
జహీరాబాద్

మార్చ్ వీక్షణం పత్రికలో వచ్చిన సంపాదకీయాలతో సహా అన్ని వ్యాసాలు ప్రతి ఒక్కరిని ఏదో ఒక మేర ఆలోచింపజేసేవిగా ఉన్నాయి. ముఖ్యంగా దేశంలోనే కాకుండా అంతర్జాతీయంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రతి సంచికలో వ్యాసాలు వస్తున్నాయి. అలాగే ఎపి విషయానికి వస్తే విశాఖ ఉక్కు కర్మాగార పరిశ్రమను ప్రైవేట్ పరం చేయడానికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాల ప్రయత్నం చేస్తున్నది. ఈ విషయంపై రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. అలాగే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడి ఇన్ని సంవత్సరాలైనా ఇప్పటికి నిరుద్యోగ సమస్య అలాగే ఉన్నది. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టే బడ్జెట్‌లపై ఎప్పటికప్పుడు వ్యాసాలు ప్రచురిస్తున్నారు. అన్ని సమస్యలపై ఎప్పటికప్పుడు రాస్తున్నారు. కాని ఈ సమస్యలకు పరిష్కార మార్గాలను చూపే విధంగా, ప్రతి సామాన్యుడు వాటిని అర్థం చేసుకునే విధంగా వ్యాసాలు రావాల్సి ఉంది. ఇప్పుడున్న కొన్ని పత్రికలను చూస్తుంటే కొన్ని వర్గాలకు చెందినవిగానే ఉంటున్నాయి. కాని వీక్షణం పత్రిక ఎక్కడైతే అన్యాయం జరుగుతుందో ఆ అన్యాయాన్ని ప్రశ్నించే విధంగా ఉంటుంది. ఇంకా మెరుగైన రచనలతో ఇలాగే కొనసాగుతూ సామాన్య ప్రజల వైపు నిలబడాలని కోరుతున్నాను. ఇలాంటి పత్రిక నిలబడడానికి చందా దారులను చేర్పించడంలో నా వంతు కృషి చేస్తాను.

– వెంకటేశ్వర్లు
నిజామాబాద్

కోవిడ్ వల్ల పత్రికలలో సాధారణ వార్తలు రావడం లేదు గనుక అసహజ మరణాల సూచి సమగ్రంగా తయారు చేయడం సాధ్యం కావడం లేదు. కొద్దికాలంగా అసహజ మరణాల సూచి వేయలేకపోతున్నందుకు చింతిస్తున్నాం. సం.

అసహజ మరణాల సూచి జిల్లాల కరస్పాండెంట్లు

తెలంగాణ : ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; ఖమ్మం – సి.ఎచ్. గిరిజ; మెదక్ – ముత్తన్నగారి రాజేందర్‌రెడ్డి; మహబూబ్‌నగర్ – మహమ్మద్ ఇక్బాల్; వరంగల్ – ఓరగంటి ఎల్లయ్య

ఆంధ్రప్రదేశ్ : అనంతపూర్ – కె. నాగేశ్వరాచారి; చిత్తూరు – పలమనేరు బాలాజి; కడప – కొండ్రాయుడు; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; తూర్పు గోదావరి – కె.ఎస్. ప్రకాష్‌రావు; శ్రీకాకుళం – ఆర్. శ్రీలత; విశాఖపట్నం – పి.వి. రమణ

ప్రభుత్వ రంగమనేది మిగులుతుందా?

ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమయ్యే ఈ ఆర్థిక సంవత్సరం దేశ చరిత్రలో, ప్రత్యేకించి ప్రభుత్వ రంగ సంస్థలకు సంబంధించినంతవరకు, అత్యంత కీలకమైన, ప్రమాదకరమైన సంవత్సరంగా మిగిలిపోనున్నది. ఈ సంవత్సరం రెండు ప్రభుత్వ రంగ బ్యాంకులు, ఒక సాధారణ బీమా సంస్థతో సహా అనేక ప్రభుత్వ రంగ సంస్థలలో ప్రభుత్వ వాటాలను తగ్గించుకోనున్నామని, అమ్మివేయనున్నామని ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన బడ్జెట్ లో ప్రభుత్వం ప్రకటించింది. అణుశక్తి, రోదసి, రక్షణ రంగాల్లు; రవాణా, టెలికమ్యూనికేషన్ రంగాలు; విద్యుత్తు, పెట్రోలియం, బొగ్గు, ఇతర ఖనిజాల రంగాలు; బ్యాంకింగ్, బీమా, ద్రవ్య సేవల రంగాలు అనే నాలుగు కీలక రంగాలలో ఇకనుంచి ప్రభుత్వ యాజమాన్యం నామమాత్రంగా ఉంటుందని, ఇక కీలకేతర రంగాలలోని ప్రభుత్వ రంగ సంస్థలన్నిటినీ అమ్మివేయడమో, మూసివేయడమో జరుగుతుందని కూడ ఆ బడ్జెట్ లో తేటతెల్లం చేశారు. అంటే ఈ ఆర్థిక సంవత్సరం గడిచిన తర్వాత కీలకేతర రంగాలనేవాటిలో ఒక్కటంటే ఒక్కటైనా ప్రభుత్వ రంగ సంస్థలు ఉండవన్నమాట. కీలక రంగాలలో కూడ విపరీతమైన అమ్మకం, పెట్టుబడుల ఉపసంహరణ జరుగుతాయన్నమాట. ఈ అమ్మకాల, పెట్టుబడుల ఉపసంహరణకు భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం పెట్టిన కొత్త పేరు 'ద్రవ్యీకరణ'. అంటే ప్రభుత్వ రంగ సంస్థలను ద్రవ్యంగా డబ్బులుగా మార్చడం. "నిరర్థక ఆస్తులుగా పడి ఉన్న ప్రభుత్వ రంగ ఆస్తులు ఆత్మనిర్భర్ భారత్ ను సాధించడంలో ఉపకరించవు. ప్రభుత్వ రంగ సంస్థల దగ్గర ఉన్న అదనపు భూములే ఈ నిరర్థక ఆస్తులు. ఈ భూమిని నేరుగా అమ్మడం ద్వారా, రాయితీలకు ఇవ్వడం ద్వారా ద్రవ్యీకరించవచ్చు" అని ఆర్థిక మంత్రి నిస్సిగ్గుగా ప్రకటించారు. అంటే ప్రభుత్వ రంగ సంస్థల దగ్గర ఉన్న వేలాది, లక్షలాది ఎకరాల భూమిని అమ్మి, ఆ పరిశ్రమలను, సంస్థలను మూసివేసి ప్రభుత్వం సొమ్ము చేసుకోదలచుకున్నదన్నమాట. ఈ సొమ్ము చేసుకునే విధానం కేంద్ర ప్రభుత్వ ఆర్థిక మంత్రిత్వశాఖ, నీతీ ఆయోగ్ ల నేతృత్వంలో శరవేగంగా సాగిపోతున్నది. ఇటువంటి ప్రక్రియలకు ఇప్పుడున్న నిబంధనల ప్రకారం పన్నెండు నెలలు వ్యవధి అవసరం కాదా, దాన్ని 30 రోజులకు తగ్గించాలని ప్రయత్నాలు మొదలయ్యాయి.

ఈ విధానం ప్రకారం ఈ ఆర్థిక సంవత్సరంలో ఒక లక్షా డెబ్బై ఐదు వేల కోట్ల రూపాయలు సంపాదిస్తామని, ఇందులో ఒక లక్ష కోట్ల రూపాయలు ప్రభుత్వ రంగ బ్యాంకుల, బీమా సంస్థల అమ్మకాల నుంచి వస్తాయని, మిగిలిన డెబ్బై ఐదు వేల కోట్ల రూపాయలు ఇతర ప్రభుత్వరంగ సంస్థల వాటాల అమ్మకాల నుంచి వస్తాయని ప్రభుత్వం అంటున్నది. పాడియావు లాంటి ప్రభుత్వ రంగ సంస్థలను తన ఆశ్రితులకు అడ్డికి పావు సేరుగా, కారు చౌకగా అప్పనంగా అప్పగించాలని తలపెడుతున్న ప్రభుత్వ ఇంత సొమ్ము నిజంగా సంపాదించగలదా అనేది ఒక ప్రశ్న. గత సంవత్సరం ఇదే విధంగా రెండు లక్షల పది వేల కోట్ల రూపాయలు ఆదాయం సంపాదిస్తామని ప్రకటించిన ప్రభుత్వ రంగ సంస్థల వాటాల అమ్మకాల కార్యక్రమం ఈ సంవత్సరం బడ్జెట్ నాటికి ముప్పై రెండు వేల కోట్ల రూపాయలుగా సవరించడం జరిగింది. అందులోనూ ఫిబ్రవరి నాటికి ప్రభుత్వానికి దక్కినది రు. 19,499 కోట్లు మాత్రమే. అంటే ప్రభుత్వం ఆశిస్తున్న ఆదాయంలో పది శాతం కూడ ఈ పథకం వల్ల సమకూరలేదు. మరొకవైపు అలా ప్రభుత్వ రంగ సంస్థలు అమ్మి సంపాదించిన సొమ్మును ఏ ప్రజా ప్రయోజనం కోసం వెచ్చిస్తున్నారనే ప్రశ్న మిగిలే ఉంటుంది. అసమర్థంగా, నష్టాలతో నడుస్తున్నాయనే పేరుతో ఈ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు రంగానికి అప్పగించగానే వాటి సామర్థ్యం ఎలా పెరుగుతుందో, అవి ఎలా లాభాల బాట పడతాయో కూడ జవాబు లేని ప్రశ్నే. అయినా నష్టాలతో నడిచే సంస్థలను కొనడానికి ప్రైవేట్ రంగం ఎందుకు ముందుకొస్తుందన్నది మరొక ప్రశ్న. లేదా, వాటిని కారు చౌకగా అమ్మితే ప్రైవేట్ వ్యాపారస్తులు కొనవచ్చు. ఆ పరిశ్రమలను నడిపే ఉద్దేశంతో కాక, ఆ యంత్రాలను పాత ఇనుపసామానుగా అమ్మడానికి, ఆ సంస్థల అధీనంలో ఉన్న భూమిని రియల్ ఎస్టేట్ గా మార్చడానికి కొనుక్కోవచ్చు. వేలాది మంది కార్మికులను వీధిపాలు చేయవచ్చు. కనుక ఆర్థిక ప్రమాణాలతో ఎటువైపు నుంచి చూసినా ప్రైవేటీకరణ అనుచితమూ అక్రమమూ ప్రజా వ్యతిరేకమూ కూడ.

ఇంతకన్న తీవ్రమైనవి చారిత్రక, నైతిక, రాజకీయ ప్రశ్నలు. చారిత్రకంగా చూస్తే, ఈ దేశంలో ప్రభుత్వ రంగం అనేది (ఆ రంగం ప్రజల నుంచి వసూలు చేసిన పన్నులలో కొంత భాగంతో, ప్రజల శ్రమ ఫలితంతో తయారైన సంస్థలు గనుక దాన్ని నిజానికి ప్రభుత్వ రంగం అని కాక ప్రజా రంగం అనాలి) 1950ల నాటి నెహ్రూ ఆదర్శాల మిశ్రమ ఆర్థిక విధానాల వల్ల, ప్రణాళికాబద్ధ అభివృద్ధి వ్యూహం వల్ల రూపొందినవి. ఈ ప్రభుత్వ రంగం సోషలిజానికి ఒక చిహ్నం అనే అనుమానంతో, సోషలిజాన్నీ, ప్రణాళికాబద్ధ విధానాన్నీ నిర్మూలించాలనే లక్ష్యంతో సంఘ్ పరివార్ వీటిని మూసివేయదలచింది. కాని ఐదు సంవత్సరాల కోసం అధికారంలోకి వచ్చిన ప్రభుత్వానికి, ఏడు దశాబ్దాల ప్రజా ధనంతో, శ్రమతో, ఆలోచనలతో, ఆచరణలతో నిర్మాణమైన ప్రజా ఆస్తులను అమ్మివేసే నైతిక అధికారం ఉందా అని ప్రజలందరూ ప్రశ్నించవలసి ఉంది. అలాగే, ఈ దేశ ప్రజలు వలసానంతరం తమకు తాము ఇచ్చుకున్న రాజ్యాంగం ప్రవేశికలోనూ, ఆదేశిక సూత్రాలలోనూ ప్రకటించిన ఆదర్శాలు ప్రభుత్వ రంగానికి, ప్రజాశ్రేయో రంగానికి వీలు కల్పించేవే గాని, ప్రజలను ప్రైవేట్ రంగ లాభాపేక్షకు బలి చేసేవి కావు. అంటే సంఘ్ పరివార్ పాలకులు ఉధృతంగా సాగిస్తున్న ప్రైవేటీకరణ కార్యక్రమం చారిత్రక, నైతిక, రాజకీయ, రాజ్యాంగబద్ధ ప్రాతిపదికలన్నిటి వైపు నుంచీ కూడ వ్యతిరేకించవలసినవి. ప్రతిఘటించవలసినవి. అయితే కేవలం వ్యతిరేకత, ప్రతిఘటన, ఒకరోజో, రెండు రోజులో నామ మాత్రపు సమ్మె, బంద్ వంటివి సరిపోవని కూడ గుర్తించవలసి ఉంది. ప్రభుత్వ రంగం పట్ల చిన్నచూపు కలిగించిన చారిత్రక, సామాజిక, సాంస్కృతిక పరిణామాలను ఎత్తిచూపి సరిచేయవలసి ఉంది. విశాల ప్రజారాశులను ఏకం చేసి, ప్రభుత్వ రంగాన్ని ప్రజా రంగంగా పునర్నిర్మించవలసి ఉంది. ప్రభుత్వ రంగ పరిరక్షణ అనేది కేవలం ఒక నినాదమో, ఒకానొక సంస్కరణ కార్యక్రమమో కాదని, సామాజిక న్యాయం కోసం, శ్రేయస్సు కోసం రూపొందవలసిన ఒక ప్రత్యామ్నాయ ప్రజా రాజకీయార్థిక వ్యవస్థ నిర్మాణ ప్రక్రియలో అనివార్యమైన, అవిభాజ్యమైన భాగమనే చైతన్యాన్ని ప్రచారం చేయవలసి ఉంది. వీ

సంపాదకీయ వ్యాఖ్య - తెలంగాణ

టుపాకి ఎంకట్రామనికి రెండాకులెక్కువ!

దొర ఉపాయాలు జూస్తాంటె అప్సోసు అయితాంది. ఇన్నాల్లు మాటలకు టుపాకి ఎంకట్రాముడే అనుకున్న, గని నోట్ల నించి ఉల్లెక్కాల బంగారు గొలుసులు దీశి కనికట్టు జేశె కాటికాపల తాత గుడ యాదికొస్తాండు. ఏమి కనికట్టు, ఏమి కనికట్టు. నిన్నటిదాక ఊరు కోడై కూశె. ఏడ జూసిన గాలి ఎదురు దిరుగుతాంది, దొరకు ఎటమటమైతాంది, మారె గీ వోట్లల్ల దొర ఎత్తులు పారెటట్టు లేవు అని. గని అవ్వల్ దర్జగ దొర ఆ ముచ్చట తారుమారు జేశి పారేశె. ఓడి పోతరనుకున్నోల్లు, గెలుస్తరని దొరకే నమ్మకం లేనోల్లు గుడ గెలిశి కూసునిరి. గిది సదువుకున్నోల్ల వోట్ల పండుగ గద, జెర సోంచాయించి వోటెయ్యరా, మంచిగ నిలదీసి అడిగెటోల్లను గెలిపియ్యరా, తెలంగాణ గడ్డ మీన గింత అన్నాలమా అనుకుంటాంటెనే పరెషానైపాయె. సదువుకున్నోల్లు గుడ పైసకు, సీసకు వోటేశిరి. ఎదురులేదు సూడు దొరకు అని ఖిలాఫున్నోల్లె గుడ ఎటకారం జెయ్యబట్టిరి. గిది నివద్దేనా అని తాత్పర్యం జేశినోల్లు లేకపాయిరి. మారె, గవ్వి నిజం వోట్లా, పైసకు సీసకు బడ్డ వోట్లు, ఖిలాఫున్నోల్ల వోట్లు నపరింత పంచుకున్నరు గనుక దొర గెల్శిండు గని గవ్వి వోట్లా గది గెలుపా అని యాడనో ఒక కాడ గుసగుస ఇనబడె గాని గట్టిగ రాశె పేపరు లేకపాయె. శెప్పె టీవి లేకపాయె. యూట్యూబో గీట్యూబో గదేందో దాంట్ల పంచాది బెట్టిన గాని గది ఎంతమందికి జేరుతది. ఏడ పొదుగైతది. సరె వోట్ల ముచ్చట గట్ల బోనియి, కాల్లె గలవనియ్యి గాని, వోట్లయినంక రెండొద్దులకే దొర ఏం దండి ఇక్మత్ జేశిండో సూశినవా. సర్కారు నౌకర్లందరిని మాయల ముంచిండు. దొర జేశిన గారడి జూస్తాంటె నాకు శిన్నప్పుడు మా ఊల్లె కాటిపాపల తాత నోట్లె నుంచి బంగారు గొలుసులు దీశిందె యాదికొచ్చింది. గా గారడంత జేశి కొసాకరికి బిచ్చం అడుక్కునెటోడు. నోట్లె గన్ని పైసలు పుట్టిస్తివి, బంగారి గొలుసులు పుట్టిస్తివి, గీ బిచ్చం గాచారమేందని అడుగుతుంటిమి. నాసొమ్ము సొక్కమైతే యాడనో ఉందు, ఈడుందునా అని నవ్వెటోడు. గిప్పుడు దొర గారడి జేశి సర్కారు నౌకర్లకు గిది జేస్త, గది జేస్త అనుడు సొక్కమా కాదా. సొక్కమైతె మూడేండ్ల నుంచి గీ బుద్ధి యాడబాయె. సొక్కం గాకపోతె నౌకర్ల బుద్ధి యాడబాయె. జీతాలు పెంచు తండ్రీ అని మొత్తుకుంటాంటే సప్పుడు జెయ్యకుంట కూసున్నోడు గిప్పుడు దయగల్ల మారాజు తీర్గ శెప్పిందానికన్న ఎక్కువ ఇస్తననె. కని ఇక్మతేందో ఎరికెనా? గా కొసరు మూడేండ్ల కింది నించి ఇయ్యడట, రేపు పొద్దటి నించె ఇస్తడట. అంటే సర్కారి నౌకర్లకు ఫాయిద అయినట్టా, నుక్సానైనట్టా? సర్కారి నౌకర్లు కొలువు నించి దిగిపోయేది అరువై ఏండ్లకే అని పక్క రాష్ట్రంల ఎన్నో ఏండ్ల కిందనే అనంగ, ఈడ నౌకర్లు మాగ్గూడ గట్లనే చెయ్యి బాంచెన్ అని బతిలాడంగ ఇన్నేండ్లు సప్పుడు జేక కూసున్న పెద్దమనిషి ఇయాల్నే కోడి గూశినట్టు అరువై ఒకటి అనె. అది గుడ బోనీ, కొలువులో రామచంద్రా అని లచ్చలకు లచ్చల మంది పడుసు పోరగాండ్లు గగ్గోలు బెడుతాంటె, శెప్పిన కొలువులు గుడ ఇయ్యని మాదండి ఆసామి, గిప్పుడు కొలువుల ఉన్నోల్లకే ఇంకో మూడేండ్లు బారాఖూన్ మాఫ్ అనె. జనం ఏది అడుగుతరో అది జెయ్య, ఏది అడుగరో అది జేశి కనికట్టు జేత్త, అడిగింది జేశినా, అడిగినప్పుడు జెయ్య, అడిగినంత జెయ్య. నా శిత్తం ఒచ్చినప్పుడు జేత్త. నన్నడిగెటంత బిశాదార మీది అని ఊల్లల్ల దొరలు బెదిరిచ్చినట్టుగనే ఉన్నది గద దొర కత. వీ

సంపాదకీయ వ్యాఖ్య - ఆంధ్రప్రదేశ్

పురపాలక ఎన్నికల్లోనూ అదే బాట


మార్చ్ రెండోవారంలో జరిగిన పురపాలక సంస్థల ఎన్నికల ఫలితాల విషయంలో కూడ గత సంచికలో గ్రామీణ స్వపరిపాలనా సంస్థల ఎన్నికల గురించి చేసిన సంపాదకీయ వ్యాఖ్యను యథాతథంగా పునరుక్తం చేయకతప్పడం లేదు. రాష్ట్రంలోని 12 మునిసిపల్ కార్పొరేషన్లు, 58 మునిసిపాలిటీలు, 17 నగర పంచాయతీలలోని 2,213 డివిజన్లకు, వార్డులకు మార్చ్ 10న జరిగిన ఎన్నికల ఫలితాలు మార్చ్ 14న వెలువడ్డాయి. ఈ ఎన్నికలు కూడ ఏడాది కింద జరగవలసి ఉండి, అనేక వివాదాల్లో చిక్కుకుని, చివరికి ఏడాది కిందనే దాఖలైన నామినేషన్ల ఆధారంగానే జరిగాయి. న్యాయస్థానానికి ఎక్కిన వివాదాల వల్ల ఒక కార్పొరేషన్, ఒక మునిసిపాలిటీ ఫలితాలు ఆపివేయగా, మిగిలిన స్థానాల్లో 11 కార్పొరేషన్లలో, 55 మునిసిపాలిటీలలో, 17 నగర పంచాయతీలలో అధికార వైఎస్ ఆర్ సి పి విజయం సాధించింది. తెలుగు దేశం పార్టీ ఎట్టకేలకు రెండు మునిసిపాలిటీలను సాధించింది. ఈ ఎన్నికలు గ్రామీణ స్వయంపాలక సంస్థల ఎన్నికలకు భిన్నంగా రాజకీయ పార్టీల ప్రాతిపదికగా జరుగుతాయి గనుక ఈ ఘన విజయం పట్టణ ప్రజల్లో అధికారపార్టీ పట్ల విస్తృతమైన ఆదరణ ఉన్నదని చూపుతున్నదని వ్యాఖ్యానాలు వెలువడుతున్నాయి. కాని అసలు మన ఎన్నికల విధానంలో వ్యక్తమయ్యేది నిజంగా ప్రజా అభిమతమేనా అనే మౌలిక ప్రశ్నకు జవాబు చెప్పుకోకుండా ఎన్నికల గెలుపు ఓటములను బట్టి పాలకవర్గ పార్టీలలో ఏదో ఒక ముఠాను ప్రజలు ఆదరించారనో, మరొక ముఠాను ప్రజలు తిరస్కరించారనో చెప్పడం సాధ్యం కాదు. సాధారణంగానే మునిసిపల్ ఎన్నికల్లో రాజకీయ పార్టీ విధేయతల కన్న ఎక్కువగా స్థానిక సమస్యలు, కుల విధేయతలు, వ్యక్తిగతంగా అభ్యర్థి పట్ల ఉండే అభిమాన దురభిమానాలు పాత్ర వహిస్తాయి. అందువల్ల ఒక్కొక్క పట్టణంలో ఎన్నికలు ఏ ప్రత్యేకమైన స్థానిక సమస్యల మీద జరిగాయో, ఎన్నికైన అభ్యర్థులు ఉపయోగించిన కుల, ధన, మద్య, ఆకర్షణ, బెదిరింపు, ప్రత్యర్థి వోట్ల చీలిక వంటి సమీకరణాల పూర్తి వివరాలు తెలియకుండా ఒక పార్టీ గెలుపు ఓటముల గురించి మాట్లాడడం కష్టం. అలాగే, ఎన్నికల సమయంలో మాత్రమే డబ్బు, మద్యం ఎర చూపి వోట్లు దండుకునే గత కాలపు పద్ధతిలో కాకుండా ఇటీవలి కాలంలో అధికారంలో ఉన్న పార్టీలు సంక్షేమ పథకాల పేరు మీద ప్రజాధనంతో నిరంతరం తమకు అనుకూలంగా ఉండే వోట్ బ్యాంక్ ను తయారు చేసుకునే పద్ధతి ప్రవేశపెట్టాయి. ఈ పద్ధతి సాధారణంగా అధికార పార్టీకి ఎక్కువ అవకాశాలు కలిగిస్తున్నది. అట్లాగే వై ఎస్ ఆర్ సి పి పట్ల ప్రజల్లో అసంతృప్తి ఉన్నప్పటికీ, ఆ అసంతృప్తిని వాడుకుని ప్రజల విశ్వాసాన్ని చూరగొనే అవకాశం తెలుగుదేశం పార్టీకి లేదు. మిగిలిన పార్టీలు ఆ దరిదాపుల్లోకి కూడ రాగలిగిన స్థితి లేదు. మొత్తం మీద ప్రజలు ఏదో ఒక అభ్యర్థికి, రాజకీయ పార్టీకి తమ అంగీకారాన్నో, తిరస్కారాన్నో తెలిపే అవకాశం లేదు. మొత్తంగానే మన ఎన్నికలకు ఈ నేపథ్యం ఉన్నప్పుడు వీటి ఆధారంగా నిజమైన ప్రజాభిప్రాయ ప్రకటన ఏమిటో విశ్లేషించడం కష్ట సాధ్యం. అందువల్ల ఎన్నికల ఫలితాలను బట్టి నిజమైన ప్రజాభిమతం ఇదే అని చెప్పడం వృథా ప్రయాసే. పాలకవర్గ ముఠాల్లో ఏ ముఠా గెలిచినా, నిరంతరం ఓడిపోయేదీ, ఓడిపోతున్నదీ మాత్రం ప్రజలే. ఆ ప్రజలు తమ ప్రయోజనాలను పరిరక్షించుకోవడానికి లేచి నిలిచిననాడు మాత్రమే నిజమైన ప్రజాస్వామ్యం ఉనికిలోకి వస్తుంది. వీ


ఇజ్రాయిల్ ఎన్నికల్లో ఫలించని నెతన్యాహు వ్యూహం

- ఎ. నర్సింహారెడ్డి


ఇజ్రాయిల్‌లో మార్చ్ 23న జరిగిన ఎన్నికలు గత రెండేళ్లలో నాలుగోసారి. సంవత్సర కాలంగా ప్రధాని బెంజిమెన్ నెతన్యాహుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. ఆయనపై అవినీతి, మోసం, విశ్వాస ఉల్లంఘన వంటి ఆరోపణలు, కరోనా వ్యాధి నివారణలో వైఫల్యం, పెరుగుతున్న నిరుద్యోగం తదితర అంశాలపై ప్రజలు తీవ్రస్థాయిలో ఆందోళన సాగిస్తున్నారు. ఆయనపై వచ్చిన అవినీతి ఆరోపణలకు తగిన ఆధారాలు ఉన్నాయని ఇజ్రాయిల్ సమాజం విశ్వసిస్తోంది. అయితే పీకల్లోతు అవినీతిలో కూరుకుపోయిన నెతన్యాహు తాను ప్రధాని స్థానంలో ఉండి ఆ కేసుల్ని ఎదుర్కోవాలి తప్ప మాజీగా మిగలకూడదని ఆరాటం. గత డిసెంబర్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆమోదంపై రాజకీయ పక్షాల మధ్య అంగీకారం కుదరకపోవడంతో ఇజ్రాయిల్ పార్లమెంట్ (నెస్సెట్) ఆ దేశ రాజ్యాంగ నిబంధన ప్రకారం రద్దయింది. దీంతో నాలుగేళ్లకోసారి జరుగాల్సిన ఎన్నికలు కాస్త మొదటి రెండేళ్లలో నాల్గవసారి నిర్వహించక తప్పలేదు. ఇజ్రాయిల్‌కు లిఖితపూర్వక రాజ్యాంగం లేదు. అక్కడి పార్టీలకు నిర్దిష్టమైన రాజకీయ సిద్ధాంతం లేదు. పాలస్తీనా వ్యతిరేకత, యూదు జాత్యహంకారం, రాజకీయ నాయకుల స్వప్రయోజనాలు మాత్రమే మిగిలాయి. వీటికి గత రెండేళ్లుగా దేశాన్ని పీడిస్తున్న రాజకీయ అనిశ్చితి తోడైంది. దీనికి మూలాలు ఇజ్రాయిల్ ఆవిర్భావంలోనే ఉన్నాయి. వెస్ట్‌బ్యాంకు ప్రాంతంలోని యూదు కాలనీలను క్రమేపీ పెంచుకుంటూ పోవడం, అలా పెంచుతామని హామీ ఇవ్వడమే అన్ని పార్టీలకూ రివాజైంది. ఇదంతా క్రమేపీ దేశంలో మితవాద పక్షం బలపడడానికి దారితీసింది. పశ్చిమాసియాలో అమెరికా సామ్రాజ్యవాదులకు ఇజ్రాయిల్ విశ్వసనీయ మిత్రదేశం.

ప్రతి ఎన్నికలకూ ముందు పాలస్తీనాపై నిప్పులు కక్కడం లేదా దానిపై దాడులు చేయడం ఇజ్రాయిల్‌లో ఎవరు అధికారంలో ఉన్నా రివాజు. నెతన్యాహు పాలస్తీనా ఆధీనంలో ఉన్న వెస్ట్‌బ్యాంకు ప్రాంతాలన్నిటినీ స్వాధీనం చేసుకుంటానని వాగ్దానం చేశారు. ఇజ్రాయిల్‌లో అరబ్ పార్టీల కూటమి జాయింట్ లిస్టును అధికారంలోకి రానీయకుండా ఇజ్రాయిల్ మితవాద పార్టీలూ ప్రయత్నిస్తుంటాయి. వాస్తవానికి 2020 ఎన్నికల్లో అరబ్ జాయింట్ లిస్టు 17 స్థానాలతో కింగ్ మేకర్‌గా ఆవిర్భవించింది. తమతో చేతులు కలిపితే ప్రధాని పదవి దక్కుతుందని, అవినీతిపరుడైన నెతన్యాహూను అధికారానికి దూరం పెట్టొచ్చునని మధ్యేవాద పక్షమైన బ్లూ అండ్ వైట్ పార్టీ నేత గాంట్జ్‌కు ప్రతిపాదన పంపినా ఆయన అంగీకరించలేదు. నెతన్యాహూతో కలిసి గాంట్జ్ సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. సంకీర్ణ ప్రభుత్వంలో అభిప్రాయ బేధాలు ఏర్పడడంతో పార్లమెంట్‌ను రద్దుచేసి నెతన్యాహూ ఎన్నికలకు పిలుపునిచ్చాడు. మార్చ్ 23న జరిగిన ఎన్నికల్లో గతంలాగే ఈసారి కూడ ఏ పార్టీకి ప్రజా తీర్పు అనుకూలంగా రాలేదు. 120 స్థానాలున్న పార్లమెంటులో ప్రభుత్వ ఏర్పాటుకు 61 స్థానాలు ఉండాలి. నెతన్యాహు నేతృత్వంలోని లికుడ్ పార్టీ 30 స్థానాలతో ముందుంది. ఆ తర్వాతి స్థానంలో సెంట్రిస్టు యేష్ అతిన్ పార్టీ 18 స్థానాలు సాధించింది. యునైటెడ్ అరబ్ లిస్టు 6 స్థానాలు సాధించింది. నెతన్యాహూ మితవాద కూటమి గాని, ప్రతిపక్ష మధ్యేవాద కూటమి గాని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేదు. యునైటెడ్ అరబ్ లిస్టు నాయకుడు మన్సూర్ అబ్బాస్ మద్ధతును ఇరు కూటములలోని సభ్యులు వ్యతిరేకిస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేయడంలో విఫలమైతే వచ్చే ఆగస్టులో ఐదవసారి ఎన్నికలు జరగడం తథ్యం. వీ






❖ **విద్యార్థులతో నా అనుబంధం –** ముత్తన్నగారి రాజేందర్‌రెడ్డి – 44 పేజీలు, 1/8 డెమీ, రు. 55, ప్రతులకు: ముత్తన్నగారి రాజేందర్‌రెడ్డి, సహాయోపాధ్యాయుడు (తెలుగు), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, లచ్చపేట్, మండలం దుబ్బాక, జిల్లా సిద్దిపేట్ – 502103, ఫోన్ : 9908240768




❖ **ప్రయాణం –** ఎ రెవల్యూషనరీ రైడ్ – ట్రావెలాగ్ – విప్లవ కుమార్, విజయ్ కుమార్ – భూమి బుక్ ట్రస్ట్ ప్రచురణ – 240 పేజీలు, 1/8 డెమీ, రు. 200, ప్రతులకు: భూమి బుక్ ట్రస్ట్, ఎస్.ఆర్.టి. 267/1, జవహర్‌నగర్, ఆర్‌టిసి క్రాస్ రోడ్స్ దగ్గర, హైదరాబాద్ – 500020, ఫోన్ : 9849908929




❖ **ఆమె** – స్ఫూర్తిమంతమైన మహిళల సక్సెస్ స్టోరీలు – వినోద్ మామిడాల – ఉమెన్స్ టుడే పబ్లికేషన్స్ ప్రచురణ – 144 పేజీలు, 1/8 డెమీ, రు. 130, ప్రతులకు: పాష ఖ1య్యుమ్, హైదరాబాద్, ఫోన్ : 9848216291, అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలలో



❖ **అంతర్వీతం –** సాహిత్య వ్యాసాలు – డా. రూప్‌కుమార్ డబ్బీకార్ – పాలపిట్ట బుక్స్ ప్రచురణలు – 176 పేజీలు, 1/8 డెమీ, రు. 150, ప్రతులకు: పాలపిట్ట బుక్స్, ఇ.నెం. 16-11-20/6/6/1/1, 403, విజయ సాయి రెసిడెన్సీ, సలీమ్‌నగర్, మలక్‌పేట్, హైదరాబాద్ – 500036, ఫోన్ : 040-27678430




❖ **స్లింగ్‌షాట్ –** (అనువదించిన కవితల సంకలనం) – ఎనిశెట్టి శంకర్ – స్నేహ ప్రచురణలు – 160 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: తూర్లపాటి లక్ష్మి, 104, శారద సుందర్ రెసిడెన్సీ, బాపునగర్, చౌడి దగ్గర, సరూర్‌నగర్, హైదరాబాద్ – 500035, ఫోన్ : 9866630739



❖ **ఆంధ్రీకవనం –** అనువాద కవిత్వం – శ్రీశ్రీ – కూర్పు సింగంపల్లి అశోక్‌కుమార్ – శ్రీశ్రీ సాహిత్యనిధి ప్రచురణ – 240 పేజీలు, 1/8 డెమీ, రు. 200, ప్రతులకు: శ్రీశ్రీ సాహిత్యనిధి, 305, ప్రగతి టవర్స్, వీరయ్య స్ట్రీట్, మారుతీనగర్, విజయవాడ – 520004, ఫోన్ : 9246277375



❖ **ఆధునిక భారత తొలి ముస్లిం ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ –** సయ్యద్ నశీర్ అహమ్మద్ – ఆజాద్ హౌస్ ఆఫ్ పబ్లికేషన్స్ ప్రచురణ – 72 పేజీలు, 1/8 డెమీ, రు. 50, ప్రతులకు: ఆజాద్ హౌస్ ఆఫ్ పబ్లికేషన్స్, ఫ్లాట్ నెం. సి-2, శ్రీరామ్ ఆర్కేడ్, అమరావతి రోడ్, ఉండవల్లి, తాడేపల్లి మండలం, గుంటూరు – 522501, ఫోన్ : 9440241727



❖ **అతడే అలిగిన్నాడు... –** కవితల సంకలనం – నూటెంకి రవీంద్ర – జీవనది ప్రచురణలు – 146 పేజీలు, 1/4 క్రౌన్, రు. 200, ప్రతులకు : నూటెంకి రవీంద్ర భారతి, ఇ.నెం. 6-115/1, ఎంకటివాడ, లక్సెట్టి పేట, మంచిర్యాల – 504215, ఫోన్ : 9491533295

సింగమనేని నారాయణ మృతి

రాయల సీమ కథా రచయిత, సాహిత్య విమర్శకుడు సింగమనేని నారాయణ(78) మరణించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఫిబ్రవరి 25న మృతిచెందారు. రైతుల్ని కథల్లో ప్రతిష్ఠించి, తెలుగు భాష, రాయలసీమ అభివృద్ధికోసం ప్రత్యక్ష ఉద్యమాల్లో పాల్గొన్నారు. వృత్తి రీత్యా ఉపాధ్యాయుడైనప్పటికీ రచనలు చేయడం ఆయన ప్రవృత్తి. ఆయన ఎన్నో కథలు, సాహిత్య విమర్శ వ్యాసాలు రాశారు. మొట్టమొదటి కథ 'న్యాయమెక్కడ?' 1960లో కృష్ణా పత్రికలో అచ్చయింది. జూదం (1968), సింగమనేని నారాయణ కథలు (1999), అనంతం (2007), సింగమనేని కథలు (2012) అనే కథా సంపుటాలను వెలువరించారు. 'సీమ కథలు', 'ఇనుప గజ్జెల తల్లి', 'తెలుగు కథలు-కథన రీతులు' తదితర పుస్తకాలకు సంపాదకత్వం వహించారు. 'సంభాషణ' పేరుతో ఒక వ్యాస సంపుటి తెచ్చారు. 'ఆదర్శాలు-అనుబంధాలు', 'అనురాగానికి హద్దులు', 'ఎడారి గులాబీలు' అనే నవలలను వెలువరించారు.

కొల్లూరి చిరంజీవి మృతి

తెలంగాణ తొలి, మలి దశ ఉద్యమకారుడు డా. కొల్లూరి చిరంజీవి(74) ఇకలేరు. గత కొంతకాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మార్చ్ 8న మృతిచెందారు. వరంగల్‌లో జన్మించిన ఆయన కాకతీయ మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ చేశారు. ఆ సమయంలో విప్లవ విద్యార్థి ఉద్యమంలో పనిచేశారు. 1969లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నారు. ఎమర్జెన్సీ కాలంలో విప్లవోద్యమంలో పనిచేశారు. ఎమర్జెన్సీ అనంతరం ఉద్యమం నుంచి బయటికి వచ్చి మెడికల్ ప్రాక్టీసు చేశారు. ఆ క్రమంలోనే బహుజన సమాజ్ పార్టీలో చేరి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు. బహుజన పత్రికకు సంపాదకుడుగా పనిచేశారు. 1969 తెలంగాణ ఉద్యమ వ్యవస్థాపకుల ఫోరమ్‌ను ఏర్పాటుచేశారు. 1948, సెప్టెంబర్ 17 నాటి చారిత్రక వాస్తవాలను వెలుగులోకి తేవాలన్న ఉద్దేశంతో కెప్టెన్ పాండురంగారెడ్డితో కలిసి 'హైదరాబాద్ దక్కన్ డెమోక్రటిక్ అలయెన్స్'ను స్థాపించారు.

తెలంగాణ బడ్జెట్: అంకెలూ, అబద్ధాలూ

ఆదాయ మార్గాలు లేకున్నా అంకెలు పెంచి ప్రవేశపెట్టిన బడ్జెట్ అప్పుల కోసం అర్హత సాధించడానికే తప్ప, ప్రజల మౌలిక అవసరాలను తీర్చడానికి కాదని అంటున్నారు డా. ఎ. పున్నయ్య

మరోమారు తెలంగాణ ప్రభుత్వం నేల విడిచి సాము చేయడానికి అబద్ధపు ఆర్థిక ప్రణాళికను సిద్ధం చేసుకుంది. ఇటీవల కరోనా మహమ్మారి సృష్టించిన పెను ఉత్పాతం వల్ల ప్రభుత్వం గత సంవత్సరం బడ్జెట్‌లో ప్రతిపాదించిన రు. 1,82,914. 42 కోట్లను స్వయంగా రు. 1,66,728. 91 కోట్లకు సవరించుకుంది. దాంట్లో కూడా కేవలం 60 శాతం వరకు ఖర్చు పెట్టినట్లు ప్రభుత్వ తాజా గణాంకాలు నివేదిస్తున్నాయి. కాగా తెలంగాణ ఆవిర్భావం నుంచి ప్రభుత్వం భారీ అంకెలతో ప్రతి ఏటా బడ్జెట్ ప్రతిపాదించడం, దానిని సవరించడం, చివరకు ఏ కొద్ది మొత్తంలో ఖర్చు పెట్టడం రివాజుగా మారింది.

నిజానికి గడిచిన సంవత్సర కాలంలో లాక్‌డౌన్ కారణంగా కొన్నేళ్లుగా ఉపాధి అవకాశాలు కల్పించిన వాణిజ్య సేవలు, సమాచార, సాంకేతిక, స్థిరాస్తి నిర్మాణ రంగాలు ఒక్కసారిగా కుప్పకూలిపోయాయి. ఒక్క వ్యవసాయ రంగం మినహా అన్నిరంగాల ఆదాయాలు తలకిందులైనాయి. దీంతో రాష్ట్రానికి రావాల్సిన ఆదాయం భారీగా కోల్పోయినట్లు ప్రభుత్వమే ప్రకటించుకుంది. ఫలితంగా ఆర్థిక వ్యవస్థ వృద్ధి రేటు కేవలం ఒక శాతానికే పరిమితమైందని, రాష్ట్రానికి ఆదాయం లేక ఉద్యోగులతో పాటుగా ప్రజా ప్రతినిధులకు సహితం సగం జీతాలిచ్చామని సర్దిచెప్పుకుంది. అత్యవసర, నిత్యావసరాలు మినహా అన్ని కార్యక్రమాలను వాయిదా వేసింది.

ఈ సంక్షోభ సమయంలో రాష్ట్ర ఆదాయ వ్యయాల మీద ఆర్థిక నిపుణులతో, హేతుబద్ధంగా, కూలంకషంగా కనీసం చర్చించలేదు. ఒక వాస్తవ ఆర్థిక ప్రణాళిక నమూనాను రూపొందించు కోలేదు. గత అనుభవాలను మరిచి ఈ విపత్కర పరిస్థితుల్లో కూడా వాస్తవ పారదర్శకమైన బడ్జెట్‌ను ప్రవేశపెట్టలేకపోయింది. ఈ సారి కూడా గతం మాదిరిగానే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన భారీ గణాంకాల వార్షిక పద్దు వాస్తవాలకు పూర్తిగా భిన్నంగా ఉంది. రాష్ట్రానికి నిర్దిష్టంగా ఆదాయ వనరులు పెరగలేదు. కోవిడ్ నుండి పూర్తిగా కోలుకోలేదు. అయినప్పటికీ భారీ అంచనాలతో ప్రతిపాదించిన ఈ బడ్జెట్ విమర్శలకు కేంద్ర బిందువుగా మారింది. మరే ఇతర రాష్ట్రంలో లేనంత భారీ అంచనాలతో ఆర్థిక మంత్రి 2021-22 ఆర్థిక సంవత్సరానికి రు. 2,30,825. 96 కోట్ల పద్దును ప్రతిపాదించారు. ఈ పద్దు గత బడ్జెట్ కంటే సుమారు రు. 48 వేల కోట్లు అదనం. గత బడ్జెట్‌లో సవరించిన అంచనాల ప్రకారం చూస్తే ఏకంగా రు. 64 వేల కోట్లు అదనం. స్థూలంగా గత బడ్జెట్‌తో పోలిస్తే ఇది 38 శాతం పరిమాణంలో అధికంగా కనిపిస్తుంది. దీనికి ప్రభుత్వం చెబుతున్న అదనపు ఆదాయ వనరులు మాత్రం నమ్మశక్యంగా లేవు.

బడ్జెట్ సమగ్ర స్వరూపం (అంకెల రు. కోట్లలో)

అంశం	2019-20	2020-21 (సవ..అంచనా)	2021-22 బడ్జెట్
రెవిన్యూ రాబడులు	1,02,543. 82	1,17,757. 84	1,76,126. 94
పెట్టుబడుల రాబడులు	75,964. 72	48,984. 00	53,850. 00
మొత్తం రాబడులు	1,78,508. 54	1,66,741. 84	2,29,976. 94
రెవిన్యూ వ్యయం	1,08,797. 88	1,33,984. 31	1,69,383. 44
పెట్టుబడుల వ్యయం	16,858. 81	10,561. 18	29,046. 77
మొత్తంవ్యయం	1,80,104. 40	1,66,728. 91	2,30,825. 96
రెవిన్యూ మిగులు	-6,254. 06	-16,226. 47	6,743. 50
ద్రవ్య లోటు	31,750. 69	42,399. 85	45,509. 60
ప్రాథమిక లోటు	17,365. 13	27,784. 49	27,925. 22

ఆధారం : తెలంగాణ బడ్జెట్ అంచనాలు 2021-22

అంకెల గారడీ వెనుక ఆంతర్యమేంటి

తెలంగాణ ఆవిర్భావం నుండి రాష్ట్ర ప్రభుత్వం వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నది. ప్రతిష్ట కోసం లేని ఆదాయ వనరులను ఊహించి బడ్జెట్‌లో కాకిలెక్కలకు తెగబడింది. క్రమంగా బడ్జెట్ లెక్కలను అమాంతం భారీగా పెంచి చూపించడం మొదలు పెట్టింది. దీని ఆంతర్యమేమిటంటే ఎఫ్ఆర్‌బిఎం చట్టం ఆధారంగా అధికంగా అప్పులు సమకూర్చుకునే అవకాశముంటుంది. బడ్జెట్‌లో 3.5 శాతం మేర లోన్లు తీసుకునే వెసులుబాటును ఆధారం చేసుకొని ప్రభుత్వం అప్పులను ఆదాయవనరుగా చూపించి బడ్జెట్‌ను భారీగా ప్రదర్శిస్తుంది. 2014 నుంచి 2021 వరకు రాష్ట్ర అప్పులు ఐదున్నర రెట్లు పెరిగాయి. పాత అప్పులకు సంబంధించిన వాయిదాలు, వడ్డీలు కట్టేందుకే రాష్ట్ర బడ్జెట్‌లో రు. 40 వేల కోట్లు ప్రతిపాదించారు. ఎఫ్ఆర్‌బిఎం చట్టపరిధిలో ప్రభుత్వం చేసిన అప్పులు 2022 మార్చి నాటికి రు. 2,86,804 లక్షల కోట్లు ఉంటాయి. అంటే అప్పులు మన బడ్జెట్ కంటే ఎక్కువ. ఇవే కాకుండా ఇరిగేషన్ ప్రాజెక్ట్‌లు, మిషన్ భగీరథ, ఇతర కార్పొరేషన్ల పేరిట రు. 1,05,006 లక్షల కోట్ల రూణాలను ప్రభుత్వ గ్యారంటీతో తెచ్చారు. వీటిని బడ్జెట్‌లో చూపించలేదు. కానీ వాటిని తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వం పైనే ఉంటుంది. వీటన్నింటినీ కలిపితే తెలంగాణలో కనిపించేది అభివృద్ధి కాదు, అప్పుల కుప్పలే. రాష్ట్రంలో సరాసరి ఒక్కొక్కరి నెత్తిపై రు. 81,944 అప్పు ఉంది.

తగ్గిన ఆదాయ వనరులు - వాస్తవికత

కరోనా దెబ్బకు కేంద్రం నుంచి రాష్ట్రాలకు రావాల్సిన ఆదాయం భారీగా తగ్గింది. జీఎస్‌టి వంటి పన్నుల ద్వారా వచ్చే ఆదాయంలో కోత పడుతోంది. అయినా, పన్ను ఆదాయం ఏకంగా రు. 92,910 కోట్లు రానున్నాయంటూ లెక్కలు వేస్తోంది. కేంద్రం నుంచి గ్రాంట్ ఇన్ ఎయిడ్ రూపంలో ఏకంగా రు. 38,669 కోట్లు వస్తున్నాయని అంచనా వేశారు. ఈ పద్దు కింద గతంలో రు. 12 వేల కోట్లు దాటలేదు. ముగుస్తున్న ఆర్థిక సంవత్సరంలో మొదటి పది నెలల్లో కేంద్రం నుంచి వచ్చిన గ్రాంట్ రు. 11 వేల కోట్లు. చివరి రెండు నెలల్లో మరో రు. 2 వేల కోట్ల వరకు రావచ్చని భావిస్తున్నారు. రు. 13 వేల కోట్ల నుంచి ఏకంగా మూడు రేట్లు రు. 38,669 కోట్లకు ఎలా పెరుగుతుందో శాస్త్రీయమైన ఆధారాలు లేవు. దీనికి తోడు వచ్చే ఆర్థిక సంవత్సరంలో భూముల విక్రయం ద్వారా సుమారు రు. 20 వేల కోట్లను సమకూర్చుకోవాలని ప్రభుత్వం అంచనా వేసింది. కానీ గత బడ్జెట్‌లో అంచనా వేసిన భూముల విక్రయం ద్వారా ఒక్క పైసా కూడా రాలేదు. అయినా ఆదాయం సమకూర్చుకోవడానికి భూములను అమ్మచూపడం ఈ ప్రభుత్వానికి సిగ్గుచేటు. ఎందుకంటే ఉమ్మడి రాష్ట్రంలో ప్రభుత్వాలు తెలంగాణ భూములను తెగనమ్మినపుడు గగ్గోలు పెట్టిన వారే ఇప్పుడు తిరిగి అదే పనిచేయడం విడ్డూరం. పారిశ్రామిక రంగానికి కేటాయించిన రు. 3,077 కోట్లలో రు. 2,500 కోట్లు ఇందులో పారిశ్రామికవేత్తలకు రాయితీలుగా, ఐటీ శాఖకు రు. 360 కోట్లు ఇవ్వదలిచిన ప్రభుత్వం కార్మికుల సంక్షేమాన్ని విస్మరించింది. కార్మిక ఉపాధి పద్దు కింద నామమాత్రంగా రు. 436 కోట్లు, పరిశ్రమల పద్దు కింద రు. 1,947 కోట్లు మాత్రమే కేటాయించింది. తెలంగాణ ప్రజల, నిరుద్యోగుల ఆకాంక్ష అయినా రిఇండస్ట్రీలైజేషన్ కొరకు ఈ బడ్జెట్‌లో కూడా ఒక్క రూపాయి కేటాయించలేదు. కార్మిక సంక్షేమం కేంద్ర ప్రభుత్వ పథకాలలో పనిచేస్తున్న కార్మికుల జీతాల పెంపుదలకు ఈ బడ్జెట్‌లో ఎటువంటి విశ్వాసం కల్పించలేదు. రాష్ట్ర ప్రభుత్వ కార్పొరేషన్లలో ఒకటైన ఆర్‌టిసికి చేయూత పట్ల ఎటువంటి స్పష్టతలేదు.

రాష్ట్రానికి ప్రధాన ఆదాయ వనరు

ఆదాయ వనరుల వివరాల్లోకి వస్తే జీఎస్‌టి, అమ్మకపు పన్ను కలిపి రు. 57,500 కోట్లు, ఎక్సైజ్ డ్యూటీ కింద రు. 17 వేల కోట్లు, రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా రు. 12,500 కోట్లు వస్తాయని అంచనా వేశారు. ప్రభుత్వ ఆస్తులు, భూములు అమ్మకం ద్వారా రు. 1,600 కోట్లు, భూములకు మార్కెట్ ధర, రిజిస్ట్రేషన్ ఛార్జీల ద్వారా రు. 6,500 కోట్లు, మద్యం ధరలు పెంచడం ద్వారా రు. 4,390 కోట్లు కలుపుకొని మొత్తం రు. 26,000 కోట్ల ఆదాయం అంచనా వేసింది. వీటితో పాటు ఈసారి కూడా రుణాల ద్వారా నిధుల సమీకరణపై ప్రభుత్వం ఆధారపడనుంది. బహిరంగ మార్కెట్ నుంచి రుణాల ద్వారా రు. 47,500 కోట్లు సేకరించాలని నిర్ణయించింది. మొత్తంగా ఈసారి రెవెన్యూ రాబడుల కింద రు. 1. 76 లక్షల కోట్లకు పైగా వస్తాయని అంచనా వేసింది. ఇక రెవెన్యూ ఖర్చు కూడా రు. 1. 69 లక్షల కోట్లకు పైగా ఉంటుందని బడ్జెట్ అంచనాల్లో పేర్కొంది. రెవెన్యూ మిగులు రు. 6,743 కోట్లుగా చూపెట్టి ద్రవ్యలోటు రు. 45,509 కోట్లు ఉంటుందని అంచనా వేసింది. రాష్ట్రానికి ఉన్న పరపతి నేపథ్యంలో ఇది సాధ్యమే. ఎక్సైజ్ ఆదాయం, వాహనాలపై విధించే పన్ను వంటి వాటి ద్వారా కూడా ఆదాయం పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల ఆదాయం ఏకంగా రు. 12,500 కోట్లు అంచనా వేశారు. గత ఏడాదితో పోలిస్తే ఇది రెట్టింపు. రిజిస్ట్రేషన్ల సంఖ్య రెట్టింపు కావడమో, రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచడం వల్లో మాత్రమే ఇది సాధ్యం అవుతుంది. అయితే ద్రవ్యలోటు భారీగా ఉన్న నేపథ్యంలో ఆదాయం పెంచుకునే మార్గాలను ప్రభుత్వం అన్వేషించక తప్పదు. ఎక్సైజ్ అమ్మకాలను ప్రోత్సహించడం, ఎక్సైజ్ సుంకాన్ని పెంచడం, భూములను విక్రయించడం, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల చార్జీలను పెంచడం మినహా ప్రభుత్వానికి మరో మార్గం లేదు. అందుకే త్వరలో ప్రజలకు పన్నుల భారాలు, వాతలు కోతలు అనివార్యం కావచ్చు.

కేటాయింపులు పెరగని భారీ సైజు బడ్జెట్

ఈ బడ్జెట్‌లో కీలక రంగాలకు కేటాయింపులు పెరగలేదు. సంక్షేమం, అభివృద్ధి ప్రధానాంశాలుగా, ప్రస్తుతం అమల్లో ఉన్న సంక్షేమ పథకాలు యథాతథంగా కొనసాగేలా ఈసారి బడ్జెట్‌కు రూపకల్పన చేశారు. విద్య, వైద్యం, వ్యవసాయం, సాగునీటి రంగాలకు తగిన ప్రాధాన్యత ఇవ్వలేదు. అలాగే రైతుబంధు, పెన్షన్‌లు, రుణమాఫీకి తగినన్ని నిధులు కేటాయించలేదు. గత బడ్జెట్‌లో సవరించిన అంచనాలతో పోలిస్తే ఈ బడ్జెట్‌లో స్థూలంగా రు. 64 వేల కోట్లు పెంచినప్పటికీ ప్రాథమిక, కీలక రంగాల్లో ఆ పెంపు ప్రతిఫలించలేదు. కరోనా నేపథ్యంలో వైద్య, ఆరోగ్య శాఖకు నిధులను పెంచాల్సి ఉన్నప్పటికీ కేవలం రు. 110 కోట్లు పెంచి చేతులు దులుపుకున్నారు. పౌర సరఫరాల శాఖకు గతంతో పోలిస్తే కోటి రూపాయలనే అదనంగా కేటాయించారు. దీంతో వచ్చే ఏడాది కూడా కొత్త రేషన్ కార్డులు ఇచ్చేది లేదన్న విషయం ప్రభుత్వం చెప్పకనే చెప్పింది. ప్రభుత్వ ప్రధాన ప్రచార వనరు అయిన డబుల్ బెడ్ రూం ఇండ్ల పథకానికి నిధులు పెంచే బదులు రు. వెయ్యి కోట్ల మేర కోత విధించింది. దీంతో పేదలకు ఇండ్లు కట్టించి ఇచ్చే ఆలోచనకు స్వస్తి పలికినట్లే. ఇదే సమయంలో వ్యవసాయ రంగానికి అదనంగా రు. 500 కోట్లు కేటాయించారు. గత బడ్జెట్‌లో రుణ మాఫీకి డబ్బు కేటాయించని సర్కార్ ఈ దఫా అరకొరగా నిధులు కేటాయించడం చూస్తే ఈ పథకాన్ని ప్రభుత్వం భారంగా భావిస్తున్నట్లు తెలుస్తుంది.

విద్యా రంగానికి ఉత్త చేయి

గతేడాదితో పోలిస్తే ఈసారి మొత్తం బడ్జెట్‌ను భారీగా పెంచగా, కీలకమైన విద్యా శాఖకు మాత్రం ఆ స్థాయిలో కేటాయింపులు పెరగలేదు. గతేడాది విద్యా శాఖకు రు. 12,127 కోట్లు కేటాయించగా ఈసారి రు. 13,608 కోట్లు ప్రకటించారు. విద్యా శాఖకు గతేడాది కంటే రు. 1481 కోట్ల బడ్జెట్‌ను పెంచారు. అయితే మొత్తం బడ్జెట్‌లో విద్యకు కేటాయించింది 5. 89 శాతమే. ఇందులో పాఠశాల విద్యా శాఖకు రు. 11,735 కోట్లు, ఉన్నత విద్యకు రు. 1,873 కోట్లు కేటాయించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రు. 4 వేల కోట్లతో

బృహత్తర విద్యా పథకాన్ని సర్కారు ప్రకటించింది. దీని ద్వారా రాబోయే రెండేళ్లలో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు ఉంటాయని గత సంవత్సరం లగే ఈ సంవత్సరం కూడా ప్రకటించడం విచారకరం. ఉన్నత విద్యా రంగానికి పెంచింది కేవలం రు. 150 కోట్లే. దీంతో యూనివర్సిటీలకు కూడా సర్కారు రిక్తహస్తమే చూపింది. ప్రభుత్వ విద్యా వ్యవస్థలను నిర్లక్ష్యం చేయడం వలన పేద, మధ్యతరగతి కుటుంబాలు చదువుకోకుండా విద్యకు దూరం చేశారు. ప్రైవేట్ యూనివర్సిటీలను ప్రోత్సహించుటకు ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు నిధులను తగ్గిస్తున్నారు. ఎస్సి, ఎస్టి గురుకులాలకు స్పెషల్ డెవలప్‌మెంట్ నిధుల ద్వారా ఖర్చు చేస్తు విద్యాశాఖ నిధులు అని లెక్కలు చూపించడం విస్మయం కలిగిస్తుంది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు అదనంగా రు. 6 వేల కోట్లు, రోడ్లు, భవనాలకు గతంతో పోలిస్తే అధనంగా రు. 5 వేల కోట్లు, సబ్‌ప్లాన్ నిధులను రు. 5 వేల కోట్లకు పెంచి చూయించారు. ఇవిపోను మిగిలిన అన్ని శాఖలకు ఇంచుమించు గత బడ్జెట్ కేటాయింపులనే రీపిట్ చేశారు. దీంతో 38 శాతం బడ్జెట్ పెరుగుదల మాయ స్పష్టమవుతుంది. మరోవైపు భారీ బడ్జెట్‌లో ఎక్కడా కొత్త పథకాలు రూపు దిద్దుకొలేకపోవడం చుస్తే ఈ బడ్జెట్ అభివృద్ధి దిశగా ఉందనుకోవడం ప్రభుత్వ భ్రమే అవుతుంది.

ఎస్సి, ఎస్టి, బిసిలకు కేటాయింపుల బుకాయింపు

రాష్ట్రంలో నానాటికీ అంతర్గతంగా ఏకమవుతున్న ఎస్సి, ఎస్టి, బిసిల గొంతులు సవరించుకోక ముందే తమ రాజకీయ రహదారిని సుగమం చేసుకొనే దిశగా ఎస్సి, ఎస్టి, బిసిల కొరకు ఈ బడ్జెట్‌లో భారీ కేటాయింపులతో బుకాయించడం జరిగింది. గత బడ్జెట్‌లలో కేటాయింపులకే పరిమితమై ఖర్చు చేయని నిధులను చూస్తే ఈ విషయం బోధపడుతుంది. యధాలాపంగా ఈ బడ్జెట్‌లోనూ ఎస్సి, ఎస్టిల ప్రత్యేక అభివృద్ధి నిధికి రు. 33,611. 06 కోట్లు కేటాయించారు. ఎస్సి ఎస్‌డిఎఫ్ కింద రు. 21,306. 84 కోట్లు. ఎస్టి ఎస్‌డిఎఫ్ కింద రు. 12,304. 22 కోట్లు. గత బడ్జెట్‌తో పోలిస్తే రు. 7,304. 81 కోట్లు అదనం. బిసి శాఖకు రు. 5,522. 09 కోట్లు. గత బడ్జెట్‌లో రు. 1,618. 51 కోట్లు అధికంగా కేటాయించింది. కేటాయించిన నిధులను పూర్తి స్థాయిలో ఖర్చు చేసిన దాఖలాలు ఇప్పటివరకు లేకపోవడం గమనార్హం. అందుకే ఈ కేటాయింపులు కూడా బుకాయింపులుగా భావించాల్సి వస్తుంది.

ముగింపు

సర్కారీ ఆదాయం లక్ష కోట్లు పడిపోయింది. కేంద్ర ప్రభుత్వం సాధారణ నిధులతో పాటు జిఎస్టి పైసలూ ఇవ్వట్లేదు. ఈ బడ్జెట్‌లో కొత్త ఆదాయ మార్గాలూ అసల్లేవు. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లోని అంకెల మాటున వాస్తవాలు మరుగునపడ్డాయి. ఆదాయం సమీకరణ, ఉపాధి అవకాశాలు, అభివృద్ధి ప్రశ్నార్థకమయ్యాయి. అప్పులు చేసి సంక్షేమ పథకాలకు కేటాయింపులు చేసినట్టు చూపినా, ఆ భారం మళ్లీ ప్రజలపైనే పడుతుంది. ఇది మేడిపండును తలపిస్తున్నది. చేసిన అంకెల కసరత్తు ప్రజలను భ్రమల్లో పెట్టేందుకే! అధిక కేటాయింపులు చేయడం, ఆ మేరకు ఖర్చు చేయలేని మూలంగా ప్రభుత్వ లక్ష్యాలు నెరవేరడం లేదు. అలాగే ప్రజల ఆశలూ అడియాశలే అవుతాయి. బడ్జెట్‌లో రు. 25,394 కోట్లను తగ్గిస్తూనే సవరించిన బడ్జెట్‌ను రు. 64,097 కోట్లకు పెంచి చూపించారు. పన్నుల ఆదాయం రు. 76 వేల కోట్ల నుంచి రు. 93 వేల కోట్లకు పెరిగింది. అంటే ఆ మేరకు పేద ప్రజలపైనే మళ్లీ పన్నుల భారం మోపారు. 2014 నుంచి ప్రతి ఏటా కనీసం బడ్జెట్‌లో 24 శాతం మేర కోతలు పెడుతూనే ఉన్నారు. పారిశుధ్యం తదితర రంగాలకు బడ్జెట్‌లో భారీగా కేటాయింపులు చేస్తూ ఎస్సి, ఎస్టి, బిసిలు, మైనార్టీలు, మహిళా శిశు సంక్షేమం, ఆరోగ్యం, విద్యారంగం, చివరికి 30 నుంచి 40శాతం మేర తగ్గిస్తూ వస్తున్నారు. అటు కేంద్రం నుంచి నిధులు రాక, ఇటు ఇతర అవకాశాల్లేక ఎలా తీరం చేరుస్తారనేది మిలియన్ డాలర్ల ప్రశ్న.

ప్రతి బడ్జెట్ పైనా ఎన్నికలు, ఓట్ల నీడ పడుతూనే ఉంది. బడ్జెట్ వస్తోందంటే ఉపాధి, ఉత్పత్తి పెరుగుతాయని సహజంగానే ఆశిస్తారు. నిజానికి బడ్జెట్ ఆ దిశగానే ఉండాలి. కానీ, అనుద్పాదక రంగాలపై ఎక్కువ ఖర్చు పెడుతున్న నేపథ్యంలో సర్కారు లక్ష్యాలు, లక్ష్యాలుగానే ఉండిపోతున్నాయి. ప్రత్యామ్నాయ ఆదాయం, ఉత్పాదకతను పెంచే మార్గాలను అన్వేషించకపోవడంతో రాష్ట్రాన్ని సాధారణ సమస్యలతో పాటు ఆర్థిక కష్టాలు చుట్టుముడుతున్నాయి. బడ్జెట్‌లో కొంతమేర ఈ విషయాలు సర్కారు పేర్కొన్నా, కేంద్ర సర్కారు ఇవ్వాల్సిన జిఎస్టి బకాయిలు, గ్రాంట్లు, ఇతర నిధుల గురించి ఎక్కడా చెప్పలేదు. కేంద్రం మాత్రం 'యాక్ట్స్ ఆఫ్ గాడ్' పేరుతో బకాయిలను ఎగ్గొట్టే ప్రయత్నంలో ఉంది. సభలో ఆర్థిక మంత్రి జిఎస్‌డిపి 13.5 శాతం నుంచి 1.3 శాతానికి తగ్గిందని చెప్పారు. కానీ, రెవెన్యూ లోటు ఉన్న తర్వాత బడ్జెట్ అంకెలను పెంచి చూపడంపై ఆర్థిక నిపుణులు ముక్కున వేలేసుకుంటున్నారు. అంటే మరింతగా సాధారణ జనంపై భారాలు వేసేందుకే అనే అనుమానాలున్నాయి. ఈసారి కేటాయించిన వాటిల్లో ఎన్ని నిధులు కోతలు పెడతారో చూడాలి. సాగునీటి రంగానికి రు. 16,931 కోట్లు కేటాయించారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టేందుకు తెచ్చిన అప్పులకే రు. 7 వేల కోట్లు కావాలి. బడ్జెట్‌లో సాగునీటి రంగానికి కేటాయించిన డబ్బులు, పాత బకాయిలు అప్పులు తీర్చడానికే సరిపోతాయి. విద్యార్థులను, యువతను నిర్లక్ష్యం చేశారు. ప్రభుత్వ ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అరకొర నిధులే కేటాయించారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన ఊసే లేదు. వివిధ శాఖల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ గురించి పట్టించుకోలేదు. కనీసం నిరుద్యోగ భృతి ప్రస్తావన లేదు. నిర్దిష్ట ఆదాయం వచ్చే మార్గాల అంచనా లేదు. దళితులకు భూ పంపకం కనుమరుగయింది. నిజానికి రాష్ట్రానికి వస్తున్న ఆదాయాన్ని శాస్త్రీయంగా అంచనా వేసి, ప్రణాళికాబద్ధమైన రాష్ట్రాభివృద్ధికి కృషి చేయాలి. ఉత్పాదక రంగానికి పెద్దపీట వేసి, యువతలో నైపుణ్యాభివృద్ధికి తగినంత ప్రాధాన్యమిచ్చి నూతన ఆదాయ మార్గాలను అన్వేషించాలి. ఇప్పటికైనా ప్రతి బడ్జెట్ రాష్ట్ర సుస్థిర అభివృద్ధికి, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పడుటకు దారితీసేలా చర్యలుండాలి. అప్పుడే ప్రభుత్వ ప్రతిపాదిత బడ్జెట్‌లకు విలువ పెరుగుతుంది.

(రచయిత అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలంగాణ విశ్వవిద్యాలయం) వీ

యాదాద్రి డ్రీమ్ ప్రాజెక్ట్ ఎవరి కోసం?

భక్త రామదాసు ఆలయ నిర్మాణానికి ప్రజాధనాన్ని ఉపయోగించడం చెరసాలలో పెట్టగల నేరమైనప్పుడు, యాదాద్రి నిర్మాణానికి వేల కోట్ల రూపాయల ప్రజాధన వ్యయం నేరం కాదా అని అడుగుతున్నారు **జి. యాదయ్య**

తెలంగాణ రాష్ట్ర పురపాలనా శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు యాదాద్రి లక్ష్మీ నరసింహస్వామి దేవాలయ పునః ప్రతిష్ఠ ముఖ్యమంత్రి కెసిఆర్ 'డ్రీమ్ ప్రాజెక్ట్' అని ట్వీట్ చేసాడు. నిజమే. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి, ఆయన అధికారానికి రాగానే, ఆంధ్రప్రదేశ్‌కు తిరుపతి తిరుమల వేంకటేశ్వరాలయం ఉన్నట్లు తెలంగాణకు యాదాద్రి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం ఉండాలని, తెలంగాణ, ఆంధ్ర, తమిళనాడుల నుంచి స్థపతులను, శిల్పులను పిలిపించి పదిహేను వందల కోట్ల రూపాయల పునర్నిర్మాణ ప్రణాళిక తయారు చేసాడు. వెయ్యి సంవత్సరాల క్రితం నిర్మాణమైన గర్భగుడి (సొరికెలోని రాయిపై నృసింహస్వామి వెలిసాడంటారు) ని, ప్రధాన దేవాలయాన్ని అలాగే ఉంచి విస్తృతపరుస్తున్నారు. దానికి సంబంధించిన వివరాలన్నీ ఫిబ్రవరి 14 ఆదివారం పత్రికల్లో ప్రకటనా వ్యాసాలు, ఫొటోల రూపంలో వెలువడినాయి. ఆసక్తి గలవారు చదువుకోవచ్చు.

ఇంగ్లిష్ లో 'నో స్టోన్ అన్ టర్న్ డ్' అంటారు. అంటే ఏ ప్రయత్నాన్నీ వదల లేదు అని. అట్లే ఈనాడు మనం విస్తృతంగా అలవాటు పడిన గ్రెనైట్ రాయి అనే కృష్ణ శిలలు 42,000 టన్నులు ప్రకాశం జిల్లాలోని గరిజేపల్లి నుంచి పెద్ద పెద్ద క్రేన్లలో తరలించారు. ధ్వజ స్థంభం కొరకు ఏటూరు నాగారం అడవి నుంచి 90 అడుగుల ఎత్తైన టేకు వృక్షాన్ని తరలించారు. తిరుపతి, తిరుమలలో ఉన్న అలిపిరి మెట్లు, మహాద్వారం, ఆనంద నిలయం, గర్భగృహం, పుష్కరిణిలకు పోటీగా దివ్య విమానం, నలుదిశల మంటపాలు, ఆళ్వార్ మండపం, ఆళ్వార్ విగ్రహాలు, వైష్ణవ కూటమి, గాలి గోపురం, క్యూ కాంప్లెక్స్, విష్ణు పుష్కరిణి, రెండు ప్రాకార మంటపాలు, రామలింగేశ్వరాలయం వంటి నిర్మాణాలెన్నో చేస్తున్నారు. అంతా బంగారం, వెండి, ఇత్తడి తాపడాలు.

దేశంలోనే కాదు, ప్రపంచంలోనే అన్నిటికన్న మించిన వైష్ణవాలయంగా దీనిని నిర్మాణం చేయాలని, ఎంత ఖర్చయినా వెనుకాడేది లేదని కెసిఆర్ ఈ మొత్తం "డ్రీమ్ ప్రాజెక్టు"ను త్రిదండి చినజియ్యర్ స్వామి పర్యవేక్షణకు వదిలేశాడు. ఈ చినజియ్యర్ స్వామిది గుంటూరు జిల్లా తెనాలి దగ్గరి చుండూరు. చుండూరు అగ్రవర్ణ రెడ్డి భూస్వాములు దళితుల హత్యాకాండ చేసినపుడు, అక్కడికి వెళ్లి పవిత్ర భారతదేశంలో స్త్రీకి అవమానం జరిగితే రామరావణ యుద్ధమే జరిగిందని, అగ్రవర్ణాల హత్యాకాండను సమర్థించి వచ్చాడు. ముఖ్యమంత్రి కెసిఆర్ ఆయనను తన ముఖ్యమంత్రి ఆసనంలో కూచోబెట్టి పాదపూజ చేసాడు. శంషాబాద్ విమానాశ్రయం దగ్గర రామేశ్వర రావు స్థలాల్లో ఈ స్వామికి ఆవాసాలే కాకుండా ఇంజనీరింగ్ కాలెజ్ వంటి ఎన్నో సంస్థలున్నాయి.

ఈ నిర్మాణమంతా పూర్తయి త్వరలోనే 'మహా సుదర్శన యజ్ఞం' నిర్వహించి ప్రధాని నరేంద్ర మోడీని, ఇరుగుపొరుగు ముఖ్యమంత్రులను, మూడు వేలమంది రుత్విక్కులను, పండితులను, దార్శనికులను ఆహ్వానించి ఈ పునర్నిర్మాణాన్ని ఆవిష్కరించాలనే సంకల్పంతో ఫిబ్రవరి 14న ఈ ప్రకటనలు జారీ చేసారు. పోలవరం ప్రాజెక్టుకు పోటీగా గోదావరిపై కాళేశ్వరం ప్రాజెక్టు తలపెట్టి ఇరవై ఏడు ఆదివాసి గ్రామాలనుంచి ఆదివాసులను నిర్వాసితులను చేసాడు. ఇప్పుడు తిరుపతికి పోటీగా ఈ యాదాద్రి.

తెలంగాణలో గుట్టకు పోవడమంటే యాదగిరి గుట్టకు పోవడమే. అది హైదరాబాదుకు 63 కిలోమీటర్ల దూరంలో ఉండడం, హైదరాబాద్ - వరంగల్ (ఇప్పుడయితే భూపాలపట్నం) హైవే మీద ఉండడం సందర్శకులకు, ముఖ్యంగా యువతీ యువకులకు ఒక ఆకర్షణ. 1986లో ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ప్రకటించిన బిసిలకు నలభై శాతం రిజర్వేషన్లకు వ్యతిరేకంగా అగ్రవర్ణ విద్యార్థులు, ముఖ్యంగా వైద్య, ఇంజనీరింగ్ విద్యార్థులు బూట్ పాలిష్ చేయడం, పల్లీలు అమ్మడం, సేవ్ మెరిట్ స్టిక్కర్లు అంటించుకొని తిరగడం, చందాలు బిచ్చమెత్తడం వంటి "ఆందోళన రూపాల"తో పాటు 'చలో గుట్ట' అని స్కూటర్ల మీద విద్యార్థినీ విద్యార్థులు విహారానికి వెళ్లే "పోరాటరూపాన్ని" కూడ చేపట్టారు.

అయితే కెసిఆర్‌కు తెలంగాణ సంస్కృతి మీద కన్నా ఆచారవ్యవహారాల మీద, మూఢ విశ్వాసాల మీద ఉన్న గురి వల్ల, మరోవైపు ఎన్టీఆర్ వలె భాష మీది ప్రేమ సంస్కృతానికి పట్టం కట్టేదిగా పథకాలు రచించడం వల్ల యాదగిరి గుట్ట కాస్త యాదాద్రి అయింది. దేవుళ్ల మీద ఆయనకున్న భక్తి, చండీ యాగం వంటి యజ్ఞ యాగాదుల పైన విశ్వాసం అన్నీ ఇప్పుడు ప్రభుత్వ కార్యకలాపాలుగా మారినవి.

తెలంగాణలో కొత్తగా ఏర్పడిన జిల్లాలలో మూడు-రాజన్న వేములవాడ (వేములవాడ రాజరాజేశ్వర దేవాలయం), జోగులాంబ గద్వాలతో పాటు యాదాద్రి భోనగిరి జిల్లా కూడ ఏర్పాటు చేసాడు. దీనితో యాదగిరి గుట్ట ఊరు ఏమైనా అభివృద్ధి అయిందా అంటే ఇదివరకే కల్లుకు ప్రసిద్ధమైన ఈ గ్రామంలో ఇపుడు సారా, బ్రాండీ దుకాణాలు పెరిగాయి. జిల్లాకేంద్రం భోనగిరియే కాబట్టి ఈ ఊరికి వచ్చే ప్రత్యేక సౌకర్యాలేమీ లేవు.

అయితే పోటీకి కొన్ని అనుకూల అంశాలు లేకపోతే పోటీతోనే స్వప్నాలను ప్రమోట్ చేయలేం. తిరుపతి వేంకటేశ్వరుడు తమిళులకు కూడ ఆరాధ్యదైవమే. అంతకన్న దేశవ్యాప్తంగా మార్వాడీలకు బాలాజీ. వీటన్నిటికన్న అవినీతి, అక్రమార్జన పరులకు స్విస్ బ్యాంకు వంటిది తిరుపతి హుండీ. పామర భక్తులకు ప్రీతిపాత్రమైన విషయమేమంటే ఈ దేవుడు బీబీ నాంచారి అనే ముస్లిం దేవతను కూడ ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. నరసింహస్వామి కూడ చెంచు లక్ష్మిని చేపట్టాడు గాని ఆమె కర్నూలు జిల్లా అహోబిలంలో ఉన్న చెంచులక్ష్మి అనేది పాలమూరు,

పారిస్ కమ్యూన్: చారిత్రక పాఠాలు

శ్రామిక వర్గ రాజ్యాధికారపు తొలి అడుగైన పారిస్ కమ్యూన్ (18 మార్చ్ 1871 - 28 మే 1871) గురించి కొండపల్లి సీతారామయ్య రాసిన ఈ ప్రత్యేక వ్యాసాన్ని పారిస్ కమ్యూన్ నూట యాభై సంవత్సరాల సందర్భంగా...

(కొండపల్లి సీతారామయ్య ఈ వ్యాసాన్ని మొదట 1973లో పిలుపు పక్ష పత్రికలో కె. ప్రభాకర రెడ్డి పేరుతో రాశారు. ఆ తరువాత అది ఒక చిన్న బుక్‌లెట్‌గా శ్రామికవర్గ ప్రచురణల పేరుతో 1973 అక్టోబర్‌లో వరంగల్‌లో జరిగిన విప్లవ రచయితల సంఘం మొదటి సాహిత్య పాఠశాల సందర్భంగా వెలువడింది. తరువాత సృజన మాస పత్రిక 1975 మార్చ్ సంచికలో పునర్ముద్రణ జరుగుతున్నప్పుడు ఒకటి రెండు పదాల మార్పు చేశారు.)

1871 మార్చి 18 వ తేదిన పారిస్ నగరంలో కమ్యూన్ సంస్థాన జరిగింది. ఈ మార్చి 18కి పారిస్ కమ్యూన్‌కు నూట నాలుగు ఏళ్లు నిండాయి. నాలుగు సంవత్స రాలక్రితం ఇదేరోజు కమ్యూన్ యొక్క శత జయంతి ఉత్సవాలు బ్రహ్మాండంగా జరిగాయి. ఈ ప్రపంచ కార్మికులంతా ఈ రోజు కమ్యూన్ పరిరక్షణ కొరకు అపూర్వమైన త్యాగసాంప్రదాయాలను సృష్టించి, అసువులనర్పించిన ఫ్రెంచి కమ్యూనిస్టులకు శ్రద్ధాంజలి ఘటించి, కమ్యూన్ ఆరంభించిన ప్రపంచ సోషలిస్టు విప్లవాన్ని పరిపూర్తి చేయడానికి శపథం తీసుకొంటారు. పారిస్ నగరమంతా ఈ రోజు కోలాహలంగా ఉంటుంది. లక్షలాది ప్రజలు పుష్పగుచ్ఛాలతో కమ్యూన్ స్థాపనకొరకు అసువులర్పించిన వేలాది కార్మిక వీరుల స్మృతిచిహ్నంగా నిలిచిన కమ్యూనార్డుల గోడవద్దకు చేరి శ్రద్ధాంజలి ఘటిస్తారు. అమరవీరుల ఆశయాన్ని సాధించి తీరుతామని ప్రతిజ్ఞ చేస్తారు

పారిస్‌లో కమ్యూన్ స్థాపన జరిగిననాడు సోషలిజం అనేది కేవలం ఒక భావన. ఈనాడది ఆచరణలోనున్న ఒక నూతన సామాజిక విధానం మానవుణ్ణి మరోమానవుడు దోచుకోడానికి వీలులేని, ఎవరిశ్రమ ఫలితం వారికే దక్కే పరిస్థితి, ఒక్క సోషలిస్టు సమాజంతోనే సాధ్యమౌతుందని ప్రపంచమంతటా అత్యధిక ప్రజానీకం ఈనాడు గుర్తించింది. అంతేకాదు. అలాంటి సమాజాన్ని స్థాపించడానికి ఎడితెగని పోరాటాలు భూమి నలుచెరగులా జరుగుతూనే ఉన్నాయి. దోపిడికి తావులేని మరో ప్రపంచాన్ని సృష్టించడానికి అపూర్వ త్యాగదీక్షతో ప్రపంచ వ్యాప్తంగా కొనసాగుతున్న ప్రస్తుత సోషలిస్టు మహోద్యమానికి పారిస్ కమ్యూనే శంకుస్థాపన. యథార్థాన్ని గమనించిన ప్రతి ఒక్కరూ ఈనాడు కమ్యూన్ వీరుల అపూర్వ సాహసాన్ని, త్యాగాన్ని కీర్తించి తప్పక శ్రద్ధాంజలి ఘటిస్తారు. ఉత్తేజంతో పొంగిపోయి. ప్రపంచ సోషలిస్టు విప్లవ పరిపూర్తికి తప్పక శపథం తీసుకొంటారు. మన భారతదేశంలో కూడ సోషలిజం అంటే ఏమిటి? సోషలిస్టు సమాజాన్ని స్థాపించడానికి మార్గాలేమిటి? వగైరా విషయాలలో తూర్పు పడమరలకున్నంత విభేదాలున్నా పాలకవర్గ పార్టీల దగ్గర్నుండి చెప్పుకోదగ్గ ప్రతిపక్షాలన్నీ సామ్యవాదమే దేశాభ్యుదయానికి శరణ్యమని ఈనాడు చాటి చెబుతున్నాయి. సోషలిస్టు సమాజ స్థాపన లక్ష్యంగా చెప్పుకోని పార్టీలు మన దేశంలో ఇప్పుడు చాలా అరుదు. పారిస్ కమ్యూన్ కొరకు ఆనాడు ప్రాణాలు తృణప్రాయంగా ఎంచి పోరాడిన అమర వీరులు నాటిన బీజమే ఈనాడు ఇంతింతై, బ్రహ్మాండమై భూమి నాలుగు చెరగులా వ్యాపించి అప్రతిహతమైన మహోద్యమంగా పరిణమించిందనీ, వారాశించిన ప్రపంచ సోషలిస్టు విప్లవ పరిపూర్తి అతి చేరువలోనే ఉందనీ, గ్రహించడానికి ఇంతకంటే గొప్ప తార్కాణం ఏమి కావాలి?

పారిస్ కమ్యూన్ 'కేవలం పారిస్ సామ్యవాద భావనకు ప్రాతిపదిక చేయడమే కాదు, దోపిడీ వర్గాల ప్రభుత్వాన్ని కూలదోసి పీడిత ప్రజల రాజ్యాన్ని పారిస్ నగరంలో 70 రోజులపాటు కొనసాగించి దోపిడీమూకల ప్రభుత్వాన్ని కూలదోయడంలోనూ, రాజ్యాధికారాన్ని స్వాధీనం చేసుకొన్న తర్వాత దాన్ని నిలబెట్టుకొనేందుకు అపూర్వ సాహసంతో పోరాడడంలోనూ కూడ ప్రపంచం మొత్తం మీద మొట్టమొదటిసారిగా జరిగిన ప్రయత్నమే పారిప్ కమ్యూన్. అందువల్ల సోషలిస్టు సమాజ స్థాపనకై అనేక దేశాలలో జరుగుతున్న విప్లవాలకూ ప్రపంచ సోషలిస్టు విప్లవంలో భాగంగా పలు దేశాల్లో ఈనాడు జరుగుతున్న ప్రజాస్వామిక విప్లవాలకూ పారిస్ కమ్యూన్

కర్నూలు జిల్లాలలో మాత్రమే చెంచులు ఉండడాన్ని బట్టి మనం ఊహించుకోవచ్చు. మైదాన ప్రాంతంలో ఉన్న యాదగిరి గుట్టకు అడవే లేదు. అవి తొమ్మిది గుట్టలుగా విస్తరించినవే కానీ పడమటి కనుమల్లో భాగమైన శేషాచలం అడవుల్లోని ఏడు కొండల వంటివి కావు. ఆ ప్రకృతి అనుకూలత యాదాద్రికి లేదు. పోనీ, మతం కూడ మత్తు మందే కాబట్టి ఎక్సైజు ఆదాయాన్ని మించిన తిరుమల తిరుపతి ఆదాయం వలె ఈ యాదాద్రి ఆదాయం పెరుగుతుందా అంటే అనుమానమే. ఇప్పుడు తిరుపతికి రోజూ డెబ్బై వేల నుంచి లక్ష మంది వస్తారు. గుట్టకు పదివేల మంది వస్తారు. అది యాదాద్రిగా పునర్వైభవం పొందాక ఎంత పెరిగినా ముప్పై నుంచి యాభై వేలకు మించదు. రెవెన్యూ తిరుమలకు మూడు వేల కోట్ల రూపాయలు. యాదాద్రికి డెబ్బై ఎనభై కోట్ల రూపాయలు మాత్రమే. తిరుపతి లోనే విమానాశ్రయం ఉన్నది. యాదాద్రికి 70 కి.మీ. దూరంలో ఉన్నది. తిరుపతి మూడు రాష్ట్రాల సరిహద్దుల్లో ఉన్నది. యాదాద్రికి రైల్వేస్టేషన్ కూడ లేదు. దగ్గరిదైన రాయగిరిలో ఎక్స్ ప్రెస్ రైళ్లు ఆగవు. బోనగిరిలో కూడ సూపర్ ఎక్స్ ప్రెస్ లు ఆగవు.

మరి ముఖ్యమంత్రి పదవిలో ఉన్న దొరగారి కల మీద పదిహేను వందల కోట్ల రూపాయల ప్రజాధనం, ఇంత శ్రమ వెచ్చించవచ్చునా? భద్రాద్రి రామునిపై నిజమైన భక్తితో కంచెర్ల గోపన్న తహసీల్దార్ గా తనకు అందిన ప్రజాధనాన్ని వెచ్చించి రామదాసుగా ఆలయం నిర్మిస్తే చెరసాల పాలయ్యాడు. అది రాచరిక ఫ్యూడలిజం కాలంలో. మరి ప్రజాస్వామ్యంలో ఎన్నికైన ముఖ్యమంత్రిది నేరం కాకుండా పోతుందా?

(రచయిత సామాజిక కార్యకర్త) వీ

మార్గదర్శేకాక ఆయా విప్లవాలను నిర్వహించే విప్లవకారులకు అదొక పెద్ద పాఠశాల, విప్లవ గుణపాఠాలకది పెద్దగని. సోషలిస్టు సిద్ధాంత మహోపాధ్యాయులైన మార్క్స్, ఎంగెల్స్‌లు పారిస్ విప్లవం జరిగిన తర్వాతనే, అనుభవం తీసికొన్న పిమ్మటనే కార్మికవర్గ నియంతృత్వం స్థాపించకుండా సోషలిస్టు సమాజ నిర్మాణం అసాధ్యమని సిద్ధాంతీకరించారు. అలానే పాత రాజ్యాంగ యంత్రాన్ని తుత్తునియలు చేయకుండా దానిమీదనే ఆధారపడి వర్గరహిత సమాజాన్ని నిర్మించడం అసంభవమని కూడ చెప్పారు.

కమ్యూన్ అందించిన గుణపాఠాలను సృజనాత్మకంగా లెనిన్ నాయకత్వం కింద బోల్షివిక్ పార్టీ రష్యాలో అమలు జరిపింది కనుకనే మొదటి ప్రపంచ యుద్ధానంతరం అచ్చట విప్లవాన్ని జయప్రదంగా నిర్వహించి కార్మిక నియంతృత్వాన్ని స్థాపించగలిగింది. రెండవ ఇంటర్నేషనల్ నాయకత్వం కింద పారిస్ కమ్యూన్ పాఠాలు నిరాకరించబడ్డాయి కనుకనే విప్లవ పరిస్థితి ఎంతో అనుకూలంగా ఉన్నప్పటికీ చాలా దేశాలలో విప్లవాలు విఫలమైనాయి. అందువల్ల సోషలిస్టు సమాజ స్థాపన లక్ష్యంగా పురోగమిస్తున్న భారత విప్లవపక్షాలన్నీ కేవలం పారిస్ కమ్యూన్ ఆశయాన్నుంచి ఉత్తేజం పొందడమేగాక దోపిడీవర్గాల నుండి రాజ్యాధికారాన్ని స్వాధీనం చేసుకొనడంలో కూడ దానినుండి పాఠాలు నేర్చుకోవాలి. చివరకు ఆ అధికారాన్ని నిలబెట్టుకోలేక విఫలత చెందడంలో కూడ కమ్యూన్ నుండి అమూల్యమైన గుణపాఠాలను తీసుకోవాలి.

పారిస్ విప్లవానికి దారితీసిన పరిస్థితి

విప్లవ పరిస్థితి లేకుండా ఏ విప్లవము జరగదు. ఒకవేళ అందుకు ప్రయత్నం జరిగినా విఫలత చెందక తప్పదు. పారిస్ విప్లవానికి దారితీసిన పరిస్థితులేమిటి? ఫ్రాన్స్ దేశం జర్మనీతో యుద్ధంలో మునిగి ఉంది. అప్పుడు ప్రష్యన్ ఛాన్సలర్ బిస్మార్కు చేతిలో ఫ్రెంచి సేనలు దెబ్బపై దెబ్బ తింటున్నాయి. ఫ్రాన్స్ ఓడిపోవడం ఖాయమనే భావం దేశమంతటా వ్యాపించిపోయింది. సైన్యంలోనూ, మధ్యతరగతి వారిలోనూ నిరాశ నిస్పృహలు వ్యాపించాయి. దానికి తోడు ఆర్థిక పరిస్థితి కూడా దెబ్బతింది, పరిశ్రమలు మూలపడ్డాయి. నిరుద్యోగం మహమ్మారిలా ప్రబలిపోయింది. ఆర్థిక దుస్థితి మూలంగానూ, యుద్ధ భారంతోనూ, నిరుద్యోగం వల్లను చిన్న చిన్న కుటుంబాలన్నీ విపరీతమైన బాధలకు గురైనాయి. వారి సహనానికి చరమదశ సంప్రాప్తించింది.

ఆ రకంగా ఒక్క కార్మిక వర్గంలోనే కాకుండా ఆనాటి ఫ్రెంచి సమాజంలో అత్యధికంగా ఉన్న చిన్న, మధ్యతరగతి (గ్రామ, పట్టణ) కుటుంబాలన్నింటిలోనూ అసహనం, అశాంతి 'పెచ్చరిల్లి పోయాయి, ఓరిమి నశించింది. ప్రభుత్వం పట్ల మితిమీరిన ద్వేషం పెరిగింది. ప్రభుత్వం శక్తి సామర్థ్యాల మీద ఏ ఒక్కరికి విశ్వాసం లేకుండా పోయింది. కాస్తో కూస్తో ఉదరపోషణకు ఇబ్బంది లేని మధ్యతరగతి (అప్పర్ మిడిల్ క్లాస్) వారిలో కూడా ఆ ప్రభుత్వం జర్మనీ దాడినుండి దేశాన్ని రక్షించగలదనే విశ్వాసం పోయింది. ఫ్రాన్సు జర్మనీకి బానిస కారాదని కోరేవారందరిలో మరో కొత్త ప్రభుత్వ మేర్పడితేతప్ప లాభం లేదనే ధోరణి ప్రబలిపోయింది. ప్రభుత్వ సంస్థగా ఉన్న నేషనల్ అసెంబ్లీ ప్రజలందరి క్రోధాగ్నికి గురి అయింది. వచ్చి అభివృద్ధి విరోధకులైన భూస్వాములతోనూ, పెట్టుబడిదారులతోనూ అది నిండి ఉంది. నేషనల్ అసెంబ్లీలో ఉన్న ఈ అభివృద్ధి నిరోధకులందరూ కలసి ఏ క్షణంలోనైనా తిరిగి ఫ్రాన్సు రాజరికాన్ని స్థాపిస్తారేమోననే భయం ఆఖరికి బూర్జువా రిపబ్లికన్‌లను కూడా పట్టిపీడిస్తోంది. ఈ విధంగా యుద్ధం మధ్యలో దెబ్బపై దెబ్బతింటూ ప్రతిష్ఠనుకోల్పోయి సైనికుల దృష్టిలోనూ ప్రజల దృష్టిలోనూ కూడ చులకనై ఆర్థిక రాజకీయ సంక్షోభాలలో చిక్కుకొని సతమతమై పోతోంది ఫ్రాన్సు ప్రభుత్వం.

పై పరిస్థితులలో ఏ దేశంలోనైనా విప్లవం చెలరేగక తప్పదు. అదే ఫ్రాన్సులో జరిగింది. ఆ విప్లవకర పరిస్థితులే ఫ్రాన్సు ప్రజల్ని విప్లవ పథం వైపు నెట్టాయి. పారిస్ పట్టణాన్ని స్వాధీనం చేసికొని కమ్యూన్‌ను స్థాపించడానికి దారితీశాయి. పెనుతుఫానులా విజృంభించిన ఫ్రెంచి ప్రజల ధాటికి తట్టుకోలేని థియర్స్ ప్రభుత్వం తన సైన్యాన్నీ, ప్రభుత్వోద్యోగుల్నీ తదితర దోపిడీ మూకల్ని వెంటదీసుకొని పలాయనం చిత్తగించింది. భీకర సంగ్రామం జరిగిన తరువాత అమూల్యమైన కార్మిక వీరుల రక్తంతో పారిస్ నగర నడి వీధులు ఆరుణారుణమైన పిమ్మటనే థియర్స్ పలాయనమూ, పారిస్ పట్టణం విప్లవకారుల కైవసం కావడమూ జరిగాయి.

కమ్యూన్ అపూర్వ సంఘటన

ప్రపంచంలో ఇంతకుముందెన్నో తిరుగుబాట్లు జరిగాయి. మానవ సమాజం ఒక మెట్టు తరువాత మరొక మెట్టుగా పరిణామం చెందుతూనే వచ్చింది. అలాంటప్పుడు చరిత్రలో పారిస్ కమ్యూన్‌కే ఇంతటి విశిష్టత ఏర్పడడానికి గాని, మానవ చరిత్ర మొత్తంలోనే ఇది అపూర్వ సంఘటనగా పేర్కొనబడడానికి గాని కారణం ఏమిటి? చరిత్రలో ఎన్నో తిరుగుబాట్లు, విప్లవాలు జరిగిన మాట వాస్తవమే అయినా, మానవ సమాజం ఒక మెట్టు తరువాత మరో మెట్టు అభివృద్ధి పథం వైపు పరిణామం చెందుతూ వచ్చిన సంగతి కూడా నిజమే అయినా ఆ తిరుగుబాట్లు లేదా విప్లవాల అనంతరం అధికారంలోకి వచ్చిన వర్గాలు కూడా దోపిడీ వర్గాలే. సమాజం ఒక దశ నుండి మరో దశకు పరిణామం చెందినా నూతనంగా ఏర్పడిన సమాజంలో కూడా కొత్త రకపు దోపిడీవర్గాలే అధికారంలోకి వచ్చాయి. అంటే చరిత్రలో పారిస్ కమ్యూన్‌కు ముందు జరిగిన విప్లవాలన్నిటి పర్యవసానంగా ఒక రకపు దోపిడీవర్గాలు కూలద్రోయబడి మరొక రకం దోపిడి వర్గాలు అధికారాన్ని హస్తగతం చేసుకొన్నాయి. చరిత్రలో మొట్ట మొదటిసారిగా దోపిడీ చేయబడే వర్గాలు అధికారాన్ని చేసికోవడం పారిస్ కమ్యూన్ స్థాపనలోనే జరిగింది. అందువల్ల నిజంగానే కమ్యూన్ ఒక అపూర్వ సంఘటన.

పారిస్ కమ్యూన్ విశిష్టతను చాటిచెప్పే మరో అంశాన్ని కూడ పరిగణనలోకి తీసుకొని తీరాలి. ఇంతకు పూర్వపు విప్లవాలన్నిటిలోను పాలక వర్గాలు మారినా పాత రాజ్యాంగ యంత్ర మే యథాతథంగా లేదా నామమాత్రమైన మార్పులు చేర్పులతో నూతన వర్గాలకు ఉపకరిస్తూ వచ్చింది. రాజ్యాంగ యంత్రమంటే మార్క్సిస్టు నిర్వచనం ప్రకారం అధికారంలో ఉన్న వర్గం ప్రత్యర్థి వర్గాలను అణచి పెట్టి ఉంచడానికి అవసరమైన యంత్రాంగం.

'...అందులో సాయుధ సైనికులుంటారు. అంతేకాదు గణసంస్థకు ఏ మాత్రము తెలియని జైళ్లు. అన్నిరకాల నిర్బంధాలను అమలు జరపడానికి అవసరమైన వ్యవస్థలు, అనుబంధ సంస్థలు అన్నీ అందులో ఉంటాయి' – ఎంగెల్స్.

కాని 'కమ్యూన్‌లో ఆలా జరగలేదు. కార్మికవర్గం చేతులలోకి అధికారం వచ్చిన మరుక్షణమే అంతకుపూర్వమున్న రాజ్యాంగ యంత్రాన్ని అంటే పాత ప్రభుత్వం తాలూకు సైన్యాన్ని, పోలీసు బలగాన్ని సంపూర్తిగా రద్దు చేసి వేశారు. మొత్తం ప్రజానీకానికి ఆయుధాలిచ్చారు. పాత రాజ్యాంగ యంత్రం నాశనం చేయబడడం ఒక అంశం, ప్రజలందరినీ సాయుధం చేసి కమ్యూన్ రక్షణకొరకు యావత్తు ప్రజానీకం పైన ఆధారపడడం మరొక అంశం. ఇది చరిత్రలో అపూర్వమైన విషయం.

'నాగరికతాయుగం' ఆరంభమైన తర్వాత అంటే సమాజంలో వర్గాలేర్పడిన తరువాత, ఆత్మరక్షణ కొరకు ప్రజలు తమంతటతామొక సాయుధ శక్తిగా ఏర్పడి ఉండడమనే ప్రశ్నకే తావులేకుండా పోయింది. దాని స్థానే పీడిత ప్రజనణచి ఉంచడానికి 'ప్రత్యేకమైన సాయుధ సిబ్బంది' ప్రతి చోటా ఏర్పడింది.

తిరిగి చరిత్రలో మొట్టమొదటిసారిగా పాత రాజ్యాంగ యంత్రం సమూలంగా మట్టు పెట్టబడడమేగాక దానిస్థానే స్వయంగా సాయుధులైన ప్రజలందరి నిర్మాణం ఏర్పడింది. దోపిడీ సమాజం సమూలంగా రద్దుచేయబడింది. కాబట్టి యావత్తు ప్రజానీకాన్ని తమ్ము తాము రక్షించుకోవడానికి సాయుధుల్ని చేయగల అవకాశమూ, అవసరమూ ఏర్పడ్డాయి. పాత రాజ్యాంగ యంత్రాన్ని రద్దుచేయకపోయినా, అలానే స్వయం సాయుధులైన ప్రజానీకంపై ఆధారపడకపోయినా కమ్యూన్ అన్ని రోజులు కూడా మనగలిగి ఉండేది కాదు.

కమ్యూన్ సాధించిం దేమిటి?

మార్చి 18న తిరుగుబాటు జరిగింది. అధికారం ప్రజలపరమైనది. ఆ విప్లవంలో పాల్గొన్న ప్రజానీకమంతా నేషనల్ గార్డుగా ఏర్పడింది. నేషనల్ గార్డు కేంద్ర కమిటీ అధికారాన్ని స్వీకరించింది. మార్చ్ 28న ఎన్నికలు జరిగి పారిస్ కమ్యూన్ ఎన్నుకోబడింది. అప్పటి వరకూ ప్రభుత్వాధికారం వహిస్తూ వచ్చిన నేషనల్ గార్డు కేంద్ర కమిటీ రాజీనామా ఇచ్చి అధికారాన్ని కమ్యూన్‌కు దఖలు పరిచింది. అధికారాన్ని చేపట్టిన మరుక్షణమే కమ్యూన్ అపఖ్యాతిపాలైన పారిస్ పోలీసు బలగాన్ని రద్దుచేసింది. ఆ తరువాత స్థాయీ సైన్యాన్ని (స్టాండింగ్ ఆర్మీ) రద్దు చేసింది. ప్రజానీకమంతటికి ఆయుధాలిచ్చి దానినే నేషనల్ గార్డుగా ప్రకటించింది. తద్వారా మార్చి 30 నాటికే పాత రాజ్యాంగ యంత్రాన్ని సమూలంగా నాశనం చేసి వేసింది.

సాంఘికంగా పీడిత ప్రజల నెదుర్కొన్న సమస్యలన్నిటి పైనా కమ్యూన్ తన, దృష్టిని కేంద్రీకరించింది. మార్క్స్ చెప్పినట్లుగా కమ్యూన్ చేసిన చట్టాలన్నీ ఆచరణ యోగ్యమైనవీ, తక్షణ సమస్యలను పరిష్కరించేవి మాత్రమేగాని ఊహాపథంలో విహరించేవెంతమాత్రమూ కాదు. ఆక్రమిత స్థలాల్లో కట్టుకొన్న ఇళ్లపై పన్ను (1870 అక్టోబర్ నుండి 1871 ఏప్రిల్ వరకు) రద్దుచేసింది. అప్పటికే చెల్లించిన మొత్తాల్ని భవిష్యత్తులో చెల్లించబోయే పద్దుల కింద జమ వేసింది. ఏ ప్రభుత్వోద్యోగికి గాని, నిపుణుడైన కార్మికునికిచ్చే జీతానికి మించి ఉండరాదని శాసనం చేసింది. దాని ప్రకారం ఆనాటి ఫ్రాన్సులో నెలకు 500 ఫ్రాంకులకు మించి ఏ ఒక్కరికి జీతం ఉండడానికి వీలు లేదు. మత సంస్థలను ప్రభుత్వం నుండి వేరు చేస్తూ శాసనం చేసింది. అప్పటివరకు మతాచార్యులకు ప్రభుత్వం జీతాలిచ్చింది. ఆ పద్ధతిని కమ్యూన్ పూర్తిగా రద్దుచేసింది. చర్చినంతటినీ జాతీయ ఆస్తిగా ప్రకటించింది. పాఠశాలలన్నింటిలో మత సంబంధమైన ఫోటోలు, ప్రార్థనలు తదితర చిహ్నాలేవీ ఉండరాదని నిషేధించింది. అలానే అమలు జరిపిందికూడ. మూతబడిన ఫ్యాక్టరీల వివరాలు సేకరించి ఆ ఫ్యాక్టరీలో పనిచేస్తుండే కార్మికులందరిని కో-ఆపరేటివ్ సంఘాలుగా ఏర్పరచి వానిని నడిపే అధికారాన్ని ఆ సంఘాలకిచ్చింది. ఫ్యాక్టరీలవారిగా ఉండే అలాంటి కో-ఆపరేటివ్ సంఘాలన్నీ ఒక యూనియన్‌గా ఏర్పడాలని కూడ నిర్ణయించింది. బేకరీలో రాత్రిపూట పనిచేసే పద్దతిని నిషేధించింది. వస్తువులు తాకట్టు పెట్టుకొని అప్పులిచ్చే వ్యాపారాన్నంతటిని నిషేధించింది. చట్టబద్ధమైన దోపిడీగా పరిణమించిన జరిమానాల పదద్ధతిని రద్దు చేసింది. ఈ పనులన్నీ కేవలం ఒక మాసంలోనే, యుద్ధరంగంలో ఎడతెగని పోరు సాగిస్తూనే అమలు జరిపిందనే విషయం గుర్తుంచుకోవాలి.

కమ్యూన్ సంకుచితమైన జాతీయ సంస్థకాదు. కమ్యూన్‌లోకి ఇతర దేశాల కార్మికులు కూడ ఎన్నుకోబడ్డారు. అలా ఎన్నుకోబడ్డ వారందరినీ కమ్యూన్ ఆమోదించింది. కమ్యూన్ పతాకం ప్రపంచ రిపబ్లిక్ పతాకం కావడమే అందుకు కారణం. అలానే జాతీయ దురహంకారానికి కమ్యూన్ పూర్తి వ్యతిరేకం.

కమ్యూన్ బూర్జువా పార్లమెంటు వ్యవస్థలాంటి బాతాఖానీ క్లబ్బు కాదు. శాసనసభ మాత్రమే కాకుండా అమలు జరిపే పాలక వ్యవస్థ కూడ అదే. ఈనాడు ప్రపంచ వ్యాపితంగా ప్రజాస్వామిక రాజ్యాలుగా చెల్లుబడి అయ్యే రాజ్యాలన్నిటా పార్లమెంటు వేరు పాలనా యంత్రాంగం వేరు. వాటి రెండింటికి సంబంధం లేదు. అందుకే అలాంటి పార్లమెంటు సంస్థల్ని లెనిన్ కార్యాచరణతో సంబంధం లేని బాతాఖానీ షాపులన్నాడు. కమ్యూన్ వాటికి పూర్తి విరుద్ధం. శాసనాన్ని చేసేదీ అదే. ఆమలుజరిపేది అదే. నిజమైన ప్రజాస్వామిక సంస్థ అది.

అందుకే కమ్యూన్‌ను బూర్జువా ప్రపంచం సహించలేకపోయింది. ప్రజల చేతుల్లోకి ఆయుధాలు రావడం పెట్టుబడిదారీ ప్రపంచానికి ప్రాణాంతకంగా తోచింది. కార్మికునికీ, ప్రభుత్వ ఉద్యోగికీ ఒకే జీతమంటే ఏ పెట్టుబడిదారీ దేశం హర్షించగలుగుతుంది. పోలీసు బలగాన్ని రద్దుచేసిన మరుక్షణం దోపిడివర్గ ప్రభుత్వం మనుగడ సాగించగలదా? అందువల్లనే కమ్యూన్ ప్రవేశ పెట్టిన నూతన వ్యవస్థ బూర్జువా వర్గాన్నంతా కలవర పరచింది. పారిస్‌పై ఎర్రజెండా ఎగరడాన్నది సహించలేకపోయింది.

కమ్యూన్ వీరుల సాహసోపేత పోరాటం

కమ్యూన్ కార్యకలాపాలలో, ఆలోచనా విధానంలో సోషలిస్టుపథం ద్యోతకమయ్యే కొద్దీ విప్లవంలో పాల్గొన్న ఊగిసలాట శక్తులన్నీ క్రమంగా జారిపోనారంభించాయి. సోషలిస్టు సమాజ లక్ష్యం లేకుండా విభిన్న కోణాల నుండి కేవలం థియర్స్ ప్రభుత్వంపై కోపంతో చేరిన మధ్యతరగతి మేధావులు, పెట్టి బూర్జువాజీ, బూర్జువా రిపబ్లికన్‌లు వగైరాలంతా క్రమంగా కమ్యూనుతో తెగతెంపులు చేసుకొన్నారు. ఆ కమ్యూను ఓడిపోతుందనే వాతావరణం ప్రబలిపోయింది. అభివృద్ధినిరోధక వర్గాలన్నీ తమలో తమకున్న కీచులాటలన్నీ మర్చిపోయి కమ్యూనుకు వ్యతిరేకంగా ఒక కొయలిషన్‌గా ఏర్పడ్డారు. గ్రామసీమల్లో ఉండే రైతాంగాన్ని , చేతి వృత్తుల వారిని కూడ ఆ కమ్యూనుకు వ్యతిరేకంగా సమీకరించగలిగారు. పెట్టుబడిదారీ విధానం ఇంకా అభివృద్ధి కాని దేశాలలో రైతాంగాన్ని సమీక రించకుండా, వారిని పెట్టుబడిదారీ రాజకీయాల నుండి వేరు పరచకుండా, ఇంకా స్పష్టంగా మార్క్సిస్టుల పరిభాషలో చెప్పాలంటే రైతాంగంపై కార్మికవర్గపు స్థిరమైన నాయకత్వం ఏర్పడకుండా కార్మికవర్గం సోషలిస్టు విప్లవాన్ని జయప్రదం చేయలేదనటానికి ఇంతకంటే ప్రబల తార్కాణం మరొకటి అవసరం లేదు.

ఆ బలహీనతలు బయటపడేకొద్దీ అభివృద్ధి నిరోధకులంతా మూక ఉమ్మడి దాడి ఆరంభించారు. ఆఖరికి ప్రష్యన్ ఛాన్సలర్ బిస్మార్కు గూడా కమ్యూన్ ప్రభావానికి హడలిపోయి థియర్స్ ప్రభుత్వంతో తనకున్న వైరాన్నీ, తాను అచ్చట చేస్తున్న యుద్ధాన్నీ కూడా మర్చిపోయి కమ్యూన్‌ను అణచివేయడానికే అన్నింటికంటే మించిన ప్రాధాన్యతనిచ్చాడు. కమ్యూన్‌ను ఓడించడానికి తన స్వాధీనంలో ఉన్న లక్ష మంది యుద్ధ ఖైదీలను (ఫ్రెంచి సైనికులను) వదలిపెట్టాడు. ఆ విధంగా జాతీయ, అంతర్జాతీయ అభివృద్ధి నిరోధక శక్తులన్నీ కలిసి కమ్యూన్‌పై దాడిచేశాయి.

కమ్యూన్‌ను రక్షించడానికి చివరివరకు నిలబడింది కార్మికులే. ఐనా

తుదివరకు ప్రాణాలను లెక్క చేయకుండా పోరాడారు. స్త్రీలు, పిల్లలు కూడా అపూర్వ సాహసాన్ని ప్రదర్శించారు. కార్మికులకున్నవన్నీ నాటు ఆయుధాలే. ప్రభుత్వ సైనికులతో పోలిస్తే అవికూడా చాలా తక్కువ. చాలీచాలని ఆయుధాలతోను, నిరాయుధులుగా ఉన్న కార్మికులపై మారణాయుధాలతో ప్రభుత్వ కిరాయి సైనిక మూకలు మారణహోమం కొనసాగిస్తుంటే కార్మిక స్త్రీలు చేతులు ముడుచుకొని కూర్చొనజాలరని ప్రపంచమంతటికీ చాటారు పారిస్ కార్మిక స్త్రీలు. చేతికందిన ఆయుధాలతో పోరాడి ఎంతోమంది వీరవనితలు నేలకొరిగారు. కమ్యూన్ పరిశీలకుడుగానున్న ఒక బూర్జువా రచయిత 1871 మేలో ఒక ఇంగ్లీషు పత్రికలో, "ఫ్రెంచి జాతి అంతా స్త్రీలతో కూడి ఉంటే అదెంత భయంకరమైన జాతిగా పరిణమించేదో"అంటూ విస్తుపోయాడు.

అప్పటివరకు జర్మను సైన్యాలతో చిత్తు చిత్తుగా తన్నులు తింటూ పలాయనం చిత్తగిస్తూ వచ్చిన ఫ్రెంచి సేనాధిపతులంతా నిరాయుధులైన ఫ్రెంచి కార్మికవర్గంపై "తమ పటాటోపాన్నంతా ప్రదర్శించారు. ఒక్క పారిస్ పట్టణంలోనే 30 వేల మందిని నిర్దాక్షిణ్యంగా కాల్చివేశారు. 45 వేల మందిని అరెస్టుచేశారు. అందులో చాలా మందిని ఆ తర్వాత ఉరితీశారు. మరికొన్ని వేల మందిని ప్రవాసం పంపారు. పారిస్‌లో అన్ని వృత్తులలోను విపుణులైన ఎంతోమంది కార్మికులతో కలిపి మొత్తం లక్ష మందిని తన పొట్టన పెట్టుకుంది థియర్స్ ప్రభుత్వం. మొదట్లో కలిసివచ్చిన మిత్రులు మధ్యలో జారిపోవడం మూలంగా కసాయివాణ్ణి నమ్మిన గొర్రెల్లా ఫ్రెంచి రైతాంగం అమాయకంగా దోపిడీ మూకల మోసాలకు గురై కమ్యూన్‌కు వ్యతిరేకంగా నిలిచిన కారణంగా అయితేనేమి, తమ మధ్యవున్న తీవ్ర వైరుధ్యాలన్నీ చంపుకొని ఫ్రాన్స్ మొత్తంలో ఉన్న అభివృద్ధినిరోధకులంతా ఒక కొయలిషన్‌గా ఏర్పడడంవల్ల అయి తేనేమి చివరికా కొయలిషన్‌కు ప్రష్యన్ ఛాన్సలర్ బిస్మార్క్ సైతం కమ్యూన్‌పై పగబట్టి మద్దతునివ్వడం మూలంగా నయితేనేమి, ఎట్టకేలకు మే 28వ తేదీన కమ్యూన్ ఓడిపోయింది. కార్మిక రక్తంతో పునీతమై ఎర్రజెండా పారిస్ నగరంపై తాత్కాలికంగా అవగతమైంది. తిరిగి అచ్చట రాబందుల రాజ్యం నెలకొనగలిగింది. ఇక చాలాకాలం వరకు సోషలిజం బెడద లేదంటూ చంకలు గుద్దుకున్నాడు థియర్స్, ఫ్రెంచి సేనాధిపతులంతా తామేదొక ఘన కార్యాన్ని సాధించినట్లు ఉబ్బితబ్బిబ్బులైనారు. ఫ్రెంచి బూర్జువా వర్గమంతా ఒక పెను గండం నుండి బయటపడ్డట్లు ఊపిరి పీల్చుకుంది. అయితే ఇది జరిగిన నాలుగు నెలలకే బిస్మార్కుతో చావు దెబ్బలు తిని అతనికి పాదాక్రాంతమై ఫ్రెంచి జాతికే అప్రతిష్టాకరమైన సంధిచేసికొంది ఫ్రెంచి ప్రభుత్వం. పరాయి ప్రభుత్వానికి దేశాన్నమ్ముకోవడానికి కూడ సిద్ధమౌతారుగాని పెట్టుబడిదారులు, కార్మిక రాజ్యాన్ని ఆమోదించరని దీనిమూలంగా ఎవరికయినా తెల్సిపోతుంది.

వైఫల్యానికి దారితీసిన కారణాలు

ప్రపంచంలో మొట్ట మొదటి కార్మిక రాజ్యం 70 రోజుల తర్వాత కూలిపోయింది. కమ్యూన్ స్థాపననుండి ప్రపంచ శ్రామిక జన సామాన్యం ఎలా పాఠాలు తీసికొంటుందో దాని ఓటమినుండి గూడా తప్పక పాఠాలు తీసికొంటుంది. కమ్యూన్ ఓటమికి దారితీసిన భౌతిక సిద్ధాంత ఆచరణలకు సంబంధించిన లోపాలను ఒక్కొక్కటిగా తీసికొందాం.

మొదటిది: ఉత్పత్తి శక్తులు అత్యున్నత స్థాయికి పెంపొంది అనుభవం కలిగిన చైతన్యవంతమైన కార్మికవర్గం ఏర్పడినప్పుడు సోషలిస్టు విప్లవ విజయం సులభతరమౌతుంది. ఆనాటి ఫ్రాన్సులో పై రెండు పరిస్థితులు లేవు. అప్పటికి ఫ్రాన్సు దేశంలో పెట్టుబడిదారీ విధానం అంతగా అభివృద్ధి చెందలేదు. ఇంకా ప్రాథమిక దశలోనే ఉంది. ఆధునిక పరిశ్రమలు తగినంతగా పెంపొందలేదు. దేశం మొత్తంమీద సరుకుల అల్పోత్పత్తి విధానమే ఎక్కువ. ఉత్పాదక శక్తులలో ఆర్టిజాన్ (చేతివృత్తులవారు) రైతులు హెచ్చు. అందుకే లెనిన్ "వాస్తవానికి అప్పటికి ఫ్రాన్సు పెటీ బూర్జువా దేశం" అని అన్నారు. అందువల్ల ఆనాటి ఫ్రాన్సులో కార్మికవర్గం సంఖ్యలో కూడ తక్కువ. అంతే కాక ఫ్రెంచి కార్మిక వర్గానికి అప్పటికి తగినంత అనుభవంకూడా లేదు. దానికి తోడు మార్క్సిజానికి వ్యతిరేకమైన ప్రౌధనిజం, బ్లాంక్విజం సిద్ధాంతాల ప్రభావం కూడ తగినంతగా వారి పై ఉంది. భౌతికంగా ఉన్న పై పరిస్థితి యొక్క ప్రభావం విప్లవ ఓటమి పై చాలవుంది.

ఉత్పత్తి శక్తులు అత్యున్నత స్థాయికి అభివృద్ధి చెందని దేశాలలో విప్లవం జరగదా? తప్పకుండా జరుగుతుంది. పై పెచ్చు జరగదనడం, లేదా జరిగినా నెగ్గదనడం మార్క్సిజానికి వ్యతిరేకం. చరిత్రకు కూడ ఆది వ్యతిరేకమే. అంతేకాదు పెట్టుబడిదారీ విధానం సామ్రాజ్యవాదంగా పరిణమించిన తర్వాత ప్రపంచ పెట్టుబడిదారీ విధానం అనే గొలుసులో బలహీనమైన లింకులవద్దనే విప్లవాలు బద్దలవుతాయనేది సర్వాంగీకారమైన సూత్రమైంది కూడా. అయితే ఈ సందర్భంలో తీసికోవలసిన గుణపాఠాలు రెండు.

1. మార్క్సిజం మార్గదర్శకంగాగల సుశిక్షణగల కార్మికవర్గ పార్టీ లేకుండా విప్లవం జయప్రదం కాదు. ఒక వేళ జయప్రదమైనా మనలేదు.

2. పెట్టుబడిదారీ విధానం అంతగా అభివృద్ధి చెందక ఇంకా పెట్టీబూర్జువా దేశంగా ఉన్న దేశంలో అత్యధికంగా ఉండే రైతాంగం పై కార్మికవర్గం సుస్థిరమైన నాయకత్వం సంపాదించకుండానూ, వారిని బూర్జువా రాజకీయాల ప్రభావంనుండి వేరు పరచకుండానూ విప్లవం జయప్రదం కావడం కష్టసాధ్యం. ఒకవేళ సాధ్యమైనా మన లేదు.

సరిగ్గా ఫ్రాన్సులో జరిగిందిదే. ఆనాటికి ఫ్రెంచి కార్మికవర్గానికి మార్క్సిస్టు సిద్ధాంత ప్రాతిపదికగాగల సుశిక్షిత పార్టీ గానీ, బలమైన ట్రేడ్ యూనియన్ గానీ లేవు. అంతేకాదు. ప్రభుత్వం మీద తీవ్రమైన అసంతృప్తి ఉంది. కానీ విప్లవం ఎందుకు చేయాలి. విప్లవ లక్ష్యమేమిటి? దాని కార్యక్రమమేమిటి? వగైరా విషయాలపై సుస్పష్టమైన అవగాహనలేదు. ఈ విప్లవంలో చివరివరకు నిలబడింది కార్మికులే. ఐతే అందులో ప్రధాన పాత్ర వహించినవారు చేతి వృత్తులవారు. వారిపై ప్రౌధనిజం, బ్లాంక్విజంల ప్రభావం చాలా వుంది.

ఇక రైతాంగం సంగతి, రైతాంగంపై కార్మికవర్గ ప్రభావమే శూన్యం. రైతాంగంలో ప్రభుత్వ వ్యతిరేకత హెచ్చుగానే ఉన్నప్పటికీ వారిలో ఉండే అపారమైన వ్యక్తిగత ఆస్తి ప్రభావాన్ని ఆసరాగా తీసికొని సోషలిజాన్ని గూర్చి లేనిపోని అబద్ధ ప్రచారం చేసి కొద్దిరోజులలోనే అభివృద్ధి నిరోధక వర్గాలన్నీ వారిని విప్లవ వ్యతిరేకులుగా మార్చగల్గారు.

ఈ రెండు గుణపాఠాలనూ చాల సీరియస్‌గా తీసికున్నారు కనుకనే రష్యాలో లెనిన్ నాయకత్వం క్రింద విప్లవం జయప్రదమైంది. అదే సమయములో ఈ గుణపాఠాలను సీరియస్‌గా తీసికోని విప్లవాలన్నీ ఓడిపోయాయి. రైతాంగాన్ని సమీకరించి వారిపై కార్యవర్గపు నాయకత్వం సాధించడం పైనా, కేంద్రీకృత ప్రజాస్వామ్యం ఆధారంగాగల ఉక్కు శిక్షణగల కార్మిక పార్టీని నిర్మించడం పైనా రష్యాలో సోషల్ డెమోక్రాట్స్‌లోని మెని లిక్ శక్తులతో లెనిన్ చాలా తీవ్రమైన పోరాటం సాగించడంద్వారానే విప్లవ విజయాన్ని సాధించగలిగారనే విషయాన్ని మర్చిపోవీలుకాదు.

రెండవది: విప్లవం స్పాంటేనియస్‌గా జరిగింది. అందులో పాల్గొన్న వారందరి లక్ష్యం ఒకటికాదు. విభిన్న లక్ష్యాలతో వారందరూ విప్లవంలో చేరారు. కార్మికులతో పాటు పన్నులభారంతో కృంగిపోతున్న షాపుకీపర్ల దగ్గర నుండి జర్మనీతో ఓడిపోకుండా ఫ్రాన్సు దేశాన్ని సంరక్షించడానికైనా తప్పకుండా థియర్స్ ప్రభుత్వం మారితీరాలని భావించే పెట్టీ బూర్జువా దేశభక్తులనుండి నేషనల్ అసెంబ్లీ పై తీరని ద్వేషం కలిగి ఉన్న బూర్జువా రిపబ్లికన్‌ల వరకు అందరూ విప్లవంలో పాల్గొన్నారు. అందువల్లనే అధికారం కార్మికవర్గ కైవసమై కమ్యూన్ ప్రజల్ని సాయుధులుగా చేసి ప్రభుత్వ సైన్యాన్ని రద్దు చేసిన దగ్గర్నుండి కమ్యూన్ నిర్ణయాల్లో సోషలిస్టు ప్రభావం ద్యోతకమయ్యే కొద్ది కార్మికవర్గం మినహా మిగిలినవారంతా క్రమంగా జారుకొన్నారు. కాబట్టి విప్లవం జయప్రదం కావాలంటే ఆ విప్లవం యొక్క లక్ష్యం పైనా, ఆ లక్ష్యాన్ని సాధించుకోవడానికవసరమైన కార్యక్రమం పైనా చైతన్యవంతమైన ప్రజాసమీకరణ జరగడం అత్యవసరం. ఆలా జరగనినాడు విప్లవం దెబ్బతినే అవకాశం తప్పకుండా ఉంటుంది.

మూడవది: దృఢనిశ్చయంతో కార్మికవర్గ నియంతృత్వాన్ని అమలు జరపలేకపోవడం మిగిలినవారంతా జారిపోగా చివరికి నిలిచింది కార్మికవర్గమే. తద్వారా ఆచరణలో అనుకోకుండా కార్మిక నియంతృత్వమే ఉన్నా ఆ నియంతృత్వాన్ని కమ్యూన్ స్థిర సంకల్పంతో అమలు జరపలేకపోయింది. సోషలిజం స్థాపించడానికి కార్మిక నియంతృత్వస్థాపన చాల అవసరమైన షరతు. ఏ దేశంలో పెట్టుబడిదారీ విధానం అంతగా అభివృద్ధి చెంది ఉండలేదో, ఏ దేశంలో ఇంకా సరుకుల అల్పోత్పత్తి విధానం ప్రబలంగా ఉంటుందో అలాంటి దేశాల్లో సోషలిస్టు సమాజం నిర్మించడాన్ని కార్మికవర్గ నియంతృత్వం సాపేక్షికంగా దీర్ఘ కాలికంగానూ, స్థిర సంకల్పంతో కూడ అమలు జరపాల్సి ఉంటుంది అని అనుభవం రుజువు చేసింది. లేకుంటే కూలద్రోయబడిన వర్గాలు పునస్సంఘటితమై సోషలిస్టు విప్లవాన్నే తుదముట్టించగల ప్రమాదం తప్పక సంభవిస్తుంది. పారిస్ కమ్యూన్ అనుభవమూ అదేకాని స్పాంటేనియస్‌గా విజృంభించిన ఫారిస్ విప్లవంలో కార్మికవర్గ నియంతృత్వాన్ని గూర్చిన చైతన్యవంతమైన అవగాహన లేకపోవడం ఆశ్చర్యమేమీ కాదు. అలా లేక పోయిన కారణం చేతనే అధికారం నుండి తొలగింపబడినవర్గం తిరిగి ఊపిరి పీల్చుకొని ఎదురుదాడి చేయడానికి అవకాశం లేకుండా మిలిటరీగాను, తదితర అవసర మార్గాల్లోనూ దానిని దెబ్బపై దెబ్బ కొట్టలేక పోయింది కమ్యూన్.

లెనిన్ అన్నట్టు అంతర్యుద్ధంలో ప్రత్యక్ష మిలిటరీచర్యల ప్రాముఖ్యతను గుర్తించడంలో అది విఫలమైంది. పారిస్ నగరాన్ని స్వాధీనం చేసికొన్న వెంటనే వర్సెయిల్సుపై దాడిజరిపి థియర్స్ ప్రభుత్వానికి ఊపిరి తీసుకొనే అవకాశం లేకుండా చేయాల్సింది. దుర్మార్గులను తిరిగి తల ఎత్తకుండా చావుదెబ్బ కొట్టలేక పోయింది. పెట్టుబడిదారీ సమాజం సృష్టించిన న్యాయసిద్ధాంత పరిధిలోనే అత్యున్నత న్యాయాన్ని స్థాపించాలనే ఊహాజనిత భ్రమలకులోనై ఆర్థిక జీవనంలో ప్రాముఖ్యతగల బ్యాంకుల్ని కూడ స్వాధీనం చేసికోలేదు.

ఆ విధంగా కమ్యూన్ మిలిటరీగాను, ఆర్థికంగానూ శతృవర్గాన్ని నిర్దాక్షిణ్యంగా అణచివేయడానికి పూనుకో లేకపోయింది. అందుమూలంగా క్రమంగా అభివృద్ధి నిరోధక శక్తులన్నింటినీ కూడగట్టి కమ్యూన్‌పై ఎదురుదాడి చేసి దెబ్బతీయడానికి థియర్స్ ప్రభుత్వానికి అవకాశం చిక్కింది. ఒక వైపున ప్రభుత్వం ఆరంభించిన ఎదురుదాడిని తట్టుకోవడం, రెండో వైపున కమ్యూన్ ఎన్నికలు విభిన్న సమస్యలపై శాసనాల తయారీ ఏ పనిపైనా కేంద్రీకరించలేకపోయింది. అందువల్ల మొదటినుండీ చివరివరకూ (మే 28 వరకూ) మిలిటరీగా కమ్యూన్ ఆత్మరక్షణలోనే ఉండిపోవాల్సివచ్చింది. అలాంటి స్థితి విప్లవానికి ఎప్పటికీ ప్రమాదమే. ఒకసారి విప్లవకారుల చేతిలోకి చొరవ వచ్చి ప్రభుత్వాన్ని కూలద్రోసే పరిస్థితి ఏర్పడిన తర్వాత తిరిగి శత్రువులు పునరాలోచించుకొనే అవకాశం కూడ ఇవ్వకుండా దెబ్బపై దెబ్బ కొట్టగలిగితేనే విప్లవం జయప్రదమౌతుంది. కాని కమ్యూన్ అలా చేయలేకపోయింది పెట్టీబూర్జువా ఉదారతకు అది గురైంది. ప్రౌధనిజం ప్రభావంకూడ అందుకు కారణం కావచ్చు. అందుచే పారిస్ కమ్యూన్ వైఫల్యాన్నుండి క్లుప్తంగా ఈ క్రింది నాలుగు గుణపాఠాలను తీసికొని ప్రపంచ కార్మికవర్గం ప్రపంచ సోషలిస్టు విప్లవాన్ని జయప్రదంగా ముగించడానికి పురోగమిస్తుంది.

1. విప్లవ విజయం కొరకు స్పష్టమైన లక్ష్యం, కార్యక్రమాలతో ప్రజల్ని సన్నద్ధం చేయాలి.

2. మార్క్సిజం సిద్ధాంతంగా గల విప్లవకర కార్మికవర్గ పార్టీ లేకుండా విప్లవం జయప్రదం కాదు.

3. కార్మిక నియంతృత్వాన్ని స్థిర సంకల్పంతో అమలు జరపకుండా సోషలిస్టు సమాజ నిర్మాణం అసంభవం.

4. పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందని దేశాలలో కార్మికవర్గం రైతాంగంపై స్థిరమయిన నాయకత్వాన్ని ఏర్పరచుకొనకుండా విప్లవాన్ని జయప్రదం చేయజాలదు.

కమ్యూను అజేయంపై లోపాల కారణంగా కమ్యూన్ విఫలత చెందినా ప్రపంచ సోషలిస్టు విప్లవానికి అది తొలిమెట్టు. కమ్యూన్ తాత్కాలికంగా ఓడిపోయినా అది అజేయం. దాని ఆశయం ఇంకా ప్రపంచ పీడిత ప్రజలందరి హృదయాలలో మారుమ్రోగుతూనే ఉంది. ఒకే ఒక పట్టణంలో లక్ష మందిని పొట్టనబెట్టుకోవడం ద్వారా శాశ్వతంగా కమ్యూన్‌కు సమాధికట్టామని థియర్స్ ప్రభుత్వమూ, ఫ్రెంచి అభివృద్ధి నిరోధకులూ ఉబ్బితబ్బిబ్బై పోయినా, ఇంతలో సోషలిజం ప్రమాదం లేదని వారు చంకలెగరేసినా కమ్యూన్ ఆశయం చావలేదు సరికదా ఆది నేల నాలుగు చెరగులా అనుదినం విస్తరిస్తోంది. ఒక దాని తర్వాత ఒకటిగా పెట్టుబడిదారీ విధానపు కోటగోడలు బద్దలైపోతున్నాయి. కార్మికవర్గ విప్లవాన్ని కాలరాచి వేశానని థియర్స్ ప్రభుత్వం బీరాలు పలికిన ఆరు నెలలు దాటక ముందే పారిస్ నడిగడ్డ పైననే తిరిగి కార్మికోద్యమం తల ఎత్తింది. సోషలిస్టు విప్లవం వర్ధిల్లాలి, పారిస్ కమ్యూన్ వర్ధిల్లాలి అంటూ పారీస్ వీథులన్నీ ప్రతిధ్వనించాయి. ఆ తరువాత కొద్ది సంవత్సరాలకే మార్క్సిస్టు సిద్ధాంత పునాదిపై ఫ్రాన్సులో కార్మికవర్గ పార్టీ అవతరించింది. ఫ్రాన్సు దేశమంతటా ఆ పార్టీ నాయకత్వం కింద పెద్దఎత్తున ఆందోళన జరిగింది. ఆ ఆందోళనతో ఫ్రెంచి ప్రభుత్వం కదిలిపోయి చివరకు కమ్యూన్ విప్లవకారులను విడుదలచేయక తప్పింది కాదు.

అంతేకాదు మరికొంత కాలానికి లెనిన్ ఆధ్వర్యం క్రింద పారిస్ కమ్యూన్ అందించిన గుణపాఠాలతో మూడవ ఇంటర్నేషనల్ ఏర్పడి ప్రపంచ సోషలిస్టు మహా విప్లవానికి సారథ్యం వహించింది. తద్వారా పారిస్ కమ్యూన్ రగిలించిన నిప్పురవ్వ క్రమక్రమంగా మహాజ్వాలగా ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. ప్రపంచాన్నంతటినీ ఆవరించిన సోషలిస్టు విప్లవజ్వాలలో పెట్టుబడిదారీ విధానం నాశనం కాక తప్పదు. ఆ రోజు కూడ చేరువలోనే ఉందని సదుస్తున్న చరిత్ర చెబుతోంది. కమ్యూన్ ఆశయం అజేయం. అప్రతిహతం. అనతికాలంలోనే ఆ ఆశయం సఫలీకృతమై తీరుతుంది. వీ

విశాఖ ఉక్కు ఉద్యమం - పాలనా వైఫల్యాల నిరసన

***పాలకుల విధానాల వల్ల ఏర్పడిన ఆర్థిక సంక్షోభాల సమయంలో, తొలినాటి ఉక్కు ఉద్యమంలోని అనుభవాల వెలుగులోనే సంస్థను కాపాడుకోవడానికి ఐక్యంగా ఉద్యమించాలని అంటున్నారు* దివి కుమార్**

తెలియని ఏ తీవ్ర శక్తులో నడిపిస్తే నడిచే మనుషులు అని మహాకవి శ్రీశ్రీ అన్నట్టు, 1966 నాటి 'విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు' ఉద్యమంలో నేను కూడా నడిచాను. నేనేమీ నాయకుడిని కాను. కానీ చురుకైన కార్యకర్తగా నాటి కృష్ణదేవరాయ పాలిటెక్నిక్, వనపర్తి (మహబూబ్‌నగర్ జిల్లా) కళాశాలలో ఫైనల్ ఇయర్ మెకానికల్ ఇంజనీరింగ్ విద్యార్థిగా పాల్గొన్నాను. నాటి విశాఖ ఉద్యమం గురించి రాస్తున్న వాళ్లు, గుర్తు చేస్తున్న వారు ప్రస్తావించని ఒక ముఖ్య విషయం నాకు మరువలేని ప్రత్యక్ష అనుభవంగా ఉన్న దానిని తప్పక చెప్పుకోవాలి. అది ..

రూపాయి విలువలో 37 శాతం కోత!

ఈ నిర్ణయం శ్రీమతి ఇందిరా గాంధీ ప్రధానమంత్రిగా పగ్గాలు చేపట్టిన అతి కొద్ది నెలల్లోనే జరిగింది. ఆ నిర్ణయంతో విభేదించిన కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి టి.టి. కృష్ణమాచారిని ఇందిరా గాంధీ మార్చివేసినట్లు కూడా గుర్తు. దానితో మా చదువులకు అవసరమైన డ్రాయింగ్ షీట్లు, ఎరేజర్లు, కొన్ని రకాల ఇంజనీరింగ్ టెక్ట్స్ బుక్స్, ఇన్‌స్ట్రుమెంట్ బాక్సులు అవన్నీ గతంలో ఒక రూపాయి ఉండినవి. వెంటనే ఒక రూపాయి 37 పైసలకు పెరిగిపోయాయి. కారణం అవన్నీ విదేశాల నుంచి మనకు దిగుమతి అయి వచ్చినవి కావటం !

మొత్తంగా దేశ ఆర్థిక వ్యవస్థపైన అది ఎంత తీవ్ర ప్రభావం కలిగించిందో మీరే ఊహించుకోవచ్చు. నేటి కోవిడ్ మహమ్మారి పీడించిన కారణంగా ఒక్క వ్యవసాయ రంగం తప్ప మిగిలిన పారిశ్రామిక, సేవ తదితర రంగాలన్నీ మైనస్ అభివృద్ధిలోకి దిగజారినట్లే, 1966-67 ఆర్థిక సంవత్సరంలో పారిశ్రామిక అభివృద్ధి గుండుసున్నా (0) స్థాయిలోనే ఉండిపోయింది. నాకు అంత లోతు విషయాలు అప్పుడు తెలియవు కానీ, భయంకరంగా నిరుద్యోగం వ్యాప్తి చెందడం, మా కళాశాలలోనే కాదు చాలా పాలిటెక్నిక్‌లలో సివిల్ ఇంజనీరింగ్ కోర్సు తాత్కాలికంగా రద్దు చేసుకోవడం మాకు ప్రత్యక్ష అనుభవంలో ఉండింది. అప్పటివరకూ సాగిన 19 సంవత్సరాల కాంగ్రెస్ పరిపాలన పట్ల దాదాపు భక్తి ప్రపత్తులతో, దాన్ని ఆమోదిస్తూ పెరిగిన మాతరం విద్యార్థి యువకులలో, మన స్వాతంత్రం పట్ల, దేశ అభివృద్ధి విధానాల పట్ల అనుమానాలు పొడచూపడానికి, నిరసనలు చెలరేగడానికి, విశాఖ ఉక్కు లాంటి వాటి రూపంలో ఆందోళనలు పెల్లుబకడానికి ఆస్కారం కలిగించింది నాటి ఆర్థిక రాజకీయ పరిస్థితులే!!

అలా డి వాల్యుయేషన్, అనగా రూపాయి ధరలో కోత, దేశ ఆర్థిక రాజకీయాలను ప్రశ్నించే ఆలోచనకు నాలో బీజం వేస్తే, విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు ఉద్యమం దాన్ని మరింత గట్టి పరిచింది.

ఆ విద్యా సంవత్సరపు ఆరంభంలోనే మా కళాశాల ప్రిన్సిపాల్, రామిరెడ్డి గారు విద్యార్థులతో ప్రత్యేకమైన సమావేశం ఒకటి నిర్వహించి రూపాయి 'డీ వాల్యుయేషన్' ఆవశ్యకతను, తప్పనిసరి పరిస్థితులలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సమర్థిస్తూ మాకు పాఠం లాగా బోధించారు. కానీ ఆచరణలో ధరలు పెరగడంతో మాకు ఖర్చులు బాగా పెరిగి అవన్నీ తెలియపరుస్తూ ఇంటికి ఉత్తరాలు రాసుకుని, తల్లిదండ్రులను ఇబ్బంది పెడుతున్నామే అని లోలోపల దిగులు చెందిన కాలం కనుక నాకు ఆ విషయం గాఢంగా ముద్రపడి ఇంకా నా జ్ఞాపకాల్లో మిగిలి ఉంది.

నేను వనపర్తిలో చదువుకుంటున్న కాలంలో విశాఖ ఉక్కు ఉద్యమం కంటే ముందు జరిగిన రెండు ఆందోళనల్లో నేను పాల్గొని ఉన్నాను.

1. అపరాధపు ఫీజుల పెంపునకు నిరసనగా..
2. డిప్లమా నుండి డిగ్రీ ఇంజనీరింగ్ కోర్సులలో చేర్చుకోవాలనేది.

మొదటిది కళాశాల యాజమాన్యంపై నిరసన, రెండవది రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సాగినది.

ఫైనల్ ఇయర్ లోది విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు. ఇది కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా! ఈ ఉద్యమ కాలంలోనే నాకు 17వ సంవత్సరం పూర్తయింది.

అట్లా మాకు తెలియకుండా దేశకాల పరిస్థితులలో నుంచి ఆందోళనల బాటలో నడిచిన వాళ్లం మేము. మాతో చదువుకున్న వారందరూ వీటిల్లో పాల్గొన్నారని చెప్పలేను కానీ నాకు మాత్రం అలాంటివి మన కళ్లముందు జరుగుతూ ఉంటే దూరంగా ఉండటం చేతకాని విషయం.

ఆ సంవత్సరం మా కళాశాల విద్యార్థి సంఘ నాయకుడు కె. కేశవ గుప్తా! (గుడివాడలో పండ్ల వ్యాపారస్తుల వంశీయుడు.) అతనితో పాటు వచ్చిన విద్యార్థి బృందం హాస్టల్లో మీటింగ్ పెట్టి విశాఖ హక్కు గురించి, అమృతరావు సాగిస్తున్న నిరాహార దీక్ష గురించి ఒక రోజు చెప్పారు. మనం కూడా ఆందోళనకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కొద్దిరోజుల్లో విశాఖపట్నంలో కాల్పులు జరగడం, విద్యార్థులు కొందరు చనిపోవడం, దానిపై రాష్ట్రంలో చెలరేగుతున్న ఉద్యమం తరహాలో మనం కాలేజీ బంద్ చేయాలి అనేది ముందుకు వచ్చింది, వెంటనే అమలు జరిగింది. నిరాహార దీక్షలు ప్రారంభం అయినాయి. ఒకరోజు బహుశా 14- 11 - 1966 కావచ్చు వనపర్తి టౌన్ బందు చేయాలి అనుకుంటూ దాదాపు మూడు వంతుల మంది పైగా విద్యార్థులం ప్రదర్శనగా బయలుదేరాం.

పోలీసులు మా ప్రదర్శనను ఆపడానికి ప్రయత్నం చేశారు. మేము వెనక్కి మళ్లలేదు. ముందుకు సాగాలని మా ప్రయత్నం.

బస్టాండ్ సెంటర్ దాకా వెళ్లగానే లాఠీచార్జి ప్రారంభించారు. చెల్లాచెదురై పారిపోయిన వాళ్లు ఉండినప్పటికీ లాఠీచార్జి లెక్కపెట్టకుండా ముందుకు నడవడానికి ప్రయత్నించిన వాళ్లూ ఉన్నారు. మరికొద్ది సేపట్లో పోలీసులు టియర్ గ్యాస్ షెల్స్ విసిరారు. నాకైతే అప్పటికి టియర్ గ్యాస్ లాంటిది ఒకటి ఉంటుందని తెలియదు. ఇప్పుడులాగా తుపాకీలో నుంచి వెలువడే తూటాల రూపంలో అప్పుడు ఉండేది కాదు. విసిరి కొడితే పగిలిపోయే సీసాల్లో బంధింపబడి టియర్ గ్యాస్ ఉండేది. పోలీసులు విసిరిన టియర్ గ్యాస్ షెల్స్ కొన్ని పగలక పోయేవి. వాటిని పుచ్చుకుని పోలీసులపై మేము వెనక్కి విసిరే వాళ్లం. టియర్ గ్యాస్ వలన కళ్లు మంటలెక్కి విపరీతంగా నీరు కారిపోవడం, కళ్లు సరిగా కనపడకపోవడం విద్యార్థులను చెదిరిపోయేట్లు చేసింది. ఇంతలో ఎవరో ఉల్లిపాయలు తెచ్చారు. వాటిని కోసి వాసన చూస్తే టియర్ గ్యాస్ పనిచేయదు అని అన్నారు కానీ, నాకు ఉల్లిపాయల ప్రభావం అంతగా అనుభవంలోకి రాలేదు. విద్యార్థులను వెనకకు నెడుతూ, గెంతుతూ మా కాలేజీ మెయిన్ గేట్ (జమీందార్ల కోట లాగా ఉండే గేట్‌ని 'కమాను' అనేవారు) వెనుకకు మేము తగ్గాము. పోలీసులు గేటు దాటి లోపలికి రాలేదు. మేము కాంపౌండ్ నుండి లోపల వెలుపల ఉన్న పోలీసులపై రాళ్లు విసిరాము. అలా సుమారు రెండు గంటలలో విద్యార్థులం వెనుకకు మళ్లీ హాస్టళ్లకు చేరుకున్నాం. ఇక్కడ గ్రహించవలసింది ఏమిటంటే అప్పట్లో పోలీసులు కాలేజీ కాంపౌండ్‌లోకి అనుమతి లేకుండా ప్రవేశించే వారు కాదు. నిరాహార దీక్షా శిబిరం కొనసాగింది. అయితే పోలీసులు దానిని తొలగించలేదు. నేటి పోలీసులను అలా ఉండనీయడం లేదు.

ముగ్గురు నలుగురు విద్యార్థులు పది రోజులకు పైగా నిరాహార దీక్ష చేశారు. రిలే నిరాహార దీక్షలు సాగుతూ ఉండేవి. రోజూ డా. బాలకృష్ణయ్య గారు వచ్చి విద్యార్థులను పరీక్షించి వెళ్లేవారు. ఆయన వనపర్తి గ్రామంలో ప్రఖ్యాత ప్రజా వైద్యులు. సి. పి. ఐ. ఎం. పార్టీకి నాయకులు.(తర్వాత కాలంలో 14-3-1982న మహాకవి శ్రీశ్రీకి వనపర్తిలో అపూర్వ పౌరసన్మానం జరిపి 25 వేల రూపాయల పర్స్ బహూకరించిన చరిత్రకు సూత్రధారుడు ఆయనే!) డా. బాలకృష్ణయ్య గారు ఎప్పుడు వచ్చినా ఆయనను అంటిపెట్టుకుని కృష్ణమూర్తి అనే అతను ఉండేవాడు. (ఆయననే కిట్టు మామ అని పిలుస్తారని ఎప్పటికో నాకు తెలిసింది) వారు మా నిరాహార దీక్షల శిబిరానికి వచ్చినప్పుడు జనశక్తి దిన పత్రిక ఇచ్చి వెళ్లేవారు. నేను మొదటిసారి శ్రీశ్రీ ఖడ్గసృష్టి పుస్తకం ఆ కృష్ణమూర్తి చేతుల్లోనే చూశాను.

మా కళాశాల యాజమాన్యం ఫ్యూడల్ సంస్థానాధీశులది. వారికి డా. బాలకృష్ణయ్య ఎదురు. ఆధిపత్యాన్ని ధిక్కరించే వాళ్లంటే విద్యార్థులకు ఒక ఆకర్షణ. అందులో మా కళాశాల యాజమాన్యానికి బాలకృష్ణయ్య వ్యతిరేకం కదా!

విశాఖ ఉక్కు ఉద్యమం గురించి

మిగిలిన దినపత్రికలలో రాని వార్తలు జనశక్తిలో వస్తుండేవి. అప్పట్లో ఆంధ్రభూమి తప్ప మిగిలిన దిన పత్రికలన్నీ బెజవాడ నుండి వచ్చేవి. అవి వనపర్తికి చేరుకునేసరికి సాయంత్రం మూడో నాలుగో! మేము కాలేజీ అయిపోయిన తర్వాత సెంటర్‌కు వెళ్లి రోజూ జనశక్తి చదవడానికి అలవాటు పడ్డాం. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం పై గొల్లపూడి నారాయణరావు రచన 'తెలుగుగడ్డ' నవల జనశక్తి పత్రికలోనే సీరియల్‌గా వచ్చింది. అమెరికా సామ్రాజ్యవాదుల సూచనల మేరకే రూపాయి విలువను తగ్గించారని అందులో వ్యాసాలు వస్తుండేవి.

రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో ఉద్యమాల రిపోర్టులు జనశక్తిలో మాత్రమే వచ్చేవి. వ్యాపార పత్రికలు ఉక్కు పోరాట వార్తలన్నీ రిపోర్టు చేసేవి కాదు. కనుక జనశక్తి మమ్మల్ని ఎక్కువ ఆకర్షించేది. నాటి కమ్యూనిస్టు ఎంఎల్‌ఏల రాజీనామాలు, వారి ప్రకటనలు వివరంగా ఇచ్చేవారు. అవి చదవడానికి మాకు బాగా ఆసక్తిగా ఉండేది. ప్రముఖ సంపాదకుడు ఏబికె ప్రసాద్ ఆ పత్రికకు సంపాదకుడు. ఆయన తొలిగా సంపాదకత్వం వహించిన దినపత్రిక జనశక్తి అన్న విషయం ఈ కాలంలో చాలా మందికి తెలియదు. విజయవాడలోని ఏలూరు లాకుల సెంటర్‌లో ఉండిన ఆనాటి కేంద్ర ఉక్కు శాఖా మంత్రి నీలం సంజీవరెడ్డి విగ్రహాన్ని ముక్కల కింద చేసి ఏలూరు కాలువలో తోసివేసిన సంఘటన గురించి వివరమైన రిపోర్టు చదివి హాస్టల్లో ఉత్సాహంగా తోటి విద్యార్థులతో పంచుకునేవాళ్లం.

మహబూబ్‌నగర్ జిల్లాలో ఆనాటికి కళాశాలలు ఎక్కువ లేవు. వనపర్తి నుండి కర్నూలు వైపు గద్వాలలోనూ, హైదరాబాదు రహదారిలో బిజినేపల్లి జంక్షన్‌కి పెడగా ఉండే పాలెం గ్రామంలోనూ డిగ్రీ కళాశాలలు ఉండేవి. అప్పటికే పాలెంలో ప్రసిద్ధి చెందిన వెంకటేశ్వర స్వామి ఆలయం ఒకటి ఉండేది. ఒకరోజు వనపర్తి విద్యార్థులం లారీలు వేసుకొని పాలెం వెళ్లి ఆ కళాశాలను కూడా బందు చేయించాం. వెంకటేశ్వరస్వామి విగ్రహాన్ని మొదటిసారిగా నేను చూసినది పాలెంలోనే. అప్పటికి తిరుపతి వెంకటేశ్వరుడు కొండదిగి పట్టణాలకు, గ్రామాలకు ఇంకా విస్తరించలేదు. వనపర్తికి నాలుగు ఐదు మైళ్ల దూరంలో తిరుమలయ్య గుట్ట అని ఒకటి ఉండేది. అక్కడ శూద్ర పూజారులు ఉండే వారు. అక్కడి విగ్రహం కూడా వేరే రకంగా ఉండేది. తిరుమలకు నమూనాగా ఉండినందువల్ల కావచ్చు పాలెం దేవాలయం చాలా ప్రసిద్ధి చెందింది.

వనపర్తిలో టియర్ గ్యాస్ ప్రయోగించిన కొద్దిరోజుల్లోనే అక్కడికి కొంత దూరంలో ఉండే కొల్లాపూర్‌లో విశాఖ ఉక్కుకై ఆందోళన చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జి చేశారు.

ఇంకొక రోజు సుమారు పదిహేను కిలోమీటర్ల దూరంలో ఉండే వనపర్తి రోడ్డు (మదనాపురం) రైల్వే స్టేషన్‌కు వనపర్తి విద్యార్థులమంతా వెళ్లి అర్ధరాత్రి ఒకటిన్నరకు సికింద్రాబాద్ నుండి బెంగళూరుకు, బెంగళూరు నుండి సికింద్రాబాద్‌కు వెళ్లే రైళ్లను కొంత సేపు నిలుపుదల చేయించాం. మొత్తంగా ఒక నెల రోజుల లోపు ఇవన్నీ సాగి క్రమంగా ఆగిపోయినాయి.

వనపర్తి కాలేజీలో కమ్యూనిస్టు నాయకుల బిడ్డలు కొందరు చదువుతూ ఉండేవారు. పిల్లలమర్రి వెంకటేశ్వర్లు గారి అబ్బాయి రవీంద్రనాథ్ ఠాగూర్ (ఇతను దేవీప్రసాద్ చటోపాధ్యాయ తాత్విక ఉపన్యాసాలను తెలుగులోకి అనువాదం చేశాడు) ఉద్దరాజు రామంగారి అబ్బాయి బాపిరాజు, తుమ్మల వెంకట్రామయ్యగారి అబ్బాయి అజయ్ కుమార్, కమ్మెల దుర్గయ్య గారి

అబ్బాయి భాస్కర రావు, అట్లాగే మందలపర్తి కపర్ది గారి పెద్దబ్బాయి రామచంద్ర రావు (ఇతని ఆఖరి తమ్ముడే జర్నలిస్ట్ కిషోర్) వనపర్తి పాలిటెక్నిక్‌లో చదువుకున్నవారే. ఇందులో మా సెక్షన్ వాళ్లు ముగ్గురే. అయితే నాకంటే ఒక్క సంవత్సరం సీనియర్ ఠాగూర్, జూనియర్ భాస్కర రావు. భాస్కర రావు వాళ్ల బాబాయి కమ్మెల వెంకటేశ్వర్లు గారు మాకు హైడ్రాలిక్స్ చెప్పేవారు. ఆయన సిపిఎం పార్టీ అభిమాని అని విద్యార్థులు చెప్పుకునేవారు. విద్యార్థుల పట్ల చాలా అభిమానంగా, ప్రేమగా సన్నిహితంగా ఉండడంతో ఆయన మాటకు విద్యార్థులలో చాలా విలువ అత్యధిక గౌరవం ఉండేవి. విశాఖ ఉక్కు ఉద్యమ విద్యార్థుల వెనుక ఆయన మార్గదర్శకత్వం ఉండేదని చెప్పుకునేవారు. భాస్కరరావు మాత్రం విద్యార్థులను ఆర్గనైజ్ చేయడంలో బాగా చురుకుగా ఉండేవాడు. తుమ్మల అజయ్ నాయకుడిగా ముందు వరసలో లేడు గాని బాగా చురుకుగా ఉండేవాడు. నాకంటే రెండేళ్లు పెద్ద. మేమిద్దరం వనపర్తి కాలేజీ క్రికెట్ టీంకి ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్‌లం కూడా అవడంతో బాగా సన్నిహితంగా ఉండేవాళ్లం. విశాఖ ఉక్కు ఉద్యమంలో నేను అజయ్‌తోటే ఉండేవాణ్ణి. నిరాహార దీక్షలో తప్ప మిగిలిన అన్ని కార్యక్రమాల్లో చురుకుగా మేమిద్దరం పాల్గొన్నాం. కళాశాల యాజమాన్యం, సమయం రాకముందే సెలవులు ప్రకటించి విద్యార్థులను ఇళ్లకు పంపించేశారు. మేము ఫైనలియర్ వాళ్లం కనుక ఇంటికి వెళ్లకుండా బుద్ధిగా చదువులో మునిగిపోయాం. మెకానికల్ ఇంజనీరింగ్ చదువుకున్న మాకు రాష్ట్రంలో ఎక్కడా ఉద్యోగాలు లేవు. అంతా హైదరాబాద్ పోవాల్సిందే. అవీ అరకొర ఉద్యోగాలే. పారిశ్రామిక సంక్షోభం అంతటా చుట్టుముట్టి ఉందని జనశక్తి పత్రికలో ఏవేవో రాస్తూ ఉండేవారు. కానీ నా వయసుకి, నా నేపథ్యానికి అవి అర్థమయ్యే స్థాయి నాకు ఆనాటికి రాలేదు.

అదే సంవత్సరం 1966లోనే మోటూరి హనుమంతరావు గారి ముందు మాటతో 'భారత దేశంలో సంపద కేంద్రీకరణ' అనే తరిమెల నాగిరెడ్డి రచన వెలువడిందని ఆ తర్వాత రెండేళ్ల దాకా నాకు తెలియనే తెలియదు. ఆ రచన ప్రేరణతోనే 'వందేమాతరం' కవితను రాసినట్లు తర్వాత కాలంలో చెరబండరాజు చెప్పడం మాత్రం నాకు తెలుసు. అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా వియత్నాం ప్రజలు పోరాడుతున్నారని తెలుసు గాని, చైనాలో మొదలైన సాంస్కృతిక విప్లవం గురించి నాకు దాదాపు తెలియదు.

అయితే కాలేజీ చదువు పూర్తయి ఇంకా పరీక్షా ఫలితాలు వెలువడకముందే, 1967 మే నెలాఖరులో సంభవించిన నక్సల్బరీ సంఘటన మాత్రం నాకు నేరుగా వార్తా పత్రికల ద్వారా బాగానే అందింది. నక్సల్బరీని ఉత్సాహంగా స్వీకరించగలిగిన మనోస్థితిలో నేను అప్పటికే ఉన్నానని దాని అర్థం. అది నా తదనంతర కార్యకలాపాలన్నిటికీ ప్రేరణగా నిలబడడం యాదృచ్ఛికం కాదు. చారిత్రక పర్యవసానమే!!

'విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు పోరాటం' తెలుగునాట నక్సల్బరీ విప్లవ స్ఫూర్తిని పొందిన తొలి తరానికి చరిత్ర ఇచ్చిన ప్రాథమిక ఉద్యమ తర్ఫీదు లేక రిహార్సల్స్ అని నా నిశ్చితాభిప్రాయం.

విశాఖపట్నం, గుంటూరు, విజయవాడ, వరంగల్లు, హైదరాబాద్‌లలో నాడు చురుకుగా విశాఖ హక్కు ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థి యువజనుల నుండే నక్సల్బరీ సంఘటనతో మలుపు తీసుకున్న విప్లవోద్యమ నిర్మాణ యువ నాయకత్వం రూపొందిందని రుజువుకు అదే చారిత్రక సత్యం!!

ఒకవైపున ఢిల్లీలో రోజులు గడిచి నెలలుగా సాగుతున్న రైతాంగ ఉద్యమం మహోధృతంగా సాగుతూ ఉండగా, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ సమస్యను పాలకులు ఎందుకు ముందుకు తెచ్చారు? కులం కత్తులతో కొట్లాడుకోవడం తప్ప తెలుగు వారికి ఏమీ తెలియదులే అనే చులకన భావం ఏమయినా ఉండి ఉంటుందా?

నేటి విశాఖ ఉక్కు ఉద్యమం ఢిల్లీలో సాగుతున్న రైతాంగ పోరాట అనుభవాల నుండి నేర్చుకుని, విదేశీ సామ్రాజ్యవాద శక్తులకు, దేశీయ కార్పొరేట్ వర్గాలకు వ్యతిరేకంగా, కేంద్ర పాలకుల మత రాజకీయాలకు, రాష్ట్ర పాలకుల కుల రాజకీయాలకు అతీతంగా సమైక్యంగా సాగితే గాని పాలకులు దిగివచ్చేలా లేరు. అప్పుడుగాని నేటి విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమం విజయవంతం కాదు.

మరొక తరహాలో థామస్ జెఫర్సన్ చెప్పినట్లు నిరంతరం త్యాగపూరిత ప్రజా ఉద్యమం అనే ఎరువులు వేస్తే తప్ప ప్రజాస్వామ్యం అనే చెట్టు ఫలాలను అందించదు. ఆ ఫలాలు ప్రజలకే చెందాలన్నా, తెలుగునాట పారిశ్రామిక ప్రగతిని ఆకాంక్షించిన ఉక్కు ఉద్యమ అమరుల ఆశలు నెరవేరాలన్నా నిరంతరాయ సంఘటిత ప్రజా ఉద్యమాలు తప్ప మరో మార్గాంతరం కనబడడం లేదు.

(రచయిత జనసాహితి నాయకులు) వీ

వెట్టి బతుకులకు వెలుగు దొరికేనా ?

ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న వలస కార్మికుల దుర్భర జీవితాలనూ, యజమానులు సాగిస్తున్న దోపిడీ, అత్యాచారాలనూ వివరిస్తున్నారు **ఎన్. నారాయణ రావు**

ఒకప్పుడు తెలంగాణ సమాజంలో భూస్వాములకు వ్యతిరేకంగా, వెట్టి బతుకులకు వ్యతిరేకంగా సాగిన బలమైన పోరాటాలను సిరిసిల్ల, జగిత్యాలల్లో చూశాం. కాని గత ఐదు ఏళ్లుగా ఇటుక బట్టీల్లో ఒడిశాకు చెందిన వలస కార్మికులుగా వెట్టి జీవితాలను జీవిస్తున్నారు. ఎంతటి వెట్టి అంటే, యజమానులు చంపి పాతేసినా అడిగే స్థితి లేదు. పారిపోయే ప్రయత్నం చేస్తే, పట్టుకొని ఇంకా భయంకరమైన చిత్రహింసలకు గురిచేసే స్థితికి ఇటుక బట్టీల జీవన పరిస్థితులు నెట్టివేయబడినాయి. 6 నెలల కాలానికి ఒక్కొక్కరికి 30 నుంచి 35 వేల వరకు చెల్లించి ఒడిశా, ఛత్తీస్‌గఢ్ నుంచి వలస కార్మికులను ఏజెంట్లు తీసుకువస్తున్నారు. కాని వచ్చాక తిరిగి వెళ్తాడా, మహిళలైతే గౌరవంగా తిరిగి ఇళ్లకు వెళ్లే పరిస్థితి ఉందా అనేది అనుమానమే.

ఒకప్పటి కరీంనగర్ జిల్లాలో భాగమైన నేటి పెద్దపల్లి జిల్లా, ఇటుక బట్టీలకు బలమైన కేంద్రంగా ఉంది. అదే స్థాయిలో పోలీసులతో, రెవెన్యూ విభాగాలతో మిలాఖతైన ఇటుక బట్టీ యజమానులు, కార్మికులను బానిసల కన్నా అధ్వాన్నంగా చూస్తూ, వారి జీవితాలను ఇటుక బట్టీల్లో బలి చేస్తున్నారు. ఒక రకంగా విపరీతమైన శ్రమ దోపిడీ, మరొకరకంగా మహిళలపై లైంగిక హింసతో పని స్థలాల నుండి అడవుల్లోకి పారిపోవలసిన పరిస్థితి అధికారులు కల్పిస్తున్నారు. యజమానులపై వలస కార్మిక చట్టం ద్వారా నియంత్రణ లేకుండా పోయింది. సర్పంచ్ నుండి ఎంఎల్ఏ వరకు అందరూ ఇటుక బట్టీ కార్మికుల శ్రమ దోపిడీలో భాగస్వాములై ఉన్నందున, కార్మికులకు న్యాయం దొరకడం లేదు.

జనవరి 23న పెద్దపల్లిలోని గౌరెడ్డిపేట ఎల్.ఎన్.సి. ఇటుక బట్టీలో పనిచేసే ఒడిశా కార్మికుల జంట పారిపోయే ప్రయత్నం చేస్తే, రామగుండం రైల్వే స్టేషన్ నుంచి పట్టుకువచ్చి యజమాని రామిరెడ్డ భాస్కర్‌తో పాటు మరో ముగ్గురు కలిసి సామూహికంగా అత్యాచారం చేసి చిత్రహింసలకు గురి చేశారు. ఫిబ్రవరి 8న మరొక ప్రయత్నం చేసిన యజమాని భాస్కర్‌ని చూసి గుట్టలవైపు పారిపోయారు. ఇది నేడు తెలంగాణ రాష్ట్రంలో ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న వలస కార్మికుల దుస్థితి. పెద్దపల్లి జిల్లాలో ఇటుక బట్టీల యజమానులు అమానుషంగా ప్రవర్తిస్తున్నారు. ఇటుక బట్టీల్లో వలస కార్మికులపై అఘాయిత్యాలు ఆగకుండా కొనసాగుతున్నాయి. వివాహిత మహిళలపై యజమానులు సామూహిక అత్యాచారాలు కొనసాగిస్తున్నారు. వలస కార్మికులను అగ్గిపెట్టల్లాంటి ఇటుక గుడిసెల్లో బందిస్తున్నారు. వారికి కాలకృత్యాలు తీర్చుకోవడానికి కూడా ఎటువంటి సౌకర్యాలు లేవు. యజమానులు ఏజెంట్ ద్వారా కార్మికులను తీసుకొచ్చి వెట్టి చాకిరి చేపిస్తున్నారు.

పొట్టకూటి కోసం వేరే రాష్ట్రాల నుంచి ఇటుక బట్టీల్లో పని కోసం వచ్చిన కార్మికులపై అఘాయిత్యాలు ఆగడం లేదు. చాలీచాలని కూలీతో రోజంతా ఇటుక బట్టీల్లో పని చేస్తున్న కార్మికులతో యజమానులు రాక్షసుల్లా, అత్యంత పాశవికంగా వ్యవహరిస్తున్నారు. ఇన్ని సంఘటనలు జరుగుతున్నా ఒకటి, అర మాత్రమే వెలుగు చూస్తున్నాయి. పెద్దపల్లి జిల్లాలో చెరువులను చెరబట్టి, సొంత భూముల్లో ఇటుక బట్టీలు పెట్టి వ్యాపారం చేస్తున్న వ్యక్తులు పనిచేసే కూలీలపై మృగాలు సైతం సిగ్గుపడేలా ప్రవర్తిస్తున్నారు.

2015లో ఇదే పెద్దపల్లి జిల్లాలో సూర్జాబాను అనే గర్భిణీ స్త్రీని ఇటుక బట్టీ యజమానులు పొత్తికడుపులో తన్ని చంపిన ఘటనపై సుప్రీం కోర్టు సుమోటో కేసుగా స్వీకరించి ఆంధ్రా, తెలంగాణ, ఒడిశా ప్రభుత్వాలను విచారణ జరిపించాల్సిందిగా, నివేదికను ఇవ్వాల్సిందిగా ఆదేశాలు జారీ చేసింది. కానీ నేటికీ ఆ హత్యపై కూడా అమీ తుమీ తేలకుండా ఉండిపోయింది. అదే నిర్బంధం నేటికి కొనసాగుతూ కొంత మందినైతే చంపి భూమిలో పాతేసిన ఘటనలు కూడా బయటికొచ్చాయి. కానీ ఏదీ యజమానులను శిక్షించడం లేవు.

పెద్దపల్లి మండలం గౌరెడ్డిపేటలో గత నెల 24న ఓ మహిళా కూలీపై జరిగిన సామూహిక అత్యాచారం కార్మికులను భయపెడుతున్నది. అనంతరం జరిగిన సంఘటనలు బట్టీల్లో కార్మికుల రక్షణ ఉట్టి మాటే అని తేల్చేస్తున్నాయి. కట్టుకున్న వాడి కళ్ల ముందే యజమాని కూలీ మహిలపై అత్యాచారానికి ఒడిగట్టడంతో తలెత్తుకోలేక సొంతూర్లకు వెళ్లాలనుకున్న జంటను బంధించి దాడి చేసిన విషయం మానవ హక్కుల కమిషన్‌కు ఓ ఏజెంట్ చేసిన ఫిర్యాదుతో వెలుగుచూసింది. ఈ సంఘటనతో జిల్లాలోని ఇటుక బట్టీల్లో వెట్టి చాకిరీ తరహాలో బతుకీడుస్తున్న కార్మికులు భయంతో వణికిపోతున్నారు.

పెద్దపల్లి జిల్లాలో గత కొన్నేళ్లుగా ఇటుక బట్టీల వ్యాపారం కార్మికులపై అరాచకం పెరిగిపోయింది. గతంలో మానేరు వాగు ఒడ్డున మాత్రమే కనిపించే బట్టీలు ఇప్పుడు పెద్దపల్లి, సుల్తానాబాద్, జూలపల్లి, కమాన్పూర్ తదితర మండలాల్లో విచ్చలవిడిగా పెరిగిపోయాయి. జిల్లాలో 127 ఇటుక బట్టీల ప్రాంతాలు ఉన్నాయి. ఒక్కో కార్ఖానాలో పేర్చే బట్టీలను బట్టి ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కార్మికులు సంవత్సరాల తరబడి వెట్టి తరహాలో చాకిరీ చేస్తున్నారు. చిన్న చిన్న కార్ఖానాల్లో 100 మందికి పైగా కార్మికులు పనిచేస్తే, పెద్ద కార్ఖానాల్లో 200 మంది వరకు ఉన్నారు. ఈ లెక్కన కేవలం పెద్దపల్లి జిల్లాలోనే సుమారు 15 వేల నుంచి 20 వేల మంది వరకు ఉన్నట్లు అంచనా.



ప్రముఖ విద్యావేత్త,
ఖమ్మం గురుదక్షిణ ఫౌండేషన్
వ్యవస్థాపక సహాధ్యక్షులు,
వామపక్ష మానవతావాది
ఎస్.వి. నారాయణ
స్మృతిలో...

- కుటుంబ సభ్యులు, హైదరాబాద్

జననం 1931, ఆగస్టు 15 – మరణం 2021, ఫిబ్రవరి 19

వీరిని ఏజెంట్లు గంపగుత్తగా డబ్బులు చెల్లించి తీసుకొస్తారు. కాని వేతనాలు తక్కువ, వెట్టి ఎక్కువగా కొనసాగుతున్నది.

ఇటుక బట్టీలో పనిచేసే కార్మికులను అగ్గిపెట్టెల తరహాలో ఇటుకలతో చిన్న చిన్న షెడ్లు నిర్మించి ఉంచుతున్నారు. కార్మికుల కుటుంబాల పిల్లలు చదువుకునే పరిస్థితి లేదు. పిల్లలను కూడా బట్టీల్లోనే కూలీపని చేయిస్తున్న దారుణ పరిస్థితి ఉంది. కార్మిక చట్టాలేవీ ఇటుక బట్టీల్లో కనిపించని దారుణ స్థితి కళ్లకు కడుతోంది.

గత నెల 24న గౌరెడ్డి పేటలో జరిగిన మహిళా కూలీపై ఇటుక బట్టీ యజమానుల సామూహిక అత్యాచారం ఘటనకు సంబంధించి ఎట్టకేలకు అధికారుల విచారణ మొదలైంది. ఘటనపై వెంటనే స్పందించిన సఖీ కేంద్రం నిర్వాహకులు ఇటుక బట్టీల వద్దకు చేరుకుని కార్మికులను వెంట తీసుకొని కలెక్టర్ సంగీతను కలిసి ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ విచారణ జరపాలని ఆర్‌డిఓ శంకర్ కుమార్‌ను ఆదేశించారు. ఆయన డిసిపి రవీందర్, సిఐ ప్రదీప్ కుమార్, తహసిల్దార్ శ్రీనివాస్, లేబర్ అధికారి రాయలింగం, ఎస్ఐ రాజశేఖర్, సఖీ కేంద్రం అడ్మినిస్ట్రేటర్ స్వప్న ఇటుక బట్టీ వద్దకు వెళ్లి విచారణ జరిపారు. సహచర కార్మికులు సఖి నిర్వాహకులకు చెప్పిన సమాచారం మేరకు పోలీసులు ఫిర్యాదు తీసుకున్నారు.

విచారణ నివేదికను కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామని అధికారులు తెలిపారు. వలస కార్మికులను ఇటుక బట్టీల యజమానులు ఏజెంట్ ద్వారా తీసుకొస్తారు. యాజమాన్యానికి కార్మికులకు మధ్య వారధి ఏజెంట్ కావడంతో కార్మికుల శ్రమ దోపిడీ అక్కడి నుంచే ప్రారంభమవుతుంది. ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌తో పాటు పలు రాష్ట్రాల కార్మికులతో ఒప్పందం కుదుర్చుకుని ఏజెంట్లు పనులకు తీసుకొస్తారు. అక్టోబర్‌లో వచ్చి వర్షాకాలం ప్రారంభమయ్యే వరకు పనులు చేసి వెళ్తారు. చట్టాలు యజమానులకు చుట్టాలు. కార్మిక చట్టాలు అమలు చేయడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. ఏదైనా ఘటన జరిగినప్పుడు యజమాని చెప్పిన వివరాలను రాసుకుని వెళ్లడం వరకే ఇక్కడ కార్మిక, రెవెన్యూ శాఖ అధికారుల డ్యూటీ. మైనర్లతో పనులు చేయిస్తున్నా అడిగే వారు ఉండరు. ఉదయం 3 గంటల నుండి రాత్రి 12 గంటల వరకు వెట్టి చాకిరి చేసే పరిస్థితి ఇప్పటికీ ఇటుక బట్టీల్లో ఉంది. యజమానులు దాడులు చేసినా, అఘాయిత్యాలకు పాల్పడినా బయటకు చెబితే యజమానుల నుంచి శిక్షలు తప్పడం లేదని కార్మికులు వాపోతున్నారు.

చట్టాలను అమలు చేయాల్సిన అధికారులే యజమానులకు వత్తాసు పలకడంతో కార్మికులు మిన్నకుండిపోయారు. పెద్దపల్లి జిల్లా గౌరెడ్డి పేట మండలంలో పలు సంఘటనలు యువతిపై సామూహిక అత్యాచారం, దాడి ఘటన తరహాలో గతంలో కూడా ఇటుక బట్టీల్లో పలు ఘటనలు జరిగాయి. గౌరెడ్డిపేటలో ఇటీవల ఒకరిని హత్య చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీనిని యాజమాన్యం రహస్యంగా ఉంచగా, పోలీసులే వెలుగులోకి తెచ్చారు. సుల్తానాబాద్ మండలం శివారులోని ఇటుక బట్టీలో యువకుడిపై యజమాని దాడి చేయడంతో కార్మికులంతా రోడ్డెక్కారు. అధికారులు పత్యేక చొరవ తీసుకుని స్వగ్రామాలకు పంపించారు. కూలీలు రోజువారీ తిండిగింజలు తెచ్చుకునేందుకు కూడా బయటకు వెళ్లనీయని అమానవీయ ఘటనలు బట్టీల్లో కోకొల్లలు.

వలస కార్మికులకు అమలు కావలసిన కార్మిక చట్టాలు 1948 కనీస వేతన చట్టం; 1976 వెట్టిచాకిరి నిర్మూలన చట్టం; 1979 అంతరాష్ట్ర వలస కార్మిక చట్టం; 1986 బాల కార్మిక చట్టాలు అమలు కావడం లేదు. దీని వలన ఇటుక బట్టి కార్మికులు వెట్టి బతుకులు వెళ్లదీస్తు బానిసల కన్నా అద్వాన్నంగా బతుకుతు మరణిస్తున్నారు. వీరి గురించి ప్రజాస్వామ్య వాదులుగా మనందరం మాట్లాడుదాం.

(రచయిత ప్రధాన కార్యదర్శి, పౌరహక్కుల సంఘం తెలంగాణ)

వీ

ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు

మున్సిపల్ ఎన్నికల్లో డబ్బు, మద్యం, అధికారం అండతో బలవంతపు ఏకగ్రీవాలు సాగాయి తప్ప ప్రజల సమస్యలు ఎక్కడా చర్చకు రాలేదని అంటున్నారు **చిమ్మె జాన్ బర్నబాస్**

మార్చ్ 10న ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని మున్సిపాలిటీలకు, కార్పొరేషన్లకు ఎన్నికలు జరిగాయి. రాష్ట్రంలోని 12 నగర పాలక సంస్థ (కార్పొరేషన్) లకు, 71 పురపాలక సంఘాలకు ఒకేసారి జరగడంతో, అవి రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల వాతావరణాన్ని తలపించాలి. ఎన్నికల్లో డబ్బు, మద్యం, ఇంటి సామాగ్రి, దుస్తులు లాంటి ప్రలోభాలకు ప్రజలను గురిచేయడానికి పాలక, ప్రతిపక్ష పార్టీలు రెండూ పోటీ పడ్డాయి.

రాష్ట్రంలోని నగర పాలక సంస్థలకు 581 డివిజన్లు, (కార్పొరేటర్లు), పురపాలక సంఘాలకు 2,214 వార్డులు ఉన్నాయి. వీటన్నింటికి కలిపి 78 లక్షల మంది ఓటర్లు ఉన్నారు. మొత్తం 7,915 పోలింగ్ కేంద్రాలున్నాయి.

అధికారంలో ఉన్న వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష పార్టీ అయిన తెలుగుదేశం పార్టీలు రెండూ ఎన్నికల నియమ నిబంధనావళిని ఏమాత్రం లెక్కచేయకుండా తమ ప్రచార పర్వాన్ని కొనసాగించాయి. పార్టీల గుర్తులతో జరిగే ఎన్నికలు కాబట్టి కొంత ప్రధాన్యతను సంతరించుకున్నాయి. ఈసారి కొత్తదనం ఏమంటే పోయిన సంవత్సరం (2020) మార్చ్‌లో వేసిన నామినేషన్ల ప్రక్రియకు ఈసారి కొనసాగింపుగా అభ్యర్థిత్వం ఖరారు ప్రక్రియ, గుర్తుల కేటాయింపు, నామినేషన్ల ఉపసంహరణ అన్నీ 2021 మార్చ్ 3-4 తేదీలలో జరిగాయి. 5-8 తేదీల మధ్య ప్రచారం కొరకు 4 రోజుల సమయం కేటాయించారు. మొత్తం మీద ఎన్నికల కమిషన్ తాను ఏదైతే మున్సిపాలిటీలకు ఎన్నికలు జరుపాలనే నిర్ణయం తీసుకున్నదో దానిని సాధించింది. అయితే అధికార పార్టీ అక్రమాలను, దౌర్జన్యాలను, బెదిరింపులను ఎన్నికల కమిషన్ కట్టడి చేయలేకపోయింది. రాష్ట్ర పోలీసు యంత్రాంగం కూడా వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీకి పూర్తిగా సహకరిస్తూ చాలా చోట్ల అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియల్లో ప్రత్యక్షంగా పాల్గొని, అధికార పార్టీ అభ్యర్థులకు పూర్తిగా సహకరించింది. వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీలో రెండు గ్రూపులున్న చోట కూడా రెండు గ్రూపులకు కూడా పూర్తిగా సహకరిస్తూ, అధికార పార్టీ సేవలో మునిగితేలింది.

వై.ఎస్.ఆర్. కాంగ్రెస్ పార్టీకి పూర్తి మెజారిటీ ఇస్తూ, ఏమాత్రం ఇతర అభ్యర్థులను ఎవరినీ నామినేషన్లను వేయనీయకుండా జరిగిన మునిసిపాలిటీలో రాష్ట్రంలో 1) పులివెందుల, 2) పుంగనూరు, 3) మాచర్ల, 4) పిడుగురాళ్ల. ఇక్కడ సామాన్య పౌరులు కానీ, ఇతర పార్టీల అభ్యర్థులు కానీ నామినేషన్లు వేయలేదు. అందుకే ఇక్కడ అన్ని వార్డులు ఏకగ్రీవమయ్యాయి. అధికార పార్టీ గత సంవత్సరం (2020) మార్చ్‌లోనే వీటిని ఏకగ్రీవం చేసుకున్నది. ఒకవేళ ఈ సంవత్సరం నామినేషన్ల ప్రక్రియను కొనసాగిస్తూ, కొత్తగా నామినేషన్ల ప్రక్రియ కొనసాగి ఉంటే పరిస్థితి వేరుగా ఉండేది. కొంతమందైనా నామినేషన్లు వేసి ఉండేవారు. ఏకగ్రీవాలకు అవకాశం ఉండి, ఉండకపోయేది. కాబట్టి ఇది కూడా కొంత లోపభూయిష్టంగా జరిగిన ఎన్నికలే.

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 243పి నుంచి 243జెడ్‌ఎ వరకు మున్సిపాలిటీకు సంబంధించిన అన్ని అంశాలూ పొందుపరచబడినవి. ఇందులో మున్సిపాలిటీలకు ఉన్న అధికారాలు, విధులు, ఎన్నికైన వారికున్న హక్కులు, అన్నీ పొందుపరిచినవి. 73, 74 రాజ్యాంగ సవరణల ద్వారా స్థానిక సంస్థలకున్న అధికారాలు, స్థానిక స్వపరిపాలనకు సంబంధించిన ప్రజల భాగస్వామ్యం అన్నీ వివరించబడినవి. అయితే ఇప్పుడు జరుగుతున్న ఎన్నికల విధానంలో ప్రజల భాగస్వామ్యం అటుంచి, కేవలం ధనవంతులు, అధికార పార్టీకి చెందినవారు, వ్యాపారస్థులు, మద్యం, రియల్ ఎస్టేట్ ద్వారా సంపాదించినవారు, క్రిమినల్ చరిత్ర ఉన్నవారు ఎన్నికల పోటీలో పాల్గొంటున్నారు. దీనివల్ల సామాన్య పౌరునికి చెందవలసిన, పొందవలసిన సర్వస్వమూ హరించబడుతున్నవి. లేదా మరొకరు పొందుతున్నారు. ప్రజలు కూడా నిమిత్త మాత్రులవుతున్నారు. ఎందుకనగా వివిధ ప్రలోభాలకు ప్రజలు గురికాబడడం చేత ఎన్నికైన వారిని ప్రశ్నించే పరిస్థితి లేకుండా చేసుకుంటున్నారు. 'ఈ పరిస్థితి ఇంతేలే' లేదా 'దేవుడు చూసుకుంటాడు' అంటూ తాము అన్యాయానికి గురవుతున్నామని తెలిసినప్పటికీ పోరాడడానికి జంకుతున్నారు.

ఎన్నికల ఫలితాలు

మొత్తం పురపాలక ఎన్నికలలో 11 నగర పాలక సంస్థలు, 75 పురపాలక సంఘాల్లోని 2,742 డివిజన్లకు గాను ఎన్నికలు జరగగా ఏకగ్రీవాలతో సహా 2,265 వార్డులలో వైకాపా గెలిచింది. టిడిపి కేవలం 348 డివిజన్లు, వార్డులకే పరిమితమైంది. గతంలో ఏకగ్రీవమైన నాలుగు పురపాలక సంఘాలను కలుపుకొని ఇప్పుడు 75 పురపాలక సంఘాలలో 74 గెలుచుకున్నది. కడప జిల్లా మైదుకూరులో ఎంపి, ఎంఎల్‌ఎ ఎక్స్ అఫీసియో ఓట్లతో వైకాపా గెలుచుకున్నది. అనంతపురం జిల్లా తాడిపత్రిలో మాత్రమే టిడిపి విజయం సాధించింది. రాష్ట్రంలో కేవలం ఒక్క తాడిపత్రి పురపాలక సంఘం మాత్రమే తెలుగుదేశం పార్టీ గెలుచుకోగలిగింది. 11 నగర పాలక సంస్థలలో మొత్తం వైకాపానే గెలుచుకున్నది. విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు లాంటి కార్పొరేషన్‌లలో అవకాశం ఉన్నప్పటికీ తెలుగుదేశం పార్టీ గెలుచుకోలేకపోయింది. జనసేన పార్టీ 7 వార్డులు మాత్రమే గెలుచుకున్నది. సిపిఎం రెండు వార్డులు, సిపిఐ, బిజెపి ఒక్కొక్క వార్డులు గెలుచున్నాయి. స్వతంత్ర అభ్యర్థులు రాష్ట్రవ్యాప్తంగా ముగ్గురు గెలిచారు. కేంద్రంలో అధికారంలో ఉన్నప్పటికీ భారతీయ జనతా పార్టీ రాష్ట్రంలోని ఏ పురపాలక సంఘంలో గాని, కార్పొరేషన్‌లో గాని గట్టి పోటీ ఇవ్వలేకపోయింది, ఏమాత్రం ప్రభావం చూపలేకపోయింది.

మున్సిపాలిటీలలో ప్రజలు తమ అవసరాలు తీరడానికి అనగా చెత్త ఎత్తుకొని పోయే ట్రాక్టర్ల లాంటి విషయాలు మొదలు జనన, మరణ

ధృవీకరణ పత్రాలు పొందడం, ఇంటి పన్ను, నీటి పన్నుకట్టే విషయాలు కూడా ప్రజలు స్వయంగా మున్సిపల్ కార్యాలయాలకు వెళుతుంటారు. అయితే మున్సిపల్ సిబ్బంది సామాన్య ప్రజలతో వ్యవహరించే తీరు చాలా చోట్ల అభ్యంతరకరంగా ఉంటున్నది. కేవలం ప్రజల పన్నులతో నడిచే స్థానిక సంస్థలు మున్సిపాలిటీలు. అప్పుడప్పుడూ రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం కొన్ని నిధులు కేటాయిస్తాయి. అవి కూడా నామమాత్రమే.

చాలా చోట్ల ప్రజలకు 'మంచినీరు' ఉచితంగా అందడం లేదు. 16 లీటర్లు ఉన్న బిందెలకు రు. 4/5 వసూలు చేస్తూ ఉన్నారు. అక్కడక్కడ 'మినరల్ వాటర్ ప్లాంట్'లను ఏర్పాటు చేసి, వాటితో వ్యాపారం చేస్తున్నారు. ఒక్కొక్క వార్డులో ఒక్కొక్క నాయకుడు వాటిని నడుపుకుంటున్నారు. రోజూ రావలసిన మున్సినల్ నీరు కూడా 4 రోజులకు ఒకసారి లేదా 5 రోజులకు ఒకసారి వస్తూ ఉంది. వాటికి కూడా నెలకు రు. 60 నుంచి 100 వరకూ వసూలు చేస్తున్నారు. ఒక్కొక్క మున్సిపాలిటీలో ఒక్కొక్క రకమైన పన్నులు వసూలు చేస్తున్నారు. వీటికి కూడా జనాభాను బట్టి గ్రేడ్1, గ్రేడ్2, గ్రేడ్3, గ్రేడ్4 మున్సిపాలిటీలుగా విభజించారు. విచారకరమైన విషయం ఏమంటే వసూలవుతున్న పన్నుల ఆధారంగా, అక్కడ ఉన్న వ్యాపారాల ఆధారంగా మున్సిపాలిటీలను గ్రేడ్‌లుగా విభజించారు. వసూలవుతున్న 'పన్నుల' ఆధారంగా ప్రజలకు సేవలందిస్తున్నారంటే అదీ లేదు. మున్సిపాలిటీలలో ప్రజలకు సేవలందించడానికి సేవా పత్రం – 'సిటిజన్ చార్ట్' ఉండాలి. పొందుతున్న సేవలకు ఎంత 'రుసుము' చెల్లించాలి? వాటిని ఎన్ని రోజుల్లోగా పొందవచ్చు? అనే విషయాలను ప్రతి మున్సిపాలిటీలలో ప్రధాన ద్వారం కుడివైపుకు ప్రజలకు కనబడే విధంగా 'బోర్డు'లు ఏర్పాటు చేయాలి. దీనితో పాటుగా సమాచార హక్కు చట్టం 2005 ప్రకారం ప్రతీ సమాచారాన్ని సెక్షన్ 4 (1)(బి) కింద రూపొందించి ప్రజలకు అందుబాటులో ఉంచాలి. సమాచార హక్కు చట్టం సెక్షన్ 4 (1)(బి) ఏమి తెలియజేస్తుందంటే ఆ ప్రభుత్వ కార్యాలయంలోని ప్రతి శాఖ అధికారి పేరు–విధులు–ఆ అధికారి నుంచి ఏయే సమాచారం పొందవచ్చు, కార్య నిర్వహణలో ఆయా శాఖల ఉద్యోగులు పాటించ వలసిన నియమ నిబంధనలు, ఆదేశాలు, మ్యానువళ్లు, రికార్డులు తదితర అంశాలన్నింటినీ పొందుపరచాలి.

సమాచార హక్కు చట్టం ప్రకారం 'పౌర సమాచార అధికారి' లేదా సహాయ పౌర సమాచార అధికారి నుంచి కార్యాలయంలోని ఏ సమాచారమైననూ పొందవచ్చును. ధరఖాస్తు చేసుకున్న నెల రోజుల లోపుగా ఈ 'సమాచారం' అడిగిన పౌరునికి అందజేయాలి. అత్యవసరమైన వాటిని 1–2 రోజుల లోపుగా అందుబాటులో ఉంచాలి. ఎవరైనా సమాచారాన్ని పొందడానికి బదులుగా పరిశీలించాలని భావిస్తే వ్యక్తిగతంగా కార్యాలయాన్ని సందర్శించడానికి సమయాన్ని కేటాయించాలి. ఇలాంటి విషయాలన్నింటినీ సమాచార హక్కు నిబంధనల ప్రకారం కార్యాలయంలో ఏర్పాటు చేయాలి. కానీ ప్రస్తుత మున్సిపాలిటీలలో అడగబడిన సమాచారం ఎవరు కూడా వెంటనే ఇవ్వడం లేదు. పైగా ఇవ్వాల్సిన సమాచారం ఇవ్వకుండా 'అందుబాటులో లేదు' అంటూ ధిక్కారంతో కూడిన సమాచారాన్ని సమాధానంగా ఇస్తున్నారు. ఇది చాలా శోచనీయం.

ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండవలసిన అధికారులు అందుబాటులో ఉండడం లేదు. పైగా రాష్ట్రంలోని ప్రధాన మున్సిపాలిటీలలో అంతా సరైన 'అధికార యంత్రాంగం' లేదు. ఇన్‌చార్జీల పాలనను కొనసాగిస్తున్నారు. పంచాయతీ రాజ్ శాఖ నుంచి డిప్యుటేషన్‌పై అధికారులను తెచ్చుకొని అధికార పార్టీ నాయకులు, తమ చెప్పు చేతల్లో మున్సిపాలిటీలు ఉండే విధంగా చూసుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి మున్సిపాలిటీలు 'ఆర్థిక వనరులు'గా మారాయి. ప్రధానంగా 'టౌన్ ప్లానింగ్' అధికారుల అవినీతి అంతా ఇంతా కాదు.

కొత్తగా ఇళ్లు కట్టాలనుకున్న వారు, కొత్తగా ఇంటి స్థలం కొన్నవారు విధిగా తగినంత 'రుసుము' మున్సిపాలిటీలకు చెల్లించాలి. ఇందులో చాలా భాగం రాష్ట్ర ప్రభుత్వానికి అందుతుంది. ప్రజలు కట్టే ప్రతి బిల్లు 'కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (సిడిఎంఎ)' ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పేరు మీద రసీదు అందుతుంది. మున్సిపల్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ శాఖకు రాష్ట్ర స్థాయి పరిపాలనాధికారి సిడిఎంఎ. కానీ విచారకరమైన విషయం ఏమంటే ఈ అధికారి కూడా 'ఇన్‌చార్జి' అధికారి అయి ఉంటారు. ఉదాహరణకు రాష్ట్రంలోని ఏ మున్సిపల్ కమిషనర్ ప్రజల పట్ల సరియైన బాధ్యతతో వ్యవహరించకుంటే ప్రాంతీయ స్థాయిలో 'రీజినల్ డైరెక్టర్', రాష్ట్ర స్థాయిలో సిడిఎంఎ ఉంటారు. వీరిరువురూ ఏదో ఒక అదనపు బాధ్యతతో వ్యవహరించడం వలన అందబడిన ఫిర్యాదులకు సరైన సమయంలో సమాధానం రాదు. లేదా నిర్లక్ష్యపూరితంగా సమాధానం వస్తుంది. కావున రాష్ట్రంలో మున్సిపాలిటీలలో ప్రజలకు సరైన సేవలు అందడం లేదనేది సుస్పష్టం. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వ ఉదాసీన, నిర్లక్ష్య వైఖరే కారణం.

ప్రజలను ఇంకా మద్యం మత్తులో ఉంచాలనే ధోరణి తప్ప రాష్ట్ర ప్రభుత్వానికి సేవలకు సంబంధించి ఎలాంటి బాధ్యత లేనట్లు వ్యవహరిస్తోంది. అంతేకాకుండా మున్సిపాలిటీలు ఉండేది ప్రజల వద్ద 'పన్నులు' వసూలు చేయడానికే కానీ, ప్రజలకు సేవ చేయడానికి కాదన్నట్లుగా వ్యవహరిస్తోంది. పట్టణాలలో కుక్కలు, పందులు స్వైర విహారాన్ని అరికట్టలేకపోతున్నారు. ఎక్కడ చూసినా పెద్ద, పెద్ద చెత్త కుప్పలు కనిపిస్తుంటాయి. వాటిని తొలగించడానికి సరైన సిబ్బంది లేరంటూ దాటవేస్తుంటారు. ప్రజలకు దోమలు కుట్టకుండా, దోమల పెరుగుదలను అరికట్టడానికి ఏ 'పురపాలిక'లో సరైన కార్యక్రమం లేదు. ఏమన్నంటే రాష్ట్ర ప్రభుత్వం నుంచి సరైన నిధులు, సిబ్బంది లేదని సమాధానం వస్తుంది. ప్రజల అన్ని సమస్యలను పరిష్కరించడానికి, ప్రజలతో ఎన్నికైన కౌన్సిలర్లు, కార్పొరేటర్లు తమ, తమ వార్డులలో నిత్యమూ పర్యటిస్తూ, వీలైనంత త్వరలో ప్రజల సమస్యలను పరిష్కరించాలి. ప్రజలకు బాధ్యులుగా వ్యవహరించాలి. కేవలం ధన సంపాదనే లక్ష్యం కారాదు.

ప్రజల కనీస అవసరాలైన మంచి నీరు, 'చెత్త' ఎత్తివేసే యంత్రాలను పంపడం, పరిశుభ్రంగా వీధులను శుభ్రం చేయడం, ప్రజలకు అందుబాటులో ఉండడం మున్సిపాలిటీల పాలక మండళ్లు చేయవలసిన విధులు. వీటిని పాటిస్తారని ఆశిద్దాం, ప్రజలు కూడా తమ పనుల కోసం అధికారులను ప్రశ్నిస్తూ, ఏమాత్రం అవినీతికి తావు లేకుండా, కేవలం 'రుసుము'ను మాత్రమే చెల్లిస్తూ తమ పనులను తాము చేసుకోవాలి. ఆ విధంగా ప్రజలు కూడా ఎప్పటికప్పుడు చైతన్యవంతులు కావాలి. పై అధికారులను కూడా అప్రమత్తులను చేయాలి. అనునిత్యం అప్రమత్తతతో వ్యవహరించినప్పుడే అధికారులు కూడా ప్రజల పట్ల బాధ్యతతో వ్యవహరిస్తారు.

ప్రజాస్వామ్యంలో ప్రజలే నిర్ణయాధినేతలు. మున్సిపాలిటీలు ప్రజలకు సేవలందించడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వ విధి విధానాలను స్పష్టం చేస్తాయి. తద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యతా అంశాలు, విలువలు బహిర్గతమవుతాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా మున్సిపాలిటీలలో మరింత 'అభివృద్ధి' జరిగేలా చూడాలి. అవినీతి అరికట్టబడాలి. ప్రజాస్వామ్య విలువలు వికసించబడాలి.

(రచయిత న్యాయవాది, ఒపిడిఆర్ రాష్ట్ర కమిటీ సభ్యులు) వీ

పెట్రోల్ భగ భగ - సామాన్యుల విల విల

***విదేశీ మార్కెట్‌లో పెట్రోల్ ధర తగ్గుతున్నా కేంద్రం ఎప్పుడూ పెంచుతుండడంతో ప్రజల జీవన ప్రమాణాలు పడిపోగా, కార్పొరేట్ శక్తులకు మాత్రం ప్రభుత్వాలు వేల కోట్ల సబ్సిడీలు ఇస్తున్నాయని అంటున్నారు* సంతోష్**

కోవిడ్-19తో అతలాకుతలమైన జనజీవనం ఇప్పుడిప్పుడే సాధారణ స్థితికి వస్తున్నది. ఈ సమయంలో పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరల రూపంలో మరో గుదిబండ మధ్యతరగతి, సామాన్య ప్రజలపై పడుతున్నది. పెట్రోల్ ధరలను నియంత్రించడంలో మోడీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. దేశంలో రోజు రోజుకు పెరుగుతున్న చమురు ధరలు సాధారణ ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఎడాపెడా పెంచుతున్న చమురు ధరలతో పెట్రో ధరలు ఆకాశానికి ఎగబాకుతున్నాయి. ఫలితంగా రవాణా సహా అన్ని రంగాల పైనా ప్రభావం ప్రసరించి ధరలు మండిపోతున్నాయి. దీంతో ద్రవ్యోల్బణానికి రెక్కలొస్తున్నాయి. సామాన్య, మధ్యతరగతి ప్రజలు భీతిల్లిపోతున్నారు. దేశ ప్రజల బాగోగులు చూడాల్సిన కేంద్ర ప్రభుత్వం చమురు ధరల పెరుగుదలలో తప్పేమి లేదంటూ బుకాయిస్తోంది. ప్రజలు గగ్గోలు పెడుతున్నా, ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నా, సోషల్ మీడియాలో నేతలపై చలోక్తులు విసురుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. రవాణా వ్యయం పెరిగి నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయి. పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలతో సామాన్యులు ద్విచక్ర వాహనాలను బయటకు తీయాలంటేనే భయపడుతున్నారు. పెరుగని ఆదాయాలు, పెరిగిన ఖర్చులతో బతికేదెలా అంటూ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కరోనా బారిన పడి ఇప్పటికే విలవిల్లాడుతున్న సామాన్య, మధ్యతరగతి వర్గాలను పెట్రో దెబ్బ మరింత కుంగదీసింది. లాక్‌డౌన్‌తో ఉద్యోగాలు కోల్పోయి, భవిష్యత్తు అగమ్యగోచరమై భయాందోళనలో మగ్గుతున్న ప్రజలకు ధరల పెరుగుదల శరాఘాతంలా పరిణమించింది. వినియోగ ధరల సూచీ ప్రాతిపదికన అంచనా వేసే టోకు ధరల ద్రవ్యోల్బణం రిజర్వ్ బ్యాంకు విధానం ప్రకారం నిర్దేశించిన ఆరు శాతానికి మించి ఉంది. గడిచిన ఆరు నెలలుగా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. టోకు ధరల ద్రవ్యోల్బణం రెండు రకాలు... ఒకటి ప్రాధాన్య ద్రవ్యోల్బణం. ఆహారం, చమురు మినహా వస్తు సేవల ధరల్లో మార్పులకు ఇది ప్రాతిపదిక. రెండు ప్రాధాన్యేతర ద్రవ్యోల్బణం. అంటే ఆహారం, ఇంధన ధరల్లోని మార్పులకు ఇది కొలమానం. రవాణా రంగం ప్రాధాన్యేతర ద్రవ్యోల్బణం కిందికి వచ్చినా.. పెట్రోల్ ధరల పెరుగుదల వల్ల రవాణా చార్జీలు మోతెక్కి, ఆ ప్రభావం అన్ని రంగాల పైనా ప్రసరిస్తుంది. ఫలితంగా ప్రాధాన్య ద్రవ్యోల్బణం అనూహ్యంగా ఎగబాకుతుంది.

యుపిఏ పాలనా కాలంలో అంతర్జాతీయంగా చమురు ధర పెరిగి, దేశీయంగా రూపాయి విలువ 32 శాతం పడిపోయిన సందర్భంలో 2012 మేలో మన్మోహన్ సింగ్ ప్రభుత్వం పెట్రోల్ ధర లీటర్‌కు 7.54 పెంచింది. ఆ సమయంలో మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు బిజెపి దేశ బంద్‌కు పిలుపునిచ్చింది. 2013 మార్చ్‌లో మరోసారి చమురు ధరలు పెరిగినప్పుడు పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు జరుగకుండా అడ్డుకున్నారు. 2014 ముందు పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరల విషయంలో ఖాళీ గ్యాస్ మొద్దులను ప్రదర్శిస్తూ, ఆటోలను, మోటార్ సైకిళ్లను తాళ్లతో లాగుతూ, రాస్తారోకో, భారత్ బంద్ లాంటి అస్త్ర శస్త్ర కార్యక్రమాలతో ధరల పెరుగుదలను రక్తికట్టించి మన్మోహన్ సర్కార్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడి గగ్గోలు పెట్టిన మోడీ, స్మృతి ఇరానీ లాంటి అనేక మంది బిజెపి నేతలు అధికారానికి రాచబాటలు వేసుకొని నేడు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తూ తమ వైఫల్యాన్ని గత ప్రభుత్వాల ఖాతాలో వేయడానికి ప్రయత్నిస్తున్నారు.

పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడానికి యుపిఏ సర్కార్ అనుసరించిన తప్పుడు ఆర్థిక విధానాలు కారణమని దేశవ్యాప్తంగా బిజెపి శ్రేణులు నిరసనలు తెలియజేశారు. 'పెట్రోల్ ధరలు పెంచితే ఊరుకునేది లేదు' అంటూ ఆనాడు వీధుల్లో గగ్గోలు పెట్టిన మోడీ నేడు 'గద్దె'మీదున్నారు. కానీ ఆయనకు పెట్రోల్ ధరలు పెంచకుండా రోజు గడవకపోవడం వైచిత్రి..! 'చమురు ధరలు మండిపోతోంటే ప్రధాని మన్మోహన్ మౌనమునిలా ఉంటే ఎలా? జిడిపి గురించి కాదు, సామాన్యుని కష్టాల గురించి ఆలోచించరా...?' ఇది నాటి ప్రధానికి గుజరాత్ ముఖ్యమంత్రిగా నరేంద్రమోడీ సవాలు...! ఇప్పుడు అదే నరేంద్రమోడీ నాయకత్వంలో పెట్రోల్, డీజిల్ నువ్వానేనా అన్నట్లు పోటీపడుతూ వందకు చేరువవుతుంటే, వంట గ్యాస్ వెయ్యికి చేరువగా చేరుకుంటుంది. ఫలితంగా నిత్యావసరాల ధరలన్నీ ఆకాశన్నంటుతుండగా, ప్రజల ఆదాయాలు మాత్రం పాతాళానికి చేరుతున్నాయి. 'ఇవేమి భారాలు మహాప్రభో' అంటూ జనాలు విలపిస్తుంటే.. 'అదంతా గత ప్రభుత్వాల చలవే' అంటూ ప్రధాని సెలవిస్తున్నారు. వైఫల్యాలను ప్రత్యర్థులకు అంటగట్టి విజయాలను తన జేబులో వేసుకోవడంలో మోడీ మహా నేర్పరి అని తెలిసినా... మరీ ఇంత అడ్డగోలుగా అబద్ధాలకు దిగజారుతుంటే నవ్వాలో ఏడవాలో అర్థం కాని పరిస్థితి జనాలది...!

మోడీ ఏలుబడికి ఏడేండ్లు గడిచిపోయినా, ఇంకా ఎంతకాలం తన వైఫల్యాలకు గత ప్రభుత్వాలను సాకుగా చూపుతారు...?! 2010 - 11లో బ్యారెల్ ముడి చమురు ధర రు. 85.09 డాలర్లుగా ఉంది. అంతర్జాతీయ మార్కెట్ల ఎగుడు దిగుళ్ల వల్ల అది పెరుగుతూ 2013 - 14లో 105.52 డాలర్లకు చేరింది. అప్పుడు పెట్రోల్ ధర సుమారు రు. 71.41గా నమోదయింది. ఆ తరువాత అంతర్జాతీయంగా నెలకొన్న ఆర్థిక, రాజకీయ, భౌగోళిక కారణాల వల్ల ముడి చమురు ధరలు తగ్గుతూ వచ్చాయి. 2015 - 16లో బ్యారెల్ ధర 46.17 డాలర్ల కనిష్ఠ స్థాయికి చేరుకుంది. ఆ తరువాత 2016 నుంచి 2020 వరకు ఎప్పుడు లేనంతగా ముడి చమురు ధరలు తగ్గాయి. కాని, దేశంలో పెట్రోల్ ధరలు ముడి చమురు ధరలతో నిమిత్తం లేకుండా క్రమంగా పెరుగుతూనే ఉన్నాయి. అంతర్జాతీయంగా ధరలు తగ్గినా, మనదేశంలో ధరలు పెరగడం జీర్ణించుకోలేని అంశం.

2014లో మోడీ ప్రధానిగా బాధ్యతలు చేపట్టే నాటికి పెట్రోల్ ధర రు. 71.41గా ఉండగా, ఆ తరువాత నిరంతరం పెరుగుతూ ఇప్పుడు 100 మార్కును తాకుతున్నది. 2013 వరకూ పెట్రోల్‌పై కేంద్ర ఎక్సైజ్ సుంకం రు. 9.48, డీజిల్‌పై రు. 3.56 ఉండేది. అంటే కేంద్రం, రాష్ట్రాలు విధించే పన్నులు దాని అసలు ధరలో 44 శాతం వరకూ ఉండేవి, ఇప్పుడు అవి 100 నుంచి 110 శాతం వరకూ పెరిగాయని గణాంకాలు చెబుతున్నాయి. ఇదే కాలంలో వంట గ్యాస్ బండ ధరను కూడా ఎడా పెడా పెంచేస్తున్నారు. జనవరిలో 14.2 కిలోల గ్యాస్ సిలిండర్ ధర రు. 746.50 ఉండగా, ఫిబ్రవరి 3న రు. 25 పెరిగి రు. 771.50 అయింది. గత ఫిబ్రవరిలో 14న మరో రు. 50 పెరిగి, రు. 810.50కి గ్యాస్ బండ చేరుకుని త్వరలో వెయ్యికి చేరుకోనుంది. ఇది సామాన్యుల కుటుంబాలలో కన్నీళ్లు తెప్పిస్తున్నాయి.

2020 నాటికి పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీ వరుసగా రు. 32.98, రు. 31.83 అంటే దాదాపు 10 రేట్ల భారం ప్రజలపై పడింది. బహుశా ప్రపంచంలో ఏ దేశంలోనూ పెట్రోల్‌పై ఇంత భారీగా పన్నులు లేవు. బ్రిటన్‌లో 61 శాతం, ఫ్రాన్స్‌లో 59 శాతం, అమెరికాలో 21 శాతం పన్నులు విధిస్తున్నారు. ఇక పెట్రోలియం ఉత్పత్తుల నుంచి కేంద్రానికి వెళ్లే ఆదాయం 2014-15లో రు. 1,26,025 కోట్లుగా ఉంటే 2020-21 నాటికి అది రు. 2,63,351 కోట్లకు పెరిగింది. ఇక పెట్రోలియం ఉత్పత్తుల నుంచి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి 2014-15లో రు. 4527 కోట్ల ఆదాయం రాగా, 2020-21లో రు. 5678 కోట్ల ఆదాయం వచ్చింది. 2016 నుంచి 2020 వరకు పెట్రోలియం రంగం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఖజానాలకు ఏటా సుమారు అయిదున్నర లక్షల కోట్ల రూపాయల మొత్తం సమకూర్చింది. భారత ప్రభుత్వం ద్రవ్య లోటును పూడ్చుకునేందుకు ఇంధనంపై భారీ స్థాయిలో పన్నులు విధిస్తోందని, ఇప్పటి వరకు ఈ పన్నుల ద్వారా రు. 20 లక్షల కోట్లు ప్రభుత్వ ఖజానాలో చేరాయని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

2014 ఎన్నికల ప్రచారంలో తాము (బిజెపి) అధికారంలోకి వస్తే వంద రోజుల్లో ధరలు తగ్గిస్తామన్న మోడీ ప్రభుత్వం ఇప్పుడు చేస్తున్నదేమిటి? పెట్రో మంటల్లో శకలాల్లా కాలిపోతున్నా మరో మార్గం లేదు కాబట్టి సామాన్యుడు పంటి బిగువున ఈ భారాన్ని భరిస్తున్నాడు. దీనినే అలుసుగా తీసుకున్న నరేంద్రమోడీ ప్రభుత్వం ప్రజలకు ఉపశమనం కల్పించే చర్యలు తీసుకునే బదులు వేడుక చూస్తున్నట్లు వ్యవహరిస్తోంది. మోడీ ప్రభుత్వానికి ఇప్పుడు పెట్రోలు ధరలు పెంచకుండా రోజు గడవకపోవడం ప్రభుత్వ దివాళాకోరుతనానికి నిదర్శనం. మోడీ ప్రభుత్వం కార్పొరేట్లపై పన్ను విధించడానికి బదులు రాయితీలు ఇచ్చింది. 2015-16లో రు. 1,15,176 కోట్లు, 2016-17లో రు. 1,30,184 కోట్లు, 2017-18లో రు. 1,20,069 కోట్లు, 2018-19లో రు. 1,25,891 కోట్లు, 2019-20లో రు. 1,16,260 కోట్లు రాయితీలు ఇచ్చింది. ఈ లోటును పూడ్చుకోవడానికి పెట్రోల్, డీజిల్‌పై పన్నులు వేస్తోంది. ఎప్పటికప్పుడు రాష్ట్రాలకు వాటా పంచనక్కరలేని కొత్త సెస్‌లు విధిస్తూ పోవడానికి కేంద్రానికి చమురు తేరగా దొరికింది. ఎక్సైజ్ పన్ను విధిస్తే పెరిగిన దాంట్లో రాష్ట్రాలకు వాటా ఇవ్వవలసి వస్తుందని కుట్ర పూరితంగా రాష్ట్రాలకు ఇవ్వనవసరం లేని సెస్ విధానాన్ని అమలులోకి తెచ్చింది. సెస్ ద్వారా వచ్చే అదనపు ఆదాయం నేరుగా కేంద్ర ఖజానాకే చేరుతుంది.

పెట్రోల్, డీజిల్ ఇంధనాలకు గతంలో నియంత్రిత ధర ఉండేది. అంతర్జాతీయ మార్కెట్‌లో క్రూడాయిల్ ధర అపరిమితంగా అసాధారణ స్థాయికి పెరిగిపోయినప్పుడు దాని దిగుమతికయ్యే ఖర్చులో కొంత భాగాన్ని ప్రభుత్వం సబ్సిడీ ద్వారా భరించేది. మొత్తం ధర ప్రజల నెత్తిన పడకుండా సబ్సిడీ ఇచ్చేది. ఆ పద్ధతిని తొలగించి 2017 జూన్ నుంచి కేంద్రం 'దినసరి ధరల యంత్రాంగం' (డైలీ ప్రైస్ మెకానిజం)తో ఇంధన ధరలను లింక్ చేసింది. దాంతో రోజువారీగా యాభై పైసల చొప్పున పెట్రో ధరలు పెరుగుతున్నాయి. అయితే ప్రపంచ మార్కెట్‌లో ఆయిల్ ధరలు పతనమైనప్పుడు ఆ మేరకు దేశంలో ధరలు తగ్గిన సందర్భాలు దాదాపు లేవనే చెప్పవచ్చు. గత ఏడాది మార్చ్‌లో అంతర్జాతీయంగా బ్యారెల్ క్రూడాయిల్ ధర ఎన్నడూ లేనంతగా 27.10 డాలర్లకు పడిపోయింది. 1991 తర్వాత క్రూడ్ ధర ఆ విధంగా తగ్గిపోవడం అదే మొదటిసారి. అయినా మనదేశంలో ఇందనపు ధరలు తగ్గలేదు.

మనం వాడే బ్రెంట్ రకం క్రూడాయిల్ ధర గతేడాది ఏప్రిల్‌లో 50 శాతం తగ్గిపోయి బ్యారెల్ 26 డాలర్లకు పతనమైంది. అప్పుడు కూడా ఆ మేరకు ఇక్కడ ధరలు తగ్గలేదు. పెట్రో ధరలు పెరగడానికి చమురు రంగాన్ని ప్రభుత్వం ఆదాయవనరుగా చూడడమే కారణం. పెట్రోల్ ధరలో 67 శాతం, డిజిల్ ధరలో 61 శాతం పన్నులే ఉంటున్నాయి. పన్నులు లేకుంటే ముప్పై రూపాయలకే లీటర్ పెట్రోలు ఇవ్వవచ్చు. ప్రపంచ మార్కెట్‌లో ధర తగ్గినప్పుడు ఆదా అయిన విత్తాన్ని కేంద్ర ప్రభుత్వం తన ఖాతాలో వేసుకొని అక్కడ పెరిగినప్పుడల్లా ఆ మేరకు భారాన్ని ప్రజల మీద పడేస్తున్నది. ఇది తానే ప్రవేశపెట్టిన అనియంత్రిత ధరల వ్యవస్థ ధర్మాన్ని కూడా దారుణంగా అతిక్రమించడమే తప్ప మరోటి కాదు. కొన్నేండ్లుగా కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలే ధరల పెరుగుదలకు కారణమని చెప్పవచ్చు.

పెట్రోల్ వినియోగించే వారిలో ఎనభై శాతం ద్విచక్ర వాహనదారులే. చమురుపై వారి నెలవారి ఖర్చు నాలుగో వంతు పెరిగింది. ఇంధన రేట్లు పెరుగుదల ప్రభావం ప్రతీ ఉత్పత్తి మీదా కనిపిస్తున్నది. ఆహారోత్పత్తుల ధరలు ఆకాశాన్ని అంటడానికి చమురు ధరలే కారణం. ప్రపంచ పటంలో ఏ దేశాన్ని చూసినా చమురు ధర ఇంతగా మండుతున్నవి కనబడవు. మన ఇరుగు పొరుగు దేశాల్లో అది ఎంతో చవుక. చమురును జిఎస్‌టి పరిధిలోకి తెస్తే తమ నిరవధిక దోపిడీ సాగదు కనుక ఆ ఊసే ఎత్తడం మానేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేర్వేరు పేర్లతో పన్నులూ, సుంకాలూ వడ్డించేస్తున్నాయి. ఏం చేసినా రాష్ట్రాలే చేయాలని కేంద్రం, పాపం పూర్తిగా కేంద్రానిదేనని రాష్ట్రాలూ బాధ్యతా రహితంగా జనాన్ని పీల్చేస్తున్నాయి. ధరల మంటను ఇక ఏమాత్రం భరించలేని స్థితికి సామాన్యుడు చేరుకున్న వాస్తవాన్ని గుర్తించ నిరాకరిస్తున్నారు.

2021 ఫిబ్రవరి 1 నాటికి అంతర్జాతీయ విపణిలో ఒక బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు ధర దాదాపుగా 63 డాలర్లు. ఒక బ్యారెల్ అంటే దాదాపు 159 లీటర్లు. అంటే ముడి చమురు లీటర్ ధర రు. 28.74. ముడి చమురు శుద్ధి, ప్రాసెసింగ్ ఇతరత్రా ఖర్చులు దాదాపుగా రు. 3.84 దాకా పడతాయి. ఈ రెండింటినీ కలిపితే... చమురు మూల ధర రు. 32.58 అవుతుంది. దీనిపై కేంద్రం విధిస్తున్న ఎక్సైజ్ డ్యూటీ... రు. 32.90 అంటే మూల ధర కన్నా కేంద్ర పన్నే ఎక్కువ. లీటర్ పెట్రోల్‌కు డీలర్ మార్జిన్ రు. 3.24 ఈ మూడింటినీ కలిపితే... రు. 68.72 అవుతుంది. రవాణా చార్జీలు 19 పైసలు. ఈ మొత్తంపై రాష్ట్రం విధించే వ్యాట్ 35.2 శాతం కలిపితే లీటర్ పెట్రోల్ ధర రు. 93 దాటేస్తుంది. పెట్రోల్‌పై కేంద్రం విధించే ఎక్సైజ్ పన్ను రు. 32.90లో బేసిక్ ఎక్సైజ్ డ్యూటీ రు. 1.40 కాగా, ప్రత్యేక ఎక్సైజ్ డ్యూటీ రు.

దేశంలో ప్రైవేటీకరణ సుడిగాలి

దేశ ప్రజల అవసరాలను తీర్చాల్సిన సహజవనరులను, ప్రభుత్వ సంస్థలను విదేశీ, స్వదేశీ కార్పొరేట్ సంస్థలకు అప్పగించడమే దేశభక్తి అన్న విధంగా కేంద్రం ప్రభుత్వ వ్యవహరిస్తోందని అంటున్నారు బి.ఎస్. రాజు

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2021-2022 వార్షిక బడ్జెట్ ప్రవేశపెడుతూ 'ఆత్మ నిర్భర్ భారత్'లో భాగంగా ప్రభుత్వ సంస్థల్లో వాటాలను అమ్మేస్తామని, ఏ నాలుగయిదో మినహా మిగతా అన్ని ప్రభుత్వ సంస్థలను ప్రైవేటీకరిస్తామని ప్రకటించింది. దీపం: డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ పబ్లిక్ ఎస్సెట్ మేనేజ్‌మెంట్), నీతి ఆయోగ్ అనే సంస్థలు ఈ వ్యవహారాన్ని చక్కబెడతాయంది. ప్రభుత్వ ఆస్తులను డిసిన్వెస్ట్‌మెంట్, స్ట్రాటజిక్ సేల్, స్టాక్ సేల్ వగైరా పద్ధతుల ద్వారా అమ్మే ప్రక్రియను ఓ సాహ

స చర్యగా వర్ణించింది. ప్రభుత్వం దేశంలో ఓ నూతన అధ్యాయాన్ని మొదలు పెట్టిందనీ, ఇంతవరకూ ఏ ఇతర ప్రభుత్వమూ చేయలేని సాహసోపేత చర్యను ఈ దమ్మున్న ప్రభుత్వం చేసి చూపిస్తుందని జబ్బలు చరుచుకుంది. ఈ తతంగానికి ఇన్ని డొంక తిరుగుడు పేర్లు అక్కరలేదు. మామూలు జనం భాషలో దీన్ని తెగనమ్మడం అంటారు. ప్రజా ఆస్తుల లూటీ అంటారు. దెకాయిటీ అంటారు. గజదోపిడీ అని కూడా అంటారు.

పెట్టుబడిదారీ ఆర్థిక శాస్త్రవేత్తలు పెట్టుబడి సమర్థనకు తీపి పదజాలాన్ని ఎప్పటికప్పుడు పేనుతూ, (అద్దుతూ) అల్లుతూ ఉంటారు. పెట్టుబడికి జబ్బుచేసి మంచమెక్కినప్పుడల్లా సరికొత్త పేర్లతో కొత్త సూది మందులు తయారుచేసి దానికి ఎక్కిస్తూ ఉంటారు. ఎలాగోలా రోగి మంచం దిగి తిరిగి నాలుగడుగులు నడిచేట్టు చేస్తారు. ఈ ఆర్థిక నిపుణులు పొందే తర్ఫీదు అటువంటిది.

ఇలాంటివారు హార్వార్డ్, ఆక్స్‌ఫర్డ్, స్టాన్‌ఫర్డ్, లండన్, చికాగోల్లో ఎక్కువగా లభ్యమవుతూ ఉంటారు. మన పాలకులు కూడా అక్కడ తయారైన మన బ్రీడ్ ఆర్థిక నిపుణులను అవసరానికి అద్దెకు తెచ్చుకుని, తమకు నచ్చితే ఉంచుకుంటూ, నచ్చకపోతే హింసిస్తూ, వంచిస్తూ, తన్ని తగలేస్తూ ఉంటారు. అలా అని అందరికీ ఒకే గతి పడుతుందని అనలేం. వీరిలో కొందరు అందలాలు ఎక్కిన వారున్నారు, కొందరు బెడ్డింగ్ సర్దుకుని తిరుగు ముఖం పట్టినవారున్నారు. ఇలాంటి కొందరు, సలహాదారుల స్థాయినుంచి మంత్రి వర్గంలోకి, దేశ ప్రధాని హోదాకు ఎత్తబడ్డ ఘటనలు లేకపోలేదు.

ఇంతకీ వీరి ప్రావీణ్యత ఏమిటి? ప్రజల ఆస్తులను రకరకాల పేర్లతో పలు పద్ధతుల్లో ప్రైవేటు సంస్థలకు బదిలీచేయడం. ప్రైవేటీకరణ, సరళీకరణ, బజారీకరణ, పెట్టుబడిదారీ వ్యవస్థ రూపకల్పన, నిర్మాణం. స్వాతంత్రం వచ్చిన తొలినాళ్లలో అప్పటి అవసరార్థం కల్పనచేసుకున్న దేశ ఆర్థిక వ్యవస్థను ఊడబీకి దేశ విదేశీ పెట్టుబడికి అనుకూలమైన కార్పొరేట్ ఆర్థిక రాజకీయ పాలనా వ్యవస్థను స్థాపించి స్థిరీకరించడం.

ఏదైనా వస్తువు నీకో నాకో చెందితే దాన్ని నీది, నాది అని పిలుస్తాం. అది నీ సొంతం. లేక నా సొంతం. అది నీకు అవసరమైతే ఉంచుకుంటావు. అవసరం లేకుంటేనో, లేక ఇతరత్రా అవసరాలకో నీ

---

11. అదనపు ప్రత్యేక ఎక్సైజ్ డ్యూటీ రు. 18 కాగా, మొన్నటి బడ్జెట్ వేసిన వ్యవసాయం, మౌలిక సదుపాయాల అభివృద్ధి సుంకం రు. 2.50 అదనం. ఈ మొత్తంలో డివిజబుల్ పూల్ కింద కేంద్రం రాష్ట్రాలతో పంచుకునేది బేసిక్ ఎక్సైజ్ డ్యూటీలో 42 శాతం మాత్రమే. అంటే ప్రతి ఒక్క లీటర్ పెట్రోల్‌పై విధించే రు. 1.40 బేసిక్ ఎక్సైజ్ డ్యూటీలో రాష్ట్రాలకు ఇచ్చేది 58 పైసలే. మిగతాదంతా కేంద్రం ఖజానాలోకే వెళ్తుంది.

అంతర్జాతీయ మార్కెట్లో గడిచిన 14 నెలల కాలంలో డాలర్‌ను ప్రామాణికంగా తీసుకుంటే ముడి చమురు ధరలు 5 శాతం తగ్గాయి. దేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు ఆ మేరకు తగ్గకపోగా జనవరి 2020తో పోలిస్తే 20 శాతం పెరిగాయి. పొరుగున ఉన్న పాకిస్తాన్, బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్ వంటి దేశాలతో పాటు అమెరికాలో ఈ కాలంలో 5 నుండి 7 శాతం ధరలు తగ్గాయి. డాలర్ కన్నా బలంగా ఉండే స్థానిక కరెన్సీ ఉన్న చైనా, కొరియా వంటి దేశాల్లో కూడా తగ్గుదల కనిపిస్తోంది. మన దేశంలో మాత్రం ధరల్లో తగ్గుదల కనిపించకపోగా, ప్రపంచంలోనే అత్యధిక పెరుగుదల వైపు పరుగులు తీస్తుండడం దిగ్భ్రాంతి కలిగిస్తోంది. తిలా పాపం తలా పిడికెడన్నట్లు కేంద్రం వసూలు చేసే పన్నుల్లో వాటా కోసం వెంపర్లాడుతున్న రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై మోపుతున్న ఈ భారాన్ని నామమాత్రంగా కూడా ప్రశ్నించడం లేదు.

ఇప్పటికే కరోనా కారణంగా ఒకవైపు ఉపాధిలేమి, మరోవైపు ఆర్థిక మాంద్యాల దెబ్బలకు ప్రజలంతా విలవిల్లాడుతున్నారు. ఇప్పుడు నిత్యం ఇంధన ధరల పెంపుతో తను దెబ్బమీద దెబ్బ వేస్తున్నా ప్రజలు కిక్కురుమనడం లేదని ప్రధాని సంబరపడుతున్నారేమో... మాటల గారడీతో జనాన్ని మాయచేయగల తన నైపుణ్యానికి మురిసి పోతున్నారేమో.. కానీ, ప్రజలు నిజాలు గ్రహించలేని అమాయకులేం కాదు. ప్రజలు కీలెరిగి వాత పెడుతారని ఎంత తొందరగా గుర్తిస్తే వారికే మంచిది. ఇకనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంప్రదింపులు చేసుకొని ఇంధన ధరల పెరుగుదలను అదుపు చేయాల్సిన అవసరం ఉన్నది. ఇంధనాన్ని జిఎస్‌టి పరిధిలోకి తెస్తారా లేదా ప్రత్యేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇరువురూ పన్నులు తగ్గించి ప్రజలకు మేలు చేస్తారా అనేది తేల్చుకోవాల్సింది పాలకులే. అంతిమంగా ప్రజలకు కావాల్సింది మాత్రం ధరల తగ్గుదల. ముమ్ముందు పరిస్థితులు ఇలాగే కొనసాగితే ప్రజాగ్రహాన్ని చవిచూడాల్సిన పరిస్థితి ఏర్పడక తప్పదు.

(రచయిత ఉపాధ్యాయులు) వీ

వస్తువును నువ్వమ్ముకుంటావు. అది కావాలనుకునేవాడు కొనుక్కుంటాడు. బేరసారాలు జరుగుతాయి. ఈ బేరం వీధి పుంతలో జరగొచ్చు, లేక ఏదైనా సంతలో జరగొచ్చు. మన ఊళ్లో, మన దొడ్లో ఆవో, బర్రో, గేదో వీటిని పాలకోసం మేపుతాం, పాలు పిండుకు తాగుతాం, అమ్ముతాం. పాలు ఇచ్చినన్నాళ్లు ఉంచుతాం, ఒట్టిపోతే అమ్ముతాం. నగా నట్రా, పొలం పుట్రా, ఇల్లు, దుకాణం, సొంత వ్యాపారం, ఇదంతా వ్యక్తిగతం. ప్రైవేట్ వ్యవహారం. ఇదే ప్రైవేట్ రంగం. ఈ రంగంలో ఆస్తిపాస్తుల అమ్మకాలు కొనుగోళ్లు సొంతదార్ల ఇష్టానుసారం జరుగుతాయి.

ఇలా కాక, నీదీ నాదీ కాక, మందిది ఉంటుంది. మందికి చెందినవి ఉంటాయి. ఊరి ఉమ్మడి ఆస్తులు, మంది సొమ్ము, జనం సొమ్ము, దేవునిదో, దేవతదో గుడో, మడో, మాన్యమో, బ్యాంకో, దుకాణమో, వ్యాపారమో, పరిశ్రమో ఇవన్నీ జనానివి, సమూహానివి. ప్రజలవి. జనం ఎన్నుకున్న ప్రభుత్వం వాటిని నిర్వహిస్తే అవి పేరుకు ప్రభుత్వానివి. కానీ జనానివే. ఇదంతా పబ్లిక్ వ్యవహారం. ఇదే పబ్లిక్ రంగం. ఇక్కడ ఈ రంగంలో ఎవరి ఇష్టానుసారం వారు ప్రభుత్వం ఆస్తులు అమ్మడానికి లేదు. దీనికి జనామోదం ఉండాలి. జనామోదం పొందడం సాధ్యం కాని పని. అంచేత ప్రజామోదం పొందలేని రాజ్యం ధమనకాండకు పాల్పడుతుంది. ఫాసిస్టుగా మారుతుంది.

ఎప్పుడైతే ప్రభుత్వం ప్రజల ఆస్తులను అజమాయిషీ చేయడం మొదలుపెట్టిందో, జనం పేరు చెప్పుకుని జనం ఆస్తులను సమాజం నుంచి కాజేసి ఆశ్రితులకు దఖలు పర్చాలని నిర్ణయించుకుందో, అప్పటి నుంచి ఆకర్షక పదజాలాన్ని, నినాదాలను గుప్పిస్తూ మోసాన్ని, ప్రజా ద్రోహాన్ని కప్పిపుచ్చాలని తాపత్రయపడుతోంది.

మనం ఆర్థిక శాస్త్రవేత్తలం కాకపోవచ్చు. కాని, కామన్ సెన్స్, ఇంగితజ్ఞానం, పెద్దలు నేర్పిన తర్కం తెలిసిన వాళ్లం. వాటిని కొంచెం గుర్తు తెచ్చుకుని ఆలోచిద్దాం. వాటిని వాడదాం. వాటిని వాడాల్సిన అవసరం ఎప్పటికన్నా ఇప్పుడు మరింత పెరిగింది. కేంద్రంలో బడా చోరీ జరుగుతోంది. ప్రభుత్వ ఆస్తులన్నిటినీ కట్టకట్టి దోచుకుపోయే గజదోపిడీకి రంగం సిద్ధమైంది. ఏం చేస్తారో చేసుకోండి అనే సవాలు జనం ముక్కు గుద్ది ఎక్కిరిస్తోంది.

ఈ సవాలును శిరసావహించాలా? లేక ఎదుర్కోవాలా? ఎలా ఎదుర్కోవాలి? ఈ మదనలో భాగంగా సమాజంలో 'ప్రభుత్వ రంగం వర్సెస్ ప్రైవేటు రంగం', వీటిలో ఏది గొప్ప, ఏది దిబ్బ అనే అంశాలపై తీవ్రమైన చర్చ తిరిగి రేకెత్తింది. ఈ చర్చ ఇదివరలో లేదా? కొత్తగా వచ్చిందా? అంటే పాతదే, దేశ స్వాతంత్రానికి ముందునుండీ ఉన్నదే! అయితే ఇప్పుడు మొత్తానికే మోసం ముంచుకొస్తున్న సందర్భంలో ఈ చర్చ తెరపైకి మరింత తీవ్రతతో, ఆవేదనతో ముందు కొచ్చింది.

బ్రిటిష్ వలస పాలకులు ఇక ఇండియాను వదిలే సమయం ఆసన్నమైనదని నిర్ణయించుకున్న తరుణంలో, ఈ దేశాన్ని ఎలా వదిలిపెట్టి వెళ్లాలి? వదిలి వెళ్లినా ఈ దేశ ఆర్థిక రంగంపై తమ పట్టును, తమ ఆర్థిక ప్రయోజనాలను ఎలా కాపాడుకోవాలి? అధికారాన్ని ఎవరికి ఏ విధంగా బదలాయించాలి? అనే అంశాలపై మంతనాలు మొదలు పెట్టారు. ఎవరితో? ఇక్కడి స్థానిక పెట్టుబడిదారుల, భూస్వాముల, బ్రిటిష్ పెట్టుబడి దళారుల బృందాలతో.

ఈ బృందాలన్నిటికి ప్రతినిధి కాంగ్రెస్ పార్టీ. కాంగ్రెస్ పార్టీని ప్రమోట్ చేసింది కూడా ఈ బృందాలే! ప్రజల దేశ స్వాతంత్ర ఆకాంక్షను ఉదార బూర్జువా జాతీయవాదానికి కుదించడంలో బ్రిటిష్ వారితో కలిసి పనిచేసింది కూడా ఈ కాంగ్రెస్ నాయకత్వమే! అప్పటి కాంగ్రెస్‌ను కేవలం ఓ రాజకీయ పార్టీగానే పరిగణించలేం. అది జాతీయ అంతర్జాతీయ పెట్టుబడికి, దేశీయ బూర్జువా భూస్వామ్య వర్గాలకు ఉమ్మడి ప్రతినిధి. ఈ వర్గాలు రాబోయే అధికారం తమ చేజారిపోకుండా, వామపక్ష శక్తుల బారిన పడకుండా జాగ్రత్త పడ్డాయి. ఈ శక్తులు ఆనాడు బ్రిటిష్ పాలక ప్రతినిధులతో కలిసి కూర్చుని రూపొందించుకున్నదే '1944/45 బాంబే ప్లాన్'.

అప్పటి ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ ఈ ప్లాన్ పెట్టుబడిదారులు, భూస్వాములు తమ సొంత లబ్ధికై రచించుకున్న ప్రణాళిక అని కొట్టిపారేసింది. దాన్ని పూర్తిగా తిరస్కరించింది. వలస పాలకుల్లోనూ, దేశీయ ధనిక వర్గంలోనూ ఈ ప్లాన్ పై ఏకాభిప్రాయం ఏర్పడలేదు. ఆ వివరాల్లోకి వెళ్లకుండా క్లుప్తంగా ఈ ప్రణాళిక ఏమి చెబుతుందో చూద్దాం:

1. దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావాలంటే మౌలిక వసతుల కల్పన, భారీ పరిశ్రమల స్థాపన వేగంగా జరగాలి. ఈ పని ప్రైవేటు పెట్టుబడి చెయ్యలేదు కాబట్టి ప్రభుత్వమే ఈ రంగాలలో పెట్టుబడి పెట్టాలి.
2. ప్రజా వినియోగ వస్తూత్పత్తి రంగంలో ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించాలి.
3. విదేశీ పెట్టుబడులను కట్టడి చేయాలి. అవసరమైతే యంత్ర దిగుమతులపై ఆధారపడాలి తప్ప విదేశీ పెట్టుబడిని అనుమతించరాదు.
4. విద్య, వైద్య రంగాలపై దృష్టి పెట్టి వాటిని విస్తృత పరచాలి.
5. ప్రణాళికా బద్ధమైన ఆర్థిక వ్యవస్థను పెంపొందించాలి.

15 ఏళ్లు, అంటే మూడు పంచవర్ష ప్రణాళికల ద్వారా భారతదేశ ఆర్థిక వ్యవస్థ ఎలా రూపొందాలో ఈ బాంబే ప్లాన్ ప్రతిపాదించింది. స్వాతంత్రం వచ్చిన తరువాత ఈ ప్రతిపాదిత అంశాలను పరిగణనలోకి తీసుకున్న నెహ్రూ నాయకత్వం, అప్పటి కాంగ్రెస్ పార్టీ, మూడు పంచవర్ష ప్రణాళికలను ఆచరణలో పెట్టింది. ఈ ప్రణాళికలు దేశంలో మిశ్రమ ఆర్థిక వ్యవస్థను ప్రవేశ పెట్టాయి. ఈ మిశ్రమ వ్యవస్థ ఓ పక్క ఆశ్రిత పెట్టుబడిదారీ వర్గాన్ని, లైసెన్స్ రాజ్‌ను, ఘోరమైన భ్యూరాక్రసీని, ప్రజాపీడనను, అవినీతిని, సకల రంగాలలో బాధ్యతా రాహిత్యాన్ని, సోమరితనాన్ని, ఉత్పత్తిలో అరాచకాన్ని పెంచింది. మరోపక్క పేదరికాన్ని, దారిద్ర్యాన్ని, సంపదల వ్యత్యాసాన్ని, వినియోగ వస్తువుల, నిత్యావసర సరుకుల, ప్రజా సేవల దుర్భర కొరతను పెంచి ఓ వికృత సమాజాన్ని సృష్టించింది. ఈ వికృత సమాజమే సోషలిస్టు సమాజంగా ప్రచారం పొంది ప్రజల మనసుల్లో తిష్టవేసుకు కూర్చుని అలానే ఉండిపోయింది.

ఈ ప్రణాళికలకు నెహ్రూ సోషలిస్టు ప్రాణాళికలని పెద్ద ప్రచారం ఆనాడు జరిగింది. ఈనాడు ఇంకా జరుగుతూనే ఉంది. సోవియట్ యూనియన్‌లో ఆనాడు పాటించిన సోషలిస్టు విధానాలకు, ఈ దేశంలో నెహ్రూ పాలనలో ప్రవేశపెట్టిన ఆర్థిక విధానాలకు అసలు పొంతనే లేదు. ఇక్కడ ప్రభుత్వ రంగం ఎప్పుడూ ప్రైవేట్ రంగ పరిపుష్టికే తోడ్పడింది

తప్పు, ఆ రంగాన్ని నిర్వీర్య పరచలేదు. ఏ రకంగా చూసినా ఈ రెండు వ్యవస్థలను ఒకే గాట కట్టడ మన్నది పూర్తి వక్రీకరణే!

ఇక్కడ కమ్యూనిస్టు పార్టీ నెహ్రూ భజన సమాజంలో ఎప్పుడైతే చేరిపోయిందో, అప్పటి నుండి వీటి మధ్య నుండే విభజన రేఖ చెరిగిపోయింది. సోషలిజం నిర్వచనం అభాసు పాలయ్యింది. ఈ పదంతో ఎవరి ఇష్టానుసారం వాళ్లు ఫుట్‌బాల్ ఆట ఆడుకుంటున్నారు. అయితే ఎన్ని లోపాలున్నప్పటికీ, మిశ్రమ ఆర్థిక విధానాలు కొన్నైనా ప్రజలకు మేలు చేకూర్చాయి. ఇప్పటి కేంద్ర ప్రభుత్వం అడ్డగోలుగా, అయినకాడికి అమ్మేయాలను కుంటున్న విలువైన ప్రభుత్వ ఆస్థలన్నీ ఆ విధానాల రూప కల్పనలో భాగమే. దాని ఫలాలే!

2014 సెప్టెంబర్‌లో మోడీ, తొలి విడత కేంద్రంలో అధికార పగ్గాలు చేబట్టి 'మేక్ ఇన్ ఇండియా' అనే మెగా ప్రాజెక్టును ఆర్భాటంగా ప్రకటించాడు. అప్పుడు ప్రజలు ఎదో అద్భుతం జరగబోతోందని భ్రమపడ్డారు. ఈ ప్రాజెక్టు వెంబడే అనేక ఆకర్షక ఆర్భాటపు మాయాజాల ప్రాజెక్టులు ప్రజలపై ప్రయోగించి మలి విడత ఘన విజయం సాధించాడు. ఇప్పుడు మూడో విడత ఎన్నికలు దగ్గర పడుతున్నాయి. 'ఆత్మనిర్భరత' అనే జపం మొదలు పెట్టాడు. దీనికి రామనామం తోడు ఎలానూ ఉంది. సుందర మందిర స్ఫూర్తి కొనసాగుతూనే ఉంది. వాళ్ల లెక్కలు వాళ్లకున్నాయి. ఎప్పుడు ఏ మాయాజాలాన్ని ప్రయోగిస్తే ఓట్లు రాల్తాయో తెలిసిన సిద్ధహస్తులు కాబట్టి, అటువంటి బూటకపు విద్యలో ఆరితేరిన వీళ్లు మూడో విడత అధికారం నిలబెట్టుకోవాలనే ప్రయత్నంలో ఉన్నారు. ఏది జరిగినా పేరు మోడీదే కాబట్టి, మనం మోడీ పేరుపెట్టే మాట్లాడుకుందాం!

'గవర్నమెంట్ హాజ్ నో బిజినెస్ టు బి ఇన్ బిసినెస్' అంటున్నాడు, మోడీ. ఈ పాచిపోయిన పదం ప్రపంచ బ్యాంకుది. ఈ పదం ప్రపంచమంతా చక్కర్లు కొట్టినదే! ఇంకా కొడుతున్నదే! ఈ 'పాచి' కే ఆత్మనిర్భరత' అనే బూటకపు ముసుగు తగిలించాడు మోడీ. ప్రజా సంక్షేమానికి, సంక్షేమ పాలనకు కట్టుబడి ఉండాల్సిన ప్రభుత్వం వ్యాపారంలో ఎందుకుండాలి? అంటున్నాడు మోడీ, ఇప్పుడేదో భారత ప్రజా విముక్తికి కొత్త మార్గం కనుగొన్నట్టు. ప్రజా సంక్షేమానికి డబ్బు కావాలి కాబట్టి, ఆ ధనం ప్రభుత్వరంగ సంస్థల్లో ఇరుక్కుపోయి ప్రజలకు ఉపయోగపడకుండా, నిరర్థకంగా మురిగిపోవడం బదులు ఆ ఆస్తులన్నిటినీ అమ్మి పారేసి ప్రజా సంక్షేమానికి మళ్లించడం ఆత్మనిర్భరత అంటున్నాడు. భేష్! బాగానే ఉంది.

కాని లెక్క కలవడం లేదు. ఓ పక్క దేశానికి అన్నం పెట్టే రైతులను దేశద్రోహులంటున్నాడు. తప్పులను ఎత్తిచూపే వాళ్లను అభివృద్ధి నిరోధకులంటున్నాడు. ఆటంకవాదులంటున్నాడు. సంపద సృష్టించేది శ్రమించే శ్రామికులు, కష్టించే కార్మికులు అయితే; విద్య, విత్త, వైద్య, వ్యాపార, నిర్మాణ రంగాల్లో పనిచేసే బుద్ధిజీవులు, ఇతర పనివారు, పాలనా యంత్రాంగాన్ని నడిపే ఉద్యోగులు ఆ సంపద సృష్టికి తోడైతే, పెట్టుబడిదారులే సంపదకు మూలమని అంటున్నాడు మోడీ. అంటే వ్యవహారం తారుమారు చేస్తున్నట్టే కదా! దీన్నిబట్టి పెట్టుబడిదారులు సృష్టిస్తున్న సంపదతోనే ప్రజా సంక్షేమం జరుగుతోందని భావించాలా? అయితే ఈ పెట్టుబడిదారుల సంపదనుండే సంక్షేమానికి కావలసిన సొమ్ము రాబట్టకుండా ప్రభుత్వ ఆస్తిపాస్తులను పుస్తెలతాడుతో సహా అమ్మేసి ప్రజా సంక్షేమానికి ఖర్చు పెడతానంటుంటే జనం నమ్ముతున్నట్టే కనిపిస్తోంది. (మోడీ ప్రచారం ప్రకారం తర్కిస్తే ప్రైవేటు రంగాన్ని జాతీయం చేసి ప్రజా సంక్షేమానికి అనుసంధానం చెయ్యాలి. బ్యాంకుల 'ఎన్ పి ఏ' లను, మొండి బకాయిలను పూర్తిగా తిరిగి రాబట్టాలి. మరి అదెందుకు చెయ్యడు?). ప్రజలు అలా నమ్మకపోతే నిలదియ్యాలి కదా! మా ఆస్తులు అమ్మితే ఊరుకోము ఖబడ్దార్! అని నిలబడాలి కదా? నిలబడాలా? చోద్యం చూస్తూ కూర్చోవాలా? అలా నిలబడడం లేదంటే, సర్కసులో రింగులాటను నోరెళ్లబెట్టి చూస్తున్నట్లు మైమరచి చూస్తూ ఉండిపోతే, బంధిపోట్లు బొక్కసాలను ఊడ్చుకు పోవడం ఖాయం.

బ్యాంకులు దోచేసి నిరర్థక ఆస్తులు కుప్పలుగా పేర్చేస్తే ఏంచేశాం? ఆల్లప్పుడు వీళ్లోడే, ఓ పంచకట్టు పెద్దాయన ప్రభుత్వ ఆస్తుల అమ్మకానికి ఓ ప్రత్యేక కిటికీ తెరిచి అమ్మడానికి ఓ నిఖార్సయిన రాతగాణ్ణి మినిస్టర్‌గా పెట్టి విలువైన ప్రజల ఆస్తులను కారుచౌకగా అమ్మిపారేస్తే బొటనేలు చప్పరిస్తూ కూర్చున్న మన సంగతి ఇప్పటి బంధిపోట్లకు తెలియనిదా?

ఇప్పుడు విశాఖ ఉక్కును తుక్కుగా అమ్మేస్తే అందులో పనిచేసే వారు కుయ్యో మొర్రో అంటూ రోడ్లెక్కుతారని వారికి తొయ్యదేటి? బ్యాంకు ఉద్యోగులు, బీమా ఉద్యోగులు, టెలిఫోన్ ఉద్యోగులు, బిఎిఎల్ వగైరా సంస్థల ఉద్యోగులు రాగం కలుపుతారని ఊహించరేటి?

తాంబూలాలు పుచ్చేసుకున్నాం తన్నుకు చావండి అన్నట్లు మొత్తానికి మొత్తం ప్రభుత్వ ఆస్తులు అమ్మి పారేస్తాం, ఏం చేస్తారో చేసుకోండి అని 'వాగుడు సభ' లో డెకాయిటీని బల్లగుద్ది ప్రకటిస్తే రోడ్డమీద చప్పుడు లేనప్పుడు ఉద్యోగుల మొత్తుకోళ్లకు డెకాయిట్లు బెదిరిపోతారా? బంధిపోట్లు తోక ముడుస్తారా? 110 రోజులుగా సాగుతున్న కిసాన్ ఉద్యమానికి అంగుళం కూడా కదలని వాళ్లు, ఉద్యోగుల ఉడత ఊపులకు బెదిరిపోదురా? సీతారాం ఏచూరి బలపడుతున్న ప్రజా ఉద్యమాల ముందు మోడీ ఆటలు సాగవంటున్నారు. మంచిదే. ఆశావహ దృక్పథం ఆహ్వానించ దగ్గదే! ఐతే కామ్రేడ్స్ అందరి కందరూ ఎందుకోగాని ఈ ఉద్యోగ కార్మిక సంఘాల పీలగొంతుకలకు విస్తృత ప్రజాసమూహాల బలమైన బృహత్ గొంతుకను జోడించలేక పోతున్నారు. వాటిని సమన్వయ పరిచి ప్రైవేటీకరణ సునామీ సవాలును ఎదుర్కొని ఓడించడానికి సమాయత్తం చేయడంలో విఫలమౌతున్నారు.

ఈ రోజు ఈ మాట నా బోటివాడి నోటమ్మటే కాదు, ఉదారవాద బూర్జువా ప్రజాస్వామ్య వాదుల నోళ్లనుండి కూడా వెలువడుతోంది. చిదంబరం లాంటి వాళ్ల పళని పలుకులు నిత్యం వాపోతున్నాయి. అధికారంలో ఉంటే ఊచకోతలు, అధికారం కోల్పేతే అభ్యుదయ సంక్షేమ జపాలు. వీళ్ల ఈ ఉదారవాద బూర్జువా విద్యలో భాగం అని మనకు తెలియని విషయం కాదు. అయితే మనకు అర్థంకాని విషయం ఈ దేశంలో కమ్యూనిస్టుల వైఫల్యతా ప్రహసనం. కమ్యూనిస్టులు పాలకుల ఆగడాలను, పెట్టుబడి ఆర్థిక దోపిడీని కట్టలు కట్టలుగా వాళ్ల పత్రికల్లో ప్రకటిస్తారు, ప్రచురిస్తారు. జరుగుతున్నది, జరగబోయేది విశ్లేషిస్తారు. ఐతే ఇదివరలోలా ఇపుడు జనాన్ని కదిలించే సత్తా వారు కోల్పోయారు. కారణాలు లేకుండానే ఓ ప్రత్యేక స్థితి ఏర్పడుతుందా? ఆచరణలో లోపమున్నపుడు సిద్ధాంతం ఉత్త రాద్ధాంతంగానో, అరిగిపోయిన గ్రాంఫోన్ పాటగానో మిగిలిపోదా? అన్నిటికన్నీ కమ్యూనిస్టు బృందాలదీ ఇదే స్థితి.

దేశంలో లుప్తమవుతున్న స్వేచ్ఛ...

పౌర స్వేచ్ఛల అమలు విషయంలో ప్రపంచ దేశాలలో దిగజారి పోతున్న భారతదేశపు స్థానం గురించి చర్చిస్తున్నారు

సతీష్ బైరెడ్డి

ఇండియా స్వేచ్ఛాయుత దేశం నుండి పాక్షిక స్వేచ్ఛ కలిగిన దేశంగా దిగజారిపోయిందని మార్చ్ మొదటి వారంలో అమెరికా ప్రభుత్వం చేత ఆర్థిక వనరులు అందుకునే 'ఫ్రీడమ్ హౌజ్' అనే ఎన్‌జిఓ తన వార్షిక నివేదికలో వెల్లడించింది. మోడీ రెండవ సారి అధికారం చేపట్టాక రాజకీయ హక్కులు, పౌర స్వేచ్ఛలు పెద్ద ఎత్తున ఉల్లంఘించ బడుతున్నాయని ఆ సంస్థ పేర్కొన్నది. అంతకంటే కొద్ది కాలం ముందే స్వీడన్‌కు చెందిన వి–డెమ్ అనే సంస్థ కూడా దేశంలో ప్రజాస్వామ్య తీరుతెన్నుల గురించి ఇలాంటి అభిప్రాయాలనే వ్యక్తపరిచింది. ఎప్పటిలాగే ఈ నివేదిక కుట్రపూరితమైనదని, అసత్యాలని, అర్ధ సత్యాలని దేశాన్ని, దేశ ప్రతిష్టను మంటగలిపే కుయత్నమని కొట్టి పారేసింది ప్రభుత్వం.

ఇదే సంస్థ గత సంవత్సరం నివేదికలో స్వేచ్ఛాయుత దేశాల్లో భారత్‌కు 71వ స్థానాన్ని కల్పిస్తే ఈ సంవత్సరం అది మరింత దిగజారి 67కు చేరింది. ఎన్నికలు, రాజకీయ హక్కుల విషయంలో 40కి గాను 34 మార్కులను ఇస్తే పౌర ప్రజాస్వామిక స్వేచ్ఛల విషయంలో 60కి 33 మార్కులనే పొందింది. ఇలాంటి సంస్థలే మోడీ గురించి, ఆయన పాలన గురించి, ఆయన నాయకత్వంలో అభివృద్ధి గురించి ఏ ప్రమాణాలు పాటించకుండా ఏ సానుకూలమైన అభిప్రాయాన్ని చెప్పినా దేశ వ్యాప్తంగా గొప్పగా ప్రచారం చేసేవారు పరివార్ భక్తులు. ఒకవేళ అలాంటి సంస్థల అంచనాలను, అనుసరించిన పద్ధతిని దేశంలో ఎవరు తప్పు పట్టిన అదో పెద్ద నేరమయ్యుండేది.

మన ఎదుగుదలను మనమే అడ్డుకుంటున్నామని, దేశ ద్రోహులని ఇంకా ఏమేమి అనే వాళ్లో? ఇప్పుడు మాత్రం అది పెద్ద కుట్ర అవుతది. సరే ఇలాంటి సంస్థల ప్రమాణాలు ఏంటి, అవి అనుసరించే సంవిధానం ఏంటి, నిజాయితీగా ఏ పక్షపాత బుద్ధి, రాగద్వేషాలకు తావివ్వకుండా చేసిందా అనే అనుమానాలు ఎప్పుడూ ఉంటాయి. అయితే ఆ నివేదిక ప్రస్తావించిన అంశాలు, దాని నిర్ధారణలను దేశంలో నెలకొని ఉన్న వాస్తవ పరిస్థితులతో బేరీజు వేసుకుని ఒక అంచనాకు రావడానికి ఎప్పుడూ ఒక అవకాశం ఉంటుంది. దేశంలో 1970ల్లో విధించబడ్డ అత్యవసర పరిస్థితి తర్వాత మళ్లీ మోడీ పాలనా కాలంలోనే అంత భయానక పరిస్థితులు నెలకొన్నాయి.

దేశంలో గత 6 సంవత్సరాలుగా అప్రకటిత అత్యవసర పరిస్థితే కొనసాగుతున్నది. రాజ్యాంగం అమలులోనికి వచ్చాక నేడు నమోదవుతున్నన్ని దేశ ద్రోహ కేసులు మరెప్పుడూ కాలేదు. యుఎపిఎ చట్టం కింద విచ్చల విడిగా కేసులు పెట్టి బెయిలు కూడా రానివ్వకుండా ఏళ్ల తరబడి జైళ్లలోనే మగ్గిపోయేలా వ్యవహరిస్తున్నారు. మావోయిస్టులకు సహకరిస్తురన్నారన్న నెపంతో అమాయక ఆదివాసీలను అక్రమంగా నిర్బంధిస్తున్నారు. వారి తరఫున మాట్లాడిన, వారి హక్కుల కోసం కొట్లాడిన పౌర హక్కుల కార్యకర్తలను చివరకి వారి కోసం వాదించే న్యాయవాదులను కూడా బెదిరించి వారికి న్యాయ సహాయం అందకుండా రాజ్యాంగ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్నారు.

ప్రభుత్వ విధానాలను విమర్శించినందుకు కళాకారుల మీద ద్రోహుల ముద్రలు వేస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లో హత్రాస్‌లో జరిగిన రేప్ కేసుకు సంబంధించి బాధితురాలుని కలవడానికి వెళ్లిన కేరళ జర్నలిస్ట్‌పై ఆ రాష్ట్ర ప్రభుత్వం ఇదే తరహా కేసు మోపింది. కవులు రచయితలు అయితే ఎప్పటి నుండో ప్రభుత్వాలకు కంటగింపుగా ఉన్నారు. జెఎన్‌టియు,

---

ఈ స్థితి పర్యవసానమే ఇప్పటి ప్రజా ఉద్యమాల నీరసపు దుస్థితి.

అప్పటి రోజులు వేరు. ఇప్పటి రోజులు వేరు. కాలం మారిపోలేదా? జనం మారిపోలేదా? రాజకీయాలు మారిపోలేదా? మరి పాలకుల తీరుతెన్నులు మారవా? గాంధీవాదులు పోయి గాడ్సేవాదులు పాలకులుగా రాలేదా? అల్పాహారంతో సరిపెట్టుకునే వాళ్లు పోయి కుంభాలకు కుంభాలు తినమరిగిన వాళ్లు రాలేదా? దేశ సేవకులు కొట్టుకుపోయి దేశభక్తులు పుట్టుకురాలేదా? చెప్పండి.

ఓ ప్రజలారా! తెలుసుకోండి! దేశాన్ని అమ్మేయడమే దేశభక్తని గ్రహించండి! దేశాన్ని అమ్మేయడమంటే ఏమిటి? ప్రభుత్వ ఆస్తులను అమ్మేయడం. ఈ మాత్రం తెలియని వాళ్లకు ఓటు హక్కు దేనికి? అంచేత ఇక మీరు ఓట్లు వేసే శ్రమ తీసుకోవద్దు. ఇళ్లల్లోనే సేద తీరండి. ఇక ముందు ఆ ఇబ్బంది ఉండదు. ఓట్లు వేసే బాధనుండి మీకు శాశ్వత విముక్తి కలిగిస్తాం! ఇది మా హామీ. ఇంతవరకు ఎవ్వరూ చేయని సాహసం మేం చేస్తాం! చేసి చూపిస్తాం! మా దేశభక్తి ఏమిటో నిరూపిస్తాం!

ఓ అమాయక ప్రజలారా! తెలుసుకోండి! ప్రభుత్వ ఆస్తులు అమ్మలేని వాళ్లు అసమర్థులు. వారికి దేశమంటే ఏమిటో తెలియదు. దేశభక్తి అంటే అసలే తెలియదు. ప్రజాక్షేమానికి, సంక్షేమానికి ఉపయోగ పడని ప్రభుత్వ ఆస్తులు నిరర్ధకమని గుర్తించని వారు, వాటిని ఆత్మీయ ఆశ్రిత ముసుగు పెట్టుబడిదారులకు కట్టబెట్టనివారు దేశభక్తులు కాగలరా? కాలేరు. ఇది పరమ సత్యం.

దిస్ ఈజ్ మోడీస్ వాయిస్ ఆఫ్ ఇండియా! యే హై ఆప్ కా ప్యారీ చౌకీదార్ కా మన్ కీ బాత్! భారత్ మాతా కీ ఆవాజ్! ఏక్ ప్రచండ్ దేశభక్త్ కా పూకార్! సునో.. సునో.. సునో... సబ్ దేశ్ వాసియో! కాన్ కోల్కర్ సునో .. ఏ దేశ్ కీ నయా ఆజాదీకీ నయీ రాస్తా మై కోల్ రహాహుమ్.. దేఖో.. దేఖో.. ధేక్తే రహో...

(రచయిత శ్రామికనేస్తం సంపాదకులు) వీ

అలీఘర్ యూనివర్సిటీ, జాదవ్‌పూర్ యూనివర్సిటీల వంటివి అయితే ఈ ప్రభుత్వానికి 'తీవ్రవాద' కేంద్రాలుగా కనిపిస్తున్నాయి.

పౌర చట్ట సవరణకు వ్యతిరేకంగా జరిగిన నిరసనోద్యమాల నేపథ్యంలో అలీఘర్ యూనివర్సిటీ విద్యార్థులపై విచ్చలవిడిగా హింసను ప్రయోగించడమే కాకుండా వందలాది మంది విద్యార్థులపై అక్రమ కేసులు బనాయించింది. జీఎన్ సాయిబాబా, హనీ బాబులాంటి విశ్వవిద్యాలయ టీచర్స్‌పై అనేక కేసులు పెట్టి జైళ్లలో వేశారు. చివరికి ప్రైవేట్ యూనివర్సిటీలో పనిచేస్తున్న భాను ప్రకాష్ మెహతా లాంటి ప్రజాపక్ష మేధావులను సైతం అక్కడ పనిచేయనివ్వని వాతావరణాన్ని కల్పించింది.

ప్రభుత్వ ఆర్థిక విధానాలను విమర్శించినందుకు అమార్త్యసేన్ లాంటి ఆర్థిక వేత్తల్ని వేధించింది. ప్రభుత్వంపై విమర్శలు చేసిన వ్యక్తులు, సంస్థలు, మీడియాపై తన చెప్పుచేతుల్లోనే ఉండే దర్యాప్తు సంస్థలతో వేధించడం షరామామూలయింది. రాజ్యాంగం ద్వారా కల్పించబడిన స్వయం ప్రతిపత్తి సంస్థలను కూడా తన రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా వాడుకుంటున్నది. తన పార్టీలోకి రావడానికి ఇష్టం లేని ప్రతిపక్ష పార్టీల నేతలపై ఆదాయ పన్ను శాఖతో దాడులు చేయించి, భయపెట్టి మరీ తన వైపు గుంజుకుంటున్నది.

గో రక్షణ పేరుతో హంతక ముఠాలను నడుపుతూ దళితులు, మైనారిటీల పైన దాడులకు పాల్పడుతున్నది. పౌరసత్వ చట్ట సవరణకు వ్యతిరేకంగా జరిగిన ఆందోళనల నేపథ్యంలో ఢిల్లీలో జరిగిన దాడుల్లో ముస్లింల మారణకాండను కూడా ఫ్రీడమ్ హౌజ్ పేర్కొన్నది. ఇవాల్టి రైతాంగ ఉద్యమాన్ని అణచడం కోసం ఎన్ని దుష్ప్రచారాలు చెయ్యాలో అన్ని చేసింది. కార్పొరేట్‌ల కోసం రైతాంగం ఉసురు తీస్తున్నది.

కరోనా వైరస్ ప్రబలిన నేపథ్యంలో ఎలాంటి సమయం ఇవ్వకుండా విధించిన లాక్‌డౌన్ వల్ల దేశవ్యాప్తంగా లక్షలాది వలస కార్మికులు, అసంఘటిత రంగంలో పని చేసే శ్రమ జీవులు నానా యాతనను ఎదుర్కొన్నారు. వాళ్లను ఆదుకోవడం కోసం ప్రభుత్వం చేపట్టిన చర్యలు శూన్యం. స్వంత ఊళ్లకు చేరుకునే ప్రయత్నంలో సుదూర ప్రయాణం చేసే క్రమంలో వందలాది కార్మికులు తమ ప్రాణాలను కోల్పోయారు.

కరోనా ప్రబలడానికి ఒక వర్గం వారే కారణం అంటూ ముస్లింలను బాధ్యుల్ని చేసే ప్రయత్నం జరిగింది. కరోనా కాలం ముసుగులో వ్యవసాయ చట్టాలను గుట్టు చప్పుడు కాకుండా తీసుకొచ్చింది. కరోనాతో దేశమంతా తాళం వేస్తే అంతకంటే సంవత్సరం ముందు నుండే కశ్మీర్ ప్రజలు భయానకమైన లాక్‌డౌన్‌ను ఎదుర్కొంటున్నారు. వాళ్లకంటూ ఏ హక్కు, స్వేచ్ఛా లేకుండా పోయింది. కనీస అవసరాలు తీర్చుకోలేని దుస్థితి. ప్రపంచంలో ఏమి జరుగుతున్నదో వాళ్లకు తెలియదు వాళ్లకు ఏమి జరుగుతున్నదో ప్రపంచానికి తెలియకుండా ప్రతి కశ్మీర్ పౌరుణ్ణి హౌజ్ అరెస్టు చేసింది. ఇంటి ముందు ఆడుకునే పిల్లల్ని కూడా ప్రమాదకరమైన తీవ్రవాదులని వందలాదిగా అరెస్టు చేసింది. పత్రికలు, టీవీల లాంటి సమాచార సాధనాలు ఏవి లేవు. ఇక ఇంటర్‌నెట్ అయితే మొత్తంగా నిషేధించబడింది.

ఇంటర్‌నెట్ సుదీర్ఘ కాలం నిలిపివేతకు గురైన ప్రాంతాల్లో కశ్మీర్ ప్రపంచంలోనే అగ్రస్థానాన్ని పొందింది. అగ్రస్థానం కూడా స్వేచ్ఛాయుత ఇండియా నుండి పాక్షిక స్వేచ్ఛ కలిగిన దేశంగా 'ఎదగ'డానికి ఎంతగానో ఉపకరించింది. వ్యక్తులు తమకిష్టమైన వ్యక్తులతో జీవితం పంచుకోవడానికి, కలిసి ఉండడానికి, సహ జీవనం చేయడానికి, పెళ్లి చేసుకోవడానికి ఉన్న సహజమైన స్వేచ్ఛను నిరాకరించేలా, ఫలానా మతం వాళ్లను పెళ్లి చేసుకోకూడదని నిషేధించేలా చట్టాలను తీసుకువచ్చాయి బిజెపి పాలిత రాష్ట్రాలు. ఇట్లా వ్యక్తుల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు మొదలుకుని సంస్థల, స్వయం ప్రతిపత్తి వ్యవస్థల స్వేచ్ఛల వరకు అన్నింటిపై విధ్వంసం జరుగుతున్నది.

హక్కుల రక్షణకు వచ్చి, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను నిలబెడుతాయనుకున్న కోర్టులు ప్రభుత్వ కనుసైగలతోనే నడుస్తున్నాయనేల వ్యవహరిస్తున్నాయి. రాజ్య యంత్రాంగం వల్ల పౌర ప్రజాస్వామిక స్వేచ్ఛలు కాలరాయబడుతుంటే ఆ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలే రాజ్య నిర్వహణకు అడ్డొస్తున్నాయన్నట్టు కోర్టులు వ్యవహరిస్తున్నాయి. ఎనిమిది పదులు దాటిపోయి అనారోగ్యంతో కృంగిపోయినా, శరీరం సహకరించకపోయినా బెయిలు ఇవ్వకుండా న్యాయవ్యవస్థ అమానవీయతను ప్రదర్శిస్తోంది.

అసలు ప్రజా ప్రయోజనాలుండే కేసులను ప్రాధాన్యతా క్రమంలో స్వీకరించకుండా ప్రభుత్వానికి అవసరమైన కేసులను ప్రాధాన్యతా కేసులని వర్గీకరిస్తున్నది. కశ్మీర్‌లో అక్రమ అరెస్టులకు గురయి బెయిలు లేకుండా సంవత్సరాల తరబడి మ్రగ్గిపోతున్న వారిని పట్టించుకోకుండా న్యూ వీస్తా లాంటి ప్రభుత్వ ప్రాజెక్టుల కేసులను హడావుడిగా తేల్చి పారేసి వారికి మార్గం సుగమం చేస్తున్నది. అన్ని వ్యవస్థలను తన చెప్పు చేతుల్లో పెట్టుకున్న ప్రభుత్వం సంపూర్ణ అధికారయుత నియంతృత్వ దిశగా వడివడిగా అడుగులు వేస్తున్నది. పార్లమెంట్‌లో మెజార్టీ అనేది ఏదైనా చేయడానికి లైసెన్స్ అన్నట్టు వ్యవహరిస్తోంది.

జాతీయవాదం పేరుతో మతవాదాన్ని తీసుకువచ్చి దేశ ప్రజల మధ్య చిచ్చుపెడుతోంది. ధరల మంటలు ఆకాశానికి అంటుతుంటే గత ప్రభుత్వాల తప్పిదమని, తనదేమి బాధ్యత లేదని తప్పించుకుంటున్నది. ప్రభుత్వ సంస్థలను తెగనమ్మి ప్రైవేట్ సామ్రాజ్యాలకు బాటలు వేస్తూ ప్రజల జీవితాలను ప్రైవేట్ కాళ్ల మీద పడేస్తున్నది. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను అమ్మే నిర్ణయంతో వేలాది ఉద్యోగుల కుటుంబాలు తీవ్రమైన కల్లోలంలోకి జారుకున్నాయి. పరోక్షంగా ఉపాధి కోసం ఆ సంస్థ పైన ఆధారపడిన ప్రజల జీవితాలను రోడ్డు పాలు చేస్తూ జీవించే హక్కును కాలరాస్తున్నాయి ప్రభుత్వాలు. కరోనా కల్లోలంలో బడుగు జీవులు కడుపు నింపుకునే కనీస పని లేక అల్లాడి పోతే బడా బాబులు బిలియన్ల రూపాయలను పోగేసుకునేల ప్రభుత్వాలు దగ్గరుండి చూసుకున్నాయి. ఎన్నికల్లో నిలబడడం, ఓట్లు వేయడమే పెద్ద ప్రజాస్వామ్యమని, అదే దేశ గొప్పదనమని ఇంకేమి అవసరం లేదని దబాయిస్తున్నారు పాలకులు.

ఒక్క ఈ ఫ్రీడమ్ హౌజ్ నివేదికే కాదు గతంలో అనేక సంస్థలు దేశంలో స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు మేడి పండు చందమే అని చెప్పాయి. ఫిబ్రవరిలో 'ది ఎకనామిస్ట్ ఇంటిలిజెన్స్' అనే సంస్థ కూడా ప్రపంచ ప్రజాస్వామ్య సూచీలో ఇండియా 53వ స్థానంలో ఉందని చెప్పడమే కాకుండా ఆ ఉన్న ప్రజాస్వామ్యం అంతా అత్యంత లోపభూయిష్టంగా ఉందని పేర్కొంది. 'వీ డెమ్' సంస్థ కూడా తనదైన ప్రమాణాలతో భారత ప్రజాస్వామ్య స్థితిని అంచనా వేసి అత్యంత నిరాశాజనకంగా ఉందని ఉదాహరణలతో తేల్చి చెప్పింది. ఏ సంస్థలు, ఏ సర్వేలు ఏమి చెప్పాయి, ఎలా చెప్పాయి, ఏ ప్రయోజనాల కోసం అలా చెప్పాయనే ప్రశ్నలను కొట్టిపడెయ్యకుండానే ప్రజల జీవితానుభవాల్లోంచే అసలు పరిస్థితి ఏంటో అంచనా వేయవచ్చు. పాలకుల ప్రజాస్వామ్యం ఏ పాటిదో తేల్చవచ్చు.

(రచయిత ఆంగ్ల ఉపన్యాసకులు) వీ

రేప్ చేశావా, అయితే పెళ్లి చేసుకో!

మైనర్ బాధితురాలి హక్కులను రక్షించాల్సిన సుప్రీం కోర్టు ధర్మాసనం దోషికే తీర్పును వదిలేయడం పట్ల మహిళలూ, హక్కుల సంఘాలూ, మేధావులూ వ్యక్తపరిచిన ఆగ్రహాన్ని తెలియజేస్తున్నారు **రాజేంద్రబాబు అర్విణి**

'ఈ రోజు నిన్నటివలె లేదు' అంటాడు కవి, కథకుడు కె.వి. కూర్మనాథ్. అవును నిజం. ఏ రాజ్యాంగ వ్యవస్థ చూసినా అతలా కుతలంగా ఉంది. నిన్నటి విలువలు, నిన్నటి నియమాలు ఈ రోజు మారిపోవచ్చు. జీవిత విధానంలో మార్పులు రావచ్చు. కానీ సహజ సూత్రాలు, సహజ న్యాయం మనగలగాలి కదా! పనిచేసే చోట మహిళా ఉద్యోగుల వద్ద అశ్లీలాన్ని సూచించే మాటలు మాట్లాడినా, మోహాన్ని, కోరికను వ్యక్తపరిచే విధంగా నోటి ద్వారా గాని, ప్రవర్తన ద్వారా గాని సూచించినా అది నేరమే అవుతుంది అని కొన్నాళ్ల క్రితం ప్రవర్తనా నియమావళికి రూపం ఇచ్చింది ప్రభుత్వం. ఈ వేళేమో ఓ పన్నెండేళ్ల బాలిక రొమ్మును ఆమె తొడుక్కున్న స్కర్ట్ పై నుండి చేతులతో తడమడం మాత్రమే కాని, 'చర్మానికి చర్మం' తాకలేదు కాబట్టి అది నేరం కాదు అని అంటుంది న్యాయస్థానం. అనడమే కాదు, కింది కోర్టు అది 'పోక్సో' చట్టం కింద నేరంగా పరిగణించి ఆ దోషికి మూడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తే, అది సరికాదనీ సెక్షన్ 354 కింద స్త్రీ పట్ల వ్యవహరించాల్సిన రీతిలో మర్యాద పాటించలేదు కాబట్టి ఒక సంవత్సరం జైలు శిక్ష కూడా ఎక్కువేనని, ఈపాటికే ఒక సంవత్సరం జైల్లో ఉన్నాడు కాబట్టి ఆ శిక్షాకాలం కూడా పూర్తయిందని, కాబట్టి ఆ 'మగ మహారాజు'ను వెంటనే విడుదల చేయమని కూడా ఆదేశించింది ముంబాయి హైకోర్టు. 12 ఏళ్ల అమ్మాయి 'పై దుస్తులు' తొలగించి తన చెయ్యిని లోపలికి జొప్పించి ఆ అమ్మాయి రొమ్ములను నొక్కాడా అన్న విషయంలో స్పష్టమైన ఆధారాలు లేవు కాబట్టి ఇది లైంగిక అత్యాచారంగా పరిగణించలేమని ఆ తీర్పులో పేర్కొన్నారు. మరొక సందర్భంలో 'కఠినమైన, దారుణమైన శిక్ష' విధించారని కూడా వ్యాఖ్యానించారు. ఈ తీర్పుపై దేశమంతా నిస్తాణువై, నివ్వెరపోయి చూసింది. సుప్రీంకోర్టు 'సుమోటో'గా అయితే స్పందించలేదు కాని, అడ్వకేట్ జనరల్ కె. వేణుగోపాల్, ఈ తీర్పు 'ప్రమాదకరమైన దృష్టాంతం'గా మిగిలిపోతుందని హెచ్చరిక బెంచ్ ముందు వ్యక్తపరిస్తే, అప్పుడు ముంబై హైకోర్టు తీర్పుపై స్టే విధించింది సుప్రీంకోర్టు.

కొన్నేళ్ల క్రితం 'పింక్' అన్న ఓ హిందీ సినిమా వచ్చింది. క్లబ్‌లో మద్యం సేవించి ఉన్న ఓ మహిళపై అత్యాచారయత్నం చేసిన ఓ 'బడాబాబు' అకృత్యాన్ని కోర్టులో ప్రశ్నించిన ఉదంతం గురించి ఆ సినిమా. అందులో అమితాబ్ బచ్చన్ అద్భుతంగా నటించాడు. అత్యాచారయత్నం చేసిన ఆ 'బడాబాబు' ఆమె మద్యం సేవించి ఉంది కాబట్టి ఆమె 'తిరుగుబోతు'. ఆమె 'తిరుగుబోతు, మద్యం కూడా సేవిస్తుంది కూడా, కాబట్టి ఆమెను బలాత్కరించడంలో తప్పులేదు' అన్న అర్థంలో వాదిస్తాడు. ఆమె తిరుగుబోతు అయినా, తాగుబోతు అయినా, నీతో సన్నిహితంగా మెలగడానికి ఒప్పుకుందా! లేదుకదా. తన ఇష్టానికి వ్యతిరేకంగా చేసింది అత్యాచారం కిందికే వస్తుంది అని కోర్టును ఒప్పిస్తాడు లాయర్ పాత్రలో ఉన్న అమితాబ్. నో అనేది ఒక శబ్దం మాత్రమే కాదు, అది పూర్తి అర్థం కలిగిన ఒక వాక్యం....అంటాడు అమితాబ్. కళా సాహిత్యాలు 'మహిళ' వైపు, బాధితుల వైపు ధృడంగా నిలబడ్డాయి. కాని, ఈవేళ... సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని ఓ ధర్మాసనం తొమ్మిదేళ్ల ఓ స్కూలు విద్యార్థినిని పలుమార్లు బెదిరించి, పెట్రోల్ పోసి చంపేస్తానని, ఆసిడ్ పోస్తానని, ఒప్పుకోకపోతే ఆమె తమ్ముణ్ణి నరికేస్తానని అదిరించి, బెదిరించి మూడేళ్ల పాటు అత్యాచారం కొనసాగించిన ఓ ప్రబుద్ధుణ్ని 'ఆ అమ్మాయిని పెళ్లి చేసుకుంటావా లేక జైలుకెళతావా?' అని రెండు ప్రాధాన్యతలలో ఏది ఎన్నుకుంటావో చెప్పు అని తీర్పు ఆ నిందితునికే వదిలిపెట్టి 'ఇప్పుడే ఏమీ చెప్పనక్కరలేదు. నెల రోజులు తాపీగా ఆలోచించుకొని చెప్పు. అంతవరకూ పోలీసులు నిన్ను ఏమీ చేయరులే' అని కూడా తన ఉదారత్వాన్ని ప్రదర్శించింది. తాను అరెస్ట్ కాకుండా బెయిల్ ఇవ్వమని అడిగిన ఆ ప్రభుత్వోద్యోగిని ప్రధాన న్యాయమూర్తి గారు అడిగారట – 'నీవు ఆ అమ్మాయిని పెళ్లిచేసుకోవడానికి ఇష్టపడితే, మేమైనా సహాయం చేయగలం. లేదంటే నీవు ఉద్యోగం పోగొట్టుకుంటావు, జైలుకూ వెళతావు. నీవు ఆ అమ్మాయిని బలవంతంగా అనుభవించావు, రేప్ చేశావు'. ప్రధాన న్యాయమూర్తి ఇంకా ఇలా అన్నారు: 'పెళ్లి చేసుకొమ్మని మేము నిన్ను బలవంతపెట్టడం లేదు. నీ ఇష్టం ఏమిటో తెలుసుకుందామని మాత్రమే పెళ్లిచేసుకుంటావా అని అడిగాం. లేకపోతే మేము నిన్ను బలవంతపెట్టామని అంటావు'.

సుప్రీంకోర్టు చేసిన ఈ వ్యాఖ్యల మీద, దాని ఉదారత్వం మీదా భారత పౌర సమాజం మండిపడింది. అసంఖ్యాకంగా ఖండనలు వెలువడ్డాయి. దేశవ్యాప్తంగా పౌరహక్కుల సంఘాలు, మహిళా సంఘాలు, మేధావులు తమ తీవ్ర నిరసనను వ్యక్తపరిచాయి. నాలుగు వేల మంది మహిళా హక్కుల కార్యకర్తలు, అభ్యుదయ సమూహాలు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎస్.ఏ. బొబ్డేకు ఒక బహిరంగ లేఖను సంధించారు. ఆ లేఖలోని కొన్ని ముఖ్యమైన భాగాలను 'దివైర్' వెబ్ పత్రిక పబ్లిక్ డొమైన్లో పెట్టింది. వాటిని యథాతథంగా తెలుగులోకి అనువదించి ఈ కింద పేర్కొంటున్నాను.

అయితే, (మరొక రేప్ వ్యాజ్యానికి సంబంధించిన విచారణ సందర్భంగా) భారత ప్రధాన న్యాయమూర్తి ఎస్.ఏ. బొబ్డే తమపై వచ్చిన విమర్శకు ప్రతిస్పందిస్తూ – మహిళలంటే తనకు అపారమైన గౌరవం

ఉందని, ఆ కేసు సందర్భంగా తన వ్యాఖ్యలను పత్రికలు తప్పుగా చిత్రీకరించాయని పేర్కొన్నాడు. యాదృచ్ఛికమే అయినా ఆయన ఆ వ్యాఖ్య చేసింది ఈ సంవత్సరం అంతర్జాతీయ మహిళా దినోత్సవం నాడే! సుప్రీంకోర్టు అధికారి ఒకరు ఈ విషయంపై ఒక పత్రికా ప్రకటన చేస్తూ సుప్రీంకోర్టును అనవసరంగా వివాదాలలోకి లాగుతున్నారని, దస్తావేజుల్లో ఉన్న సంగతిని నిర్ధారణ కోసం నిందితుణ్ని న్యాయమూర్తి ప్రశ్నించారని వివరణ ఇచ్చుకున్నారు.

ఇక నాలుగు వేల మంది మహిళా ఉద్యమ కార్యకర్తల ఆగ్రహాన్ని, ఆవేదనను వీక్షించండి:

"గౌరవ భారత ప్రధాన న్యాయమూర్తి గారూ, 2021, మార్చ్ 1 నాడు మోహిత్ సుభాష్ చవాన్‌కు, మహారాష్ట్ర ప్రభుత్వానికి మధ్య ఉన్న వివాదం విచారణ సందర్భంగా మీరు కొన్ని వ్యాఖ్యలు చేసినట్టుగా మీడియా నివేదించింది. ఆ వ్యాఖ్యలు దేశంలో జరుగుతున్న వివిధ మహిళా ఉద్యమాల, అభ్యుదయ ఉద్యమాల ప్రతినిధులమైన మాకు, సమాజ శ్రేయస్సు పట్ల అనురక్తి కలిగిన కొంతమంది పౌరులకు తీవ్రమైన ఆందోళనను, ఆగ్రహాన్ని కలిగించాయి.

వెంటబడి, కట్టివేసి, నోట్లో బట్టలు కుక్కి మైనర్ అయిన ఒక స్కూల్ విద్యార్థినిని పలుమార్లు దౌర్జన్యంగా అత్యాచారం చేసిన వ్యక్తి అరెస్ట్ కాకుండా రక్షణ కల్పించమని వేడుకుంటున్న ఒక అర్జీని మీరు విచారిస్తున్నారు. ఆ వ్యక్తి తన కోరిక తీర్చకపోతే ఆ అమ్మాయిని పెట్రోల్ పోసి నిప్పంటిస్తానని, మొహం మీద ఆసిడ్ పోస్తానని, కాదంటే ఆమె సోదరుణ్ని చంపేస్తానని బెదిరించాడు. బాధితురాలైన ఆ స్కూల్ విద్యార్థిని ఆత్మహత్యాయత్నం చేసినప్పుడు అత్యాచారానికి సంబంధించిన వాస్తవాలు వెలుగు చూశాయి. 'ఆ మైనర్ బాలికను బలవంతంగా చెరుస్తున్నప్పుడు, అత్యాచారం చేస్తున్నప్పుడు దాని పర్యవసానం ఎలా ఉంటుందో అప్పుడే ఆలోచించవలసింది' అని చెప్తూ మీరు ఆ అమ్మాయిని పెళ్లిచేసుకోవడం నీకిష్టమేనా అని అడిగారు.

రేప్ బాధితురాలు తనను రేప్ చేసిన వ్యక్తిని పెళ్లాడి, ఏ వ్యక్తి చేతిలో తాను తీవ్రమైన హింసకు గురయ్యిందో, ఏ వ్యక్తి కారణంగా తాను ఆత్మహత్యకు సిద్ధపడిందో ఆ వ్యక్తిచేత జీవితాంతం మానభంగానికి గురికావాలని మీ ఉద్దేశమా భారతదేశ ప్రధాన న్యాయమూర్తి గారూ! 'తనతో సంగమించాలన్న ఆకర్షణ'కు లోనుకావడానికి, అత్యాచారానికి, వివాహానికి అర్థం ఏమిటో భారత రాజ్యాంగాన్ని వివరించి చెప్పే కర్తవ్యం, అధికారం గల భారతదేశ ప్రధాన న్యాయమూర్తికి కూడా. వివరించే బరువైన బాధ్యతను మోయడానికి మహిళలే ముందుకురావలసిన పరిస్థితుల పట్ల మాకు పట్టలేని కోపంగా ఉంది.

'ఒకరితో ఒకరు సన్నిహితంగా ఉండే ఆకర్షణ'లో పరస్పర ఆమోదం ఉంటుంది. అంగీకారం లేకుండా, శరీరం అఖండతను, నైతిక నిష్ఠను భగ్నం చేసేది అత్యాచారం అవుతుంది. అందుకనే అది హింస. ఎట్టి పరిస్థితులలో ఇద్దరినీ కలపడం అసాధ్యం. ఇంతే కాకుండా, బాధితురాలు మైనర్ అయినప్పుడు ఆమోదం ఉండకపోవడం న్యాయబద్ధంగా, సహజ బద్ధంగా ఒప్పుకోవాల్సిన సత్యం.

మరొక వ్యాజ్యంలో (వినయ్ ప్రతాప్ సింగ్ వర్సెస్ ఉత్తరప్రదేశ్ రాష్ట్రం) కూడా మీరు చేసిన వాఖ్య ఒకటి ఇటీవలే పత్రికల ద్వారా మాకు తెలిసింది. మీరు అన్నారు: 'ఇద్దరు వ్యక్తులు భార్యా భర్తలుగా కలిసి జీవిస్తున్నప్పుడు, భర్త పశుప్రాయంగా, క్రూరంగా ప్రవర్తించినప్పుడు, చట్టబద్ధంగా వివాహం చేసుకున్న భార్యభర్తల మధ్య జరిగే సంభోగ కార్యక్రమాన్ని అత్యాచారం అనగలమా?' మీరు చేసిన ఈ వ్యాఖ్య వలన భర్త చేసే శారీరక, మానసిక, లైంగిక సంబంధమైన లేదా మరే రకంగానైనా చేసే హింస చట్టబద్ధమైనదిగా పరిగణించబడడమే కాదు ఏ రకమైన న్యాయ సహాయం లేకుండా భారతీయ స్త్రీలు సంవత్సరాల తరబడి వివాహ చట్రంలో అనుభవిస్తున్న హింసను సాధారణీకరణ చేయడం కూడా జరుగుతుంది.

మోహిత్ సుభాష్ చవాన్‌కు సెషన్స్ కోర్టు బెయిల్ ఇవ్వడాన్ని బొంబాయి హైకోర్ట్ 'దారుణమైన' చర్యగా అభివర్ణించింది. అంతమాత్రాన ఊరుకోలేదు, 'సునిశిత జ్ఞానం కలిగిన న్యాయమూర్తి ఏవో తార్కికమైన కారణాలు చెప్పి ఇలాంటి తీవ్రమైన విషయంలో ఇలాంటి విధానాన్ని అవలంబించాడంటే ఆయన ఏమాత్రం సున్నితత్వం లేనివాడని స్పష్టమవుతున్నది' అని కూడా వ్యాఖ్యానించింది. ఆ వ్యాఖ్యలన్నీ మీకు సరిగ్గా సరిపోతాయి, అయితే ఇంకా ఎక్కువ స్థాయిలో వర్తిస్తాయి. మైనర్ బాలికపై జరిగిన అత్యాచారాన్ని పెళ్లితో సరిపెడితే బాగుంటుంది అన్న మీ ప్రతిపాదనకు 'దారుణమైనది' అన్న వ్యక్తీకరణ సరిపోదు. అది అంతకన్నా నీచమైనది, మొద్దుబారిపోయిన మందబుద్ధి లాంటిది. ఎందుచేతనంటే, దానివల్ల బాధితులు న్యాయాన్ని కోరే హక్కును కాలరాచివేసినట్టవుతుంది.

అత్యాచార సమస్యను 'రాజీ'తో పరిష్కరించాలని ప్రతిపాదన చేస్తున్న అధికారంలో ఉన్న పెద్దమనుషుల పితృస్వామిక దృక్పథంతో భారతదేశంలో స్త్రీలు ఇంకా సతమతమవుతూనే ఉన్నారు. 'తనను మానభంగం చేసిన వ్యక్తితో రాజీ పరిష్కారానికి ఒప్పుకోని స్త్రీ గాని లేదా ఆమె బంధువు గాని ఆత్మహత్య చేసుకున్న లేదా హత్య చేయబడిన సంఘటనలలో వెలువడిన పలు తీర్పులు రాజీ అంటే అసలు అర్థం ఏమిటో బట్టబయలు చేస్తున్నాయి' ('అత్యాచారానికి గురైన వారికి 'రాజీ మార్గంగా పెళ్లిళ్లు' కుదర్చడం కోర్టుల పనికాదు.' – దవైర్, 26 జూన్ 2015).

లైంగిక వేధింపుల వ్యాజ్యం ఎదుర్కొంటూ, తానే తీర్పరి స్థానంలో కూచున్న మీ పూర్వాధికారిని మేం కళ్లారా చూశాం. అలాగే పూర్వ ప్రధాన న్యాయమూర్తి తనను లైంగికంగా వేధించాడని ఫిర్యాదు చేసిన వ్యక్తిని, ఆమె కుటుంబాన్ని సుప్రీంకోర్టు బెంచ్ ఎలా అబద్ధాలకు, అపనిందలకు గురిచేసిందో కూడా మా ఎరుకలో ఉంది. 'ఒక స్త్రీ బలహీనంగా 'వద్దు' 'కాదు' అంటే 'సరే' అనే అర్థం' అన్న సిద్ధాంతం ప్రాతిపదికన అత్యాచారం చేసినట్టు నిర్ధారించబడ్డ ఒక దోషిని విడుదల చేసిన అకృత్యానికి వ్యతిరేకంగా దాఖలు చేసిన పిటిషన్‌ను అడ్మిట్ కూడా చేసుకోలేదు. వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రతిఘటనా ప్రదర్శనలలో ఎందుకు మహిళా రైతులను కూడా 'కూర్చునపెడుతున్నారు', 'వారిని వెనక్కి పంపించండి' అని కూడా మీరు అన్నారు. అంటే, స్త్రీలకు స్వయం ప్రతిపత్తి లేదని, వారు పురుషులలాగా అన్ని పనులు చేయడానికి అర్హులు కాదని అర్థం కదా! అదీకాక ఈ మధ్యనే మీరు అన్నారు: 'ఒక జంట భార్యాభర్తలుగా కలిసి జీవిస్తున్నప్పుడు, భర్త క్రూరంగా

ఆర్థిక లక్ష్యాల కన్న రాజ్యాంగ ఆదర్శాలే మిన్న

కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రకటించిన ప్రైవేటీకరణ పథకం తప్పుడు వాదనల మీద ఆధారపడిందని, రాజ్యాంగ ఆదర్శాలకు భిన్నమైనదని విశ్లేషిస్తున్నారు **ఆనంద్ తేల్తుంబ్డే**

ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించాలనే మోడీ ప్రభుత్వ కార్యక్రమం మీద ప్రస్తుతం సాగుతున్న చర్చ ఒకరకంగా గతంలో ఎన్నోసార్లు జరిగినదేనన్నట్టు అనిపిస్తున్నది. ప్రభుత్వానికి మద్దతుగా ప్రయివేటీకరణ సమర్థకులు ఎప్పుడైనా ప్రభుత్వ రంగం కన్న ప్రైవేటు రంగమే ఎక్కువ సమర్థంగా పనిచేస్తుందని వాదిస్తారు. పాపం వారు గుర్తించడం లేదేమో గాని, వారి వాదనను తార్కికంగా కొనసాగిస్తే ఒక ఇబ్బందికరమైన అనివార్యమైన ప్రశ్న దగ్గరికి చేరుతాం. ఆ ప్రశ్నేమంటే, మరి ప్రభుత్వాన్నే ప్రైవేటీకరిస్తే సరిపోతుంది గదా అని.

వారి వాదనకు ఉదాహరణగా వారు చాలా తరచుగా అమెరికాను చూపుతుంటారు. అమెరికాలో కూడా ప్రైవేటు రంగాన్ని చాలా బలంగా విస్తరించారు. తద్వారా అది ప్రపంచ ఆర్థిక శక్తిగా ఎదిగింది. అందుకు భిన్నంగా యునైటెడ్ కింగ్ డం ప్రభుత్వ రంగాన్ని బలపరిచి 1980ల కల్లా దివాళా తీసింది. కాని ఈ ఉదాహరణ చూపేవారు తమ అవసరం కొద్దీ ఒక విషయాన్ని విస్మరిస్తుంటారు. వాస్తవంగా 1929 మహా సంక్షోభం వల్ల మరణశయ్యమీదికి చేరిన పెట్టుబడిదారీ విధానాన్ని (ప్రైవేటు పెట్టుబడిని) కాపాడి, బతికించినది కీన్స్ ప్రతిపాదించిన ప్రభుత్వ రంగ పెట్టుబడులు అనే ఔషధమే. ఈ ఔషధమే ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వ రంగం పుట్టుకకూ, వ్యాప్తికీ ప్రధాన కారణాలలో ఒకటి. ఈ ఔషధం పనికిరాదనే దుష్ప్రచారాన్ని నయా ఉదారవాద అర్థశాస్త్ర వేత్తలు ప్రారంభించినది 1980ల ప్రారంభంలో మాత్రమే.

అదే విధంగా, భారతదేశంలో మిశ్రమ ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ రంగం మార్గదర్శక శిఖరాల స్థానంలో ఉండాలనే అభిప్రాయం, దానితో పాటు విస్తరించిన లైసెన్స్ రాజ్ నెహ్రూ సోషలిజంతో చేసిన దోస్తీ వల్ల వచ్చినవేననేది ఒక వాస్తవం. అందువల్ల, 1980లలో భారత ప్రభుత్వం సరళీకరణ విధానాలు ప్రారంభించినప్పుడు ప్రైవేటు రంగం వేగంగా ముందుకు దూసుకు వెళ్లి, ప్రభుత్వ రంగం కన్నా మెరుగైన పనితీరును చూపింది. కానీ చరిత్రను ఇంత సులభంగా చదివితే కూడా తెలిసేదేమంటే, ఇలా మౌలిక పరిశ్రమల్లో విపరీతమైన ప్రజా పెట్టుబడులు పెట్టాలని ప్రతిపాదించినది నెహ్రూ కన్న ఎక్కువగా 1944 బొంబాయి ప్రణాళిక. దాన్ని తయారు చేసినది అప్పటికి అగ్రశ్రేణిలో ఉన్న భారతీయ

వ్యవహరించవచ్చు, అంతమాత్రాన చట్టబద్ధంగా వివాహం చేసుకున్న భార్యభర్తల మధ్య జరిగే సంభోగ కార్యక్రమాన్ని అత్యాచారం అనగలమా?'

జరిగింది చాలు. మీరు మాట్లాడిన మాటలు న్యాయస్థానం స్థాయిని తగ్గించేట్టుగా, అపఖ్యాతి కలిగించేట్టుగా ఉన్నాయి. అత్యున్నత స్థానంలో ఉన్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నుండి వచ్చిన ఈ పదజాలం ద్వారా ఇతర కోర్టులకు, జడ్జీలకు, పోలీసులకు, చట్టాన్ని అమలు చేసే సంస్థలన్నింటికీ భారతదేశంలో స్త్రీలకు రాజ్యాంగ పరంగా న్యాయం పొందే హక్కు లేదని సందేశం వెళుతుంది. దీనివల్ల బాలికల, మహిళల నోళ్లు మూయించే పని పుంజుకుంటుంది. దీనిని ఛేదించడానికి దశాబ్దాల కాలం పట్టింది. అత్యాచారాలు చేసేవాళ్లకు, అత్యాచారం చేయడానికి పెళ్లి అనేది లైసెన్స్ పొందడం అనే సందేశాన్నిస్తుంది: అలా, లైసెన్స్ పొందిన రేపిస్ట్ తాను చేసిన దారుణం నేరరహితమైందని, తాను చేసిన పని న్యాయబద్ధమైపోయిందని భావిస్తాడు.

2021, మార్చ్ 1న కోర్టులో మీరు చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకొమ్మని, అలాగే ఈ దేశ మహిళలకు క్షమాపణలు చెప్పాలని మేము డిమాండ్ చేస్తున్నాం. ఒక్కక్షణం ఆలస్యం చేయకుండా భారతదేశ ప్రధాన న్యాయమూర్తి పదవి నుండి మీరే వైదొలగడం నైతికంగా, సహేతుకంగా ఉంటుంది.

ఈ బహిరంగ లేఖను ఆమోదించి, తమ చేవ్రాలును నమోదు చేసిన మహిళా హక్కుల ఉద్యమాల కార్యకర్తలు నాలుగు వేల మంది. అందులో కొంతమంది ఈ క్రింద పేర్కొన్నవారు:

అన్నీరాజా, మరియం ధావలె, కవితా కృష్ణన్, కమలా భాసిన్, మీరా సంఘమిత్ర, అరుంధతిదురు మొదలగువారు.

వ్యక్తులుగా కాక సంఘాలుగా ఈ లేఖపై సంతకంచేసిన వాళ్లు కూడా చాలా మందే ఉన్నారు. అందులో కొన్ని సంఘాల పేర్లు:

ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఉమెన్స్ అసోసియేషన్, ఆల్ ఇండియా డెమోక్రటిక్ ఉమెన్స్ అసోసియేషన్, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఉమెన్, సహేలి, ఉమెన్ అగేనెస్ట్ సెక్సువల్ వాయిలెన్స్ అండ్ స్టేట్ రిప్రెషన్, తిట్స్, ఫోరమ్ అగేనెస్ట్ అప్రెషన్ ఆఫ్ ఉమెన్, బిబా కలెక్టివ్, భారతీయ ముస్లిం మహిళా ఆందోళన్, దళిత్ ఉమెన్స్ ఫైట్, బాసో, ఉమెన్ అండ్ ట్రాన్స్‌జెండర్ ఆర్గనైజేషన్ జయింట్ ఆక్షన్ కమిటీ మొదలగునవి.

వీరితో పాటు వివిధ సామాజిక రంగాలలో పనిచేస్తున్న ప్రముఖ ప్రజాస్వామికవాదులు కూడా సంతకం చేసినవాళ్లల్లో ఉన్నారు. వారిలో కొంతమంది పేర్లు:

అడ్మిరల్ ఎల్. రాందాస్, అరుణ్‌రాయ్, నిఖిల్ డే, ఆనంద్ సహాయ్, దేవకీ జైన్, జాన్ దయాళ్, లక్ష్మి మూర్తి, అపూర్వానంద్, ఫెరా నక్వి, అయేషా కిద్వాయ్, ఆంజ కొ వాక్స్ మొదలగువారు.

(రచయిత జూనియర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్)

వీ

పెట్టుబడిదారులు. తాను ప్రవచిస్తున్న సోషలిస్టు వాగాడంబరానికి ఈ ప్రణాళిక పనికి వస్తుందని ప్రభుత్వం రాజకీయంగా భావించింది. అలాగే రష్యా, చైనాల ఆర్థిక వ్యవస్థలు కూడా తమ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించిన తర్వాతనే శరవేగంతో పురోగమించాయని అనేవారు కూడ ఆ ప్రైవేటీకరణ విజయమంతా అంతకు ముందు ప్రభుత్వ రంగ సంస్థలు తయారుచేసి పెట్టిన మౌలిక సాధన సంపత్తి వల్లనే అనే గుర్తించాలి. కనుక విశ్లేషణ లేకుండా చారిత్రక సమాచారాన్ని పైపైన ప్రదర్శించడం ప్రైవేటీకరణ సమర్థకుల వాదన గెలిచిందనిపించేట్టు చేస్తుందేమో గాని, వాస్తవ పరిణామాలను తెలియజేయదు.

ఎటువంటి నియంత్రణలూ అదుపులూ లేకుండా ఉండే సంస్థ అటువంటి నియంత్రణలూ అదుపులూ ఉన్న సంస్థ కంటె ఎక్కువ సమర్థంగా పనిచేయగలదని ఒక సూత్రం లాగా చెప్పుకోవచ్చు. ప్రభుత్వ రంగ సంస్థల కంటె ప్రైవేట్ రంగ సంస్థలు ఎక్కువ సమర్థంగా పనిచేస్తున్నట్టు కనిపించడానికి ఈ సూత్రంతో వివరణ సరిపోతుంది. కాని అసలు పనితీరు అనేదానిమీద ఎంపిక చేసిన సమాచారపు ముక్కలు మాత్రమే చెప్పడం ప్రైవేటు రంగం ఆధిక్యత అనబడేదాన్ని నిర్ధారించడానికే అయితే, మరెన్నో అంశాలను కూడా పరిగణనలోకి తీసుకోవలసి ఉంటుంది. ప్రైవేటు రంగానికి ఎప్పటికప్పుడు ఇస్తున్న అనేక పన్ను రాయితీలను, పన్నేతర రాయితీలను కూడా లెక్కలోకి తీసుకోవలసి ఉంటుంది. ఇక ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో నిరర్థక ఆస్తులుగా, మొండి బాకీలుగా పోగుబడిన విస్తారమైన నిధులన్నీ ప్రైవేటు రంగ పారిశ్రామిక వేత్తలు ఎగ్గొట్టినవేనన్న వాస్తవాన్ని లెక్కలోకి తీసుకోవలసి ఉంటుంది.

భారత చమురు పరిశ్రమ మీద నియంత్రణలు ఎత్తివేయడాన్ని అధ్యయనం చేసే బృందం సభ్యుడిగా 1995లో నేను ప్రధానంగా ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఆయిల్ అండ్ నాచురల్ గాస్ కార్పొరేషన్ పనితీరునూ, అంతర్జాతీయ భారీ చమురు కంపెనీల పనితీరునూ దీర్ఘకాలిక స్థాయిలో పోల్చి చూసే అధ్యయనం చేశాను. రెంటి మధ్య ఎటువంటి ప్రాధాన్యత గల తేడా లేదని మా బృందం చేసిన నిర్ధారణ ప్రభుత్వానికి నచ్చలేదు. అలాగే, ప్రపంచీకరణ అనంతర రణగొణధ్వనిలో చేతిలో డబ్బు ఉన్న ప్రభుత్వ రంగ సంస్థల బోర్డులకు ప్రభుత్వం ఎక్కువ నిర్ణయాధికారాలు ఇచ్చినప్పుడు, ప్రభుత్వ రంగ చమురు కంపెనీలు ప్రైవేటు రంగంలో ప్రవేశించి ప్రైవేటు భాగస్వాములతో కలిసి సంయుక్త సంస్థలు ఏర్పాటు చేయడానికి ఉవ్విళ్లూరాయి. ఆ సంయుక్త సంస్థలలో ప్రభుత్వ రంగ సంస్థల భాగస్వామ్యం 50 శాతం దాటగూడదని కూడ ఆంక్ష ఉండేది. కొద్ది సంవత్సరాల్లోనే అతి తక్కువ సంస్థలు మినహా మిగిలిన సంయుక్త సంస్థలన్నీ విపరీతంగా బకాయి పడి, బకాయిల రద్దు కోసం ఎదురు చూశాయి. అంటే, ప్రైవేటు సంస్థ దానికదిగా ప్రభుత్వ సంస్థ కన్న సమర్థంగా పని చేస్తుందని చెప్పడానికి నిస్సందేహమైన ఆధారాలేమీ లేవు.

అయితే, అత్యంత ముఖ్యమైన విషయం ఆ సంస్థ పనితీరు ఎంత సమర్థమైనది అని కాదు, అది ఎంత సఫలమైనది అని. ఈ మొత్తం చర్చలో సాఫల్యం అనే మాటే మచ్చుకైనా వినబడదు. చివరికి సాంప్రదాయిక వ్యాపార నిర్వహణా శాస్త్రంలో కూడ సామర్థ్యం అనే ఒక్క ప్రమాణాన్ని మితిమీరి పొగడడం జరగదు. దానితోపాటే ఆ సంస్థ పెట్టుకున్న లక్ష్యాలు ఎంతవరకు సఫలమయ్యాయి అనే ప్రమాణంతో కలిపి సామర్థ్యాన్ని లెక్కిస్తారు. ఒక సంస్థ గనుక స్వల్పకాలికంగా ఆదాయం సంపాదించినప్పటికీ దాని దీర్ఘకాలిక లక్ష్యాల దిశలో సాగుతుండకపోతే అది నిరుపయోగమే. అలాగే, ఒక ఆర్థిక వ్యవస్థ తన జాతీయాదాయ గణాంకాలలో పరుగులు గంతులుగా సాగుతున్నప్పటికీ, అది తన పౌరులకు మౌలిక స్వేచ్ఛలనూ, ఆరోగ్య, విద్యా, జీవనోపాధి భద్రతల వంటి సౌకర్యాలనూ కల్పించలేకపోయినట్టయితే అది నిరుపయోగమే.

దీన్ని ఒక పరికల్పన ద్వారా చూద్దాం. మనం ఒక ఆర్థిక వ్యవస్థను ఒక సుప్రసిద్ధమైన కార్పొరేట్ సంస్థకు అప్పగించామనుకుందాం. అది జాతీయాదాయాన్ని మనం ఊహించలేని ఎత్తులకు తీసుకుపోయిందనుకుందాం. కాని ఒక జాతిగా అది మన లక్ష్యాలను నెరవేర్చినట్టవుతుందా?

మన ఆర్థిక వ్యవస్థ లక్ష్యాలను రాజ్యాంగ ప్రవేశికలో, వివిధ అధికరణాలలో, అన్నిటికన్న ముఖ్యంగా ఆదేశిక సూత్రాలలో వ్యక్తీకరణ పొందిన మన రాజ్యాంగ ఆదర్శాల నుంచి వేరు చేసి చూడలేం. “జాతి జీవనపు అన్ని సంస్థలలోనూ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అమలయ్యే సామాజిక వ్యవస్థను వీలైనంత సఫలమైన పద్ధతిలో సాధించడం, పరిరక్షించడం ద్వారా ప్రజల సంక్షేమాన్ని అభివృద్ధి చేయడానికి ప్రయత్నించడం” ప్రభుత్వ లక్ష్యం అని ఆ ఆదేశిక సూత్రాలు ప్రకటించాయి. ప్రవేశికలో బాబాసాహెబ్ బి ఆర్ అంబేద్కర్ చెప్పినట్టుగా ఈ సామాజిక వ్యవస్థ స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, న్యాయం అనే ప్రాతిపదికల మీద ఆధారపడి ఉంది.

ఒకవైపు ప్రైవేట్ రంగం ప్రభుత్వ రంగం కన్న ఎక్కువ సమర్థమైనదనే నిస్సందేహమైన నిరూపణ లేకపోగా, మరొక పక్క భారతదేశపు ఆర్థికాభివృద్ధికి అత్యంత కీలకమైన ప్రమాణాన్ని ప్రైవేట్ రంగం నెరవేర్చగలదా అనే సందేహం కూడ ఉంది.

(ది కారవాన్ మాసపత్రిక మార్చ్ సంచికలో ప్రచురితమైన వ్యాసానికి అనువాదం)

(రచయిత విద్యావేత్త, సామాజిక కార్యకర్త. గోవా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజిమెంట్ లో ప్రొఫెసర్ గా ఉండగా భీమా కోరేగాం కేసులో నిందితుడిగా అరెస్టు చేశారు. ప్రస్తుతం విచారణను ఎదుర్కొంటూ తలోజా జైలులో ఉన్నారు.)

వీ

మానవ ఆలోచన భౌతిక సత్యాన్ని గ్రహించగలదా అనేది సైద్ధాంతిక ప్రశ్న కాదు. అది ఆచరణలో తేలే ప్రశ్న. సత్యాన్ని, అంటే, తన ఆలోచనకు సంబంధించిన వాస్తవితకనూ, శక్తినీ, తాను చూసే పార్శ్వాన్నీ మనిషి ఆచరణలోనే రుజువు చేయవలసి ఉంటుంది. ఆలోచన వాస్తవికమైనదా, అవాస్తవికమైనదా అనే వివాదాన్ని ఆచరణ నుంచి వేరు చేస్తే అది కేవలం పండిత చర్చే అవుతుంది.

– కార్ల్ మార్క్స్

ఐదు రాష్ట్రాల ఎన్నికల మినీ సంగ్రామం

కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ప్రజా వ్యతిరేక చట్టాల వల్ల ప్రజలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో ఉన్న సందర్భంలో జరుగుతున్న ఎన్నికలు పాలకులను మారుస్తాయి తప్ప ప్రజల జీవితాలను మార్చేవి కావని అంటున్నారు ఎ. నర్సింహారెడ్డి

నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో శాసనసభలకు ఎన్నికల తేదీలను ప్రధాన ఎన్నికల కమీషనర్ (సిఇసి) సునీల్ అరోరా ఫిబ్రవరి 26న షెడ్యూల్ ప్రకటించారు. దీంతో మినీ సార్వత్రిక ఎన్నికల సంగ్రామంగా పరిగణిస్తున్న ఈ ఎన్నికల వైపు దేశవ్యాప్తంగా ప్రజలు ఆసక్తితో చూస్తున్నారు. ఈ ఎన్నికల ఫలితాలు అనేక పార్టీల రాజకీయ భవిష్యత్ గమనంపై ప్రభావం చూపే అవకాశం ఉంది. మార్చ్ 27 నుండి ఏప్రిల్ 29 వరకు పలు దశల్లో ఎన్నికలు జరుగుతాయి. తమిళనాడు, కేరళ, కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరిలో ఒకే దశలో ఏప్రిల్ 6న; అస్సాంలో మూడు దశలుగా మార్చ్ 27, ఏప్రిల్ 1,6; తేదీలలో పోలింగ్ నిర్వహిస్తారు. క్రితం సారి 2016లో అస్సాంలో రెండు దశలలోను, పశ్చిమబెంగాల్‌లో ఆరు దశలలోను ఎన్నికలు నిర్వహించగా ఈ పర్యాయం ఆ రెండు రాష్ట్రాలలో పోలింగ్ దశలను పెంచడం విశేషం. బెంగాల్‌లో ఎనిమిది దశలలో మార్చి 27, ఏప్రిల్ 1, 6, 10, 17, 22, 26, 29 తేదీల్లో ఎన్నికలు నిర్వహించడాన్ని మమతా బెనర్జీ ఆక్షేపణ తెలిపారు. ఈ మొత్తం ఎన్నికల ఫలితాలను మే 2న ప్రకటిస్తారు.

ఈ నాలుగు రాష్ట్రాలూ, కేంద్రపాలిత ప్రాంతంలో మొత్తం 824 అసెంబ్లీ స్థానాలుండగా... 18.68 కోట్ల మంది ఓటర్లు తమ తీర్పునివ్వాల్సి ఉంది. బెంగాల్‌లో లక్షకు పైగా పోలింగ్ కేంద్రాల్లో, తమిళనాడులో 89 వేల పోలింగ్ కేంద్రాల్లో, కేరళలో 40 వేల పోలింగ్ కేంద్రాల్లో, అస్సాంలో 33 వేల పోలింగ్ కేంద్రాల్లో, పుదుచ్చేరిలో 1,500 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ ప్రక్రియ నిర్వహిస్తారు. జనవరి నాటికి సిద్ధమైన ఓటరు జాబితాలతో ఎన్నికలు నిర్వహిస్తున్నామని సిఇసి సునిల్ అరోరా తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా నామినేషన్ వేసే అవకాశం కల్పించారు. కరోనా వ్యాప్తి నేపథ్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని, సమస్యాత్మక ప్రాంతాల్లో వెబ్ కాస్టింగ్ చేస్తామని ఆయన చెప్పారు. పశ్చిమ బెంగాల్‌కు ఇద్దరు ప్రత్యేక పోలీసు పరిశీలకులను నియమిస్తున్నామని ఆయన చెప్పారు.

2014లో మోడీ ప్రధానిగా, అమిత్ షా కేంద్ర హోం మంత్రి అయిన తరువాత ప్రధానమైన రాజకీయ ప్రత్యర్థులను కేంద్ర సంస్థలతో ఎన్‌కౌంటర్ చేయించారు. మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, కేరళ వంటి రాష్ట్రాలలో ప్రతిపక్ష ప్రముఖులకు ఇ.డి విచారణకు సమన్లు పంపి లొంగదీసుకున్నారు. బిజెపి యేతర ప్రభుత్వాలు ఉన్న రాష్ట్రంలోకి విస్తరించడానికి ప్రతిపక్ష పార్టీ నుంచి కీలకమైన నేతలెవరో గుర్తించి వారిని నయానా, భయానా తమ పార్టీలో చేర్చుకోవడం. ఎంఎల్ఏలను తమవైపుకు తిప్పుకుని రాజీనామా చేయించి ప్రభుత్వాలను పడగొట్టడం, ప్రత్యర్థులను ఆర్థికంగా బలహీనం చేయడానికి కేంద్ర సంస్థలను ఉపయోగించుకొని ఆయా రాష్ట్రాల్లో స్థానిక పరిస్థితులకు అనుగుణంగా ఏవిధమైన భాష వాడాలో నిర్ణయించడం, మతపరంగా ఓట్లను చీల్చేందుకు వ్యూహాల్ని రూపొందించి పకడ్బందీగా అమలు చేయడం ఇవన్నీ బిజెపి అమ్ముల పొదిలో స్పష్టంగా కనపడే అస్త్రాలు మాత్రమే.

ఐదు రాష్ట్రాల అసెంబ్లీల ఎన్నికలు అనేక కారణాల రీత్యా ఎంతో ముఖ్యమైనవి. దేశంలో మరొక మినీ ఎన్నికల సంగ్రామానికి తెర లేచింది. ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రంలో ఉన్న రాజకీయ నేపథ్యం దృష్ట్యా ఈ ఎన్నికలు అత్యంత ప్రాధాన్యత సంతరించుకున్నాయి. అయితే, వీటన్నింటినీ కలిపిచూస్తే మొత్తంగా ఈ ఎన్నికలు జాతీయ ప్రాధాన్యతను కలిగి ఉన్నాయి.

ఈ ఐదు రాష్ట్రాల ఎన్నికలను బిజెపి 2023లో జరుగనున్న సార్వత్రిక ఎన్నికలకుసెమీ ఫైనల్‌గా భావిస్తోంది. ఇప్పటికే పలు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలను చేజిక్కించుకున్న బిజెపి... ప్రాంతీయ పార్టీలు బలంగా ఉన్న ఈ రాష్ట్రాలలో పాగా వేయగలిగితే దేశంలో తమకు తిరుగుండదని నమ్ముతోంది. అందుకే అస్త్రశస్త్రాలు సంధిస్తోంది. అయితే, ప్రజాబలంతో కాకుండా ఇతర పార్టీల నుండి అడ్డదిడ్డంగా ఫిరాయింపును ప్రోత్సహించడం ద్వారా, కేంద్ర దర్యాప్తు ఏజెన్సీలను ప్రయోగించి బలమైన రాజకీయ ప్రత్యర్థులను దారికి తెచ్చుకోవడం ద్వారా, కులాల మధ్య, మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి మెజారిటీ హిందూ ఓట్లను పొందడం ద్వారా తమ రాజకీయ ఆధిపత్యం కోసం బిజెపి చేస్తున్న ప్రయత్నాలు ఆ పార్టీ భవిష్యత్‌ను ప్రశ్నార్థకరం కావించే ప్రమాదాలుగా కనిపిస్తున్నాయి.

ఈసారి ఎన్నికల్లో బిజెపి వ్యూహాలు అంతగా వర్కవుట్ కావట్లేదని తెలుస్తోంది. కొన్ని అంశాలు ఆ పార్టీ ముందరి కాళ్లకు బంధం వేస్తున్నాయి. ముఖ్యంగా అమాంతం పెరిగిపోయిన పెట్రో ఉత్పత్తుల ధరలు బిజెపి నేతల స్పీడ్‌కు బ్రేకులు వేస్తున్నాయి. దేశంలో ఒకే పార్టీ గుత్తాధిపత్య పాలన సాగించాలన్న బిజెపి ఆకాంక్ష నెరవేరేలా ఈ ఎన్నికల ఫలితాలు ఉంటాయా లేక నాలుగు నెలలకు పైగా ఢిల్లీలో రైతులు చేస్తున్న ఆందోళను పట్టించుకోకుండా అనుసరిస్తున్న నిరంకుశ పోకడలను వ్యతిరేకించే వైఖరి బలోపేతమవుతుందా? మరోవైపు కరోనా గడ్డు కాలంలోనే కార్మిక వ్యతిరేక చట్టాలు, రైతు వ్యతిరేక వ్యవసాయ చట్టాలు చేసింది. స్వావలంబనకు ప్రతిబింబంగా గత ఏడు దశాబ్దాలుగా నిర్మించుకున్న మూడు వందలకు పైగా ఉన్న ప్రభుత్వరంగ సంస్థలను ఆశ్రిత పెట్టుబడిదారులకు కట్టబెట్టాలని పరుగులు పెడుతున్న ప్రభుత్వ

ప్రజా వ్యతిరేక విధానం, అలాగే ఆకాశానంటుతున్న నిత్యావసరాల ధరలు, పెరుగుతున్న నిరుద్యోగం, ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ వైఖరి, కునారిల్లుతున్న ఆర్థిక వ్యవస్థ పట్ల ప్రజల ఆగ్రహం సమీకృతమై కేంద్ర ప్రభుత్వ వ్యతిరేకతను పెంచుతుందా? అనేది ఎన్నికల ఫలితాలే చెప్పాల్సి ఉంది.

ప్రధాని నరేంద్ర మోడీ సారథ్యంలోని ఎన్‌డిఎ-2 ప్రభుత్వం లోక్‌సభలో తిరుగులేని ఆధిక్యంతో అధికారంలోకి వచ్చి సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఆర్థిక సంస్కరణలను అమితవేగంతో అమలు చేస్తున్న నేపథ్యంలో జరుగుతున్న విస్తృత స్థాయి ఎన్నికలివి. కాంగ్రెస్‌ను నామరూపాల్లేకుండా తుద ముట్టించి, వివిధ రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ప్రాంతీయ పార్టీలకూ నూకలు దొరకని స్థితిని సృష్టించి దేశమంతటా తానే అయి ఏకచ్ఛత్రాధిపత్యం వహించాలని ఉవ్విళ్లూరుతున్న బిజెపి అందుకనుగుణంగానే సకల వ్యూహాలను పన్నుతున్నది. తనకు కనీస స్థాయి ఉనికి కూడా లేని తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లోనూ, కేంద్ర పాలిత రాష్ట్రం పుదుచ్చేరిలో కూడా పాగా చేయాలని చూస్తున్నది. బిజెపిలో ఈ పరిణామాల్ని చూసిన హిమాచల్‌ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శాంతాకుమార్ తన ఆత్మకథలో ఏవగించుకున్నారు. 'నీతీ నిజాయితీలేని మోసపూరిత రాజకీయాలతో ప్రభుత్వాలను మార్చవచ్చు కాని సమాజాన్ని మార్చలేం. స్వామి వివేకానందను పూజిస్తే చాలదు, ఆయన మార్గాన్ని అనుసరించాలి' అని ఆయన అన్నారు. ప్రజాప్రతినిధులను సంతలో పశువుల్లా కొనుగోలు చేసుకోవడం, గోరక్షణ, లవ్ జిహాది వంటి అల్లర్లు సృష్టించడం వంటి అకృత్యాలను బిజెపి అవలంభించడం చూసి సిగ్గుపడుతున్నానని ఆయన చెప్పడం ప్రతి ఒక్కరు గుర్తించాల్సిన అంశం.

అందరి దృష్టి బెంగాల్ పైనే

పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ దశాబ్ద కాలంగా అధికారంలో ఉంది. ఆమె స్వయంకృతాలు, అవినీతి ఆరోపణల ప్రభావం ఓటర్లపై పడితే కమల వికాసానికి దారులు పడుతాయి. బెంగాల్‌లో పునాది కోల్పోయిన కాంగ్రెస్‌తో చేతులు కలిపిన కమ్యూనిస్టులకు ఏ మేరకు ప్రయోజనం దక్కుతుందన్నది అనుమానమే. ఈ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్, బిజెపి, కాంగ్రెస్ వామపక్షాల అలయెన్స్ మధ్య ప్రధానంగా త్రిముఖ పోటీకి భూమిక సిద్ధమైంది. బిజెపి ధీమాకు గత లోక్‌సభ ఎన్నికల ఫలితాలు ప్రాతిపదిక కల్పించాయి. ప్రధాని నరేంద్ర మోడీ, హోంమంత్రి అమిత్‌షా, బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డా తదితరులు బెంగాల్‌లో పర్యటనలు ముమ్మరం చేశారు. అన్ని వర్గాల ప్రజలను ఆకర్షించడానికి బిజెపి ఆచరణ సాధ్యం కాని వరాలు ప్రకటిస్తుంది. తృణమూల్ కాంగ్రెస్ పార్టీ నుండి పలువురు ముఖ్యులను బిజెపిలోకి లాక్కున్నారు. ఆమె కుటుంబ సభ్యులపై అవినీతి ఆరోపణలతో సిబిఐ దర్యాప్తు పురమాయించారు. బిజెపికి డబ్బుకు కొరత లేదు. అంతర్గతంగా పనిచేయడానికి ఆర్‌ఎస్‌ఎస్ శక్తులు ఉన్నాయి.

బెంగాల్‌లో ఏ ప్రభుత్వ పథకం, లబ్ధి పొందాలన్నా అందులో కొంత శాతం అధికార తృణమూల్ కార్యకర్తలకు ముడుపుగా చెల్లించుకోవాల్సిందే! దాన్నే 'కట్ మనీ' అని అంటారు. ఇది కేవలం విపక్షాలు చేసే ఆరోపణ మాత్రమే కాదు... స్వయంగా తృణమూల్ అధ్యక్షురాలు మమత బెనర్జీ సైతం అంగీకరించిన నిజం. అంత్యక్రియలకిచ్చే 2వేల రూపాయల నుంచి మొదలెడితే... సొంతింటి నిర్మాణ పథకం దాకా పథకం ఏదైనాగానీ తృణమూల్ కార్యకర్తలకు రు. 200 నుంచి 25,000 దాకా ముడుపు చెల్లించుకోవాల్సిందే! ప్రతిదానికీ ఓ రేటుగట్టి తృణమూల్ కార్యకర్తలు, ప్రతినిధులు ఈ ముడుపు కట్టించుకుంటారని ప్రచారంలో ఉంది. ఇది తృణమూల్ ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చి పెట్టింది. ఇలాంటిదే మరొకటి సిండికేట్. కమ్యూనిస్టుల హయాంలో ఆరంభమైన ఈ సిండికేట్ వ్యవస్థ తృణమూల్ ప్రభుత్వంలో మరింత విస్తరించింది.

2000 సంవత్సరంలో సాల్ట్‌లేక్ ప్రాంత్‌లో ఐటి, ఇతర పరిశ్రమల నిర్మాణాల సమయంలో ఈ సిండికేట్ ఆరంభమైంది. వామపక్షాల మద్ధతుదారులైన కొంతమంది స్థానిక యువకులు ఆ ప్రాంతంలోని నిర్మాణాలకు అవసరమైన సరకులన్నీ అమ్మేవారు. పరిశ్రమలు వీరి నుంచే సామాగ్రి కొనాల్సి వచ్చేది. అప్పట్లోనే దీనిపై ఆరోపణలు, విమర్శలు వచ్చాయి. ఆనాడు సిపిఎం పార్టీ స్థానికంగా తయారైన వస్తువులు కొనాలని నిర్బంధం చేసింది. కాలక్రమంలో ఈ స్థానిక కూటముల (సిండికేట్లు) బలం విస్తరించింది. నాణ్యత ఎలా ఉన్నా తమ వద్ద మాత్రమే కొనేలా ఒత్తిడి తెచ్చేస్థాయికి ఎదిగారు.

ఈ సిండికేట్లను ఏరిపారేస్తామంటూ 2011లో అధికారంలోకి వచ్చిన తృణమూల్ ఆ తర్వాత వీటిని మరింత బలోపేతం చేసింది. అప్పట్లో కొన్ని ప్రాంతాలకే పరిమితమైనవి కాస్తా ఇప్పుడు అన్ని జిల్లాలకూ విస్తరించాయి. పర్యావసానంగా బెంగాల్ ప్రజల్లో అసంతృప్తి గూడుకట్టుకొని ఉంది.

2016 బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారి మూడు స్థానాలు గెలుచుకొని బోణీ కొట్టిన బిజెపి ఈసారి అధికారం తమదేనన్నంతగా హడావుడి చేస్తోంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో 18 స్థానాల్లో సాధించిన విజయమే ఈ దూకుడుకు కారణం. తృణమూల్ ఇప్పటికే 'బెంగాల్ తన కుమార్తెను తప్ప మరెవరినీ కోరుకోవడం లేద'న్న ప్రధాన నినాదంతో బరిలో నిలిచింది. మమత చిత్రం, ఆ నినాదం ఉన్న హోర్డింగ్‌లు రాష్ట్రం నలుమూలలా వెలిశాయి.

బెంగాల్‌ను బెంగాలీలు తప్ప బయటివారు పాలించడానికి ప్రజానీకం అంగీకరించబోరని పలు బహిరంగ సభల్లో మమత తరచు చెబుతున్నారు. అలాగే ఈసారి 'జై శ్రీరాం'కూ... 'జై బంగ్లా'కూ మధ్య పోటీ జరగబోతోందని ఆమె చేస్తున్న ప్రకటనలు చూస్తే బిజెపిని ఎదుర్కొనడానికి బెంగాలీ సెంటిమెంటును ఆమె బలంగా ముందుకు తీసుకురాబోతున్నారని అర్థమవుతుంది. అయితే తమిళనాడులో జాతీయ పార్టీలను గత కొన్ని దశాబ్దాలుగా నిలువ నీడ లేకుండా చేసిన 'ద్రవిడ' సెంటిమెంటు స్థాయిలో ఇది బెంగాల్‌లో పని చేస్తుందా అన్నది వేచిచూడాలి. రాష్ట్రాన్ని మూడు దశాబ్దాలేలిన వామపక్షాలు అత్యంత బలహీనమైన స్థితిలో పడటం, రాష్ట్ర రాజకీయాల్లో కాంగ్రెస్ సైతం అసంగతంగా మారడం ఇన్నాళ్లూ తృణమూల్‌కు వరమైంది. ఇప్పుడు బిజెపి రూపంలో కొత్తగా వచ్చిపడిన సవాలును ఎదుర్కొనవలసి రావడం ఆ పార్టీకి కష్టంగానే ఉంది.

పశ్చిమ బెంగాల్ జనాభాలో దాదాపు 27 శాతం ముస్లింలు, ఉంటారు. మరొక బలమైన సామాజిక వర్గం రాజ వంశీలు. గత ఎన్నికల్లో

ఈ రెండు వర్గాలూ చాలావరకు తృణమూల్ కాంగ్రెస్‌కే అండగా నిలిచాయి. ఫలితంగా ఆ పార్టీకి భారీ ఆధిక్యం దక్కింది. ఎన్నికల్లో గణనీయమైన ప్రభావం చూపగల ఈ రెండు వర్గాల మొగ్గు ఈసారి ఎటువైపు ఉండబోతోందన్నది ప్రాధానాంశం. గతంలో ముస్లింలకు ప్రత్యేకంగా ప్రాతినిధ్యం వహించే పార్టీలేవీ బరిలో లేవు. కానీ ఈసారి ఆలిండియా మజ్లిస్ ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఏఐఎంఐఎం) పోటీ చేస్తోంది. మరోవైపు, పశ్చిమబెంగాల్‌లో చాలా ప్రముఖమైన ఫుర్‌ఫురా షరీఫ్‌కు చెందిన 34 ఏళ్ల మత గురువు అబ్బాస్ సిద్దిఖీ 'ఇండియన్ సెక్యులర్ ఫ్రంట్ (ఐఎస్ఎఫ్) పేరుతో కొత్త పార్టీ పెట్టారు. మమతకు వ్యతిరేకంగా ఆయన నిర్వహించిన బహిరంగ సభలకు జనం భారీగానే హాజరయ్యారు.

రాష్ట్రానికి పశ్చిమాన ఉన్న జంగల్‌మహల్, ఉత్తరభాగంలోని కూచ్‌బిహార్ ప్రాంతాలు తమను ఆదుకుంటారన్నది కమలనాథుల నమ్మకం. దాదాపు 60 అసెంబ్లీ నియోజక వర్గాలున్న జంగల్‌మహల్‌లో గట్టి ప్రభావం చూపించగల 'అధికారి' కుటుంబం కాషాయ కండువా కప్పుకోవడం ఆ పార్టీకి కలిసొచ్చే అంశం. ఉత్తర, దక్షిణ 24 పరిగణాలు ముర్షీదాబాద్, హూగ్లీ, మాల్డా, హౌవ్‌డా, తూర్పు, పశ్చిమ మిద్నాపూర్, బర్ద్వాన్, నదియా జిల్లాల్లో తృణమూల్‌కు ఉన్న పట్టును తక్కువ అంచనా వేయలేం. గత ఎన్నికల్లో కేవలం ఈ జిల్లాలోనే ఆ పార్టీ 150 స్థానాలు సాధించింది. 2011లో 4.06 శాతం ఓట్లు సాధించిన భాజపా, 2016లో 10.16 శాతం వద్ద ఆగింది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం 40.64 శాతం ఓట్లు సాధించి, 18 స్థానాలను సొంతం చేసుకుంది.

మూడు దశాబ్దాలు పశ్చిమ బెంగాల్‌పై ఎర్రజెండా ఎగరేసిన సిపిఐ(ఎం) నానాటికీ తీసికట్టుగా తయారవుతోంది. 2011లో 30.08 శాతం ఓట్లున్నా, 2016లో ఆ బలం 19.75 శాతానికి పడిపోయింది. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో మరింత తగ్గింది. కాంగ్రెస్ పార్టీ సొంతంగా ప్రభావం చూపగల పరిస్థితిలో లేదు. మైనారిటీలలో మెజారిటీ (ముస్లింలు), మెజారిటీలో మైనారిటీ భాగం (హిందువులు) ఓట్లు సాధించి విజయం సాధిస్తానని మమత చెబుతుంటే, ఈసారి బెంగాల్‌లో విజయం సాధిస్తామని బిజెపి నేతలు చెబుతున్నారు. బిజెపి గెలుపుకు డబ్బులు, మనుషులు బెంగాల్‌కు వరదలా వస్తున్నాయి. ఇరువురు హోరా హోరి పోరాడుతున్నారు. పరస్పరం ఆరోపణలు సంధించుకుంటున్నారు. విజయం ఎవరిని వరిస్తుందో చూడాలి.

అసోంలో బిజెపికి గడ్డు స్థితి

అసోంలో బిజెపి కూటమి అధికారంలో ఉన్నప్పటికీ పౌరసత్వ సవరణ చట్టం, జాతీయ పౌర జాబితా– ఈ రెండు దాని ప్రతిష్ఠను చాలావరకు దెబ్బతీశాయి. కాంగ్రెస్‌కు పెన్నిధి వంటి తరుణ్ గొగోయ్ మరణం ఆ పార్టీకి తీవ్రమైన నష్టం కలిగించే అంశం. ఈ నేపథ్యంలో అక్కడి ఎన్నికలు ఎటువంటి ఫలితాన్నిస్తాయనేది ఉత్కంఠ భరితం. ఈ నేపథ్యంలో ఈశాన్య రాష్ట్రం అసోంలో అధికారాన్ని నిలబెట్టుకునేందుకు బిజెపి సర్వశక్తులు ఒడ్డుతోంది. రాష్ట్రంలో ఈ దఫా త్రిముఖ పోటీ జరగనున్నది. బిజెపి నేతృత్వంలోని పాలక కూటమి, కాంగ్రెస్ నేతృత్వంలోని 'మహా కూటమి', కొత్తగా ఏర్పడిన రెండు ప్రాంతీయ పార్టీలు ఏర్పాటు చేసిన తృతీయ కూటమి మధ్యనే ప్రధానంగా పోటీ ఉంటుంది. గత ఎన్నికలలో బిజెపి కూటమిలో ఉన్న బోడోలాండ్ పీపుల్స్ ఫ్రంట్ (బిపిఎఫ్) ఈ దఫా కూటమికి దూరమై కాంగ్రెస్ మహా కూటమిలో చేరింది.

కొత్తగా ఏర్పడిన రెండు ప్రాంతీయ పార్టీలు తృతీయ కూటమి ఏర్పాటు దిశగా ప్రయత్నాలు చేయడంతో బిజెపి పరిస్థితి కుడితిలో పడ్డ ఎలుకలా తయారైంది. కోక్రాఝార్‌లో గట్టి పట్టున్న బిపిఎఫ్‌కు ప్రస్తుత అసెంబ్లీలో 12 మంది సభ్యులున్నారు. శర్వానంద సోనోవాల్ నాయకత్వంలోని ప్రభుత్వంలో ముగ్గురు మంత్రులున్నారు. దేశంలోనే అత్యధికంగా తేయాకు పండించే రాష్ట్రం అసోం. ఇక్కడున్న తేయాకు కార్మికులు మొత్తం ఓటర్లలో దాదాపు 15 నుంచి 20 శాతం. వీరికి లభిస్తున్న దినసరి కూలీ రు.167 మాత్రమే. కేరళ (రు. 380), తమిళనాడు (333), బెంగాల్ (220) కంటే బాగా తక్కువ. కూలీని మిగిలిన రాష్ట్రాలతో సమానంగా పెంచుతామని 2016లో హామీ ఇచ్చిన బిజెపి దాన్ని నెరవేర్చలేక పోయింది. ఈ నేపథ్యంలో తేయాకు కార్మికులు ఎన్నికల్లో అధికార కూటమికి దూరంగా ఉండే అవకాశముంది.

కాంగ్రెస్ సారథ్యంలోని మహా కూటమిలో మొత్తం 8 పార్టీలున్నాయి. వీటిలో కాంగ్రెస్‌కు గట్టిగా సహకరించేది బద్రుద్దీన్ అజ్మల్ నేతృత్వంలోని ఏఐయుడిఎఫ్. ఈసారి కాంగ్రెస్, ఏఐయుడిఎఫ్ కలిసి పోటీ చేస్తున్నాయి. కాబట్టి వారి ఉమ్మడి ఓటు షేరు 43 శాతానికి అంటే బిజెపితో సమంగా చేరుతుంది. అయితే తాము హిందూ ఓట్లను సంఘటితం చేయగలమని బిజెపి వాదిస్తోంది.

2016లో విడివిడిగా పోటీవల్ల ఏఐయుడిఎఫ్ ఓటు చీలిపోయిందని, ఈసారి కలిసొస్తుందని కాంగ్రెస్ విశ్వసిస్తోంది. సిపిఐ, సిపిఎం, సిపిఐ (ఎంఎల్), బిపిఎఫ్, ఏజిఎం, ఎజెపి, ఆర్‌డి మొదలైన పార్టీలు కూడా మహా కూటమిలో భాగమే. అసోం జనాభాలో మూడవ వంతు మంది ముస్లింలే, మొత్తం 37.14 శాతం మంది అంటే సుమారు కోటీ 36 లక్షల మంది దాకా ఉన్నారు. వీరిలో 90 లక్షల పైచిలుకు బంగ్లాదేశ్, బెంగాల్‌ల నుంచి వలసొచ్చి స్థిరపడ్డవారే. ఏఐయుడిఎఫ్‌లో ఉన్నది మెజారిటీ బెంగాలీ ముస్లింలు. వీరిని ప్రధానంగా ఏరిపారేసే ఉద్దేశ్యంతోనే కేంద్రం సిఎఎ తెచ్చిందన్న అభిప్రాయాలు బలంగా ఉన్నాయి. సిఎఎ తమ అస్తిత్వాన్ని దెబ్బతీస్తుందన్న భయసందేహాలు వారిలో ఇప్పటికీ ఉన్నాయి.

తమిళనాడులో మలుపులు తిరుగుతున్న రాజకీయాలు

తమిళనాట ఎన్నికల ప్రకటన వెలువడగానే పాత పొత్తులు వీడిపోతున్నాయి. కొత్త పొత్తులు చిగురిస్తున్నాయి. తాజాగా సీట్ల తకరారుతో విసిగిపోయిన వెటరన్ యాక్టర్, డిఎండికె అధినేత విజయకాంత్ అధికార అన్నా డిఎంకె–బిజెపి కూటమిని వీడారు. ఆయనలా ఎన్డీయే నుంచి బయటకి వచ్చారో లేదో ఆయనకు గాలమేసేందుకు నటద్వయం కమల్–శరత్ ముందుకొచ్చారు. దీంతో తమిళనాడులో రాజకీయాలు అనూహ్య మలుపులు తిరుగుతున్నాయి. మాజీ ముఖ్యమంత్రులు జె.జయలలిత, ఎం. కరుణానిధి లేకుండా తమిళనాడులో తొలిసారి పూర్తిస్థాయి ఎన్నికలు 2021 మేలో జరుగనున్నాయి. ఇక తమిళనాడులో ఎఐఎడిఎంకె, డిఎంకె సాంప్రదాయక ప్రధాన ప్రత్యర్థులు. సినీనటుడు రజనీకాంత్ రాజకీయ

పార్టీ పెట్టడం విరమించుకున్నాక బిజెపి ఎఐఎడిఎంకెతో పొత్తు పెట్టుకుంది. కాగా డిఎంకె కూటమిలో కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం, ఇంకా మరికొన్ని పార్టీలున్నాయి.

మాజీ ముఖ్యమంత్రి జయలలిత నెచ్చెలి శశికళ జైలుశిక్ష ముగిసి తిరిగివచ్చి ఎఐఎడిఎంకె ప్రధాన కార్యదర్శిని తానేనంటూ రాజకీయాల్లోకి దిగటంతో తమిళ రాజకీయాలు ఆసక్తిగా మారాయి. తమిళనాడులో ఏది ఏమైనా సరే కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్న డిఎంకెను అధికారంలోకి రాకుండా చేయడం కోసం క్రుంగిపోవడానికి సిద్ధంగా ఉన్న అన్నాడిఎంకె పార్టీకి బిజెపి ప్రాణం పోస్తూ వస్తున్నది. 20 సీట్లు మించి తమకు ఇవ్వకపోయినా సర్దుకొంది. పైగా, జైలు నుండి వచ్చిన శశికళను తిరిగి అన్నాడిఎంకెలోకి తీసుకురావడం కోసం, కనీసం ఎన్నికల పొత్తు పెట్టుకొనే విధంగా చేయడం కోసం విఫలయత్నం చేసింది. అవేమీ సాధ్యం కాకపోవడంతో ఎన్నికలయ్యే వరకు రాజకీయాలకు దూరంగా ఉండేటట్లు చేయగలిగారు. రాజకీయంగా తమ బలాన్ని పెంచుకొనే ప్రయత్నం తమిళనాడులో బిజెపి చేయలేక పోతుంది. బిజెపి నిస్సహాయ స్థితిని అవకాశంగా అన్నాడిఎంకె నేతలు ఉపయోగించుకొంటున్నారు.

పుట్టగొడుగుల్లా ఎన్నో పార్టీలున్న ద్రవిడ సీమలో రాజకీయ పార్టీల కూటములు కూడా అదే స్థాయిలో ఉన్నాయి. పాలక అన్నా డిఎంకే బిజెపి కూటమి అందులో మొదటిది కాగా.. విపక్ష డిఎంకే, కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలతో మరో కూటమి ఉంది. ఈ రెండు కాకుండా కమల్ పార్టీ సారథ్యంలో థర్డ్ ఫ్రంట్ ఉంది. అందులోనే శరత్‌కుమార్ పార్టీ కూడా కొనసాగుతోంది. మరోవైపు శశికళ బంధువు టిటికె దినకరన్ సారథ్యంలోని ఏఎంఎంకె ఆధ్వర్యంలో నాలుగో కూటమి కూడా ఇటీవల ఏర్పడింది. ఇందులో హైదరాబాదీ పార్టీ ఎంఐఎం చేరింది.

పొత్తులో భాగంగా ఎంఐఎం మూడు సీట్లలో పోటీకి సంసిద్ధమైంది. మరోవైపు మక్కల్ నీధిమయ్యమ్ అధినేత, నటుడు కమల్‌హాసన్ రానున్న ఎన్నికల్లో శరత్‌కుమార్ పార్టీతో కలిసి బరిలోకి దిగనున్నారు. నిజానికి రజనీకాంత్ రాజకీయ పార్టీ పెట్టి ఉంటే జత కదుదామనుకున్నారు కమల్. అయితే రజనీ రాజకీయాల నుంచి తప్పుకోవడంతో కోలీవుడ్‌లోని పలువురు బడా హీరోలతో కలిసి ఎన్నికల బరిలో దిగేందుకు కమల్‌హాసన్ వ్యూహరచన చేశారు.

ప్రాంతీయ పక్షాల యుద్ధక్షేత్రంగా ఉన్న తమిళనాడులో ప్రాబల్యం గడించుకోవాలని బిజెపి చిరకాలంగా ఆశపడుతున్న సంగతి తెలిసిందే. నేరుగా తాను అధికారంలోకి రాకపోయినా మాజీ ముఖ్యమంత్రి జయలలిత మరణానంతరం ఆ రాష్ట్రంలో ఏర్పడిన నూతన రాజకీయ వాతావరణంలో ఆమె పార్టీ ఎఐఎడిఎంకెకు వెనుక నుంచి మద్దతు ఇవ్వడం ద్వారా అక్కడ పాలక పీఠాన్ని చెప్పుచేతుల్లో పెట్టుకోవడంలో బిజెపి కృతకృత్యురాలు కాగలిగింది. ఈ ఎన్నికల్లో కూడా తిరిగి ఎఐఎడిఎంకె గెలుపొందేలా చేయాలన్నది దాని వ్యూహంగా కనిపిస్తున్నది. అయితే, ఇందుకు ప్రధానమైన సవాలు డిఎంకె నుంచి కమలనాథులకు ఎదురుకానున్నది. 2019 సార్వత్రిక ఎన్నికల్లో తమిళనాడులో గల 39 లోక్‌సభ స్థానాల్లో 38 స్థానాలను డిఎంకె నాయకత్వంలోని యుపిఎ కూటమి గెలుచుకున్నది. అందుచేత డిఎంకెని నిలువరించి అక్కడ ఎఐడిఎంకె వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చేలా చేయడం బిజెపికి అనుకున్నంత సులువు కాదు.

కేరళలో బిజెపి ప్రత్యామ్నాయం అవుతుందా?

కేరళ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మొదటి నుంచి లెఫ్ట్ డెమోక్రాటిక్ ఫ్రంట్ (ఎల్.డి.ఎఫ్), యునైటెడ్ డెమోక్రాటిక్ ఫ్రంట్ (యు.డి.ఎఫ్)ల మధ్య పోటీ నువ్వా నేనా అన్నట్లు కొనసాగుతుంది. ఒక ఎన్నికల్లో ఒక కూటమి ఆధిపత్యం సాధిస్తే... తరువాతి ఎన్నికల్లో ఇంకో ఫ్రంట్‌ది పైచేయిగా అవుతూ వస్తోంది. కేరళ సాంప్రదాయక ప్రత్యర్థులు ఎల్‌డిఎఫ్, యుడిఎఫ్‌ల మధ్యనే పోటీ. దాదాపు మూడు దశాబ్దాలుగా అక్కడ బలం పెంచుకోవాలని చూస్తున్న బిజెపి నేతలకు అది అందని ద్రాక్షగానే మిగిలిపోతోంది. అయితే 2019 పార్లమెంటు ఎన్నికల్లో కేరళలో బిజెపి ఓటు బ్యాంకు గణనీయంగా పెరిగింది. గత ఎన్నికల్లో కేవలం ఒక స్థానంతో సరిపెట్టుకున్న బిజెపి ఈ ఎన్నికల్లో తన బలాన్ని మెరుగుపరుచుకునేందుకు ప్రయత్నాలు చేస్తుంది. ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి పలు పంచాయితీలను ఎల్‌డిఎఫ్, యుడిఎఫ్‌ల నుంచి కైవసం చేసుకుంది. బిజెపి కొన్ని మతతత్వ సంస్థలతో కలిసి అక్కడ రంగంలో ఉంటుంది.

దక్షిణాది రాష్ట్రాలలో పాగా వేయాలనే కృత నిశ్చయంతో ఉన్న బిజెపి కల కేరళలో నెరవేరాలంటే మరో కొంతకాలం వేచి చూడక తప్పదు. మరోవైపు కాంగ్రెస్ యువనేత రాహుల్ గాంధీ కేరళ నుండి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహిస్తున్న దృష్ట్యా ప్రతిష్టాత్మకంగా ఇక్కడ కాంగ్రెస్ నేతృత్వంలోని యుడిఎఫ్‌ను అధికారంలోకి తీసుకురావడానికి చెమటలు కక్కుతున్నారు. కాగా ప్రతి ఎన్నికల్లో అధికారం చేతులు మారే సాంప్రదాయాన్ని ఈసారి నిలువరించి కొత్త చరిత్ర సృష్టిస్తామంటున్నారు ముఖ్యమంత్రి విజయన్. ప్రతి ఎన్నికల్లో అధికారం చేతులు మారే సాంప్రదాయాన్ని నిరోధిస్తామని ముఖ్యమంత్రి విజయన్ ధీమాతో ఉన్నారు. కేరళ కాంగ్రెస్ (మణి) ఎల్‌డిఎఫ్‌లోకి రావటం, ఇటీవల స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎల్‌డిఎఫ్ గొప్ప ఫలితాలు ఈ భరోసా ఇచ్చాయి. సిపిఐ(ఎం) నాయకత్వంలోని వామపక్ష కూటమి రెండోసారి అధికారంలోకి రాగలదనే జోస్యాలు వెలువడుతున్నాయి. అయితే గత లోక్‌సభ ఎన్నికల్లో అక్కడ 20 స్థానాల్లో 19 గెలుచుకున్న కాంగ్రెస్ నాయకత్వంలోని ఐక్య ప్రజాస్వామ్య కూటమి (యుడిఎఫ్)ని తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు.

పుదుచ్చేరిలో ధనశక్తితో బిజెపి దండయాత్ర

పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా నియమితురాలైన కిరణ్ బేడీ నియమబద్ధమై సంఖ్యాధిక్యతతో పరిపాలన సాగిస్తున్న కాంగ్రెసు–డిఎంకె ప్రభుత్వాన్ని గద్దెదించడానికి సరిగ్గా ఎన్నికల ప్రకటనకు వారం రోజుల ముందే పూనుకుంది. కేవలం నెల రోజుల వ్యవధిలోనే కాంగ్రెస్‌కు చెందిన ఐదుగురు, డిఎంకెకి చెందిన ఒకరు తమ శాసనసభ సభ్యత్వాలకు రాజీనామా చేశారు. వీరంత బిజెపిలో కలిసారు. కిరణ్ బేడీ ఎన్నికైన ప్రభుత్వానికి నిరంతరం సవాలుగా, కొరకరాని కొయ్యగా వ్యవహరిస్తూ అది సవ్యంగా పరిపాలించలేని పరిస్థితిని సృష్టించారు. ఆమ చర్యలకు, నిర్ణయాలకు నిరసనగా ముఖ్యమంత్రే స్వయంగా రాజ్‌నివాస్ వద్ద ధర్నా చేపట్టవలసి వచ్చింది. కిరణ్ బేడీని ఇంకెంత మాత్రం కొనసాగించినా

తమకు చెడ్డపేరు మరింతగా వచ్చి చేరుతుందని భావించిన కేంద్రంలోని బిజెపి పాలకులు ఎన్నికలు అతి చేరువలో ఉన్న సమయంలో ఆమెను తొలగించారు. ఆమె స్థానంలో పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు చేపట్టిన తమిళి సై తక్షణమే బలపరీక్షకు ముహూర్తం ప్రకటించడం ఆలోగా మరి ఇద్దరు పాలక కూటమి ఎంఎల్ఎలు రాజీనామా చేయడం వెరసి నారాయణ స్వామి ప్రభుత్వం మెజారిటీని కోల్పోయి తనంత తానుగా నిష్క్రమించడం జరిగిపోయింది.

పుదుచ్చేరిలో ఎలాగైనా రానున్న ఎన్నికల్లో అధికారంలోకి రావడానికి బిజెపి ప్రయత్నిస్తోంది. అసెంబ్లీ ఎన్నికలు జరిగే వరకు రాష్ట్రపతి పాలన విధించారు. బిజెపి కుట్రల వల్ల ప్రభుత్వం పడిపోయిందని, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తిరిగి తమనే గెలిపించాలని కాంగ్రెస్ ఓటర్లను కోరుతుంది. ప్రభుత్వం పడిపోయినా కాంగ్రెసు-డిఎంకె పార్టీలు ప్రజాభిమాన్ని కోల్పోలేదు. బిజెపి చర్యలకు ప్రజల ఆమోదం లేదని తెలుస్తోంది. పుదుచ్చేరిలో ఎన్నికలు మూడు మాసాల దూరంలో ఉన్నాయనగా అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఫిరాయింపుల ద్వారా కూలదోయించిన కమలనాథుల పట్ల ఓటర్లు ఏవిధంగా స్పందిస్తారో చూడాలి.

ముగింపు

2021 మార్చ్-ఏప్రిల్‌లో జరిగే ఈ ఎన్నికలు పాలక బిజెపికే కాదు, ప్రతిపక్షాలకు కూడా కీలకం. బిజెపి దృష్టి, కేంద్రీకరణ ప్రధానంగా అస్సాంలో తమ నాయకత్వంలోని సంకీర్ణ ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తెచ్చుకోవటంతో పాటు పశ్చిమ బెంగాల్‌లో అధికారం కైవసం చేసుకోవటంపై ఉంది. దక్షిణాదిలో చొరబడటానికి అది విశ్వప్రయత్నాలు చేస్తున్నా అవకాశాలు పరిమితమే. మోడీ నిరంకుశ హిందూత్వ ఫాసిస్టు విధానాలను ఎన్ఆర్‌సి, సిఎఎ చుట్టూ సాగిన ఉద్యమాలు, రైతు వ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలను, సామ్రాజ్యవాద పెట్టుబడి అనుకూల విధానాలను, ఆకాశానంటుతున్న ధరలను, నిరుద్యోగ సమస్యను ప్రజల్లో ప్రచారం చేసి లబ్ది పొందాలని కాంగ్రెస్, వామపక్షాలు, బిజెపి కూటమిలో లేని ప్రాంతీయ పార్టీలు విస్తృతంగా ప్రచారాన్ని కొనసాగిస్తున్నాయి. స్థానిక పరిస్థితులు, ప్రజాభిప్రాయం ఈసారి బిజెపికి అనుకూలంగా లేదు.

మరోవైపు భారతదేశ పార్లమెంటరీ ప్రాతినిధ్య ప్రజాస్వామ్య ఎన్నికల పద్ధతి గురించి, ఎన్నికల తీరు గురించి అనేక అభ్యంతరాలు, సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మొదటిది కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఏ ఒక్క పార్టీకి మెజారిటీ ప్రజల మద్దతు లేదు. అంటే మైనారిటీ ప్రభుత్వం మెజారిటీ ప్రజలపై తన విధానాలను రుద్దుతుంది. రెండవది ఎన్నికలు స్వేచ్ఛగా సైద్ధాంతిక పునాదిపై జరుగడం లేదు. డబ్బు ప్రభావం, కులం ప్రభావం, మతం ప్రభావం, మద్యం ప్రభావం, కొన్నిచోట్ల రౌడీయిజం ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేస్తున్నాయి. మూడవది ఎన్నికల్లో పాల్గొని ఓటు వేసే వారు 70 శాతం మించడం లేదు. అంటే 30 శాతం ప్రజల అభిప్రాయం ఏమిటో తెలియదు. నాల్గవది ఒక పార్టీ జెండాపై గెలిచి మరో పార్టీలోకి పిరాయించడం ప్రజాభిప్రాయాన్ని దగా చేయడమే అవుతుంది. ఐదవది గత దశాబ్దకాలంగా మతం ప్రధాన భూమికను పోషిస్తుంది. ఆరవది ఎన్నికల సంఘం అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించడం వంటి అంశాలన్నీ ప్రజాస్వామ్య భావనకు వ్యతిరేకమైనవి.

మన ఎన్నికలు ప్రజాస్వామికంగా జరుగుతున్నాయా? ఎన్నికల్లో వ్యక్తమవుతున్నది నిజమైన ప్రజాభిప్రాయమేనా? ఎన్నికల్లో ప్రభుత్వాలు మారితే విధానపరమైన మార్పులు వస్తున్నాయా? ఐదు సంవత్సరాల కొకసారి ఎన్నికలు జరగడమే ప్రజాస్వామికమా? గత ఏడు దశాబ్దాలుగా జరుగుతున్న ఎన్నికల ప్రహసనాన్ని గమనిస్తే కనిపించే అపసవ్యతలు మనం గమనిస్తూనే ఉన్నాం.

ఎన్నికల ప్రచారంలో ప్రజా ప్రయోజన అంశాలు చర్చకు రావడం ఈ మధ్యకాలంలో తగ్గింది. నాయకులు ఒకరిపై ఒకరు విసురుకునే సవాళ్లు, సంచలనాత్మక ప్రకటనలు, ఇరుగు పొరుగు దేశాలతో ఉండే సంబంధాలు వగైరా ప్రాధాన్యతలోకొస్తున్నాయి. పెరిగిపోతున్న ఆర్థిక అసమానతలు, పెరుగుతున్న నిరుద్యోగం, సామాజిక న్యాయం వంటి అంశాలు అప్రస్తుతమైపోతున్నాయి. నిజానికి ప్రజాస్వామ్యం అంటే ఎన్నికలు మాత్రమే కాదు. అది ఒక పాలన విధానం. ఇందులో పాలకులకు బాధ్యతలుంటాయి. ప్రజలకు హక్కులుంటాయి. ప్రజాస్వామ్యానికి స్వేచ్ఛా, సమానత్వం, సౌభ్రాతృత్వం మూలాధారాలుగా ఉంటాయి.

అసమ సమాజంలో ఎన్నికలు ప్రజాస్వామికంగా జరిగే అవకాశముండదు. మన సమాజం వర్గ-కుల భూస్వామ్య, ఆశ్రిత పెట్టుబడి సంబంధాల ఆధారంగానే నడుస్తోంది. ఎన్నికలు పాలకులను మార్చుకొనే అవకాశం ఇస్తుంది గానీ పాలన విధానాలను మార్చుకొనే అవకాశం ఇవ్వడం లేదు. ఎన్నికలు ఒక ప్రహసనంగా మారాయి. అంటే సమాజంలో వ్యవస్థాపరమైన మౌలిక మార్పులకు తోడ్పడేవి కాదని మన 70 ఏళ్ల అనుభవం రుజువు చేస్తోంది. నిజానికి సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల అమలు పట్ల కాంగ్రెస్, ఇతర జాతీయ, ప్రాంతీయ పార్టీలకు విధానపరమైన ప్రత్యామ్నాయం లేదు. పేదరికం, నిరుద్యోగం, సాంఘికార్థిక అసమానతలు నివారించడానికి విధానపరంగా పత్యామ్నాయం చూపకుండా మాటలు చెబితే ప్రయోజనం ఏమి ఉండదని గుర్తించాలి.

మోడీ ప్రభుత్వం గత ఏడేళ్లుగా రైతాంగానికి, కార్మిక వర్గానికి, యువతకు హాని చేసే విధానాలు రూపొందించి అమలు చేస్తోంది. ప్రజాస్వామ్య, లౌకిక విలువలను సమాధి చేస్తోంది. రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా పాలన సాగిస్తోంది. ఫలితంగా బిజెపి పాలనలో దేశ ఫెడరల్ స్వరూపం తీవ్రమైన ఒత్తిడికి గురవుతున్నది. అది రాష్ట్రాల పరిధిలోని అంశాలను చేతిలోకి తీసుకుని శాసనాలు చేస్తున్నది. వ్యవసాయ సంస్కరణ చట్టాలు తాజా ఉదాహరణ, ఆర్థిక సంబంధాల నిర్మాణాలను మార్పు చేస్తున్నది. బాధ్యతలు రాష్ట్రాల చేతుల్లో ఉంచి అధికారాన్ని సొంతం చేసుకుంటున్నది. ఈ పరిస్థితిలో బిజెపి గనుక బెంగాల్‌లో అధికారంలోకి వచ్చి, తమిళనాడులో ప్రత్యక్షంగా లేక పరోక్షంగా అధికారంలో భాగస్వామి అయినా కేంద్రంలో ఫాసిస్టు పాలన బలపడుతుంది. బెంగాల్‌లో టిఎంసి, తమిళనాడులో డిఎంకె విజయం సాధిస్తే రాష్ట్రాల గొంతు బలపడుతుంది.

(రచయిత ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడు, రాజనీతి శాస్త్ర విద్యార్థి) వీ

అందమైన నినాదాలు - అబద్ధాల మూటలు

***ప్రభుత్వాలు అమలుచేస్తున్న పథకాలు ప్రజల జీవితాల్లో మౌలిక మార్పుకు దోహదం చేయవనీ, వారిని మాట్లాడకుండా చేసి పాలకులు సహజ వనరులను ప్రైవేట్‌పరం చేస్తారనీ అంటున్నారు* తండ సదానందం**

ఏ నినాదం వెనుక ఎవరి ప్రయోజనాలు దాగి ఉన్నాయో తెలుసుకో లేనంత కాలం ప్రజలు మోసపోతూనే ఉంటారని లెనిన్ అన్నట్లు.... ఈ మధ్య కాలంలో పాలకులు తమ వాక్చాతుర్యంతో, అందమైన నినాదాలతో ప్రజలను ఆకర్షించుకుంటు కాలం వెళ్లదీస్తున్న పరిస్థితులు కనిపిస్తుండటం విధితమే... అసలు అభివృద్ధి పక్కనబెట్టి మాటలతో మభ్యపెడుతూ నినాదాలతో అబద్ధాల మూటలు కడుతూనే ఉన్నారు. ఈ నినాదాలు సామాన్య ప్రజలకు అనుకూలంగా వారి అభివృద్ధికి దోహదపడతాయి అన్నట్లుగా కనిపిస్తూనే వారికి అందకుండా, సుదూరంగా పాలకుల అనుయాయులకు, కార్పొరేట్ శక్తులకు ఉపయోగపడుతున్నాయి. పేరుకు పేదల అభివృద్ధికి అని కానీ ఎన్నికలలో ఆర్థికంగా, హార్థికంగా సాయపడిన బడా పారిశ్రామికవేత్తలకు వేల కోట్ల రూపాయల లాభం కలిగించేందుకు పాలకవర్గాలు ఎర్రతివాచీ పరిచి వారికి ఊడిగం చేస్తూ... పేదల అభివృద్ధి, సంక్షేమం మా లక్ష్యం, ధ్యేయం అని ఊకదంపుడు ఉపన్యాసాలలో పేర్కొనడం, పేద ప్రజల కష్టాలు, బాధలు మాకు తెలుసునని అందుకే పలు రకాల సంక్షేమ పథకాలతో రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మారుస్తున్నామని ఒకరు, దేశంలో ఏ ఒక్కరు కూడా ఇబ్బందులు పడవద్దని., నల్లధనాన్ని వెనక్కి రప్పించి లక్షల రూపాయలను జనదన్ ఖాతాలోకి మళ్లీస్తామని ధనాధన్ ప్రకటనలు గుప్పించి దేశం వెలిగిపోతోందని... పట్టపగలే చుక్కలు చూపిస్తున్న పాలకులు దేశాన్ని రామరాజ్యంగా తీర్చిదిద్దుతామని, రాక్షస రాజ్యంగా మారుస్తూ, అబద్ధాల మాటల మూటలతో కాలాన్ని చక్కగా వెళ్లదీస్తూ ఉండటం ఆశ్చర్యకరం... పాలకుల నినాదాలు వాటి వల్ల ప్రజలకు ఏ మేరకు అభివృద్ధి ఒనగూడిందో పరిశీలిద్దాం....

1) సబ్ కా సాథ్ సబ్ కా వికాస్... నినాదంతో కేంద్ర ప్రభుత్వం ముందుకు వెళుతుందని, అంత్యోదయులకు ఉపయోగపడే విధంగా ప్రణాళికలు బడ్జెట్లు తయారు చేస్తున్నామని, ప్రభుత్వం నుంచి నేరుగా ప్రతి ఫలాలు పేదలకు అందినప్పుడు మాత్రమే సంక్షేమ పథకాలకు అర్థం ఉంటుందని ఆర్థికశాఖ మంత్రి అన్నారు. చాలా సంతోషమే కానీ ఆచరణలో అది కనబడడం లేదు. కరోనా విపత్కర సమయంలో అకస్మాత్తుగా లాక్ డౌన్ ప్రకటించి ఎందరో వలస కూలీల ఆర్తనాదాలు మారుమ్రోగే విధంగా చేయడం జరిగింది... ఎందరో అభాగ్యులు రహదారుల వెంట రైలు పట్టాల వెంబడి రక్తాన్ని చిందించారు. వలస కూలీలకు సరైన దిశా నిర్దేశం చేసి వాళ్లకి సరైన ఏర్పాట్లు చేసి లాక్‌డౌన్ ప్రకటిస్తే బాగుండేది. కానీ వారిని పూర్తిగా విస్మరించి, ప్రకటించిన నాలుగు గంటల వ్యవధిలోనే లాక్‌డౌన్ ప్రకటించడం వల్ల కోట్లాది మంది వలస పక్షులు విలవిలలాడటం అత్యంత విచారకరం.... కరోనా సంక్షోభ సమయంలో కార్మికుల హక్కులకు భంగం వాటిల్లే విధంగా పారిశ్రామికవేత్తలకు లబ్ధి చేకూరేలా చట్టాలను సవరించడం, పలు ప్రభుత్వ రంగ సంస్థలైన రైల్వేలు, బొగ్గు గనులు, లైఫ్ ఇన్సూరెన్స్, భారత్ సంచార్ నిగం లిమిటెడ్, విశాఖ ఉక్కు లాంటి సంస్థలు, లాభాల బాటలో నడుస్తున్నవి ప్రభుత్వ ఆదాయ వనరులుగా ఉన్న వాటిని అమ్మ చూపడం, ప్రైవేటీకరించేందుకు చట్టాలు చేయడం ఎవరి ప్రయోజనాల కోసం? ప్రభుత్వ రంగ సంస్థలు ప్రభుత్వ వాటాలను అమ్మి వేసేందుకు గాను నీతి ఆయోగ్ ప్రణాళికలు సిద్ధం చేసింది. పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా రు. 2,10,000 కోట్ల మేర నిధులు సేకరిస్తామని ఆర్థిక మంత్రి ప్రకటించడం ఎవరి వికాసం కొరకు? ప్రభుత్వ రంగ ఆస్తులు దేశ ప్రజల ఆస్తులు. అత్యంత కీలకమైన, ప్రతిష్ఠాత్మకమైన ప్రభుత్వ రంగ సంస్థలను తెగనమ్మాలను కోవడం బంగారు బాతు గుడ్లు పెట్టే బాతులను చంపడమే అవుతుంది... కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణలకు పాల్పడుతూ బడా పారిశ్రామిక వేత్తల కోసం, వారి సంక్షేమం కోసం, వారికి కోట్లాది రూపాయల ప్రజల సొమ్మును అప్పనంగా అప్పజెప్పేందుకు పాలక పెద్దలు కృషి చేయడం అమోఘం. మాటలు పేదల అభివృద్ధి గురించి చేతలు కార్పొరేట్ శక్తుల కోసం, వారిని ప్రపంచ కుబేరుల జాబితాలో చేర్చేందుకు పాటుపడటం జరుగుతుంది. గుప్పెడు మంది ప్రభుత్వ అనుకూలురకు, ధనవంతులకు, వారి అభివృద్ధి కోసం ఒక వైపు చర్యలు చేపడుతుంది. మరో వైపు సబ్ కా వికాస్ సబ్ కా సాథ్ అనడం చెవిలో పువ్వు పెట్టడమే కదా...

2) బేటి పడావో భేటీ బచావో... అనే మరో ప్రభుత్వ ప్రతిష్టాత్మక నినాదం అక్టోబర్ 2014లో మనుగడ రక్షణ, సాధికారత నిర్ధారించడానికి ప్రయత్నాలు చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. కనుక భారత ప్రభుత్వం బేటీ బచావో బేటీ పడావో అనగా బాలికను రక్షించు చదివించు పథకంను ప్రవేశపెట్టింది. దేశంలో శిశు లింగ నిష్పత్తి క్షీణిస్తూ ఉంది. ప్రతి వెయ్యి మంది బాలురకు బాలికల సంఖ్య 918 కంటే తక్కువగా కూడా క్షీణిస్తూ వస్తుంది. శిశువు లింగ నిష్పత్తిని మెరుగుపరచడానికి ఈ పథకాన్ని ప్రవేశపెట్టడం జరిగింది. భ్రూణ హత్యల నివారణకు, చదువు మధ్యలో ఆపివేయకుండా బాలికల చదువు కొనసాగించుటకు ఈ పథకం నినాదం ఉద్దేశం. కానీ అమలులో తీవ్ర వ్యత్యాసం ఉంది. దేశంలో దళిత, వెనుకబడిన కులాల పిల్లలు ముఖ్యంగా బాలికలు ఇప్పటికీ లక్షల్లో బడి ముఖం చూడలేకపోతున్నారు. అనేక ప్రణాళికలు, కమిషన్లు, చట్టాలు వచ్చినను పాలకులకు చిత్తశుద్ధి లేని కారణంగా లక్ష్యాన్ని సాధించడంలో ఇంకా సుదూరంగానే ఉన్నాము. గ్రామీణ ప్రాంతాలలో లింగ వివక్షత ఎక్కువగా ఉంది. బాలికలను ఎక్కువగా పనులకు ఉపయోగిస్తూ.. బాలురను కాన్వెంట్‌లకు పంపిస్తున్నారు. బాలికలందరిని ప్రభుత్వ పాఠశాలలకు, పనిలేని సమయాలలో పంపించడం జరుగుతుంది. బాల్య వివాహాలు కూడా ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ కరోనా సంక్షోభ కాలంలో 8, 9 తరగతుల బాలికలకు చాలామందికి వివాహం జరిగింది. పాఠశాలలు నిర్వహించకపోవడం మూలంగా తల్లిదండ్రులు పెళ్లి చేస్తే ఓ బాధ్యత

తీరిపోతుందని భావనతో బాల్య వివాహాలు చేసేసి చేతులు దులుపుకున్నా వైనం ప్రతి పల్లెల్లో కనిపిస్తుంది. గత పదేళ్లలో 3 లక్షలకు పైచిలుకు బడి మధ్యలో మానివేయడం జరిగింది. స్వాతంత్రం వచ్చి 73 సంవత్సరాలు పూర్తయినప్పటికీ 100 శాతం బాలికలు చదువుకు నోచుకోలేకపోవడం బాధాకరం.... అంతేకాకుండా బాలికల రక్షణ కడు దయనీయంగా మారింది. పట్టపగలే బయటికి వెళ్లిన అమ్మాయి లేదా యువతి ఇంటికి తిరిగి వచ్చే వరకు భరోసాలేదు. ప్రతిరోజు ఎంతోమంది అభాగ్య యువతులు మానవ మృగాల చేతిలో బలి అవుతున్నారు. అత్యాచారాలకు గురికాని రోజు ఉండడంలేదు. దేశ రాష్ట్రాల రాజధానులలో అత్యాచారాలు, లైంగిక వేధింపులు జరుగుతున్నా యంటే బాలికల రక్షణ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. 2020లో మహిళలపై పాల్పడిన నేరాలకు సంబంధించి 4.05 లక్షలకు పైగా కేసులు నమోదయ్యాయని నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో వెల్లడిస్తోంది. గతంలో కంటే అత్యాచారాలు 7.3 శాతం పెరిగాయి. ఇలాంటి పరిస్థితులలో బాలికలు ఎక్కువగా ఇంటి పనికి, వ్యవసాయ కూలీలుగా, బాల కార్మికులుగా మారిపోయారు. బాలికల చదువుకు రక్షణకు ప్రభుత్వం మరిన్ని భద్రతా చర్యలు చేపడితేనే బేటి బచావో బేటి పడావో అనే నినాదానికి అర్థం ఉంటుంది.

3) వన్ నేషన్–వన్ మార్కెట్... భారత ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయ రంగం అత్యంత విలువైనది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు నేటికీ ప్రధాన జీవనాధారం వ్యవసాయం. సగానికి పైగా ప్రజలు వ్యవసాయ రంగంలో పనిచేస్తున్నారు. ఆర్థిక సంస్కరణల ప్రభావంతో భారత ఆర్థిక వ్యవస్థ జాతీయాదాయంలో వ్యవసాయరంగం వాటా క్షీణిస్తూ వచ్చింది. వ్యవసాయ రంగంలో ఆధునిక పోకడలు వాణిజ్య పంటల సాగు, రసాయనిక ఎరువుల వాడకం పెరిగింది. నాణ్యమైన విత్తనాల సరఫరాలో లోపభూయిష్టమైన విధానం, రుణాల లభ్యత, కౌలు రైతులు, మహిళా రైతులను రైతులుగా గుర్తించకుండా ప్రభుత్వం అందించే సబ్సిడీలు, రుణమాఫీ పథకాలు వర్తింప చేయకపోవడం వల్ల రైతులు అప్పుల ఊబిలోకి కూరుకుపోయాయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. దీంతో పాలకులు రైతును రాజు చేస్తామని 2022 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని బడ్జెట్ ప్రసంగాలలో తెలపడం.. దానిని నెరవేర్చడానికి వన్ నేషన్ వన్ మార్కెటింగ్ నినాదంతో కేంద్ర ప్రభుత్వం తాజాగా పార్లమెంట్‌లో మూడు బిల్లులు ప్రవేశపెట్టింది. ద ఫార్మర్స్ ప్రొడ్యూస్ ట్రేడ్ అండ్ కామర్స్ బిల్లు 2020, ద ఫార్మర్స్ అగ్రిమెంట్ ఆఫ్ ప్రైస్ అండ్ ఫార్మ్ సర్వీసెస్ బిల్లు 2020, ద ఎసెన్షియల్ కమోడిటీస్ బిల్లు 2020 పేరిట తీసుకువచ్చిన ఈ మూడు బిల్లులు లోక్‌సభలో సులువుగా ఆమోదం పొందడం జరిగింది. మొదటి బిల్లు రైతులు తమ పంటల్ని ఎక్కడైనా విక్రయించుకోవచ్చని కేంద్రం చెబుతోంది. వ్యాపారులతో చేసుకునే ముందస్తు ఒప్పందాలకు చట్టబద్ధత కల్పించడం నిత్యావసర సరుకులు, పప్పు ధాన్యాలు, నూనె గింజల నిల్వలపై ఆంక్షలు తొలగించడం మిగిలిన బిల్లుల ఉద్దేశం. కానీ వాస్తవానికి వ్యవసాయాన్ని కార్పొరేటీకరించేందుకు కనీస మద్దతు ధర నుంచి తప్పుకోవడానికి ఈ చట్టాలు తీసుకువచ్చారని విపక్షాలు ఆరోపిస్తున్నాయి. వీటిని అమలు చేయడం వల్ల మార్కెటింగ్ శాఖకు 60 శాతం ఆదాయం పోతుందని రైతులు కార్పొరేట్ల చేతుల్లో వారి క్షేత్రాలలో కూలీలుగా మారిపోయే ప్రమాదం పొంచి ఉందని వ్యవసాయరంగ నిపుణులు మేధావులు ఆందోళన చెందుతున్నారు. గత నవంబర్ నుంచి ఢిల్లీలో రైతుల నిరసన కార్యక్రమం పెద్ద ఎత్తున జరగడం వల్ల ఈ బిల్లులు వ్యవసాయ రంగాన్ని అధోగతి పాలు చేస్తాయని అర్థం చేసుకోవచ్చు. అందరికీ అన్నం పెట్టే అన్నదాతను ఇక్కట్లపాలు చేస్తూ కొత్త చట్టాల రూపంలో వారి ఉనికినే మనుగడనే కొల్లగొట్టే విధంగా కార్పొరేట్ వ్యవసాయం కొనసాగించేందుకు తహతహలాడుతున్న ప్రభుత్వం, ఈ వ్యవసాయ సాగు చట్టాలకు వ్యతిరేకంగా రైతులు గత 112 రోజులుగా ఉద్యమం చేస్తున్నప్పటికీ పలు దఫాలుగా చర్చలు నామమాత్రంగా జరిపి వాటిని సంవత్సరంన్నర పాటు వాయిదా వేస్తామని మాత్రమే చెబుతూ, ఉద్యమకారులను నయానా, భయానా అణిచివేతకు పాల్పడుతూ రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామనడమంటే రైతుల్ని మరోసారి మోసగించడమే.

4) వన్ నేషన్– వన్ హెల్త్... భారత్‌కు స్వాతంత్రం వచ్చి 73 సంవత్సరాలు పూర్తయినా కూడ అందరికీ ఆరోగ్యం అందని ద్రాక్షగానే మిగిలిపోయింది,. కరోనా మహమ్మారి విజృంభణతో ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వాలు చేపట్టే చర్యల డొల్లతనం బయటపడింది. ప్రభుత్వ ఆసుపత్రులలో సరైన సిబ్బంది, వసతులు డాక్టర్లు లేక ప్రజలు విలవిలలాడుతున్న పరిస్థితులు ఒకవైపు, ప్రైవేటు ఆస్పత్రులలో చికిత్స పేరిట చేస్తున్న దోపిడీని అరికట్టలేని పరిస్థితులలో ప్రభుత్వాలు ఉండటంతో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడలేక చేతులెత్తేయడంతో కోట్లాది మంది ప్రజలు వైరస్ బారిన పడి వేలమంది మరణించడంతో భారత దేశ ఆరోగ్య విధానం వైరస్ ఎదుట వెలవెలబోయింది. ఇటువంటి అనారోగ్యకర పరిస్థితులు ఉండగా వైద్యులను తయారు చేసి వైద్య విధానాన్ని సరళీకరణ గావించడం నిబంధనలు సడలించడం ప్రైవేటీకరణకు ఆజ్యం పోయడం, మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను రద్దుచేసి నూతన జాతీయ మెడికల్ కమిషన్ బిల్లును తీసుకురావడంతో ప్రజారోగ్యానికి ముప్పు వాటిల్లుతుందని వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఒకవైపు ప్రైవేటు రంగాన్ని బలోపేతం చేసే చర్యలు చేపడుతుంది. వన్ నేషన్ వన్ హెల్త్ కార్డు స్కీమ్ ప్రకటించడం కేవలం ఐదు వందల కోట్ల బడ్జెట్ కేటాయింపులు జరిపి దేశంలోని ప్రతి ఒక్క పౌరుడి ఆరోగ్య రికార్డులను డిజిటల్ ఫార్మెట్లో భద్రపరుస్తారు అనడం హాస్యాస్పదం కదా.... సరైన చికిత్స, మందులు, డాక్టర్లు ఉండేవిధంగా ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేయకుండా డిజిటల్ కార్డు వల్ల ఉపయోగం ఏమిటో ప్రభుత్వ పెద్దలకే తెలియాలి.. భారతదేశంలో ప్రజలు సంపాదించిన ఆదాయంలో 65 శాతం ఆరోగ్యానికి ఖర్చు పెడుతున్నారని, ఆ వ్యయాన్ని రాజా తగ్గించుకొనుటకు ప్రభుత్వ రంగంలో వైద్య విధానాన్ని పటిష్ట పరిచేందుకు పోయింది స్థూల జాతీయ ఉత్పత్తిలో రెండు శాతం నిధులు కేటాయించినప్పుడే ఆరోగ్య భారత్ అవతరిస్తుంది గాని వన్ నేషన్ వన్ హెల్త్ కార్డ్ స్కీమ్ కంటితుడుపు చర్యగానే భావించాలి.

5) వన్ నేషన్– వన్ టాక్స్... దేశంలో పలు రకాల పన్నులు ఉన్నాయని దీంతో ఉత్పత్తిదారులు, వినియోగదారులు పెద్దమొత్తంలో పన్నులు చెల్లించడం జరుగుతుంది అనే సాకుతో గత విధానాన్ని రద్దు చేసి గూడ్స్ అండ్ సర్వీస్ టాక్స్ పేరుతో వన్ నేషన్ వన్ టాక్స్ అమలు చేయడం జరుగుతుంది. దీని ద్వారా మేలు జరగడం మాట అటుంచితే వ్యాపారస్తులు రకరకాలుగా ఖాతాలు నిర్వహించాల్సి రావడం, వాటిని నమోదు చేయడానికి ఎంతో వ్యయప్రయాసలతో కూడి ఉండడం, పన్నులు కూడా అధికం కావడం వ్యాపారస్తులు, సామాన్య ప్రజానీకం కూడా అనేక ఇబ్బందులకు గురి అవుతున్నారు. చిరు వ్యాపారులు తమ ఉనికిని కోల్పోయారు. రాష్ట్ర ప్రభుత్వాల ప్రమేయం తగ్గించి పన్నుల విధానం అంతా కేంద్ర ప్రభుత్వం చేతిలో ఉంచుకోవడానికి, సంపద కేంద్రీకృతం చేయడానికే ఈ విధానం అనుగుణంగా ఉంది. కేంద్రం రాష్ట్రాలకు అందించే వాటాను అందించకుండా జాప్యం చేస్తుండడంతో

పలు రాష్ట్ర ప్రభుత్వాలు ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా లేని రాష్ట్రాలు ఆర్థికంగా తీవ్ర ఇక్కట్లకు గురి అవుతున్నాయి. వన్ టాక్స్ వన్ నేషన్ పేరిట కేంద్రం తమ ఆధిపత్య ధోరణిని కొనసాగించడానికి తప్ప గత వ్యవస్థ కంటే నేటి పన్నుల విధానం అమలులో ఉండటం వలన లాభం ఏమిటో అంతు చిక్కడం లేదని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. ఇది పూర్తిగా సమాఖ్య విధానానికి వ్యతిరేకమని, రాష్ట్రాల హక్కులను హరించడమేనని మేధావులు అభిప్రాయపడుతున్నారు.

6) వన్ నేషన్- వన్ గ్రిడ్:.... దేశ ప్రజలకు పారిశ్రామిక అవసరాలకు నిత్యావసర ఉపయోగకరమైన వస్తువుగా విద్యుత్తు మారినందున డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సారథ్యంలో విద్యుత్ పాలసీ 1948 రూపొందింది. భారతదేశం ఫెడరల్ స్వభావం కలిగి ఉన్నందున రాష్ట్రాల పారిశ్రామిక వ్యవసాయ అభివృద్ధికి ప్రజల వినియోగార్థం అందుబాటులో ఉండటానికి తప్పనిసరి అని భావించి ఉమ్మడి జాబితాలో చేర్చారు. దేశ అవసరాలకు అనుగుణంగా ప్రణాళిక బద్ధంగా విద్యుత్ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వేరువేరుగా ఉమ్మడిగా కృషి చేయవచ్చు. అందులో భాగంగానే 2003 విద్యుత్ చట్టంను, 2014లో కొన్ని విద్యుత్ సవరణలను నూతన ఆర్థిక విధానాల వెలుగులో తీసుకురావడం జరిగింది. దీంతో వినియోగదారుల పై తీవ్ర ప్రభావం పడింది. సబ్సిడీలు ఎత్తివేయడం జరిగింది. సమాంతర లైసెన్సింగ్ విధానం తీసుకురావడం జరిగింది. ప్రవేటీకరణ, కార్పొరేటీకరణ ప్రోత్సహించినను ప్రైవేట్ సంస్థలు అంతగా రాణించక పోవడం మూలంగా 2014 ఎన్నికలలో కార్పొరేట్ వర్గాలకు ఇచ్చిన హామీ మేరకు విద్యుత్ సవరణ బిల్లు 2020ను తీసుకురావడం జరిగింది. ఇది సమాఖ్య విధానానికి పూర్తి వ్యతిరేకం. రాష్ట్రాల హక్కులను కాలరాసే విద్యుత్ రంగాన్ని పూర్తిగా కేంద్రీకృతం చేస్తూ కేంద్రం గుప్పిట్లో ఉంచుకోవడానికి బడా కార్పొరేట్ పెత్తందారులకు లాభాలను ఆర్జించి పెట్టేందుకు సవరణలు చేయబూని నూతన విధానాలతో కొత్త చట్టాలు చేయడం ప్రజా వ్యతిరేక చర్యగానే భావించాలి. సామాన్య ప్రజలకు అందుబాటులో లేకుండా వ్యవసాయ రంగంలో ఉచితంగా అందించే విద్యుత్తు నుండి వైదొలగాలని, సామాజిక బాధ్యత నుండి తప్పుకోవాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ఈ సవరణ బిల్లు తీసుకువచ్చి, పారదర్శకత కోసం పేద ప్రజల సౌకర్యార్థం సవరణలు చేయడం జరిగిందని కల్లబొల్లి కబుర్లు చెప్పడం హాస్యాస్పదం....

7) వన్ నేషన్-వన్ ఎడ్యుకేషన్:.... భారత దేశ విద్యా విధానం ఫలితాలు ఇవ్వని ప్రయోగశాలగా మారింది. పరాయిపాలన నుండి నేటి వరకు విద్యా విధానాన్ని అమలు చేసేందుకు 100 కమిషన్లు తీసుకువచ్చినా అందరికీ విద్య అందకుండానే ఉన్నది. కమిషన్లు తీసుకువచ్చినంత ఉత్సాహంగా వాటిని అమలు చేయడంలో చిత్తశుద్ధి లేక ఎక్కడ వేసిన గొంగలి అక్కడే ఉన్నది. పలు రకాల పద్ధతులు:....ఎపెప్, డిపెప్, క్లిప్, క్లాప్, లాప్ లేప్, ఖాళీ ఖరో, సమగ్ర శిక్షాభియాన్, సిసిఇ లాంటి కార్యక్రమాలను అమలు చేయడం మూలంగా అభివృద్ధి మాట అటుంచితే, విద్యా విధానం తిరోగమనంలో పడింది. శాస్త్రీయ విద్యా విధానాన్ని అమలు చేయాలని రాజ్యాంగం చెబుతుంటే విద్యను పూర్తిగా ప్రైవేటు పరం చేసేందుకు, తమ భావజాలానికి అనుగుణంగా చేసేందుకు దేశమంతా ఒకే రకమైన నాణ్యమైన విద్యను అందించేందుకు గాను 34 ఏళ్ల తర్వాత నూతన విద్యా విధానం 2020 నీ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ విద్యా విధానానికి రాజ్యాంగ స్ఫూర్తి లేదు. సమాన విద్య అవకాశాల గురించి, గతంలో కొఠారి కమిషన్ సూచించినట్టు కామన్ స్కూల్ విధానం గురించి, బడ్జెట్ కేటాయింపులు లేకుండా నాణ్యమైన విద్యను అందిస్తామని, వృత్తి విద్యా విధానం అభివృద్ధిలో భాగంగా చలనంలో లేని కుల వృత్తులను ప్రోత్సహించే విధంగా చర్యలు ఉండటం, 100 విదేశీ యూనివర్సిటీలకు అనుమతులు ఇవ్వడం, ఎత్తివేసిన డిటెన్షన్ విధానం తిరిగి ప్రవేశపెట్టడం లాంటి పలు తిరోగమన చర్యలతో కూడిన విద్యా విధానం ఒకే దేశం ఒకే విద్య పేరుతో తీసుకురావడం శాస్త్రీయ విద్య అభివృద్ధిని నిరాకరించడమే అవుతుంది. అదేవిధంగా ఒకే దేశం ఒకే పౌరసత్వం పేరుతో పౌరసత్వ సవరణ 2019, బొగ్గు గనుల ప్రైవేటీకరణ, కార్మిక చట్టాల మార్పులు, రైల్వేల ప్రైవేటీకరణ, వ్యవసాయరంగ చట్టాలు ఎన్నో కీలకమైన అత్యంత ముఖ్యమైన, దేశ భవిష్యత్తుకు ఉపయోగపడే నిర్ణయాలు పార్లమెంట్‌లో సరైన చర్చ జరగకుండానే రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధంగా, సామాన్య ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా వ్యతిరేక చర్యలు తీసుకోవడం విచారకరం. విశ్వమారి నుండి ప్రజలను ఆదుకోవడానికి 20 లక్షల కోట్లతో ఆత్మ నిర్భర్ భారత్ ఉద్దీపన పథకాన్ని తీసుకురావడం జరిగిందని, ఈ ప్యాకేజీ వివరాలు వారం రోజుల పాటు విత్తమంత్రి సవివరంగా తెలియజేసినా, వాస్తవానికి లక్ష కోట్లు కూడా ఖర్చు చేయడం లేదని ఏషియన్ ఇన్ ఫైట్, జపాన్ జనరల్ లాంటి అంతర్జాతీయ పత్రికలలో వార్తలు రావడాన్ని బట్టి చూస్తే ఈ ప్యాకేజీ పేద ప్రజలకు, వలస కార్మికులను ఏ విధంగా ఆదుకుంటుంది అన్న విషయాన్ని అర్థం చేసుకోవచ్చు. ఈ ప్యాకేజీ వల్ల పెద్దగా ఉపయోగం ఏమీ లేదని పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సైతం అభిప్రాయపడటం విధితమే.. ఇంకా స్వచ్ఛ భారత్, మేక్ ఇన్ ఇండియా, స్కిల్ ఇండియా, డిజిటల్ ఇండియా, టిబి హరేగా దేశ్ బచేగా, లాంటి ఎన్నో అందమైన నినాదాలతో భావోద్వేగ పూరిత వ్యాఖ్యలతో, వాక్పటిమతో మసి పూసి మారేడు కాయ చేసి చూపిస్తూ.. ప్రజా సమస్యల పరిష్కారంలో పట్టించుకోకుండా, వలస కార్మికులను, పేద ప్రజలను మరింత అగాథంలోకి నెట్టివేస్తూ కార్పొరేట్ దారులను ప్రపంచ కుబేరుల జాబితాలో ఎగబాకెందుకు అద్వితీయమైన కృషి చేస్తూ... ప్రైవేటీకరణ జోరులో అందమైన నినాదాలు చేస్తూ, అబద్ధాల నీటి మూటలు కడుతూ పేద ప్రజలను మరింత పేదవారిగా మారే విధంగా చర్యలు తీసుకోవడం, సామాన్య ప్రజల అభివృద్ధిని గాలికి వదిలేయడమే అవుతుంది....

(రచయిత టిపిటిఎఫ్ మహబూబాబాద్‌జిల్లా ఉపాధ్యక్షుడు) వీ

ఉప్పు కృష్ణ మృతి

అమరుల బంధుమిత్రుల సంఘం వ్యవస్థాపక సభ్యుడు ఉప్పు కృష్ణ మార్చ్ 7న గుండె పోటుతో మరణించారు. గుంటూరు జిల్లా సత్తెనపల్లికి చెందిన కృష్ణ 'అఖిలభారత ప్రజాప్రతిఘటన వేదిక'లో రాష్ట్రస్థాయి నాయకుడుగా పనిచేశారు. ఉప్పు కృష్ణకు ఇద్దరు కూతుళ్లు. ఒక కొడుకు. కొడుకు పీపుల్స్ వార్ పార్టీలో పనిచేస్తూ ఎన్‌కౌంటర్‌లో మృతిచెందారు. కొడుకు చనిపోయిన కొంతకాలానికి పెద్ద కూతురు ప్రమీల కూడా ఎన్‌కౌంటర్‌లో మరణించారు. అమరుల రక్తసంబంధీకులతో కమిటీ ఏర్పాటు చేసి కన్వీనర్ బాధ్యతలు స్వీకరించారు. అనేక గ్రామాలు తిరిగారు. శవాల స్వాధీనానికి వెళ్లేవారు. ప్రకాశం జిల్లాలో మార్కాపుర్ హాస్పిటల్లో మావోయిస్టు శవాన్ని తెచ్చుకోవడానికి అతని తల్లిదండ్రులతో పాటు వెళ్లిన కృష్ణపై పోలీసులు దాడిచేసి రెండు చేతులు విరగొట్టి చిత్రహింసలకు గురిచేశారు.

మయన్మార్‌లో సైనిక పాలన బీభత్సం

మయన్మార్‌లో సైనిక పాలనకు నిరసనగా పౌర పాలనేర్పడాలంటున్న ప్రజలపై సైన్యం విచ్చలవిడిగా కాల్పులు జరుపుతూ బీభత్సం సృష్టిస్తోందని అంటున్నారు బి. రామకృష్ణ

దాదాపు ఆరు లక్షల ఎనభై వేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం, ఐదున్నర కోట్ల జనాభా ఉన్న దేశం మయన్మార్. 1948 జనవరి 4 నుండి యూనియన్ ఆఫ్ బర్మా (మయన్మార్) స్వతంత్ర దేశంగా కొనసాగుతూ ఉన్నది. ఇక్కడ 135 ప్రత్యేక జాతుల సమూహాలు ప్రభుత్వంచే గుర్తించబడ్డాయి. స్వతంత్ర దేశంగా ప్రకటించబడిన తర్వాత కొంతకాలం తప్పిస్తే ఎక్కువ కాలం సైనిక నియంత్రణలోనే ఉన్నది. 1948కి ముందు ఈ ప్రాంతం బ్రిటిష్, జపాన్‌ల ఆక్రమణలో ఉన్నది.

నోబెల్ శాంతి బహుమతి గ్రహీత ఆంగ్ సాన్ సూకీ తండ్రి ఆంగ్ సాన్ తన విద్యార్థి దశ నుండి బర్మా మయన్మార్‌లోని దురాక్రమణ వలసపాలకుల లైన బ్రిటన్ జపాన్‌లకు వ్యతిరేకంగా పోరాడాడు. ఇతడు బర్మా కమ్యూనిస్టు పార్టీ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి. పీపుల్స్ రెవల్యూషనరీ పార్టీ సహవ్యవస్థాపకుడు. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ఇది సోషలిస్టు పార్టీగా మారింది. బర్మా ఇండిపెండెంట్ ఆర్మీని స్థాపించాడు. ఇది తర్వాత బర్మా నేషనల్ ఆర్మీ గా మారింది. 1944లో బర్మా నేషనల్ ఆర్మీ,కమ్యూనిస్టులు, సోషలిస్టు లతో కూడిన ఐక్య వేదిక యాంటీ ఫాసిస్ట్ ఫ్రీడమ్ లీగ్‌ను ఏర్పాటు చేయడంలో ప్రధాన భూమిక పోషించాడు. ఆంగ్ సాన్ దీని తరపున నే 1947 లో ఏర్పడిన తాత్కాలిక ప్రభుత్వంలో డిప్యూటీ చైర్మన్‌గా ఉన్నాడు.అదే సంవత్సరం ఇతర కేబినేట్ సభ్యులు హత్యకు గురయ్యారు. బర్మా(మయన్మార్)ప్రజల్లో నేటికీ ఆంగ్ సాన్ పట్ల సానుకూలత గౌరవం ఉన్నాయి. అతన్ని ఆధునిక బర్మా నిర్మాత అని బర్మా జాతిపిత అని అంటారు.

1948లో స్వతంత్ర బర్మాకు తొలి ప్రధానిగా యాంటీ ఫాసిస్ట్ ఫ్రీడమ్ లీగ్ కు చెందిన యూన్యు ఎన్నికయ్యాడు. మధ్య మధ్య కొన్ని ఆటంకాలు అవాంతరాలు ఎదురైనప్పటికీ ఇతడు 1962 వరకు ఆ పదవిలో ఉన్నాడు. 1948 నుండి 1962 వరకు కొంతమేరకు పౌర పాలన సాగింది. 1962 లో సైనిక జుంటా ఆక్రమణతో బర్మా సోషలిస్ట్ ప్రోగ్రాం పార్టీ పేరున ఆర్మీ చీఫ్ జనరల్ నేవిన్ నేత్రుత్వంలో ప్రత్యక్ష సైనిక నియంతృత్వ పాలన వచ్చింది. ఇది జాతీయ సమైక్యత పేరుతో జరిగింది. అంతకు ముందు కూడా మిలిటరీ ప్రత్యక్ష పరోక్ష ప్రభావం ప్రభుత్వ పాలన పై ఉంటూనే వస్తున్నది. సైనిక ఆక్రమణను వ్యతిరేకిస్తూ వచ్చిన ప్రజా నిరసనలను అణిచివేయడంలో భాగంగా జూలై 7, 1962న రంగూన్(నేటి యాంగాన్) విశ్వవిద్యాలయ విద్యార్థులు 15 మందిని కాల్చి చంపారు. సైనిక పాలనను వ్యతిరేకిస్తూ నిరంతర ఉద్యమాలు వస్తూనే ఉన్నాయి. 1975,1976,1977లలో పెద్దఎత్తున విద్యార్థుల నాయకత్వంలోని ఆందోళనలు జరిగాయి. అవి తీవ్రమైన అణచివేత కు గురయ్యాయి. 1975 స్టేట్ ప్రొటెక్షన్ చట్టం ప్రకారం ఎవరినైనా సరే విచారణ లేకుండా ఐదు సంవత్సరాలు నిర్బంధించవచ్చు. నేవిన్ నేతృత్వంలోని సైనిక ప్రభుత్వం అన్ని ప్రతిపక్ష పార్టీలను నిషేధించింది. ప్రధానమైన పరిశ్రమలు వ్యాపార రంగాలను భారీగా జాతీయీకరణ చేశారు. వీరి భావజాలం బర్మీయ సోషలిజం గా పిలువబడింది. పేదరికం నిరుద్యోగం రాజకీయ అస్థిరత ఆర్థిక క్షీణత అంతర్గత ఘర్షణలు పెరగడం ప్రపంచంలో ఒంటరిగా మారడం అనేవి సైనిక పాలనలో జరిగాయి. ఆగస్ట్ 1988లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా విద్యార్థుల చొరవతో నాయకత్వంలో పెద్ద ఎత్తున ప్రజా ఆందోళనలు వచ్చాయి. వీటిని సైనిక ప్రభుత్వం ఉక్కుపాదంతో అణచివేసింది.వేలాది మందిని చంపి ఈ ఉద్యమాన్ని రక్తసిక్తం చేశారు. అందులో ఐదు వేల మందిని చంపేశారు. ఈ ఉద్యమాన్ని 8888 ఉద్యమం అని పిలుస్తారు.

విదేశాలలో చదువుకుంటూ ఉద్యోగాలు చేస్తున్న ఆంగ్ సాన్ సూకీ 1988లో బర్మా (మయన్మార్) కు వచ్చింది. నేషనల్ లీగ్ ఫర్ డెమోక్రసీని స్థాపించింది. ఎన్నికలు నిర్వహించాలని, ప్రజాస్వామిక ప్రభుత్వ పాలన కావాలని నేషనల్ లీగ్ ఫర్ డెమోక్రసీ డిమాండ్ చేస్తూ ప్రజలను సమీకరించడం మొదలుపెట్టింది. ఆమెను 1989లో గృహ నిర్భంధంలో ఉంచారు. ఎన్నికలు నిర్వహించాలని దేశవ్యాప్తంగా, అలాగే అంతర్జాతీయంగా వస్తున్న తీవ్రమైన వత్తిళ్ల నేపథ్యంలో 1990లో ఎన్నికలను నిర్వహించారు.

ఈ ఎన్నికల్లో సూకీ నాయకత్వంలోని నేషనల్ లీగ్ ఫర్ డెమోక్రసీ విజయం సాధించింది. అప్పుడు ఆమె వయసు 43 ఏళ్లు. ఆ గెలుపును ప్రభుత్వం నిరాకరించింది. తన కనుసన్నల్లో ఉన్న యునైటెడ్ సాలిడారిటీ డెవలప్‌మెంట్ పార్టీ గెలిచిందని నమ్మబలికింది. మిలిటరీ ప్రభుత్వం (తాత్మడ/సైనిక శక్తి) కొత్త రాజ్యాంగాన్ని తయారు చేసిన తర్వాత ఎన్నికలు నిర్వహించి పౌర ప్రభుత్వానికి అధికారం అప్పగిస్తామని వాగ్దానం చేసింది. కానీ18 ఏళ్ల వరకు ఆ పని చేయకుండా ఇచ్చిన వాగ్దానాన్ని ఉల్లంఘించి మయన్మార్ ప్రజలను మోసం చేసింది. 2008లో మిలిటరీ జుంటా ప్రభుత్వం ఏకపక్షంగా నూతన రాజ్యాంగాన్ని రూపొందించింది. అందులో ఏ ప్రతిపక్ష రాజకీయ పార్టీలకు, ప్రజా సమూహాలకు భాగస్వామ్యం కల్పించలేదు.

ఈ రాజ్యాంగంపై తూతూ మంత్రపు రెఫరెండం నిర్వహించింది. ఇది తీవ్ర వివాదాస్పదంగా మారింది. దాన్ని నేషనల్ లీగ్ ఫర్ డెమోక్రసీ అంగీకరించలేదు. అంతర్జాతీయంగా కూడా ఈ రెఫరెండం సాధికారతను ప్రశ్నించడం జరిగింది. అయినప్పటికీ మిలిటరీ ప్రభుత్వం రాజ్యాంగానికి

విస్తృతమైన ప్రజా మద్దతు, అంగీకారం లభించిందని బుకాయిస్తూ అమల్లో పెట్టారు. నూతన రాజ్యాంగం ప్రకారం జాతీయ స్థానిక పార్లమెంట్‌లో నాలుగో వంతు సీట్లు మిలిటరీ అధికారులకు రిజర్వ్ చేశారు. అంటే మిలిటరీచే నియమించబడతారు. అంతేకాకుండా పౌర ప్రభుత్వం చేసే ఏ రాజ్యాంగ సంస్కరణలనైనా వీటో చేసే అధికారం సైన్యానికి ఉంటుంది. ఇదే రాజ్యాంగం నేటికీ అమలులో ఉన్నది.

దేశాధ్యక్షుడిగా ఎన్నికయ్యే వారికి మిలటరీ అనుభవం ఉండాలి. అలాగే విదేశీయులతో వివాహం గాని, వారి సంతానానికి లేదా వారికి గాని విదేశీ పౌరసత్వం ఉండరాదు. ఆంగ్ సాన్ సూకీ బ్రిటిషీయున్ని పెళ్లి చేసుకున్నది. ఆమె పిల్లలు బ్రిటిష్ వారసత్వాన్ని కలిగి ఉన్నారు. అందువల్ల ఆమె అధ్యక్ష స్థానానికి అనర్హురాలు అవుతుంది. రక్షణ హోం మంత్రిత్వ శాఖలు సరిహద్దు వ్యవహారాలను మిలిటరీ నిర్వహిస్తుంది. ఎన్నికలు నిర్వహింపబడి పౌర ప్రజాస్వామిక ప్రభుత్వం ఏర్పడినా కూడా ఆ ప్రభుత్వానికి అధికారాలు నామమాత్రంగా ఉంటాయి. ఈ రాజ్యాంగాన్ని నేషనల్ లీగ్ ఫర్ డెమోక్రసీ గుర్తించకుండా 2010లో జరిగిన ఎన్నికలను బహిష్కరించింది. యూనియన్ సాలిడారిటీ డెవలప్‌మెంట్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ఇది ఆర్మీ కనుసన్నలలో పనిచేస్తుందని అందరికీ తెలిసిన విషయమే.

2015లో జరిగిన ఎన్నికలలో నేషనల్ లీగ్ ఫర్ డెమోక్రసీ గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఆంగ్ సాన్ సూకీ స్టేట్ కౌన్సిలర్‌గా నియమించబడ్డారు. రాజ్యాంగ నిబంధనల రీత్యా ఆమె దేశ అధ్యక్షురాలు కాలేకపోయింది. గుత్తాధికారం సైన్యం చేతుల్లో ఉన్నది. నామమాత్రపు పాలనా అధికారంతో నేషనల్ లీగ్ ఫర్ డెమోక్రసీ ప్రభుత్వంలో కొనసాగింది. సూకీ అధికారంలో ఉన్న సమయంలో 2017లో సైన్యం మతతత్వాన్ని రెచ్చగొట్టి, రోహింగ్యాలను తుడిచి పెట్టేందుకు మారణ హోమాన్నే సృష్టించారు. ఊళ్లకు ఊళ్లనే తగుల బెట్టారు. వేలాది మందిని ఊచకోత కోశారు. ఇందుకోసం ప్రైవేట్ ముఠాలను ప్రోత్సహించారు. దీని ఫలితంగా ఏడు లక్షల రోహింగ్యాలు బంగ్లాదేశ్‌కు వలస వెళ్లారు. మరెంతో మంది సరిహద్దు దేశాల్లో తలదాచుకుంటున్నారు.

మయన్మార్ సైనిక చర్యను జాతిహనన చర్యగా ఐక్యరాజ్య సమితి పేర్కొన్నది. ఆర్మీ చీఫ్ జనరల్ మిన్ఆంగ్ హ్లాయింగ్ రోహింగ్యాల సమస్యకు వాళ్లే కారణమని, వారి మూలాలు మయన్మార్‌లో లేవని, ఉత్తర రఖైన్ ప్రాంతంలో పెత్తనం కోసం ప్రయత్నిస్తున్న బెంగాలీ చొరబాటుదారులని, అక్కడ మిలిటెంట్లు చేస్తున్న దాడులకు మాత్రమే సైన్యం స్పందిస్తుందని ప్రకటించాడు. రోహింగ్యాలకు అక్కడి చట్టాల ప్రకారం మయన్మార్‌లో పౌరసత్వం లేదు. ఈ వివక్షతకు వ్యతిరేకంగా రోహింగ్యాలు పోరాటం చేస్తున్నారు.

మైనారిటీలైన రోహింగ్యాలపై సైనిక దాడులను అడ్డుకోవడంలో సూకీ విఫలమయ్యారు. రఖైన్ రాష్ట్రంలో రోహింగ్యాలపై జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనలపై సూకీ పెదవి విప్పలేదు. సైన్యంపై స్టేట్ కౌన్సిలర్‌గా సూకీకి నియంత్రణ ఉండదు. అది వేరే విషయం. అంతర్జాతీయ న్యాయస్థానం ముందు రోహింగ్యాలపై జరిగిన ఆర్మీ మారణ హోమానికి పాల్పడిందన్న విషయాన్ని సూకీ ఖండించింది. ఇది ఒక తప్పుడు కేసు అని చెప్పింది. ఈ నేపథ్యంలో ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ప్రధాన కార్యదర్శి సూకీకి లేఖ రాస్తూ అందులో మీరు మానవ హక్కులను పరిరక్షిస్తారని, విశ్వాసానికి, ధైర్యానికి ప్రతీకగా నిలుస్తారనే నమ్మకం మాకు కలగడం లేదు అన్నారు. 2009లో ఇచ్చిన అంబాసిడర్ ఆఫ్ కాన్షైన్స్ అనే గౌరవాన్ని ఆమ్నెస్టీ నవంబర్ 2018లో వెనక్కి తీసుకున్నది. ఈ మచ్చ సూకీని ఎప్పటికీ వెంటాడుతూనే ఉంటుంది.

నవంబర్ 2020లో జరిగిన ఎన్నికల్లో నేషనల్ లీగ్ ఫర్ డెమోక్రసీ భారీ మెజారిటీతో తిరిగి గెలిచింది. సైనిక మద్దతు ఉన్న యూనియన్ సాలిడారిటీ అండ్ డెవలప్‌మెంట్ పార్టీ ఘోర పరాజయం పాలైంది. ఎన్నికల్లో 90 వేలకు పైగా ఓట్ల అవకతవకలు జరిగాయని యూనియన్ సాలిడారిటీ అండ్ డెవలప్‌మెంట్ పార్టీ, అలాగే సైన్యం ఆరోపించింది. ఎన్నికల ఫలితాలను మిలిటరీ జుంటా గుర్తించ నిరాకరించింది. అయితే ఎన్నికల అక్రమాలకు సంబంధించిన సాక్ష్యాధారాలను చూపించలేకపోయారు. ఈ ఆరోపణలను ఎన్నికల కమిషన్, అలాగే అంతర్జాతీయ పరిశీలకులు కూడా కొట్టిపారేశారు. ఆంగ్ సాన్ సూకీతో పాటు ఆమె పార్టీకి చెందిన వారిని అరెస్టు చేశారు.

రాజ్యాంగంలోని ఆర్టికల్ 417 ప్రకారం జాతీయ సమగ్రత ఐక్యతల పరిరక్షణ కోసం దేశంలో ఎమర్జెన్సీని అమలు చేయవచ్చు. తమకు నచ్చని పార్టీ ఎన్నికల్లో విజయం సాధించడానికి జీర్ణం చేసుకోలేని మిలిటరీ కమాండర్ ఇన్ చీఫ్ కుంటిసాకులతో ఎమర్జెన్సీని విధించాడు. లైసెన్స్ లేని వాకి టాకీలను కలిగి ఉన్నారని, మయన్మార్ ప్రకృతి విపత్తు చట్టాన్ని ఎన్నికల ప్రచారంలో కోవిడ్-19 ఆంక్షలను ఉల్లంఘించారని, ప్రజల్లో భయాందోళనలకు కారణమయ్యారని చెబుతూ వారిని అరెస్టు చేశారు.

ఒక వ్యాపారవేత్త తన ప్రయోజనాలు నెరవేర్చుకోవడం కోసం ఐదు లక్షల యాభై వేల డాలర్లు ఇచ్చాడని చెప్పాడు అనేకంటే చెప్పించారు అంటే సరిపోతుంది. రెండోసారి అధికారంలోకి రాబోతున్న నేషనల్ లీగ్ ఫర్ డెమోక్రసీ భవిష్యత్తులో సైనిక అధికారాలను తగ్గించే చర్యలు తీసుకుంటారేమోనన్నది సైనిక అధికారులను ఆందోళనకు గురి చేస్తున్నది. సైన్యం అధికారాన్ని మరింత పటిష్టం చేసుకోవడానికి ఎమర్జెన్సీని ప్రకటించారు.

మయన్మార్‌లో 1962 నుండి 2015 వరకు మధ్య మధ్యలో ఎన్నికలు నిర్వహించడం, వాటిని గుర్తించ నిరాకరించడం వంటివి జరిగినా మొత్తంగా ప్రత్యక్ష సైనిక పరిపాలన జరిగింది. ఆపై 2015 నుండి 2020 వరకు నామ మాత్రపు పౌరపాలన తప్పిస్తే దాదాపు సైనిక పాలనే కొనసాగింది. 2020 ఫిబ్రవరి 1 నుండి ఎమర్జెన్సీని విధించి మిలిటరీ కమాండర్ ఇన్ చీఫ్ మిన్ అంగ్ హ్లాయింగ్ మళ్లీ అధికారాన్ని చేతుల్లోకి తీసుకున్నాడు. దేశంలోని అన్ని రకాల మౌలిక వనరులపై సైనికాధికారులకే అధికారం ఉన్నది. దానిని వదులుకోవడానికి వారు సిద్ధంగా లేరు. తద్వారా నిర్బంధపూరిత పాలన కొనసాగిస్తూ పౌర ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తున్నారు.

ఎమర్జెన్సీని నిరసిస్తూ సూకీ, ఆమె సహచరులను విడుదల చేయాలని, పౌర పాలన జరగాలని సైనిక పాలనకు వ్యతిరేకంగా సివిల్ డిస్ఒబిడియన్స్ మూమెంట్ (సిడిఎం) పెద్ద ఎత్తున మయన్మార్‌లో జరుగుతున్నది. మయన్మార్‌లోని ప్రధాన పట్టణాలలో, వీథుల్లో రోడ్లపై

నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి. ప్రజాస్వామ్యాన్ని, పౌర ప్రజాస్వామిక హక్కులను పరిరక్షించాలని విద్యార్థులు, యువత, ప్రజానీకం నిరసన పోరాటాలలో సమీకృతం అవుతున్నారు.

నిరసనకారులపై విచ్చలవిడిగా హింసను, బలప్రయోగాన్ని ఉపయోగిస్తున్నారు. నిరాయుధులైన ప్రజలపై గురిచూసి కాల్చడం, విచక్షణారహితంగా భౌతిక దాడులు చేయడం జరుగుతున్నది. కంచే చేను మేసినట్లుగా ప్రజలను రక్షంచాల్సినవారే వారిని పొట్టన పెట్టుకుంటున్నారు. నిరసనకారులను చెదరగొట్టడం కోసం కాకుండా గురిచూసి కాల్చడం జరుగుతున్నది. అంటే నేరుగా చంపడానికి తుపాకులను వినియోగిస్తూ ఉండడం వంటివి పాశవికమైనవి. సమాచార మాధ్యమాలను నిషేధించారు. ఇంటర్నెట్ మొబైల్ డేటాను కట్ చేశారు. దేశవ్యాప్తంగా 4 టెలికాం సంస్థల సర్వీసులను నిలిపివేశారు. కేవలం మిలిటరీ టీవి మాత్రమే పనిచేస్తున్నది.

చనిపోయిన వారి శరీరాలను కుటుంబీకులు తీసుకోకుండా అడ్డుకుంటున్నారు. నిరసన ఉద్యమాలపై రక్తసిక్త అణచివేతను అమలు చేస్తున్నారు. ఇప్పటివరకు దాదాపుగా మూడు వందల మంది చంపి వేయబడ్డారు. మూడు వేలకు పైగా అరెస్టు చేయబడ్డారు. రెండు వేలకు పైగా కనిపించడం లేదు. గాయాలైన వారికి చికిత్స చేయకుండా పోలీసులు అడ్డుకుంటున్నారు. శాంతియుత నిరసన ప్రదర్శనలపై నేరుగా కాల్చడం, టియర్ గ్యాస్ వదలడం, ఇళ్లపై రాత్రిపూట దాడులు, అక్రమ అరెస్టులు చేయడం మామూలు విషయంగా మారింది. మౌర్య విశ్వవిద్యాలయంపై దాడులు చేసి లెక్చరర్లను, విద్యార్థులను అరెస్టు చేశారు. నిరసనలో ముఖ్యమైన శక్తిగా నిలుస్తున్న విద్యార్థులను మిలిటరీ టార్గెట్ చేస్తున్నది.

సైన్యం ఐదు యూనివర్సిటీలలో, ఆసుపత్రులలో సైనిక క్యాంపులను ఏర్పాటు చేసింది. నిరసనకారులను పోలీసుల నుండి రక్షించడానికి రోడ్డును నిలిపివేసిన వ్యక్తి గొంతులో తుపాకులతో కాల్చగా చనిపోయాడు. ఊరేగింపుగా వేలాదిగా వస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులపై పోలీసులు కాల్పులు జరపగా ఎంతో మంది చనిపోయారు. కొందరు నిరసనకారుల తలలోకి తుపాకీ గుళ్లు దూసుకుపోయాయి. కొందరు నిరసనకారులు అయితే ఆందోళనలో పాల్గొనడానికి వెళ్లే ముందు తాము చనిపోతే తమ శరీర అవయవాలను దానం చేయవలసిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు.

గాయాలపాలైన వారిని సైనిక ట్రక్కుల్లో కుప్పలుగా విసిరేయడం, అందిన వారిని అందినట్లుగా కొట్టడం, తన్నడం, తొక్కడం చేస్తూ అమానవీయంగా ప్రవర్తిస్తున్నారు. సివిల్ డిస్ఓబిడియన్స్ మూమెంట్ (సిడిఎం) లో భాగంగా ఆరోగ్య సంరక్షణ రంగం మిలిటరీ, జుంటాకు వ్యతిరేకంగా చురుగ్గా పాల్గొంటున్నది. జర్నలిస్టులను నిర్బంధిస్తున్నారు. ఆందోళనకారులు శాంతియుత నిరసన పద్ధతుల్లో తమ వ్యతిరేకతను ప్రదర్శిస్తున్నారు. రోహింగ్యా ముస్లింలు ఇతర మైనారిటీలపై దమననీతిని ప్రశ్నిస్తున్నారు. నిరసనకారులు కొందరు చైనా వ్యాపార సంస్థలపై దాడులు చేశారు. మయన్మార్ సైనిక పాలనకు చైనా మద్దతుగానే ఉన్నది తప్పితే పౌర పాలనకు మద్దతు ఇవ్వడం లేదు.

మయన్మార్‌లో పెట్టుబడులు పెట్టినా చైనా, రష్యా తదితర దేశాలు ఆర్మీ పాలనను చూసీచూడనట్లుగా పోతున్నాయి. చైనా, రష్యా దేశాల్లో ప్రస్తుత దేశ అధ్యక్షులు తమ జీవితకాలమంతా లేదా సుదీర్ఘ కాలం పాటు ఆ స్థానంలో ఉండేలా రాజ్యాంగాలను మార్చి వేశారు. ప్రపంచ వ్యాప్తంగా సామ్రాజ్యవాద పెట్టుబడిదారీ శక్తులు తమ పెట్టుబడులకు లాభాలు, రక్షణ రాబట్టుకోవడం కోసం ఏమైనా చేస్తాయి. వారికి ప్రజాస్వామ్యం, పౌరహక్కులు వారి దేశంలోని అలాగే ఇతర దేశాల్లోని పేద ప్రజల జీవిత భద్రతలు కనీస న్యాయమైన బతుకులు పట్టవు.

మయన్మార్ భద్రతా సిబ్బంది పోలీసులు కొంతమంది సైనిక చర్యలను భరించలేక, వాటిని ఆచరణలో పెట్టలేక, తమ సొంత ప్రజలపై దాడులు కాల్పులు చేయలేక తమ దేశాన్ని విడిచి పొరుగు దేశాలకు వలస వెళ్లి తలదాచుకుంటున్నారు. భారత ఈశాన్య రాష్ట్రాలు మిజోరం, మణిపూర్‌లకు శరణార్థులుగా తరలివస్తున్నారు.

ఏ దేశ చరిత్ర చూసినా ఏమున్నది గర్వ కారణం నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం అన్న శ్రీశ్రీ మాటలు ప్రపంచవ్యాప్తంగా అనేక ప్రాంతాలకు ఎంతగా వర్తిస్తాయో అన్న దానిని మయన్మార్‌లో ఆరు దశాబ్దాలుగా కొనసాగుతున్న సైనిక నియంతృత్వం స్పష్టం చేస్తున్నది. మయన్మార్ ప్రజలు అభద్రతలో కనీస హక్కులు లేకుండా సంఘర్షణలో జీవితాలను నెట్టుకొస్తున్నారు.

ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లోని పాలకపక్షం కార్పొరేట్ పెట్టుబడిదారుల, ఆధిపత్య సంపన్న వర్గాల ప్రయోజనం కోసం అశేష సాధారణ ప్రజల ప్రయోజనాలను ఫణంగా పెడుతున్నారు. అశేష ప్రజానీక పోరాటాల ఫలితంగా మయన్మార్‌లో సైనిక నియంతృత్వ పాలన స్థానంలో పౌర ప్రభుత్వం వచ్చినప్పటికీ అది సామాన్య ప్రజల ఆకాంక్షల మేరకు వారి అవసరాలను తీర్చడానికి పనిచేస్తుందా లేక కార్పొరేట్ శక్తుల పంచన చేరి వారి ప్రయోజనాలను నెరవేర్చడానికి పరికరంగా మారుతుందా అనేది కాలమే నిర్ణయిస్తుంది.

(రచయిత ఉపాధ్యాయులు) వీ

పురందర్ మృతి

రాడికల్ యువజన సంఘం నాయకుడు పురంధర్(75) మృతి చెందారు. ఆయన గత కొంత కాలంగా గుండెకు సంబంధించిన సమస్యతో బాధపడుతూ మార్చ్ 11న నెల్లూరులో మృతిచెందారు. రాడికల్ యువజన సంఘం ఖమ్మం మహాసభల్లో కోశాధికారిగా ఎన్నికయ్యారు. 1983 కరీంనగర్ రైతుకూలీసంఘం మహాసభల్లో వాలంటీర్ల బృందానికి నాయకుడుగా పనిచేశారు. పురందర్ నెల్లూరులో ప్రజా ఉద్యమాల కార్యకర్తలకూ సానుభూతిపరులకూ అందరికీ పెద్దదిక్కు. 1980లు, 1990ల మధ్య దాకా పురందర్ కుటుంబ సభ్యులతో నెల్లూరులో ప్రతి జూలై 4న జరిగే కూటాలమర్రి అమరవీరుల సంస్మరణ సభలో పాల్గొనేవారు. విప్లవోద్యమ సానుభూతిపరుడిగా జిల్లా వాసులకు సుపరిచితుడు. గతంలో జిల్లాలో జరిగిన పలు ఉద్యమాల్లో ఆయన కీలక పాత్ర పోషించారు.

నేపాల్‌లో భారత విస్తరణవాదం - ఇటీవలి పరిణామాలు

వీక్షణం సంపాదకీయ వ్యాఖ్యలో నేపాల్ గురించి చేసిన వ్యాఖ్యకు స్పందనగా నేపాల్ - భారత సంబంధాల గురించి చర్చిస్తున్నారు **యస్ కృష్ణమూర్తి**

'నేపాల్‌లో మళ్లీ అనిశ్చితి' ఏర్పడినమాట నిజమే. అయితే ఆ శీర్షికతో ఉన్న 'వీక్షణం' ఫిబ్రవరి (2021) సంపాదకీయ వ్యాఖ్యలో వాస్తవాలను తలక్రిందులు చేశారు. ఫలితంగా అది అపసవ్య విశ్లేషణకు, తప్పుడు నిర్ధారణలకు దారితీసింది. నేపాల్‌పై భారత విస్తరణవాదం ఈనాటిది కాదు. 1950 అసమాన ఒడంబడికను నేపాల్‌పై రుద్దిననాటినుంచీ ఉన్నది. ఇటీవలి కాలంలో మళ్లీ విజృంభించింది. పై వ్యాఖ్య క్లుప్తమైనది, పరిమితమైనది అని గుర్తిస్తూనే దానికి సంబంధించిన కొన్ని వాస్తవాల ప్రస్తావనే ప్రస్తుత వ్యాస లక్ష్యం.

నేపాల్, శ్రీలంకలలో బిజెపి ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తామని, దానికి ముందు కనీసం బిజెపి పార్టీని అక్కడ స్థాపిస్తామని హోంమంత్రి అమిత్ షా చెప్పారన్న ఒక వార్త ఫిబ్రవరి14న మీడియాలో విస్తృతంగా కన్పించింది. బిజెపికి చెందిన త్రిపుర ముఖ్యమంత్రి విప్లవ్ దేవ్ ఈ మాట 13న స్వయంగా ఒక బహిరంగ సమావేశంలో చెప్పారు. త్రిపురలో జరిగిన బిజెపి నాయకుల ఒక సమావేశంలో ఈశాన్య భారత బిజెపి కార్యదర్శి అజయ్ జిమ్వాలుకి సమాధానంగా అమిత్ షా 2018లో ఆ మాట అన్నారని, ఆయన అంత సామర్థ్యమూ కలవాడేనని విప్లవ్‌దేవ్ అన్నారు (వైర్, 14-2-2021). మోదీ ప్రభుత్వ అనుకూల రిపబ్లిక్ వరల్డ్.కామ్ కూడా – అమిత్ షాని ఉటంకిస్తూ విప్లవ్‌దేవ్ అలా అన్నారని – ఈ వార్తని 15న ప్రచురించింది. అభ్యంతరకరమైన ఈ మాటల పట్ల ఆందోళన వ్యక్తంచేస్తూ, నేపాల్ రాయబారి నీలాంబర్ ఆచార్య భారత విదేశాంగశాఖ అధికారితో 16న మాట్లాడారని 'టైమ్స్' 17న పిటిఐ వార్తను రిపోర్టు చేసింది. శ్రీలంక ఎన్నికల నిబంధనలను పేర్కొంటూ అది సాధ్యంకానిపని అని ఆ దేశ ఎన్నికల కమిషనర్ ప్రకటించారు. నేపాల్ విదేశాంగమంత్రి ప్రదీప్ గ్యావలి కూడా అభ్యంతరం తెలిపామని చెప్పారు.

సాధ్యాసాధ్యాల మాట ఎలా ఉన్నా భారత విస్తరణవాదతత్వం ఎంతదూరం పోతున్నదో ఈ ఉదంతం స్పష్టం చేస్తున్నది. అనేక దేశాల్లో భారతీయ సంతతివారి రాజకీయ ప్రాబల్యం గురించి ఈమధ్య అనేక వార్తలు వెలువడ్డాయి. దక్షిణాసియా దేశాలన్నిటా భారత ప్రభుత్వ జోక్యందారీ విధానాలు విజ్ఞులకు తెలిసినవే. ఈ విధానాలు అగ్రరాజ్యాల-ప్రస్తుతం ప్రధానంగా అమెరికా-ప్రోద్బల సహకారాలతో అమలవుతున్నాయి. ట్రంప్ నేతృత్వంలోని అమెరికా అనుసరించిన చైనా వ్యతిరేక 'ఆసియా-పసిఫిక్ వ్యూహాన్ని' కొత్త అధ్యక్షుడు బైడెన్ కొనసాగిస్తారని ఇప్పటికే గట్టి సూచనలు వెలువడినాయి. ఈ వ్యూహంలో భాగంగానే, నేపాల్‌లో భారత జోక్యం, అక్కడి ప్రభుత్వ పతనానికై ప్రయత్నాలు గత ఏడాదిగా పుంజుకున్నాయి. అందులో భాగంగా అక్కడి పాలక కమ్యూనిస్టు పార్టీలోని విభేదాలను వాడుకొని ఆ పార్టీని చీల్చడానికి ప్రయత్నాలు సాగుతూవచ్చాయి.

ఈ వ్యూహం విషయాన్ని (ఫిబ్రవరి సంచికలోనే) మరో వ్యాసంలో రచయిత నర్సింహారెడ్డిగారే పేర్కొన్నారు. కానీ నేపాల్‌లో ఆ వ్యూహం ఎలా అమలుచేస్తున్నారో విస్మరించారు. దీనికి సంబంధించి నేపాల్ మీడియాలో అనేకానేక రిపోర్టులు వచ్చాయి. భారతీయ మీడియాలో కూడా రిపోర్టయినాయి. వాటిని విస్మరించి, 'నేపాల్ జాత్యహంకారం' అంటూ నిందించారు. మావోయిస్టు పార్టీలో గతంలో భట్టారాయ్ చీలిక వలెనే, మరికొన్ని చీలికలు-తాజాగా ప్రచండ-ఓలి వర్గాల చీలిక-భారత ప్రమేయంతో సాగుతున్నాయి. దాన్ని 'ప్రజాస్వామ్య ఉద్యమంలో సంక్షోభం' అంటూ, భారత విస్తరణవాదాన్ని పూర్తిగా విస్మరించారు. 'బూర్జువా ప్రజాస్వామ్య పార్లమెంట్ వ్యవస్థ' సామ్రాజ్యవాద వ్యూహంలో భాగంగానే అమలు చేయబడుతున్నదన్న స్పృహ లేకుండా, పై వ్యూహాన్ని విస్మరించి రాశారు. అమెరికా-భారత్‌ల వ్యూహాలకు నేపాల్ క్రీడాస్థలిగా మారిందని అక్కడి రాజకీయ శక్తులు, పార్టీలు, నాయకులు, మీడియా ఆవేదన వ్యక్తం చేస్తుండగా, దాన్ని విస్మరించి 'నేపాల్‌ను భారత-చైనా ప్రచ్ఛన్నయుద్ధ రంగస్థలిగా' ఓలి మార్చారని హ్రస్వదృష్టితో రాశారు.

'ఓలి జిత్తుల మారి, అవకాశవాది. తాను పదవిలో కొనసాగడానికి జాత్యహంకారాన్ని రెచ్చగొట్టారు.'... 'భారత భూభాగాలైన లిపులేఖ్, కాలాపానీ, లింపియదురలను నేపాల్ భౌగోళిక పటంలో చూపుతూ, ఆ పటాన్ని ఆదరాబాదరాగా పార్లమెంట్‌లో ఆమోదింప జేసుకున్నాడు. భారతదేశానికి చిరకాల మిత్రపార్టీ నేపాలీ కాంగ్రెస్ కూడా ఎక్కడ జాతీయభావం గాయపడుతుందోనన్న భయంతో ఆ పటానికి ఓటు వేసింది.' సంపాదకీయంలోని పై వాక్యాలు వాస్తవాలను తలక్రిందులు చేసి చూపెడుతున్నాయి.

మోదీ ప్రభుత్వం 2019 ఆగస్టులో జమ్మూ-కశ్మీర్‌ని రెండుగా విడగొట్టి, 370 రాజ్యాంగసవరణ చేసి, కశ్మీర్‌ని మరింత కల్లోలంలోకి నెట్టిందనేది బాగా తెలిసిన విషయమే. అయితే ఆ చర్య భారత విదేశీ సంబంధాల్లో, సరిహద్దులవెంట మరింత అశాంతిని కూడా రగిలించిందన్నది అంతగా గుర్తించబడలేదు. చైనాతో, నేపాల్‌తో భారత సంబంధాలు మరోసారి బెడిసికొట్టడానికి దారితీసిన చర్య అది. పాక్ ఆక్రమిత కశ్మీర్ భారత భూభాగమే అని చెప్పుకుంటూ మోదీ ప్రభుత్వం కొత్తగా సరిహద్దు పటాలను విడుదలచేసింది. అందులో చైనాతో 'వివాదాస్పద భూభాగంగా' భారత ప్రభుత్వం కూడా గుర్తించి, 'చర్చల ద్వారా శాంతి యుతంగా పరిష్కరించు కోవాల'ని పరిగణించబడుతున్న అక్సాయిచిన్‌ని కూడా చేర్చారు. చైనాతో 'వాస్తవాధీన రేఖ' వెంట ఇటీవలి

అశాంతికి మూలకారణం అదే.

ఈ వరుసలోనే చైనా సరిహద్దులవెంట యుద్ధ సన్నాహాలను, దానికై మౌలిక వసతులను కూడా పటిష్టం చేసుకునే ప్రయత్నం భారత ప్రభుత్వం చేపట్టింది. ఈ క్రమంలో నేపాల్-భారత సరిహద్దుని ఏకపక్షంగా ఏమార్చిన పటాన్ని కూడా భారత్ నవంబర్ 2019లో విడుదల చేసింది. దానికి నేపాల్ అభ్యంతరపెట్టినా ఖాతరు చేయలేదు. కాగా, ఈ చర్యల పరంపరగానే 2020, మే 8నాడు ఒక 'లింకురోడ్డు' ప్రారంభోత్సవాన్ని అట్టహాసంగా నిర్వహించింది. రక్షణమంత్రి రాజనాథ్ సింగ్ ఆధ్వర్యంలో అది జరిగింది. ఉత్తరాఖండ్‌లోని ధరూచా నుంచి టిబెట్ వైపుగావున్న ఆ రోడ్డు నేపాల్ కాలాపానీ ప్రాంతంలోని లిపులేఖ్ కనుమద్వారా వెళ్తుంది. ఈ ఘనకార్యాన్ని చాటిచెప్తూ భారత ప్రభుత్వం ఈ ప్రాంతపు మ్యాపులను కూడా మార్చి, ఏమార్చి ప్రకటించింది. ఈ విషయంపై నేపాల్ అధికారికంగా నిరసన తెలిపింది. చర్చల ద్వారా ఈ సరిహద్దు వివాదాన్ని పరిష్కరించు కోటానికి సిద్ధంగా ఉన్నామని భారత్ తెలియజేసింది. విదేశాంగశాఖ ప్రతినిధి అనురాగ్ శ్రీవాస్తవ ఆమేరకు ప్రకటనలు చేశారు. కానీ కరోనా మహమ్మారి సాకుతో ఆ చర్చలని ఎత్తేశారు. చర్చలకు అడ్డుగా వచ్చిన కరోనా వివాదాస్పద రోడ్డు ప్రారంభానికి అడ్డురాలేదా అని నేపాల్ విదేశాంగ మంత్రి గట్టిగా ప్రశ్నించారు. (హిందూ, మే9,2020).

కనీసం తమకు తెలియజేయకుండా ఈ రోడ్డుని నిర్మించడం, మ్యాపులను మార్చడం 'ఏకపక్ష చర్య' అని నేపాల్ అధికారికంగా నిరసన తెలిపింది. మే 11నాడు భారత రాయబారిని పిలిచి, నేపాల్ విదేశాంగ మంత్రి ప్రదీప్ గ్యావలి నిరసన పత్రాన్ని అందజేశారు. ఈ విషయంలో భారత ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ నేపాల్ పత్రికలన్నీ విస్తారంగా వ్యాఖ్యలు, రిపోర్టులు ప్రచురించాయి. ఆ రోడ్డు భారత భూభాగంలోనే ఉందని చెప్తూనే, ఇక్కడ సరిహద్దు వివాదాన్ని పరిష్కరించుకోటానికి సిద్ధంగా ఉన్నామని, 'ప్రపంచవ్యాప్తమైన' కరోనా మహమ్మారిని ఎదుర్కొన్నాక, చర్చలు జరుపుతామని భారత్ ప్రకటించింది. ఆ చర్చలు నేటికీ ప్రారంభం కాలేదు.

ఇదంతా 'జిత్తులమారి ఓలీ' కొత్తగా లేవనెత్తినదికాదు. ఇది ఇప్పటి వివాదమూ కాదు. ప్రధానిగా తొలిసారి ఎన్నికైన తొలి రోజుల్లోనే మోదీ నేపాల్‌కి వెళ్లి, స్నేహహస్తం చాచారని; ఆ సందర్భంగా 2014 ఆగస్టు 4 నాటి సంయుక్త ప్రకటనలో భారత-నేపాల్ సరిహద్దు వివాదాన్ని 'శాశ్వతంగా' పరిష్కరించుకోవలసిన అవసరాన్ని నొక్కిచెప్పారనీ ఉటంకిస్తూ నేపాల్ గుర్తు చేసింది. దానికై 'బౌండరీ వర్కింగ్ గ్రూప్'(బిడబ్లుజి) ఏర్పాటుని కూడా ఆ ప్రకటనలో హర్షించారు. కాలాపానీ తదితర వివాదాస్పద ప్రాంతాలని విస్పష్టంగా పేర్కొంటూ, 'సరిహద్దు పిల్లర్స్' పునరుద్ధరణ, రిపేరువంటి వివరాలను కూడా ప్రస్తావించారు. (సంయుక్త ప్రకటనలోని 12వ పాయింటులో).

అయితే, 2014 నుంచి నేటివరకూ ఆ చర్చలని భారత్ జరుపలేదు. ఇప్పుడు కరోనా సాకుని చూపెడుతున్నది. కాగా, వివాదాస్పద ప్రాంతాలను భారత భూభాగంగా చూపెట్టే కొత్త మ్యాపుల విడుదల; ఆ భూభాగంలో నుంచి కొత్తగా సరిహద్దు రోడ్డు విస్తరణ, మే 2020లో ప్రారంభోత్సవం-ఈ పరిణామాలు నేపాల్‌తో కూడా సరిహద్దు వివాదానికి ఆజ్యం పోసాయి.

నేపాలీ కాంగ్రెస్ 'కూడా' ఎక్కడ నేపాల్ జాతీయ మనోభావం గాయపడుతుందోనని, ఓలీ ప్రభుత్వం కొత్తగా విడుదల చేసిన మ్యాపుకి ఓటు వేసింది-అని సంపాదకీయ వ్యాఖ్యలో రాశారు. కానీ వాస్తవాలు పూర్తిగా వేరుగా ఉన్నాయి.

నేపాలీ కాంగ్రెస్‌కి చెందిన ప్రధాని గిరిజాప్రసాద్ కోయిరాలాతో భారత ప్రధాని వాజపాయి 2000 జూలైలో చర్చలు జరిపారు. కాలాపానీ ప్రాంతాన్ని విస్పష్టంగా (డీమార్కేట్ చేసి) గుర్తించడానికి 'జాయింట్ బౌండరీ కమిటీ'ని (జెబిసి) ఏర్పాటు చేసారు.

వాజపాయి చర్చల సందర్భంగా ఆప్రాంతపు సవివరమైన 'స్ట్రిప్' మ్యాపులతో రిపోర్టులను తయారుచేయాలని కూడా నిర్ణయించారు. అయితే ఆ ప్రాంతంలో ఉన్న భారత సైన్యాలను ఉపసంహరించు కోవాలన్న నేపాల్ డిమాండ్‌ని భారత ప్రభుత్వం తోసిపుచ్చింది. అప్పటి నుంచీ నేపాలీ కాంగ్రెస్ ప్రభుత్వాలు పట్టుపడుతూ వచ్చినా, ఆ చర్చలు కార్యరూపం దాల్చలేదు. సరికదా అసలుకే మోసం జరిగి, నేపాల్‌లో అధికారిక పత్రాలు గల్లంతైనాయి. మోదీ 2014 నేపాల్ పర్యటన తర్వాత, 2016లో భారత-నేపాల్ సంబంధాల సమీక్షకోసం నేపాల్ ఇపిజి (ఎమినెంట్ పర్సన్స్ గ్రూప్) సమావేశంలో ఈ విషయం బయటపడింది. 1950 ఒడంబడికను సమీక్షించాలని కూర్చున్న ఆ బృందానికి దాని అధికారిక, ఒరిజినల్ డాక్యుమెంట్ కనపడలేదు. నేపాలీ కాంగ్రెస్‌కు చెందిన మాజీ విదేశాంగ మంత్రి నారాయణ్ ఖడ్కా దీన్ని పార్లమెంట్‌లో లేవనెత్తారు. పార్లమెంటరీ కమిటీ దర్యాప్తులో (జూలై 22, 2016) ఆ పత్రంతో పాటు, బ్రిటిష్ కాలంనాటి సుగౌలీ ఒడంబడిక (1815-16) ఒరిజినల్ కాపీకూడా 'దేశంలోపల ఎక్కడా' లేవని సమగ్ర గాలింపులో నిర్ధారణైంది. ఈ పత్రాలు దేశందాటి 'బయటికి వెళ్లిపోయాయని' పలువురు నిపుణులు వ్యాఖ్యానించారు. 1950 ఒడంబడిక ఒరిజినల్ ఇండియాలోనూ, సుగౌలీ ఒడంబడిక ఒరిజినల్ లండన్‌లోనూ ఉన్నాయని సంబంధిత కమిటీ నిపుణుడు పవిత్ర నిరౌలా చెప్పారని ఖాట్మండూ పోస్టు (2019 ఆగస్టు 13) రిపోర్టు చేసింది. అంతేకాక, 103 'బోర్డర్ పిల్లర్లు' (బంకే, బర్దియా జిల్లాల్లో) కన్పించకుండా పోయాయని మరో నేపాలీ పత్రిక (20-11-2019) పేర్కొంది. ఈ రెండూ ఉత్తరప్రదేశ్‌కి ఆనుకొని ఉండే జిల్లాలు అని గమనించాలి.

నేపాల్ రాజు అధికారిక భవనంలో ఈ ఒరిజినల్స్ అన్నీ ఉండేవని తనకు కచ్చితంగా తెల్సునని రాజరికానికి సన్నిహితుడైన మాజీ రాయబారి థాపా చెప్పారు. నేపాల్ విదేశీ వ్యవహారాలు 1950 అసమాన ఒడంబడిక ప్రకారం భారత్ అజమాయిషీలో ఉండేవని గుర్తించాలి. నేపాల్ రాజు బీరేంద్ర, రాణి ఐశ్వర్యతో సహా రాజవంశంలోని 9 మంది(2001 జూన్‌లో) హత్య చేయబడిన తర్వాత కాలంలోని అస్థిరత సమయంలో అవి కనపడకుండా పోయాయని ఆయన చెప్పారు. ఆ హత్యాకాండ వెనుక భారత ప్రభుత్వ హస్తం ఉందని నేపాల్‌లో ఆరోపణలు వెల్లువెత్తాయి. దానితోపాటు నేపాల్ కమ్యూనిస్టు వ్యవస్థాపక నాయకుడు మదన్ భండారీ హత్య (1993) వెనుక కూడా ఢిల్లీ హస్తం ఉందని మావోయిస్టు నాయకుడు ప్రచండ (2010 జనవరి 10), వారి పత్రిక 'జనదిశ'లో ఆరోపించారు. బీరేంద్ర, భండారీ ఇరువురూ నేపాల్ సార్వభౌమత్వ పరిరక్షణకై భారత్‌ను వ్యతిరేకించినందున, చైనా నుంచి ఆయుధాలు కొనాలని రాజు బీరేంద్ర నిర్ణయించినందున ఈ హత్యలు

జరిగాయని ప్రచండ ఆరోపించారు. (హిందుస్తాన్ టైమ్స్ 2010 జనవరి 10).

ఈ వ్యవహారమంతా నేపాల్ సుప్రీంకోర్టు ముందుకి కూడా వెళ్లింది. నేపాల్ సార్వభౌమత్వ పరిరక్షణకై రాజకీయ, దౌత్య చర్యలు ప్రారంభించమని ఆదేశించాలని కోర్టుని పిల్‌లో కోరారు. కాలాపానీ సరిహద్దు మ్యాపుని 15 రోజుల్లోగా తమ ముందుంచాలని కోర్టు ఆదేశించింది.

కాగా నేపాల్‌లో భారత జోక్యం అనేక రూపాల్లో పెచ్చరిల్లుతున్నది. నేపాల్‌లో 'మరింత బలమైన ప్రజాస్వామిక రాజకీయ ఫ్రంట్' ఏర్పాటులో భారత ప్రయోజనాలు ఉన్నాయని, దానికి (కమ్యూనిస్టుల స్థానంలో) నేపాలీ కాంగ్రెస్ నాయకత్వం వహించాలని కొన్ని వర్గాలు కోరుతున్నాయి. సరిహద్దు ప్రాంతాల్లో భారతీయ సంతతిలో ప్రాబల్యంగల 'మాధేశీ' తెగల పార్టీలు దీనిలో ప్రముఖ పాత్ర వహించగలవని ఆ వర్గాలు ఆశించి, కృషిచేస్తున్నాయి. నేపాల్ పార్లమెంట్‌లో కమ్యూనిస్టులు, నేపాలీ కాంగ్రెస్ తర్వాత మూడు, నాలుగు స్థానాల్లో అలాంటి రెండు పార్టీలున్నాయి. సమాజవాదీ పార్టీ, రాష్ట్రీయ జనతా పార్టీ. ఈ రెండూ విలీనమై 'జనతా సమాజవాదీ పార్టీ' అని ఒక పార్టీని ఏర్పరిచారు. దానికి మాజీ మావోయిస్టు, మాజీ ప్రధాని బాబూరామ్ భట్టారాయ్‌ని నాయకుడిగా చేయాలని ఆలోచన. భట్టారాయ్, ఆయన భార్య ఇద్దరూ 2015 సెప్టెంబర్‌లోనే నేపాలీ మావోయిస్టు పార్టీ నుంచి బయటపడ్డారు. ఆయన నేతృత్వంలోనే నేపాల్ సమాజవాదీ పార్టీ 2019 మే లో ఏర్పడింది. ఈ పార్టీ భారత్ పట్ల 'మరింత సానుకూలంగా' ఉంటుందని ఆశిస్తున్నారు. ఈ కూటమి ఓలీపై రాజకీయదాడి చేసి, ఆయనను ఇరకాటంలో పడేసింది. వారేకాదు. నేపాల్‌లోని అన్ని రాజకీయ శక్తులూ భారత్‌తో సంపర్కిస్తూనే ఉన్నాయని; ఈ విషయంలో భారత్ తానుగా ఇప్పుడే బయటపడవద్దనుకుంటున్నదని 'టైమ్స్ ఆఫ్ ఇండియా' వార్తలు పేర్కొన్నవి (2020 మే 5, 28, 29).

ఈ విషయంలో వాస్తవాలు ఇలా ఉన్నాయి: వివాదాస్పద ప్రాంతంలో రోడ్డు నిర్మాణం, కొత్త మ్యాపుల విషయాన్ని నేపాల్ లేవనెత్తడం వెనుక చైనా పాత్ర ఉన్నదనడాన్ని నేపాల్‌లోని పాలక, ప్రతిపక్షాలూ, సైన్యమూ, మీడియా ఏకకంఠంతో ఖండించాయి. భారత్ చైనాలు రెండూ తమ పొరుగు, మిత్ర దేశాలేనని, భారత్‌తో తమ సంబంధాలు లోతైనవి, చారిత్రకమైనవి అని, అయితే ఈ ఏకపక్ష నిర్ణయాలు భారత-నేపాల్ లోగడ కుదుర్చుకున్న అవగాహనకు విరుద్ధంగా ఉన్నాయని నేపాల్ ప్రధాని, విదేశాంగ మంత్రి కూడా స్పష్టం చేశారు. (ఇండియా టుడే, మే 14, 2020) తమ ఆంతరంగిక వ్యవహారాల్లో ఎలాంటి జోక్యాన్నీ సహించబోమని అన్నారు. భారతీయ మీడియా చౌకబారు పద్ధతిలో చైనా ప్రస్తావన తెచ్చిందని ఖండించారు.

చైనా హస్తం పేరిట సాగిన ప్రచారం గురించి నేపాల్‌లో వ్యక్తమైన సార్వత్రిక నిరసనను భారత ప్రభుత్వం, ఇతరులూ గుర్తించారు. భారత సైన్యాధిపతి నరవనె చైనా విషయాన్ని అనవసరంగా తెచ్చి, తేనెతుట్టెను కదిలించారని; ఇది నేపాల్ ఆర్మీతో సహా సర్వత్రా జాతీయభావనను రగిలించి, సమస్యను మరింత సంక్లిష్టం చేసిందని భావించారు. ఆ మేరకు మన దేశంలో వ్యాఖ్యలు, సంపాదకీయాలు వెలువడ్డాయి కూడా.

భారతదేశంలో నేపాలీయులు, నేపాల్‌లో భారతీయులు పదుల లక్షల సంఖ్యలో పనిచేస్తున్నారని; నేపాల్ 'పొరులు' వేలాదిగా భారత సైన్యం గూర్ఖా రెజిమెంట్‌లో పనిచేస్తున్న విచిత్ర, విశిష్ట స్థితి ఉన్నదని; ఇరు దేశాల మధ్య 'ఓపెన్ బోర్డర్' ఉందని; నేపాలీయులు భారత ఆర్థికానికి ఇతోధికంగా సమకూర్చుతున్నారని; ఇలాంటి స్థితిలో భారత్ జోక్యందారీ పాత్ర ప్రత్యేకించి హానికరమని భావించబడింది. కనకమణి దీక్షిత్ వంటి నేపాల్ నిపుణులు కూడా ఈ విషయాలపై వ్యాఖ్యానించారు.

నేపాల్‌లోని వివాదస్పద ప్రాంతంలో భారత సైన్యాలు (అదీ చైనాను రెచ్చగొట్టే ఇండో-టిబెటన్ దళాలు కూడా) 1962 యుద్ధం నాటినుంచీ తిష్టవేసి ఉన్నాయని; వాటిని వెనక్కి తీసుకోవాలని నేపాల్ ఆనాటి నుంచీ కోరుతున్నదని; ఈ విషయం కూడా నేపాల్‌లో భారత వ్యతిరేక జాతీయవాదానికి కారణంగా ఉన్నదని విజ్ఞులకు బాగా తెలుసు. ఈ డిమాండు నేపాల్‌లో మళ్లీ ముందుకు వచ్చింది. వివాదస్పద కాలాపానీ ప్రాంతంలోని లిపులేఖ్ వద్ద భారత సైనిక స్థావరంలో భాగమైన 16 'ఆర్మీ పోస్టు'లను 1970లో ఇండియా నేపాల్ రాజు మహేంద్ర ఒత్తిడి వల్ల వెనక్కి తీసుకోవలసి వచ్చింది. మరికొన్ని నేటికీ కొనసాగుతున్నవి. భారత విస్తరణవాదానికి నేపాల్ ప్రతిఘటన ఎంత గట్టిదో, సుదీర్ఘమైనదో దీన్నిబట్టి ఊహించుకోవచ్చును. ఇలాంటి వాటిని భారత భూభాగాలుగా చెప్పడం తప్పు.

నేపాల్‌ని భారత్ పలుసార్లు దిగ్బంధించడం, గ్యాస్-నిత్యావసరాల కొరతతో నేపాల్ ప్రజలు విలవిలలాడటం తెలిసినవే. భారత నేపాల్ 'వాణిజ్యం-రహదారి ఒప్పందం'తో సహా అసమాన ఒప్పందా లన్నింటినీ రద్దుచేయాలన్న డిమాండ్‌కి ఈ పరిణామాలు ఆజ్యం పోశాయి. అంతకుముందు నేపాల్ ప్రభుత్వాధినేతగా ప్రచండ పదవీచ్యుతి వెనుక, నేపాల్ (సెక్యులర్) రాజ్యాంగ రచన-ఆమోదం సందర్భంగా భారత్ నుంచి, ప్రత్యేకించి హిందుత్వ వాదుల నుంచి బాహాటమైన జోక్యం; మాధేశీ పార్టీల ద్వారా నేపాల్ చేయి మెలితిప్పే భారత విస్తరణవాద రాజకీయాలు; చైనాతో సంబంధాలు-ప్రత్యేకించి చైనా ఆయుధాల కొనుగోలు విషయంలో భారత్ పెత్తనం-ఇవన్నీ నేపాల్‌లో భారత్ పట్ల ద్వేష భావాన్ని ప్రేరేపిస్తున్నాయి.

ఇదంతా నేపాల్‌లోని కమ్యూనిస్టుల వల్ల అని; దానివెనుక చైనా పాత్ర ఉందని; కమ్యూనిస్టు పార్టీలను చీల్చడంద్వారా ఈ స్థితిని ఎదుర్కోవాలని భారత పాలకవర్గాలు భావిస్తున్నాయి. ఇది నిరాధారం. ఇప్పటి కమ్యూనిస్టులే కాదు. బీరేంద్రవంటి రాజుల కాలం నుంచి, కోయిరాలా వంటి నేపాలీ కాంగ్రెస్ నాయకులదాకా అన్ని హయాముల లోనూ భారత్ పట్ల అక్కడ వ్యతిరేకత కొనసాగుతున్నది. బ్రిటిష్ వలస పాలకుల వారసులుగా భారత పాలకవర్గాలు నెరపుతున్న విస్తరణవాదం దీనికి మూలకారణం. అగ్రరాజ్యాలు - నేడు ప్రత్యేకించి అమెరికా - ఈ విస్తరణ వాదాన్ని, చైనా వ్యతిరేకతను ప్రోత్సహించి వాడుకుంటున్నాయి. నేపాల్‌లో దలైలామా అనుచరులను కొందరిని పెంచిపోషిస్తూ, చైనా వ్యతిరేక చర్యలు సాగిస్తున్నాయి. ఈ విస్తరణవాదం వల్లనే భారతదేశానికి దక్షిణాసియాలోని అన్ని దేశాలతోనూ వైరుధ్యాలు దశాబ్దాలుగా కొనసాగుతున్నాయి. దాన్ని గుర్తించకుండా బలీయమవుతున్న చైనా చేస్తున్న దిగ్బంధనంగా దాన్ని భారత పాలకవర్గాలు, మీడియా చిత్రిస్తున్నాయి. భారత దేశానికి భారత ప్రజలకు హానికరమైన ఈ విస్తరణవాదాన్ని వ్యతిరేకించడం అత్యవసరం. నేపాల్‌తో అసమాన సంబంధాలను, ఒడంబడికలను రద్దుచేయడం తక్షణ కర్తవ్యం.

(రచయిత రాజకీయ శాస్త్ర విద్యార్థి) వీ

పెట్టుబడి - స్వేచ్ఛ: వర్తమాన భారతం

తన అభివృద్ధికి అవసరమైన భావప్రకటనా స్వేచ్ఛను ఒక దశలో పెట్టుబడి ఎట్లా అణచివేయడానికి ప్రయత్నిస్తుందో వివరిస్తున్నారు **కొండూరి వీరయ్య**

ప్రస్తావన:

ఏడేళ్ల బిజెపి పరిపాలనలో భారతదేశంలో భావప్రకటనా స్వేచ్ఛ ప్రమాదంలో పడింది. ప్రత్యేకించి గత రెండేళ్లలో పరిస్థితి మరింత దిగజారింది. తాజాగా రైతు ఉద్యమం నేపథ్యంలో జరుగుతున్న పరిణామాలు భావప్రకటనా స్వేచ్ఛ గురించిన చర్చను మరోసారి ముందుకు తెస్తున్నాయి. గత ఏడేళ్ల కాలంలో దేశంలో భావప్రకటనా స్వేచ్ఛపై రెండు కోణాల్లో దాడి జరుగుతోంది. మొదటిది అంతర్జాతీయ గుత్తపెట్టుబడి ప్రయోజనాలను ప్రశ్నించే భావప్రకటనా స్వేచ్ఛపై ద్రవ్యపెట్టుబడి సాగిస్తున్న దాడి మొదటిది. ప్రభుత్వాల ప్రగతినిరోధక మితవాద స్వభావం కారణంగా జరుగుతున్న దాడి రెండోది. ఇక్కడ భావ ప్రకటనా స్వేచ్ఛపై దాడికి కారణాలు వేరైనా ఫలితం మాత్రం దాడి చేస్తున్న, చేయిస్తున్న వర్గాలకు పరస్పర ప్రయోజనకారిగానే ఉంటోంది. అందువల్లనే సోకాల్డ్ ప్రగతిశీల స్వభావం కలిగిన ఆధునిక పెట్టుబడిదారీ సమాజంలో సైతం ఇటువంటి దాడులకు పాలకవర్గాల ఆమోదం సాధించటం తేలికైన పనిగా మారింది.

పెట్టుబడిదారీ వ్యవస్థలోని అత్యున్నత దశ సామ్రాజ్యవాదం అని లెనిన్ విశ్లేషించాడు. సామ్రాజ్యవాదం రెండు రూపాల్లో వ్యక్తమవు తుంది. భౌగోళిక సామ్రాజ్యవాదం. భావజాల సామ్రాజ్యవాదం. మొదటి రూపం లెనిన్ విశ్లేషణకు పునాదిగా మారింది. ఈ విశ్లేషణ సోవియట్ విప్లవాన్ని విజయవంతం చేసింది. రెండో ప్రపంచ యుద్ధానంతరం సామ్రాజ్యవాదంలోని రెండో కోణం - భావజాల, సైద్ధాంతిక సామ్రాజ్యవాదం పెట్టుబడిదారీ వ్యవస్థ సార్వత్రిక నియమంగా మారింది. దీన్నే నేడు మనం ప్రపంచీకరణగా పిలుచుకుంటున్నాం. ప్రపంచీకరణ సారాంశమే స్వేచ్ఛ. ప్రభుత్వ నియంత్రణల రద్దు. ఆ మాటకొస్తే సామాజిక నియంత్రణలు, అదుపాజ్ఞల రద్దు కూడా ప్రపంచీకరణ లక్ష్యంలో భాగమేనని చెప్పాలి. ఈ మేరకు గత మూడు దశాబ్దాలుగా ప్రపంచ వ్యాప్తంగా మౌలిక ఉత్పత్తి సాధనమైన పెట్టుబడికి ఎక్కడలేని స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు సిద్ధించాయి. పెట్టుబడి ఏ మేరకు స్వేచ్ఛను అనుభవిస్తుందో అర్థం చేసుకోవటానికి తాజాగా అమెజాన్ ఇండియా సీనియర్ ఎగ్జిక్యూటివ్స్ రూపొందించిన నోట్స్‌లో "చట్టాలను ఎంత మేరకు వెనక్కు నెట్టగలమో ఆమేరకు వెనక్కు నెట్టాలి" అని రాసుకున్న వాక్యం చక్కని ఉదాహరణ. ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడికి ప్రపంచీకరణ దశలో దక్కిన స్వేచ్ఛ, దాని పర్యవసానాల గురించి పెద్దగా వివరించుకోవాల్సిన పని లేదు. కానీ ప్రపంచీకరణ ప్రతిపాదించిన స్వేచ్ఛ సార్వత్రికమా? సమాజంలోని అన్ని వర్గాలకూ, దేశాలకూ కూడా ఈ స్వేచ్ఛ కావాలన్న నిబద్ధత ప్రపంచీకరణ చోదకశక్తులు అంగీకరిస్తాయా? అన్న ప్రశ్నకు మాత్రమే సమాధానం చెప్పే ప్రయత్నమే ఈ వ్యాసం.

వ్యక్తిగత స్వేచ్ఛ : మార్క్సిస్టు అవగాహన - బూర్జువా అవగాహన

మార్క్స్ రచనల గురించి, మార్క్సిజం గురించిన చర్చల్లో రాజకీయ స్వేచ్ఛ, ప్రజాస్వామ్య కోణాలు తగినంత గుర్తింపు పొందలేక పోయాయి. మార్క్సిజంలో వ్యక్తిగత స్వేచ్ఛకు ఉన్న అర్థం, అవగాహన, ప్రపంచీకరణ దశలో పెట్టుబడి ఏలుబడిలో వ్యక్తిగత స్వేచ్ఛకున్న అర్థం అవగాహనల మధ్య ఉన్న తేడాలు గుర్తించాలి.

వ్యక్తి యొక్క సకల సామర్థ్యాలు స్వేచ్ఛగా వ్యక్తం చేసుకునే అవకాశమే భావ ప్రకటనా స్వేచ్ఛ. భావ ప్రకటనా స్వేచ్ఛ అంటే విద్యా విషయక స్వేచ్ఛ. మేధో స్వేచ్ఛ. విమర్శనాత్మక స్వేచ్ఛ. మేధో వ్యక్తీకరణ, సాంస్కృతిక వ్యక్తీకరణ భావ ప్రకటనా స్వేచ్ఛలో అంతర్భాగం. వయోజన ఓటింగ్ హక్కు, ప్రభుత్వాన్ని విమర్శించేందుకు ప్రజలకు హక్కులు దఖలు పర్చటం, మత విశ్వాసాలు పాటించే హక్కు, మతాన్ని, రాజ్యాన్ని వేరు చేయటం, సైనికేతర ప్రాపంచిక దృక్పథాలు పారిస్ కమ్యూన్‌లో ప్రత్యేక లక్షణాలుగా కారల్ మార్క్స్ గుర్తించాడు. తర్వాతి కాలంలో ఈ లక్షణాలే పశ్చిమ దేశాల ప్రజాస్వామ్యానికి పునాది అంశాలుగా గుర్తించబడ్డాయి. కాకపోతే తేడా ఒక్కటే. మార్క్సిజం ఆచరణాత్మక హక్కులను ప్రతిపాదిస్తే పెట్టుబడిదారీ వ్యవస్థ హక్కుల ప్రకటనను ఆదర్శప్రాయమైన ప్రకటన స్థాయికి కుదించేసింది. మార్క్స్ అవగాహనలో ప్రతి వ్యక్తీ తనను తాను సంపూర్ణంగా ఆవిష్కరించుకోవటానికి కావల్సిన స్వేచ్ఛ ఉండాలి. భౌతికంగా, భౌతిక అవసరాలు సమకూర్చుకునే దైనందిన ఒత్తిళ్ల నుండి విముక్తి పొందినప్పుడే వ్యక్తి తనను తాను సంపూర్ణంగా ఆవిష్కరించుకోగలుగుతారు. అందుకే మార్క్స్ వ్యక్తి స్వేచ్ఛ, భావ ప్రకటనా స్వేచ్ఛ గురించి మాట్లాడేటప్పుడు సార్వత్రిక ఆచరణాత్మక సానుకూల హక్కులను మాత్రమే పరిగణనలోకి తీసుకున్నాడు. దీనికి భిన్నంగా భారతదేశంతో సహా బూర్జువా రాజ్యాంగాలన్నీ హక్కులను ప్రతికూల హక్కులుగా గుర్తిస్తాయి. ఉదాహరణకు వాక్‌స్వాతంత్ర్యపు హక్కు గురించి భారత రాజ్యాంగం "ఇతరుల హక్కులకు అవరోధం కలగకుండా ఉండేంతవరకు..." భారతీయులందరూ వాక్‌స్వాతంత్ర్యం హక్కును అనుభవించవచ్చని చెపుతోంది. భారత రాజ్యాంగంలో వ్యక్తి స్వాతంత్ర్యాల గురించి అందమైన భాషలో వర్ణించినా అవి రాజ్యంపై పెట్టుబడి పట్టు బిగిస్తున్న కొద్దీ అలంకారప్రాయమైన హక్కులుగానే మిగిలిపోతున్నాయి. గత ఏడేళ్లలో భావ ప్రకటనా స్వేచ్ఛ, వ్యక్తి స్వాతంత్ర్యాలపై జరుగుతున్న దాడిని దీనికి పరాకాష్టగానే పరిగణించాలి.

రాజ్యం వ్యక్తి ఆలోచనలను, వ్యవహారశైలిని నియంత్రించాలని ప్రయత్నం చేస్తున్నపుడు అదే రాజ్యం సదరు వ్యక్తి తనను తాను సంపూర్ణ వ్యక్తిగా ఆవిష్కరించుకునేందుకు అన్ని అవకాశాలు కల్పించాలన్నది మార్క్సిస్టు అవగాహన. కానీ బూర్జువా రాజ్యాంగాలు దీనికి భిన్నంగా

వ్యక్తుల ఆలోచనా సరళిని, జీవన శైలిని నియంత్రించాలని కోరుకుంటాయే తప్ప సదరు వ్యక్తి తనను తాను సంపూర్ణంగా ఆవిష్కరించుకునేందుకు కావల్సిన అవకాశాలను అందించవు. అవసరాలు తీర్చుకునే మార్గాలు అందుబాటులో ఉంచవు. ఈ వైరుధ్యాన్ని మనం నిత్యజీవితంలో చూస్తూనే ఉన్నాము. కార్మికుడు ఉత్పత్తి వలయంలో ఎలా ఎన్ని గంటలు మసలుకోవాలో, ఏ స్థాయిలో ఉత్పత్తి సాధించాలో నిర్దేశించే బూర్జువా రాజ్యాంగాలు, చట్టాలు సదరు కార్మికుడు ఆ స్థాయిలో పని చేయటానికి కావల్సిన వేతనాలు, విరామం, సాంస్కృతిక అభివృద్ధి, సామాజిక వాతావరణాన్ని మాత్రం కల్పించాల్సిన బాధ్యతను ప్రభుత్వాలపై మోపకపోవటాన్ని మనం ఉదాహరణగా చూడొచ్చు. తాజాగా పార్లమెంట్ ఆమోదించిన కార్మిక చట్టాల సవరణలో కనిపించేది బూర్జువా రాజ్యాంగాల్లోని హక్కుల గురించిన ఈ అవగాహన పర్యవసానమే.

పెట్టుబడి పూర్తి స్థాయిలో ఆవిష్కృతం కావటానికి బూర్జువా రాజ్యాంగాలు సాధనాలుగా ఉంటే మార్క్స్ ఆశించిన సోషలిస్టు సమాజం వ్యక్తి తనను తాను పూర్తి స్థాయిలో ఆవిష్కృతం కావడాన్ని లక్ష్యంగా నిర్దేశించుకుంటుంది. సమాజాన్ని మార్చడానికి కావల్సిన విప్లవాన్ని సాధించడంలో వర్గాలు కీలక పాత్ర పోషించినా విప్లవానంతర సమాజం మాత్రం వ్యక్తుల సమున్నతాభివృద్ధి, సమగ్రాభివృద్ధిని లక్ష్యంగా ఎంచుకుంటుంది. కమ్యూనిస్టు సమాజంలో వర్గాలు అంతర్ధానమవుతాయనే మార్క్స్ ప్రతిపాదనను ఈ కోణంలో అర్థం చేసుకోవాలి. వర్గ సమాజంలో వ్యక్తులు వివిధ వర్గాల్లో భాగంగా సామాజిక సంబంధాల్లోకి ప్రవేశిస్తారు. సామాజిక వ్యవహారాల్లో పాల్గొంటారు. కానీ మార్క్స్ ఊహించిన సమాజంలో వ్యక్తులు స్వతంత్ర వ్యక్తులుగానే సామాజిక వ్యవహారాల్లో భాగస్వాములవుతారు. అంటే వర్గ సమాజంలో వ్యక్తులు అవసరాలు తీర్చుకోవటానికి వర్గం ఓ ఉమ్మడి అస్తిత్వంగా, సాధనంగా ఉపకరిస్తే మార్క్స్ ఆశించిన సమాజంలో వ్యక్తులు సంపూర్ణ స్వేచ్ఛాయుత సభ్యులుగానే ఉండి కూడా తమ అవసరాలు తీర్చుకోగలుగుతారు. తమను తాము సంపూర్ణ సమగ్ర వ్యక్తులుగా అస్తిత్వాలుగా మల్చుకోగలుగుతారు.

చరిత్రలో భావ ప్రకటనా స్వేచ్ఛ

చరిత్రలో భావ ప్రకటనా స్వేచ్ఛ అనేక మేధో విప్లవాలకు తెర తీసింది. ప్రత్యేకించి పెట్టుబడిదారీ విధానం ఆవిర్భావంతోనే భావ ప్రకటనా స్వేచ్ఛ మరింత ప్రాధాన్యత సంతరించుకుంది. మతం, మతమౌఢ్యం రాజ్యాన్ని కబళించినంత కాలం భావ ప్రకటనా స్వేచ్ఛ మతమౌఢ్యంపై పోరాడింది. ప్రకృతి, సమాజ పరిణామం, మానవాళి చరిత్ర, ఆస్తి సంబంధాలు, వర్గాలు రూపొందటం, సంపద కేంద్రీకరణ వంటి విషయాలన్నింటికీ ఉన్న మతపరమైన పునాదిని, ప్రాతిపదికను నాటి భావ ప్రకటనా స్వేచ్ఛతోనే ప్రశ్నించగలిగాము. శాస్త్రీయ ఆలోచనా విధానం చరిత్రగా రాసుకుంటూ పోతే సోక్రటీస్‌తో మొదలుపెట్టాల్సి ఉంటుంది. భారతదేశంలో చార్వాకులు, లోకాయతతో మొదలై స్వాతంత్ర్యోద్యమ కాలం నాటి ప్రోగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్, తర్వాతి కాలంలో ఉనికిలోకి వచ్చిన ప్రజాతంత్ర రచయితల వేదికల వరకూ సమీకృత చరిత్ర భారతదేశంలో శాస్త్రీయ ఆలోచనా చరిత్రగా మనం క్రోడీకరించుకోవచ్చు. ప్రతి వర్గమూ తన లక్ష్యాలు సాధించుకునేందుకు వీలుగా సమాజాన్ని పూర్వపు సామాజిక ఆర్థిక బంధనాల నుండి విముక్తి చేయటానికి ప్రయత్నం చేస్తుంది. పారిశ్రామిక విప్లవంతో పాటు నిర్దిష్ట భావనగా ఉనికిలోకి వచ్చిన భావప్రకటనా స్వేచ్ఛ మౌలిక లక్ష్యం భూస్వామ్య భావజాలం, సైద్ధాంతిక పునాది నుండి సమాజాన్ని విముక్తి చేసి పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రయోజనాలు తీర్చటానికి వీలుగా మార్చటమే. అందువల్లనే గత నాలుగు శతాబ్దాలుగా పెట్టుబడిదారీ వ్యవస్థీకరణతో పాటు వ్యక్తిగత స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కూడా ఆధునిక సమాజపు ప్రాథమిక లక్ష్యాలుగా, లక్షణాలుగా గుర్తింపు పొందుతూ వచ్చాయి. అందుకే ఆధునిక రాజ్యాంగాలన్నీ వ్యక్తిగత హక్కులు, స్వేచ్ఛలకు తమదైన శైలిలో ఎంతో కొంత ప్రాధాన్యత ఇచ్చాయి.

పెట్టుబడిదారీ వ్యవస్థ తొలినాళ్లలో అంగీకరించిన భావ ప్రకటనా స్వేచ్ఛ ఆ వ్యవస్థలో ఉత్పత్తి శక్తులు, వాటి సామర్థ్యాలు పెంచడంలో కీలక పాత్ర పోషించింది. ప్రకృతి రహస్యాలను ఛేదించటంలో త్రిశంకు స్వర్గాన్ని సృష్టించటంలో ఆయుధాలుగా పని చేశాయి. ఈ భావ ప్రకటనా స్వేచ్ఛతో అందివచ్చిన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ప్రకృతిలో అంతర్భాగాలైన భూమి, గాలి, నీరు, ఆకాశం వంటి పంచభూతాలను సైతం అమ్మకానికి వీలైన సరుకుగా మార్చడంలో ఆయుధంగా ఉపయోగపడింది. పెట్టుబడిదారీ విధానం ప్రపంచ వ్యాప్తంగా సార్వత్రిక ఉత్పత్తి విధానంగా మారిన తర్వాత భావ ప్రకటనా స్వేచ్ఛ, వ్యక్తిగత స్వేచ్ఛలు ఈ వ్యవస్థ మనుగడకు సవాలు విసరటం మొదలైంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో సంపద సృష్టి, కేంద్రీకరణ నిరంతరాయంగా కొనసాగటానికి, భావప్రకటనా స్వేచ్ఛ పరంగా పోగుపడ్డ సంపదపై పెత్తనం కొనసాగించటానికి భావ ప్రకటనా స్వేచ్ఛకు మధ్య ఉన్న వైరుధ్యం మొదటిది. ఇక్కడ కేంద్రీకరణ అన్న పదాన్ని కేవలం సంపద కేంద్రీకరణకు మాత్రమే పరిమితం చేయకూడదు. కేంద్రీకరణ అంటే కేవలం ఉత్పత్తి కేంద్రీకరణ మాత్రమే కాదు. ఉత్పత్తి కేంద్రీకరణకు దారితీసే సామాజిక మేధో పరిస్థితుల నిర్మాణం కూడా. పెట్టుబడిదారీ వ్యవస్థ తన అధికారాన్ని మరింత సంఘటితం చేసుకోవాలంటే దానిపై సమాజం, పౌర మేధావులు విధించే పరిమితులు, నియంత్రణలను అధిగమించాల్సి ఉంటుంది. ఈ క్రమంలోనే తెరమీదకు వచ్చిన ఫ్రెంచి విప్లవం వ్యక్తిగత హక్కులను ఎజెండాగా మార్చింది.

ఓ సూత్రీకరణగా చెప్పుకోవాలంటే పెట్టుబడిదారీ విధానం విస్తరించాలంటే ప్రకృతి నుండి సహజ వనరులను, సమాజం నుండి మానవ వనరులను ఉత్పత్తి శక్తులు, ఉత్పత్తి సాధనాలుగా మల్చుకోవాలి. దానికి గాను ప్రకృతిని అర్థం చేసుకోవాలి. సమాజాన్ని అర్థం చేసుకోవాలి. ప్రకృతిని, సమాజాన్ని ఉత్పత్తి సాధనాలుగా మల్చగలిగిన సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయాలి. సమాజానికి అలవాటు చేయాలి. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావాలంటే భౌతిక శాస్త్రాలు అభివృద్ధి కావాలి. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ నిర్మాణం, నిర్వహణ నిర్నిరోధంగా జరగాలంటే సమాజమూ, రాజకీయ అర్థశాస్త్రమూ అర్థం కావాలి. ఇవన్నీ జరగాలంటే వ్యక్తిగత సృజనాత్మకత, మేధో స్వేచ్ఛ, భావ ప్రకటనా స్వేచ్ఛ అనివార్యమైన సాధనాలు. ఈ మేరకు పెట్టుబడిదారీ వ్యవస్థ తన ఆధిపత్యాన్ని కొనసాగించుకునేందుకు వీలుగా వ్యక్తిగత హక్కుల విషయంలో కొన్ని మినహాయింపులు ఇచ్చింది. కొన్ని మినహాయింపులకు లోబడిన వ్యక్తిగత స్వేచ్ఛా స్వాతంత్ర్యాలే అన్ని బూర్జువా రాజ్యాంగాల్లో మనకు కనిపిస్తున్న హక్కులు.

మరోవైపున పెట్టుబడిదారీ విధానం సమాజంపైనా ప్రత్యేకించి

శ్రామిక జనావళిపైనా తన పట్టును ఎట్టి పరిస్థితుల్లోనూ వదులుకోవడానికి సిద్ధపడదు. ఈ ఆధిపత్యాన్ని కొనసాగించడానికి అవసరమైతే హింసకు పాల్పడడానికి కూడా సిద్ధమే. సదరు హింస నిరంకుశత్వం పర్యవసానం కావచ్చు, ఫాసిజం పర్యవసానం కావచ్చు లేదా మరో రకమైన గుత్తాధికార కేంద్రీకరణ, అథారిటేరియన్, టొటాలిటేరియన్ పాలన రూపం తీసుకోవచ్చు. ఈ రకమైన నియంత్రణ సాధించే ప్రయత్నంలోనే అనేక చట్టాలు, నియమ నిబంధనలు ఉనికిలోకి వస్తాయి. ఈ చట్టాలు, నియమ నిబంధనలు బూర్జువా వర్గపు ఉమ్మడి నియంత్రణతో పాటు వ్యక్తిగత బూర్జువాలు తమ పరిధిలోని సమాజాన్ని నియంత్రించేందుకు కూడా కావల్సిన పునాదులు వేస్తాయి. తదనుగుణంగా సదరు పెట్టుబడిదారీ విధానపు అభివృద్ధి దశ, దిశల నిర్దిష్ట అవసరాలను బట్టి భావప్రకటనా స్వేచ్ఛపై పరిమితులు పెరుగుతూ తరుగుతూ ఉంటాయి. వ్యక్తిగత స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు, భావ ప్రకటనా స్వేచ్ఛ, ప్రభుత్వాలను విమర్శించే స్వేచ్ఛ సంపూర్ణ స్థాయిలో అమలు జరిగితే ఈ దోపిడీ పాలనకు చరమగీతం పాడే సమయం దగ్గరపడుతుంది.

పై సూత్రీకరణలు నిర్ధారించుకోవడానికి మనం మన దేశపు ఉదాహరణనే తీసుకోవచ్చు. ఆసియా దేశాలు ప్రత్యేకించి భారతదేశం వంటి దేశాల్లో వలసపాలన కాలం వరకూ ఉనికిలో ఉన్న ఉత్పత్తి రూపాన్ని ఏసియాటిక్ మోడ్ ఆఫ్ ప్రొడక్షన్ అంటున్నాము. భారతదేశంలో వలసపాలన ప్రవేశించే వరకూ విద్యా విజ్ఞానం, వాక్ స్వాతంత్ర్యం, భావప్రకటనా స్వేచ్ఛ, ఆఖరికి ప్రశ్నించే హక్కు కూడా కులీన వర్గాలకు, రాజ కుటుంబాలకు మాత్రమే పరిమితం అయ్యింది. మిగిలిన సమాజం జ్ఞానాంధకారంలో వేల ఏళ్ల పాటు కొనసాగింది. జ్ఞానాంధకారం ఉన్న చోట భావప్రకటనా స్వేచ్ఛను ఆశించలేం. సామాజిక స్వేచ్ఛల గురించి మన చరిత్ర మనకు తెలిసినంతగా ఇతరులకు తెలియదు. అందుకే పాశ్చాత్య దేశాలు ప్రత్యేకించి పశ్చిమ యూరప్ దేశాలు ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని, సామర్ధ్యాన్ని పెంపొందించటానికి కావల్సిన విద్యావ్యవస్థ, మనోవికాస వ్యవస్థల దిశగా అడుగులు వేయడం ప్రారంభిస్తే మనం మాత్రం జ్ఞానాంధకారాన్ని మరింత చిక్కబరుస్తూ వెళ్లాము. అందువల్లనే క్రీస్తు పూర్వం 3–5 శతాబ్దాల్లోనే ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన విశ్వవిద్యాలయాలను నెలకొల్పిన భారతదేశంలో జ్ఞానసంపద క్రీస్తు శకానంతరం మనువాద మాయాజాలంలో చిక్కుకుపోవటంతో హెగెల్ అంతటి వాడు భారతదేశంలో కోతులను దేవుళ్లుగా పూజిస్తారని ఎద్దేవా చేస్తూ రాశాడు. అంత జ్ఞానాంధకారంలో సైతం ఎర్రకోట, తాజ్ మహల్ వంటి సాంస్కృతిక కళా ఖండాలు మొదలు రామప్ప చెరువు, గోల్కొండ పైకి నీటి సరఫరా వరకూ పాలకవర్గాలకు కావల్సిన సాంకేతిక పరిజ్ఞానం వరకూ అందుబాటులో ఉంచుకున్నాయి పాలకవర్గాలు.

ప్రపంచీకరణ దశలో భావ ప్రకటనా స్వేచ్ఛ:

అయితే భావప్రకటనా స్వేచ్ఛపై నాడున్న నియంత్రణకు నేడున్న నియంత్రణకు గుణాత్మకమైన తేడా ఉంది. నాటి నియంత్రణ ఫలితంగా ఉత్పత్తి శక్తుల అభివృద్ధి కుంటుపడింది. సమాజం జ్ఞానాంధకారంలో మగ్గింది. భావ ప్రకటనా స్వేచ్ఛ సార్వత్రిక విలువలు కలిగిన అంశం. ప్రశ్నించే తత్వం, మేధో వికాసం, భావ ప్రకటనా స్వేచ్ఛలు పెట్టుబడిదారీ విధానపు అవసరాలు తీర్చాలన్న ముందస్తు అవగాహనతో పని చేయవు. ఈ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు తమదైన స్వతంత్ర విలువలను, ఉనికిని, నిర్వర్గ స్వభావాన్ని కలిగి ఉంటాయి. ఆధిపత్య వర్గాలు ప్రకృతితో సహా అన్నిటినీ తమ అదుపులోకి తీసుకుని తమ ప్రయోజనాలు కాపాడుకునే ప్రయత్నంలో సాధనాలుగా మార్చుకుంటాయి. అదేవిధంగా భావ ప్రకటనా స్వేచ్ఛ పర్యవసానంగా ఉనికిలోకి వచ్చిన శాస్త్రసాంకేతిక పరిజ్ఞానంపై కూడా ఆధిపత్య వర్గాలు పెత్తనం చలాయిస్తాయి. ఫలితంగానే ఈ శాస్త్రవిజ్ఞాన సాంకేతికాభివృద్ధి ఫలితాలు సదరు సమాజంలోని ఆధిపత్య వర్గాల ప్రయోజనాలు తీర్చే సాధనాలుగా మారతాయి. అంతేకానీ శాస్త్రసాంకేతిక వికాసానికి దారులు వేసిన మహనీయులంతా పెట్టుబడిదారీ వర్గాధిపత్యం నీడనే బతకాలని కోరుకోరు. చార్లెస్ డార్విన్ మొదలు స్టీఫెన్ హాకింగ్స్ వరకూ, కారల్ మార్క్స్ మొదలు గ్రాంసీ వరకూ ఉన్న భావప్రకటనా స్వేచ్ఛకు సిసలైన ప్రతినిధులు మొదటి తెగకు చెందిన మేధావులు. రెండో రకం మేధావులు కౌటిల్యుడిలాగానో, మాకియావెల్లిలాగానో, ఆడమ్‌స్మిత్ లాగానో ఈ వ్యవస్థ విసిరిన వలలో చిక్కుకుని వ్యవస్థ ప్రయోజనాలు కాపాడటానికి జీవితాలు వెచ్చించిన మేధావులూ ఉన్నారు. ప్రపంచీకరణ దశలో ఈ తరహా మేధావులు కుప్పలు తెప్పలు కనిపిస్తారు. తన మనుగడ కొనసాగించడానికి ఈ రెండు రకాల మేధావులూ అవసరం కావటమే పెట్టుబడిదారీ వ్యవస్థ దురదృష్టం.

కాలం గడిచే కొద్దీ జ్ఞానార్జన మార్గాలు సాధనాలు, ఉపకరణాలు మారిపోతూ ఉంటాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ ఆధునిక రూపం తీసుకున్న తర్వాత కలం, కాగితం, గ్రంథాలయాలు ఇటువంటి ఉపకరణాలుగా మారతాయి. మార్క్స్ మొదలు అంబేద్కర్ వరకూ ఆధునిక సమాజ నిర్మాతలైన మేధావులకు ముడిసరుకు సమకూర్చింది లండన్‌లోని గ్రంథాలయం. ప్రపంచీకరణ దశలో కంప్యూటర్లు, సామాజిక మాధ్యమాలు, మొబైల్ ఫోన్లు అటువంటి జ్ఞానార్జనా సాధనాలుగా ఉన్నాయి. పెట్టుబడిదారీ విధానపు ప్రపంచీకరణ దశలో అనివార్యంగా పెరిగిన విద్యావకాశాలు, స్వతంత్ర జీవనోపాధి మార్గాలు, మేధో తృష్ణ పర్యవసానంగా స్వతంత్ర మేధావులు, కళాకారులు, రచయితలు, విలేకరులు, విశ్లేషకులు, శాస్త్రవేత్తలు, సాంకేతిక నిపుణులతో కూడిన ఓ సమూహాన్ని ఈ వ్యవస్థ ఉనికిలోకి తెస్తుంది. అయితే ఈ సమూహం కూడా ప్రత్యక్షంగానో పరోక్షంగానో తన సేవలోనే కొనసాగాలని పెట్టుబడిదారీ వ్యవస్థ ఆశిస్తుంది. ఈ దిశగానే పెట్టుబడిదారీ వ్యవస్థ స్వతంత్ర తరగతులుగా ఉన్న న్యాయవాదులు, వైద్యులు, అధ్యాపకులు వంటి వారి ప్రాధాన్యతను తగ్గిస్తూ పోతుంది. ఈ స్వతంత్ర తరగతులు నేడు కార్పొరేట్ ఆసుపత్రులపైనో, కార్పొరేట్ న్యాయవాద సంస్థలపైనో, ప్రైవేటు విద్యా సంస్థలపైనో ఆధారపడి బతుకీడ్వాల్సి వస్తుంది. దాంతో అప్పటి వరకూ స్వతంత్ర మేధోతరగతిలో భాగంగా ఉన్న ఈ తరగతి ప్రపంచీకరణ విస్తరించేకొద్దీ పెట్టుబడిపై ఆధారపడిన వేతన జీవులుగా మారుస్తుంది. ఈ పరిణామం మన గత రెండు దశాబ్దాలుగా మన దేశంలో కూడా కనిపిస్తోంది. ఈ పరిణామమే మనకు టెక్నోక్రాటిక్ (ఉన్నత స్థాయిల్లోని సాంకేతిక నిపుణులైన ఉద్యోగులు, పెట్టుబడిదారీ వ్యవస్థను అజమాయిషీ చేసే క్రతువులో భాగస్వాములైన ఉద్యోగులు) తరగతిని ఓ విలక్షణమైన తరగతిగా మనముందు తీర్చి దిద్దుతుంది.

వలస రాయలసీమలో మహిళా చైతన్యం-4

బ్రిటీష్ వలస పాలనలో వెలుగుచూడని రాయలసీమ ప్రాంత మహిళల చైతన్యాన్ని సంఘటిత నిర్మాణాలను వివరిస్తున్నారు **డా. షేఖ్. మహబూబ్ బాషా**

(గత సంచిక తరువాయి..)

విడాకుల చట్టములు విరివిగా ఆచరణయందున్న పాశ్చాత్య దేశము(ల)లోని దాంపత్య జీవితములకంటె మనదేశములోని దాంపత్య జీవితములె ఎక్కువ సౌఖ్య ప్రదముగను, శాంతియుత ముగను కనబడక మానవు. దుస్సహములగు దాంపత్యములచ్చటచట మనదేశములో నుండకబోవు, కాని పాశ్చాత్య దేశములతో పోల్చి చూచిన వీటి సంఖ్య అత్యల్పము. వీటినెదుర్కొనుటకై కళంక పూరితమగు దాంపత్య శాంతి భంగమునకు తోడ్పడు విడాకుల చట్టము వంటి దారుణాస్త్ర ప్రయోగము కేవలము కొరివితో తలగోకికొనిన చందమగును'.

పరిశీలనలో ఉన్న ఉపన్యాస సందర్భంలోనే కాకుండా ఇంకా అనేక సందర్భాలలో రామసుబ్బమ్మ స్త్రీల విడాకుల హక్కును తీవ్ర స్వరంతో వ్యతిరేకించింది. ఉదాహరణకు 1934 నవంబర్ 18న మదనపల్లెలో గుమ్మడిదల దుర్గాబాయమ్మ (తర్వాత దుర్గాబాయ్ దేశ్ముఖ్) అధ్యక్షతన జరిగిన ఎనిమిదవ 'ఆంధ్ర రాష్ట్ర మహిళా సభ'లో విడాకులకు సంబంధించిన ప్రతిపాదన వచ్చినప్పుడు రామసుబ్బమ్మ తీవ్రంగా వ్యతిరేకించింది. ఎక్కువ మంది ఆమెనే సపోర్టు చేయడం కారణంగా ఆ ప్రతిపాదన వీగిపోయి తీర్మానం కాలేకపోయింది. సమకాలీనంగా పలు మంది మహిళలు విడాకుల హక్కు కావాలని కోరుతున్న సందర్భంలో, (ఏడవ గుంటూరు మండల స్త్రీల సభలో తుర్లపాటి రాజేశ్వరమ్మ మాట్లాడుతూ మహిళలకు విడాకుల హక్కు తప్పకుండా ఉండాలని వాదించింది. సెప్టెంబర్ 1930 (చర్చ ముగింపు) నాటికి 40 మంది స్త్రీల అభిప్రాయాలు ప్రచురిత మయ్యాయి. విడాకుల చట్టం సమకాలీనంగా స్త్రీ పురుషులను ఎంతగా భయభ్రాంతులకు గురిచేసిందో 21-22 నవంబర్ 1931లో గుంటురులో జరిగిన ఐదవ ఆంధ్ర రాష్ట్ర మహిళా మహాసభపై కనుపర్తి వరలక్ష్మమ్మ రాసిన సమీక్షా వ్యాసం కళ్లకు కట్టినట్టు వర్ణించింది. '...మొత్తము మీద ఆంధ్ర దేశమంతటను ఈ విడాకుల తీర్మానం పెద్ద తెక్కలికి కారణముగానున్నను ముఖ్యముగా గుంటూరు పౌరులలో గొప్ప ఆందోళనకు కారణమైనదీ విషయము. తమ సాధ్వీ ధర్మానికి గొప్ప అవాంతరం వచ్చిందని కంపిల్లి పోయినారు స్త్రీలు. తాము చాలా కాలము నుండి స్త్రీలను భద్రపరచుచువచ్చిన సాంఘిక కట్టుబాటులనెడి ఉక్కు పంజరము ముక్కలు ముక్కలుగా విరిగిపోయే సమయం వచ్చిందనుకున్నారు పురుషులు. సభ సమీపించినకొలది ఇంటింట ఈ విషయకమైన చర్చలు బయలుదేరినాయి. కొందరిటువంటి సభలకు ధన సహాయము

ప్రశ్నతోనే పాలకవర్గాలకు సమస్య

ఈ రెండో తరహా మేధావులు నిరంతరం ప్రశ్నిస్తుంటారు. అమల్లో ఉన్న చట్టాలు, రాజ్యాంగం, సామాజిక విలువల ప్రాతిపదికగా ప్రభుత్వాల పని తీరును బేరీజు వేస్తూ ఉంటారు. ఈ క్రమంలో ప్రభుత్వం కప్పి పెట్టాలని భావించిన అనేక వాస్తవాలు సమాజం ముందుకొస్తాయి. ఈ వాస్తవాలు చూసిన తర్వాత ప్రజలు సదరు ప్రభుత్వం పట్ల దానికి నాయకత్వం వహిస్తున్న వ్యక్తుల పట్ల తమ అభిప్రాయాన్ని మార్చుకుంటారు. ఈ తరహా ప్రశ్నించే మేధావులు అన్ని సందర్భాల్లోనూ ప్రజల పక్షానే ఉన్నారనీ, ఉంటారనీ రూఢి చేయలేము కానీ ఇటువంటి ప్రశ్నల ద్వారా ప్రజల దృక్పథం మార్చటంలో మాత్రం కీలక పాత్ర పోషిస్తారు. ఇటువంటి ప్రశ్నలు సంధించటానికి ఇవే పాలకవర్గాలు ఆమోదించిన కొన్ని చట్టాలు ఉపయోగపడతాయి. ఉదాహరణకు సమాచార హక్కు చట్టం, అవినీతి నిరోధకచట్టం వంటివి. ఈ పరిస్థితులు తలెత్తిన తర్వాత పెట్టుబడి, దానికి ప్రతినిధిగా ఉన్న పెట్టుబడిదారీ వర్గం సమాజాన్ని తాననుకున్న పద్ధతుల్లో మార్గాల్లో శాసించటం గతంలో ఉన్నంత దూకుడుగా వ్యవహరించలేదు. అందుకే ప్రజల భావ ప్రకటనా స్వేచ్ఛ, చైతన్యాన్ని పెంపొదించే ప్రశ్న, దానికి అనుకూలంగా ఉన్న సామాజిక, చట్టపరమైన అవకాశాలు, రాజ్యాంగ నిబంధనలు అన్నింటినీ మార్చటానికి పాలకవర్గం తప్పనిసరిగా ప్రయత్నం చేస్తుంది. ఇటువంటి సమయాల్లో పాలకవర్గం తన యజమాని పెట్టుబడి అవసరాలు తీర్చేందుకు రెండు మార్గాల్లో ప్రయత్నిస్తుంది. చట్టాలు, రాజ్యాంగ పరిధిలోనే పెట్టుబడి ప్రయోజనాలు కాపాడేందుకు కావల్సిన కార్యనిర్వాహక విచక్షణకు తెరతీయడం మొదటి మార్గం. ఆ పరిస్థితి కూడా సాధ్యం కాదనుకున్నప్పుడు ఏకంగా చట్టాలు, వాటికి మూలమైన రాజ్యాంగాన్నే మార్చడం రెండో మార్గం. రెండో మార్గాన్ని అనుసరించటానికి సిద్ధమవుతున్నపుడు పాలకవర్గం మొదటగా దాడి చేసేది స్వతంత్రంగా ఆలోచించే ప్రజా మేధావులు, ప్రజా మేధావుల ఆలోచనలకు కావల్సిన సరంజామా సమకూర్చే పత్రికా రంగం మీదనే. భావ ప్రకటనా స్వేచ్ఛను నియంత్రించడంతో మొదలు పెట్టి చివరకు గొంతునులిమేంత వరకూ పాలకవర్గాలు సిద్ధమవుతాయి. ఈ క్రమంలోనే పాత్రికేయరంగం, ప్రజాపక్షం వహించే మేధావులపై తొలుత చట్టపరమైన దాడి, తర్వాత భౌతిక దాడి అనివార్యమైన పర్యవసానాలుగా ఉంటాయి. గత ఏడేళ్లుగా భారతదేశంలో జరుగుతున్న పరిణామాలు ఈ విషయాన్ని మరోసారి రుజువు చేస్తున్నాయి.

(రచయిత పాత్రికేయులు)

వీ

నిరాకరించారు. కొంతమంది సూక్ష్మ బుద్ధిగలవారు సభకు బోయిన తమ భార్యలు ఇంటికి వస్తారో రారో అని భయపడి ఇళ్లలో భద్రపరచుకొన్నారు. మొత్తము మీద స్త్రీ పురుషుల హృదయములలో అతి భయంకరమైన ఆందోళన రేపినది విడాకుల తీర్మానము. ఈ విధముగా విడాకుల విషయము అందరిని కలవరపెట్టియుండుట చేత మరునాటి సాంఘిక సభపై నిలిచినవి అందరి చిత్తములు.' డి. కమల రత్నమ్మ సృష్టించిన గందరగోళం వల్ల మొత్తానికి విడాకుల ప్రతిపాదనని చర్చించలేదు సభలో. దీంతో 'విడాకుల తీర్మానమనేది ఒక విష సర్పమనీ, అది స్త్రీల ప్రతివ్రతాత్వమునకు కాటువేసి కాలుష్య మొనర్చవలయునని సిద్ధముగా నున్నదనీ, కాబట్టి ఇది తలయెత్తితే చితుకగొట్టుదామని కూర్చున్నవారికీ; ఆ తీర్మానము తమకు ఇష్టము లేకపోయినను ఆ విష సర్పము నృత్యము కండ్లార చూడవలెనని కుతూహలము బెట్టుకున్న వారికీ ఆశాభంగం కలిగింది.' విడాకుల చట్టాన్ని గూర్చి అనవసర భయాందోళనలు పడుతున్న వారి గూర్చి రాస్తూ 'నిజము విచారించితే ఈ విడాకుల తీర్మానమును గురించి ప్రజలింత భయపడవలసిన అవసరము కనుపించదు. అన్యోన్యతగల సతీపతులను ఏ చట్టము గాని విడదీయలేదు. పొత్తు కుదురని ఆలుమగలను ఏ సాంఘికమైన కట్టుబాటులు గాని కలిపి ఉంచలేవు. కాని ఈ విషయము గొప్ప పత్రికాధిపతులకే అర్థముగాక అడావిడి చేసినప్పుడు (చేస్తున్నప్పుడు) సామాన్య జనులు అడలుకున్నారంటే ఆశ్చర్యమేమున్నది?' అని తన అనుకూలాభిప్రాయాన్ని స్పష్టంగా బహిర్గతం చేసింది.) ముఖ్యంగా ఆంధ్ర రాష్ట్ర మహిళా సభ మాతృ సంస్థ అయిన అఖిల భారత మహిళా సంఘం విడాకుల హక్కుకై తీవ్రంగా కృషి సల్పుతుండిన సందర్భంలో రామసుబ్బమ్మ విడాకుల విషయంలో ఇంత తీవ్రమైన ఛాందస భావాలు కల్గి ఉండడం, అందునా స్త్రీ పురుష సమానత్వాన్ని బలంగా కాంక్షించి పురుషులను ప్రశ్నించిన రామసుబ్బమ్మ ఇలా అనడం, విడ్డూరంగా అనిపిస్తుంది; (విడాకులను ఎంత తీవ్రంగా నిరసించిందో అంతే తీవ్రంగా పరదా పద్ధతినీ నిరసించింది రామసుబ్బమ్మ: ఒకటి ఆమెలోని ఛాందసత్వానికి నిదర్శనమైతే ఇంకోటి ఆమె అభ్యుదయ దృక్పథానికి తార్కాణం. రంగమ్మ ఓబుల్‌రెడ్డి తదితరుల నాయకత్వంలో హైదరాబాదులో నిర్వహించబడుతుండిన 'ఆంధ్ర యువతీ మండలి' ఐదవ వార్షికోత్సవానికి అధ్యక్షురాలుగా ఆహ్వానిత అయిన రామసుబ్బమ్మ సమావేశానికి వచ్చిన స్త్రీ పురుషులను వేరుచేస్తూ తడికలతో ఒక చిన్న అడ్డుగోడ లాంటిదాన్ని ఏర్పాటు చేసి ఉండడాన్ని చూసి నిరసనతో 'పరదా పాటిస్తే నేను ఈ సభలో పాల్గొనను' అని నిక్కచ్చిగా చెప్పడంతో తడికల పరదా తీసివేశారు; పంతం నెగ్గించుకొని రామసుబ్బమ్మ ఉపన్యసించింది. ఒక విషయంలో అభ్యుదయం మరో విషయంలో తిరోగమనం పలుమంది తొలినాటి స్త్రీవాదుల్లో స్పష్టంగా కన్పించే లక్షణమే!) కానీ అది ఆమెలోని డోలాయమాన స్త్రీవాదానికి ప్రబల తార్కాణంగా నిలబడుతుంది.

'మన స్వాతంత్ర్య సంపాదనమే గాక భారతదేశ స్వాతంత్ర్య సంపాదనము గూడ భారత నారీమణుల ప్రధాన విద్యుక్త ధర్మమని భావించవలెను' అని ప్రబోధించిన రామసుబ్బమ్మ దేశ స్వాతంత్ర్య సంపాదనా మార్గంలో అప్పుడు పెచ్చరిల్లుతుండిన హిందూ, ముస్లిం రాజకీయ వైషమ్యాలు తీవ్ర ప్రతిబంధకం కలుగజేస్తుండడం పట్ల కలతచెంది వాటిని సామరస్య పూర్వకంగా పరిష్కరించుకునే దిశగా పనిచేయాలని కోరుతూ ఈ కింది విధంగా అన్నారు:

'ప్రస్తుతము స్వాతంత్ర్యోద్యమమునకు హిందూ మహమ్మదీయ సమస్య తీరని ఆటంకమును కలిగించుచున్నది. దీనినేవిధమునైన పరిష్కరించుకొన్ననే గాని స్వాతంత్ర్యోద్యమము నిరాటంకముగ ముందుకు సాగజాలదు. హిందూ మహమ్మదీయ సోదరీమణులు ఈ విషయమున ఏకైక దీక్ష వహించి హిందూ మహమ్మదీయ సమస్యా పరిష్కారమునకు తమ యమూల్యపు సేవను ధారపోయుదురని ఆశించుచున్నాను. భారతీయుల జన్మహక్కగు స్వాతంత్ర్యమునకు హిందూ మహమ్మదీయుల విభేదములు అడ్డుతగులుచుండుట కడు శోచనీయము. భారత స్త్రీలయందు ఈ విభేదములు లేక సమగ్ర భారత స్త్రీ జాతి ఔన్నత్యమునకు పాటుపడుచుండుట (చూచి) గర్వించవలసియున్నది. నేడు మనమధ్య అధ్యక్ష పీఠమునధిష్టించిన మన సోదరీమణియగు బేగం అమీరుద్దీన్ గారు ఇందుకు (హిందూ - ముస్లిం ఐక్యతకు) తార్కాణము. కాన భారతదేశ దాస్య విమోచనకయి మనమైనను (అంటే స్త్రీలయినను) హిందూ ముస్లిం సమస్యా పరిష్కారమును సాధించవలెను'.

పై విధంగా చెప్పడం ద్వారా హిందూ - ముస్లిం వైషమ్యాలు స్త్రీలలోకింకా పాకకపోయిన విషయం తెల్పి దానికై గర్వపడాల్సిన అవసరం గురించి చెప్పడం స్ఫూర్తిదాయకంగా ఉంది. పురుషులు - అటు కాంగ్రెస్ పురుషులు గానీ, ఇటు ముస్లిం లీగ్ పురుషులు గానీ - తమ స్వార్థ ప్రయోజనాల కోసం కొట్లాడుకుంటూ దేశ విముక్తికి అడ్డుగోడలుగా మారుతున్న సందర్భంలో స్త్రీలు రంగంలోకి దిగి నిరాటంకంగా స్వాతంత్ర్య రథాన్ని ముందుకు నడపాల్సిన విషయాన్ని నొక్కి చెప్పడం ముదావహం. ఈ విధంగా రామసుబ్బమ్మ మహిళోద్యమం ముందా, స్వాతంత్ర్యోద్యమం ముందా అనే ప్రశ్నకు అవి ఏకకాలంలో సాగాలనీ, సాగగలవనీ సమాధానం చెప్పగలిగిన జాతీయవాద స్త్రీవాది.

ఇప్పుడు రామసుబ్బమ్మ జండర్ చైతన్యాన్ని స్థూలంగా మదింపు చేద్దాం. మన వ్యాసంలో అక్కడక్కడా వేరే-వేరే సమావేశాల్లో ఆమె మాట్లాడిన విషయాల్ని ప్రస్తావించినప్పటికీ, ప్రధానంగా ఒకే ఉపన్యాసంపై ఆధారపడి చేస్తున్న విశ్లేషణ అవడం చేత సహజంగానే ఈ మదింపుకు ఒక పరిమితి ఉందన్న విషయం ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. 20వ శతాబ్ది ప్రారంభం నుండీ క్రమక్రమంగా ఆంధ్ర స్త్రీలలో కులుగుచుండిన జండర్ చైతన్యం 30వ దశకం నాటికి నిర్దిష్ట రూపాన్ని తీసుకోవడం మొదలెట్టింది. అందులో ప్రధానాంశం స్త్రీలు తమను తాము 'అబలలం'గా భావించడం వదిలిపెట్టి 'సబలలం' అని భావించడం; ఈ భావమే ఇంకాస్త ముందుకెళ్లి 'మేమూ పురుషులకు సమానమే'గా భావించడం. రామసుబ్బమ్మలో స్త్రీ పురుష సమానత్వ భావజాలం పుష్కలంగా ఉంది; అయితే ఈమె దైవవాద సమానత్వ భావజాలాన్ని ఆశ్రయించింది. అంతేకాకుండా చారిత్రక వాద సమానత్వ భావజాలాల్నీ వాడింది. ఈ సమానత్వ భావన కారణంగానే పురుషులకు సమానంగా స్త్రీలకూ హక్కులుండాలని డిమాండు చేసింది. సదరు హక్కుల నిరాకరణకై అన్యాయంగా పాల్పడ్డంతో ఆగ్రహించి పురుషులను విమర్శించి తమ బుద్ధుల్నీ, పద్ధతుల్నీ మార్చుకోమంది: అలా మార్చుకోని

పక్షంలో స్త్రీలు పురుషులతో సంఘర్షించగలరని హెచ్చరించి, అలాంటి ఘర్షణను నివారించమని హితవు చెప్పింది. కానీ పురుషులకు అలాంటి అడ్డూ అదుపూ లేని అధికారాన్ని కట్టబెట్టిన సంస్కృతినీ, ఆ సంస్కృతి మత మూలాల్నీ వి. సరస్వతి లాగా విశ్లేషించ లేకపోయింది. హిందూ పితృస్వామ్య సంస్కృతి పదిలంగా కాపాడుకుంటూ వచ్చిన పాతివ్రత్య భావనను పూర్తిగా వదిలించు కోలేకపోయింది కాబట్టే విడాకుల హక్కును తీవ్రంగా వ్యతిరేకించింది. హిందూ వర్ణ ధర్మంలో శూద్రులుగా ఈసడించబడ్డ రెడ్డి కులానికి చెందిన రామసుబ్బమ్మ, బ్రాహ్మణేతర ఉద్యమ ప్రభావం ఉన్న రామసుబ్బమ్మ స్త్రీల అణచివేతలో మతధర్మ శాస్త్రాల పాత్ర గూర్చి ఏమైనా చెప్పిందేమో పరిశీలించాల్సి ఉంది.

రాయలసీమ లాంటి వెనుకబడిన ప్రాంతాల్నుంచి మహిళోద్యమ తెరపైకి వచ్చి కేవలం చెప్పడమే కాకుండా బాధ్యతాయుతమైన పదువుల్ని అలంకరించిన రామసుబ్బమ్మ గూర్చి ఒక జీవిత చరిత్రే రాయాల్సి ఉంది. ఆమె స్త్రీవాదం వైరుధ్యాలతోనూ, సంశయాలతోనూ ఎందుకు నిండి ఉంది అనే అంశాన్ని పూర్తి స్థాయి చారిత్రక పరిశోధన వల్ల గాని తెలుసుకోలేము.

2

ఇక మహిళా మహా సభకు అధ్యక్షత వహించిన బేగం అమీరుద్దీన్ ప్రసంగ విశేషాలను టూకీగా తెలుసుకుందాం. బేగం అమీరుద్దీన్ (బేగం అమీరుద్దీన్ ఛాయా చిత్రాన్ని ప్రచురించి చిత్రం పక్కన ఈ కింది సమాచారం పొందుపరిచారు గృహలక్ష్మిలో. 'తంజావూరులో ప్రస్తుతము సెషన్స్ జడ్జిగానున్న శ్రీ మీర్ అమీరుద్దీను గారి సతీమణి. కలకత్తాయందు ఉన్నత విద్యనభ్యసించి తదుపరి పాశ్చాత్య ఖండములయందు సంచారమొనర్చి స్త్రీజన సమస్యల పట్ల విపుల విజ్ఞానమును సంపాదించిరి (శ్రీ బేగం అమీరుద్దీన్ సాహెబా గారు). జాతీయ, అంతర్జాతీయ ప్రఖ్యాతినొంది అప్పటి నుండియు భారత మహిళా సమస్యలందు అత్యంత శ్రద్ధతో పనిచేయుచున్నారు. మొదటి నుండియు ఆంధ్ర వనితా లోకముతో ఎక్కువ పరిచయము కలిగి 1927లో రాజమండ్రి యందు ప్రథమ గోదావరీ మండల మహిళా సభను, కాకినాడలో ప్రథమ ఆంధ్ర రాష్ట్ర మహిళా మహా సభను జరుపుటకు ఈమె (చేసిన) తీవ్ర కృషి, ప్రోత్సహములే కారణము. కడప యందు జరిగిన 14వ ఆంధ్ర రాష్ట్ర మహిళా మహా సభకు అధ్యక్షత వహించి, అధ్యక్షోపన్యాసమునందు ప్రస్తుతపు స్త్రీజన సమస్యలను విపులముగ విమర్శించి, నారీ లోకమునకు నిర్మాణ కార్యక్రమమునకనువగు సందేశమునిచ్చి, సభా కార్యక్రమమును కడు నేర్పుతో నిర్వహించినన్నుతినొందిరి.' బేగం అమీరుద్దీన్ గూర్చి రామసుబ్బమ్మ ఇలా అన్నారు: '...యెల్లప్పుడు స్త్రీ జనాభ్యున్నతి కొరకు నిరంతరము సంఘసేవ చేయుచున్న వీరి నిష్కామ స్వార్థత్యాగము గణనాతీతము. ఇట్టి సాధ్వీమణి ఈ సభకు అధ్యక్షురాలగుట మన భాగ్యము.') ఆంగ్లమున ప్రసంగించగా యస్. సుభద్రమ్మ దానిని తెలుగులోకి అనువదించారు. తన ప్రసంగంలో అమీరుద్దీన్ నాటికి మహిళోద్యమ అజెండాలో ఉన్న అన్ని విషయాలనూ చర్చించారు. అఖిల భారత మహిళా సభ యేర్పడిన నాటి నుండీ భారత స్త్రీల స్థితిగతులలో వచ్చిన మార్పులు 'అద్భుతములు' అంటూ సంతృప్తి ప్రకటించారు. 'భారత జాతీయ జీవ(న) పునరుద్ధరణయే నిజముగ జరుగవలసినచో' స్త్రీ విద్యకు అత్యధిక ప్రాధాన్యతనివ్వాలనీ కానీ, బాలికల విద్యపై ఖర్చుపెట్టే విషయంలో వివక్ష ఉందనీ అది పోవాలనీ చెప్పింది. బాలికల వివాహ వయసు పెంచడం కారణంగా (శారదా చట్టం ద్వారా) 'నేడు ఉన్నత విద్యాసక్తి ప్రబలముగా కనిపించుచున్నది' కాబట్టి 'ఆంధ్ర దేశములో స్త్రీలకు ఒక ఫస్టు గ్రేడు కాలేజీ పెట్టుట మిక్కిలి అవసరము' అని స్త్రీల ఉన్నత విద్యా సంస్థల ఆవశ్యకత గూర్చి చెప్పింది. వయోజన విద్య గూర్చి మాట్లాడుతూ జాతి నిర్మాణంలో స్త్రీ 'ఎక్కువ బాధ్యత' వహిస్తుంది కాబట్టి 'పురుష వయోజనుల విద్యకంటె, స్త్రీ వయోజనుల విద్య విషయమై ఎక్కువ శ్రద్ధ' చూపాల్సిన అవసరాన్ని గుర్తు చేసింది. 'మాతృ సంఘము అజ్ఞానమున మునిగియుండ, ఒక గొప్ప కొత్తజాతి ప్రభవించుట సాధ్యమా?' అని ప్రశ్నిస్తూ స్థానిక సంస్థలూ, ఇతర సంస్థలూ స్త్రీ వయోజన విద్యా కేంద్రాలను నెలకొల్పడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

'బహు భార్యాత్వమును మాన్పుట' ఆవశ్యకత గూర్చి ప్రసంగిస్తూ 'పెక్కు భార్యలను కలిగియుండు ఆచారము ప్రకృతి ధర్మమునకు విరుద్ధమైనది' అని ప్రకటించారు. 'ఈ దుష్టాచారమును శాసనము ద్వారా రూపుమాపుటకు స్త్రీలందరు ముక్త కంఠమున కోరవలసియున్నది. ఇందులకై ప్రయత్నించు శ్రీమతి రాధాబాయి సుబ్బరాయన్ గారిని సంపూర్ణముగ బలపరుచుట అవసరము' అని ఉద్బోధించారు. బాల్య వివాహాలూ, వృద్ధ వివాహాలూ దురాచారములనీ, వాటిని నిర్మూలించాలనీ ప్రకటిస్తూ 'సాధ్యమయినంత మట్టుకు కనీసం 16 యేండ్లు వచ్చువరకు' బాలికలకు పెండ్లిండ్లు చేయవద్దని సలహా ఇచ్చారు. (శారదా చట్టము బాలికల కనీస వివాహ వయస్సును 14గా నిర్ణయించినప్పటికీ మహిళోద్యమ కార్యకర్తలు చాలా వరకు కనీస వివాహ వయస్సు 16గా ఉంటే బాగుంటుందని భావించేవారు. అందుకే బేగం అమీరుద్దీన్ కనీసం 16 సంవత్సరాల దాకా బాలికలను అవివాహితులుగా ఉంచాలని కోరారు. హిందూ సుందరి ప్రథమ స్త్రీ సంపాదకురాలైన మొసలిగంటి రమాబాయమ్మ శారదా చట్టం రావడానికి సుమారు రెండు దశాబ్దాల ముందు నుండే 16 సంవత్సరాలు రాకముందు బాలికలకు పెండ్లిండ్లు చేయరాదని చెప్పి ఉండడం విశేషం.) 'నేడు భారతదేశములో పురుషుల సంఖ్య కన్న స్త్రీలు 60 లక్షలు తక్కువగా' ఉన్నారనీ, 'ఈ శతాబ్దారంభము నుండియు స్త్రీల సంఖ్యయే విశేషముగ తగ్గిపోవుచున్నది' అనీ తెలుపుతూ ఇలాంటి పరిస్థితికి 'బాల్య వివాహముల మూలముగ పడుచు బాలలు విశేషముగ మరణించుటయే కారణము' అని విశ్లేషించారు. శారదా చట్టము వచ్చినప్పటికీ ఇంకా బాల్య వివాహాలు జరుగుతుండడం పట్ల నొచ్చుకున్న బేగం అమీరుద్దీన్ సదరు చట్టం గూర్చి ముఖ్యంగా గ్రామ ప్రాంతాల్లో ప్రచారం చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు.

వరకట్నాలను తీవ్రంగా నిరసిస్తూ బేగం ఇలా అంది: 'ఆడుబిడ్డలు గల కుటుంబములను అవమానముతో క్రుంగదీసి అధోగతిపాలు చేయు మహామ్మారి కట్నముల దురాచారమును పూర్తిగా రూపుమాప వలెనని రెండు చర్యలు అత్యవసరమని నాయభిప్రాయము. ప్రజలందరు ఈ దురాచారమును ఏకగ్రీవముగ ఖండించునంతవరకు నిశ్చల దీక్షతో తీవ్ర ప్రచారమును జరుపుట ప్రథమ చర్య; స్త్రీలు ఆర్థికముగ ఒకరిపైని ఆధారపడవలసిన అవసరము లేకుండ అవసరమయిన యెడల స్వతంత్రముగ ఏదో ఉద్యోగము చేసికొనుటకు తగిన విద్యను స్త్రీల

(కు) ఇప్పించవలెను. మహిళామణులకు నిజమయిన విజ్ఞానము లభించునాడే, ఆ విజ్ఞాన తేజమే కట్నముల దురాచారమును అంతమొందించగలదు. ఏలయనిన ఈ విజ్ఞాన ఫలితముగ స్త్రీలకు స్వతంత్రముగా బ్రతుకగల శక్తి లభించును. ఆ శక్తి లభించిననాడే తల్లిదండ్రులకు తమ ఆడుబిడ్డ ఆర్థిక స్థితిని గురించి ఆత్రము తొలగును.'

సంఘ సంస్కరణలు ఫలప్రదం కావడానికి 'ప్రజాభిప్రాయము పునాది వంటిది' అనీ సంస్కరణానుకూలంగా ప్రజాభిప్రాయాన్ని కూడగట్టడానికి పత్రికల ద్వారా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని తెలుపుతూ 'ఆంధ్ర దేశమున పూర్తిగా స్త్రీలచే నిర్వహింపబడు వార పత్రికలు, మాస పత్రికలు ఎక్కువగ ఉండవలెనని' కోరుతూ 'ఈ పత్రికల ద్వారా స్త్రీలకు తమ స్వవిషయములను చక్కగ గుర్తించగల అవకాశము కలుగగలదు' అని ప్రత్యేక మహిళా ప్రచార మాధ్యమాల ప్రయోజనాన్ని వివరించింది.

స్త్రీల వారసత్వపు హక్కులను ప్రస్తావిస్తూ 'వారసత్వపు హక్కు మానవ జాతి హక్కులలో చాలా సాధారణమయినది (సహజమయినది)' అనీ 'హిందూ స్త్రీ జాతి నేడు ఈ ప్రాథమిక హక్కునే కోరుచున్నది' అనీ తెలుపుతూ 'ఎంత కష్టములకయినను ఓర్చి ఈ హక్కును పొంది తీరెదమని హిందూ స్త్రీలు కంకణము కట్టవలెను' అని ప్రబోధించింది. స్త్రీల వారసత్వపు హక్కు విషయం ఎంతగా ముళ్ల కంపలో చిక్కుకొని ఉన్నదో వివరిస్తూ 'హిందూ స్త్రీల వసతులను గురించి, వారి పోషణను గురించి విచారణ కాదు ఇప్పుడు ముఖ్యముగా జరగవలసినది; హిందూ స్త్రీ సమస్యనంతటిని పూర్తిగా పునర్విమర్శించి చట్టరీత్యా మహిళా లోకమునకు న్యాయము జరుపుటయే ఇప్పటి ముఖ్య కర్తవ్యము' అని ప్రభుత్వానికి సూచించింది. (అఖిల భారత మహాసభ ఈ విధంగా ఒక సమగ్రమైన చట్టం ఏర్పాటుకు చేసిన కృషి ఫలితంగానే 1940లో బి.యన్. రావు అధ్యక్షతన 'హిందూ లా కమిటి' ఏర్పడిందని ప్రారంభంలోనే తెలుసుకొని ఉన్నాం).

వితంతు సమస్య మీద బేగం అమీరుద్దీన్ వెలుబుచ్చిన అభిప్రాయాలు పందొమ్మిదో శతాబ్దం ద్వితీయార్థంలో ప్రారంభమై 20వ శతాబ్ది ప్రథమార్థంలోనూ కొనసాగిన వితంతు వివాహోద్యమ స్థితిగతుల్ని (1940 నాటికి) అంచనా వేయడానికి కొంతవరకు ఉపయోగపడుతుంది. ఆమె మాటల్లో:

'భారత సంఘమునకు ఇంకను పెద్ద మచ్చగనున్నది వితంతు సమస్య. సభా వేదికల నుండి వితంతు వివాహమును గురించి తీవ్ర ప్రచారము చేయువారేకలరు కాని వితంతు వివాహములను ప్రోత్సహించి, క్రియా రూపముగ తోడ్పడువారు ఎక్కువగ కనుపించకున్నారు. 'హిందూ స్త్రీల ఆస్తి హక్కుల చట్టము' వల్ల భాగ్యవతులగు వితంతువుల ఆర్థిక స్థితి బాగుపడినది. కాని బీదల గతి ఏమి? వారి స్థితి హృదయ విదారకము. ఆ వితంతువులలో అనేకులు అర్ధ ఆకలితో జీవితమును గడుపుచున్నారు. ఇటువంటి బీద వితంతువులు తగిన విద్యను పొంది ఏదో పని చేసుకొనుటకు ప్రత్యేక వితంతు విద్యార్థి వేతనములను ఏర్పాటు చేయవలెను. వితంతువులు పాఠశాలలో పనిచేయుటకు ప్రత్యేక సౌకర్యములను చేయవలెను. సోదరీ మణులారా! ఈ అభాగినులకు శక్తికొలది సహాయము చేసి, వారికి కొంత సౌఖ్యము చేకూర్చి ధన్యులు కండు. వారి సహాయార్థము ప్రతి పట్టణములోను వితంతు శరణాలయములను నెలకొల్పుటకు ప్రయత్నించుడు. ఇదియే మీకు నా మనవి.'

మాతృ మరణములను గూర్చి చెబుతూ ప్రసవ సమయంలో అనేక మంది స్త్రీలు మరణిస్తున్నారనీ, అధికారులు ఈ విషయాన్ని గుర్తించడం లేదనీ, గర్భిణుల సహాయార్థం వెచ్చిస్తున్న ధనం స్వల్పంగా ఉందనీ, స్థానిక సంస్థలు మాతాశిశు సంరక్షణావశ్యకతను గుర్తించేట్లుగా మహిళోద్యమ కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు. తరిఫీదు పొందిన మంత్రసానుల ఆవశ్యకతనూ ఆరోగ్య శాఖ అధికారులకు ఇవ్వాల్సిన ఆదేశాలను గూర్చీ స్థానిక సంస్థలను కోరాలని సలహా ఇచ్చారు.

ఆంధ్ర స్త్రీలు 'యావత్ భారతదేశములోను ఐకమత్యమును స్థాపించగల' హిందీ భాష నేర్చుకోవాలనీ, సంఘంలో ఐకమత్యము కొరకు పాటు పడాలని కోరింది. 'కుల కక్షలను అంతమొందించి వివిధ జాతులకు పరస్పర ప్రేమానురాగములను నెలకొల్పగలవారు స్త్రీలే' అనీ, 'మానవ జాతిని చిన్నాభిన్నము చేయుట ఏ మతము ఆశయము కాజాలదు. మానవజాతి నంతటిని ఒకటిగా చేర్చి, విశ్వమానవ సౌభ్రాతృత్వమును నెలకొల్పుటయే ప్రతి మతము ఏకైక ఆశయము. కాబట్టి హిందువులు, మహమ్మదీయులు ఈ విషయమును తమ మనసులో ఉంచుకొని, పరస్పర మత భేదములను మరచిపోయి, సద్భావము కలిగి భారత జాతి అంతటి క్షేమము కోసము పాటుపడవలెను' అని ఆకాంక్షించిన బేగం అమీరుద్దీన్ 'అదృష్టవశమున ఇతర రంగములలో చెలరేగుచున్న ఈ మత వైషమ్యములు, సంఘ కక్షలు మన మహిళా లోకమునకు వ్యాపించలేదు. మహిళా లోకము ఒక ప్రజాస్వామ్య రాజ్యము వంటిది. కుల కక్షలకు, మత వైషమ్యములకు అది బలికాలేదు' అని సంతోషంగా ప్రకటించి 'మనలో (స్త్రీలలో) ఉన్న ఈ ఐకమత్యమును పురుషులకు కూడా వ్యాపించునట్లు చేయుటకు మనము శాంతిదూతలము కావలెను' అని స్త్రీలకు పిలుపునిచ్చారు.

మహిళోద్యమ లక్ష్యం పురుషులతో పోటీపడడం కాదనీ, స్త్రీ పురుషులిరువురు ఒకరికొకరు ఒకరుగా పరస్పర సహకారులుగా ఉండాలంటూ ఈ కింది విధంగా బోధించింది:

'మగవారితో పోటీపెట్టి మనము మహిళోద్యమమును స్థాపించలేదు. మన విలువను నిరాడంబరముగా విశదపరచుటకే ఈ ఉద్యమమును స్థాపించితిమి. అందువల్లనే మన ఉద్యమము భారతదేశ అభ్యుదయమునకు సహకారిగానున్నది. మరొక సంగతిని నేను స్పష్టపరచదలచితిని. దేశ సేవ చేయవలెనని స్త్రీలకు అపార కుతూహలము కలదు. కాని ఈ విషయములో స్త్రీలు ప్రత్యేక సౌకర్యములు, హోదాలు మొదలగు వాటిని ఏమియు కోరుట లేదు. స్త్రీలయినంత మాత్రమున ప్రత్యేక హోదాను కోరకూడదనువారిలో నేనొకదానిని. పురుషులతో సరిసమానత్వమును స్త్రీలు కోరుచున్నారు, నిజమే. కాని యోగ్యతా యోగ్యతలను పాటించక ఈ సమానత్వమును ఇవ్వవలెనని చెప్పలేదు. ప్రపంచములో స్త్రీ పురుషులు సరిసమానమయిన అవకాశములు కలిగి, దేశమునకు శక్తికొలది పాటుపడగల భాగహారులుగ ఉండవలెనని స్త్రీలు కోరుచున్నారు.' (ఈ భావజాలం (మహిళోద్యమం పురుషులతో పోటీపడ్డానికి కాదనేది) గృహలక్ష్మి పత్రికా సంపాదకుల భావజాలంతో సరిగ్గా సరిపోయింది కాబట్టి ఈ భాగాన్ని పెద్దక్షరాల్లో ముద్రించి హైలైట్ చేశారు సంపాదక మహాశయులైన కె.యన్. కేసరి గారు. స్త్రీలు

పురుషులతో పోటీపడినా, పోటీ పడ్డట్లుగా అన్పించినా చికాకు పడేవారీయన. మహిళలు ఎక్కడ తమ చేయిదాటి పోతారో అనే పురుష భయం స్పష్టంగా మనకు కేసరిలో కన్పిస్తుంది. పురుష నిందకు నిష్కారణంగా పాల్పడవద్దని మహిళోద్యమ నాయకులకు ఆయన ఎలా హెచ్చరించారో ముందే తెలుసుకొని ఉన్నాం. మహిళోద్యమం పురుషులతో పోటీపడ్డానికి కాదు అని ఏ మహిళా నాయకురాలు మాట్లాడినా సంబరపడిపోయి సంపాదకీయాల్లో రాసేవారాయన. ఉదాహరణకు 1933 ఏప్రిల్ 16న విశాఖపట్టణములో జరిగిన ఉత్తరాంధ్ర రెడ్డి స్త్రీల ప్రథమ మహాసభకధ్యక్షత వహించిన (రాయలసీమ ప్రాంతీయురాలైన) వి. సీతమ్మ '...మనము సమానమగు హక్కులను కోరు విషయంలో మన దేశాభివృద్ధికై పాటుపడవలయుననియే కాని పురుషులను ధిక్కరించుటకు కాదు...' అని చెప్పగా ఈ మాటల్ని ఉటంకిస్తూ కేసరిగారు '(ఈ) వాక్యములవలన ఆమె నిష్కలంక నిస్సాంఘిక జాతియాభిమానము విశదమగుచున్నది. కాలానుగుణ్యములు దేశాభివృద్ధి కరములునగు సలహాలతో కూడిన ఇట్టి సూక్ష్మ సుందరోపన్యాసము నొసగినందుకు శ్రీమతి సీతమ్మ గారి నెంతయు అభినందించు చున్నాము' అని ప్రశంసల జల్లు కురిపించారు.

చూడండి: 'శ్రీమతి సీతమ్మ గారి ఉపన్యాసము', గృహలక్ష్మి 1933 మే పు. 264-65. అలాగే భారత 'స్వాతంత్ర్య'నంతరం 1953 ఏప్రిల్ 4న కృష్ణా జిల్లా దివి తాలూకా ఘంటసాలలో జరిగిన ఎనిమిదవ కృష్ణా జిల్లా మహిళా మహాసభలో మాట్లాడిన స్త్రీల ఉపన్యాసాలపై ప్రతిఫలిస్తూ 'పురుషుడు చేసే ప్రతి యుద్యోగమును తాను చేయాలనే ఉబలాటం సమాన హక్కులనిపించుకోవు. పురుషులు చేయలేనివి, పురుషుల కంటే స్త్రీలే మెరుగుగా చేయగల ఉద్యోగాలు చాలయున్నవి' అనీ, 'శ్రీమతి రామసుబ్బమ్మ గారు ప్రబోధించిన ఆర్థిక, సాంఘిక రంగాలలో పురుషులతో బాటు ప్రతిపత్తి పెరుగుదలకు అవకాశమున్నది. అయితే ప్రజలు, ప్రభుత్వము ఈ సందర్భమున రెండు విషయాలు గుర్తించాలి – మహిళా విద్యా విధానంలో మార్పు రావాలి; హక్కులను గురించి రాయి గుద్ది మాట్లాడే ముందు యదార్థ పరిస్థితులను ముందుంచుకొని బాధ్యతలను గుర్తించి వ్యవహరించాలి. ఇందుకై మహిళా ఉద్యమం సయితం కృషి చేయాలి' అనీ అన్నారు.)

'భావములను రగుల్కొల్పుటకు, మన కోరికలను విశదపరచుటకు, కార్యక్రమములను నిర్ణయించుకొనుటకు ఇటువంటి సమావేశములు చాల ప్రయోజనకరములే. కాని ఈ కార్యక్రమమును ఆచరణలో పెట్టుటయే అన్నిటికన్నను ముఖ్య విషయము' అని కార్యాచరణ ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు.

ఆంధ్ర మహిళల క్రియాశీలకత్వమును గూర్చి బేగం అమీరుద్దీన్ వెలుబుచ్చిన అభిప్రాయాలు నాటికి బ్రిటీషాంధ్రలోని మహిళోద్యమ గతికీ, ఉదృతికీ అద్దం పడుతున్నాయి. ఆంధ్ర స్త్రీలలో తనకున్న దీర్ఘకాల సంపర్కం ద్వారా 'అనుభవముతో' ఆమె ఆంధ్ర మహిళోద్యమానికి సంబంధించి చేసిన ప్రశంస ఈ కింది విధంగా ఉంది:

'12 సంవత్సరముల కిందట ఉత్సాహపూరితులగు గోదావరీ మండల మహిళామణులు కొందరితో కలిసి కృషిచేయు భాగ్యము నాకొదవియుండెను. తత్ఫలితముగనే అపుడు రాజమండ్రిలో ప్రథమ గోదావరీ మండల మహిళా మహాసభను, కాకినాడలో ప్రథమ ఆంధ్ర మహిళా మహాసభను జరిపియుంటిమి. అది మొదలుగా ఆంధ్రదేశ మహిళా మణులు తమ సహజోత్సాహముతో ప్రతి (సం) వత్సరము ఈ మహాసభలు జయప్రదముగ జరుపుచుండుట చాలా ముదావహము. అఖిల భారత మహిళా మహాసభ ప్రాంతీయ సమావేశములను జరుపుటలో అన్ని ప్రాంతముల వారికంటె ఆంధ్ర మహిళా మణులే పైచేయిగానున్నారు. భారతదేశములోని అనేక ప్రాంతములలోకన్నను, ఆంధ్రదేశ స్త్రీ జనమందు ఎక్కువ ప్రబోధము కలిగినదనుట నిశ్చయము. దీనినెవ్వరు కాదనజాలరు. భారత భూమికి, స్త్రీ జనోద్యమమునకు సేవ చేయుటలో వీరితో దీటురాగల వారెందరో యుందరు. ఆంధ్ర దేశములో ఆరేండ్లు వసించి, అనుభవముతో నేను చెప్పుచున్న మాట ఇది. భారతవర్ష భావి భాగ్యోదయమునకు ఆంధ్ర మహిళలు ప్రశస్తముగ తోడ్పడి, తమ బాధ్యత నెరవేర్చుకొందురనుట నిస్సంశయము.'

బేగం అమీరుద్దీన్ చెప్పిన పై మాటలు కేవలం మొహమాటం కొద్దో లేక తననధ్యక్షురాలుగా పిలిచారు కాబట్టి పొగిడి పోదామనో చెప్పిన మాటలు కావు. స్త్రీల పత్రికలను సునిశితంగా పరిశీలించిన వారెవరైనా మహిళా సంఘాల ద్వారా ఆంధ్ర స్త్రీలు చేపట్టిన మహిళోద్యమ క్రియాశీలకత్వం ఇట్టే బోధపడుతుంది. దేశంలోని వివిధ ప్రాంతాల్లోని స్త్రీలందరికన్నా ఆంధ్ర మహిళలు మెరుగ్గా పనిచేశారని నిర్ధారణకు రావడం ప్రాంతీయ దురభిమానమని మనమనుకొన్నా మిగిలిన ప్రాంతాల్లోని స్త్రీల కెవ్వరికీ ఆంధ్ర స్త్రీలు మహిళోద్యమ నిర్మాణ విషయంలో తీసిపోలేదని చెప్పడం మాత్రం ఎంతమాత్రమూ అతిశయోక్తి కానీ అత్యుక్తి కానీ కాదు.

ఇంగ్లిషు ఉపన్యాసమైన తర్వాత సభకు వచ్చి ఉండిన మహమ్మదీయ స్త్రీలనుద్దేశించి 'ప్రత్యేకముగ' ఉర్దూలో ఉపన్యసించింది బేగం అమీరుద్దీన్ (ముస్లిం స్త్రీలు కూడా చాలామందే సభకొచ్చినారన్న విషయం ముందే తెలుసుకొని ఉన్నాం మనం). ఏయే విషయాలను గూర్చి ఆమె ప్రసంగించిందో గృహలక్ష్మిలో ఇవ్వలేదు. 'వారి వారి విద్యుక్త ధర్మములను గూర్చి విపులముగ ఉపన్యాసము గావించింది' అని మాత్రమే సమాచారం ఇవ్వడం జరిగింది. హిందూ స్త్రీల సమస్యల్లాగే ముస్లిం స్త్రీలూ ఎదుర్కొన్న కామన్ సమస్యలతో పాటుగా ముస్లిం స్త్రీల ప్రత్యేక సమస్యల్నీ ముఖ్యంగా హిందూ – ముస్లిం ఐక్యతను గూర్చి మాట్లాడి ఉంటుందని మనం ఊహించవచ్చు. ఆమె ఉపన్యాసాన్ని విపులంగా ప్రచురించిన ఆంధ్ర పత్రికలో 'మహమ్మదీయ వివాహములు' అనే ఉపశీర్షిక కింద మహమ్మదీయ పురుషుల నిరంకుశ విడాకుల హక్కు దుర్వినియోగానికి సంబంధించి ఆమె వెలిబుచ్చిన అభిప్రాయాలు ప్రచురించబడ్డాయి. దీనికి ముస్లిం స్త్రీలు బలిపశువులయ్యేవారు కాబట్టి ఆమె తప్పకుండా ఈ విషయాన్ని వారితో 'ప్రత్యేకముగ' చర్చించి ఉండవచ్చు. ముస్లింల వివాహాల గూర్చి, ముఖ్యంగా ఏకపక్షంగా పురుషులు విడాకుల హక్కును దుర్వినియోగం చేస్తుండడం గూర్చి ఆమె ఈ కింది విధంగా అన్నారు:

'విడాకుల విషయంలో మగవారికి గల అధికారమును తగ్గించుటను గురించి యోచించుట చాలా అవసరము. ఇప్పటి మహమ్మదీయ వివాహ చట్టముల ప్రకారము ఈ విషయములో మగవారికి నిరంకుశాధికారము కలదు. ఈ చట్టము ప్రకారము ఆడుదాని దోషము అవంతయును లేకపోయినను మగవాడు తనకు తోచినప్పుడు ఆమెకు

విడాకులివ్వవచ్చును. కోర్టులతో ఎటువంటి జోక్యము లేకుండానే మగవాడు పవిత్ర వివాహ బంధములను తెంచివేయగలడు. నీకు విడాకులిచ్చాను – అను రెండు మాటలతో వివాహాన్ని రద్దుచేసి ఆడుదాని బతుకు బుగ్గిపాలు చేయగల నిరంకుశాధికారము మహమ్మదీయ పురుషునికి కలదు. స్త్రీలకు ఏమి చెప్పుటకును అధికారము లేదు. మాగవాని ఆజ్ఞకు శిరసావహించి, తనకు పట్టిన దుర్గతికి నిశ్శబ్దముగ కన్నీరు కార్చుట తప్ప స్త్రీకి వేరుదారి లేదు. మగవారు ఈ నిరంకుశాధికారమును దుర్వినియోగము చేయుట వల్ల ఎందరెందరో అమాయక మహమ్మదీయ యువతుల జీవితములు అధోగతి పాలవుటను నేను చూచితిని.

పూర్వము పరిస్థితులింత దారుణముగ లేవు. అప్పుడు విడాకుల విషయములో మహమ్మదీయ న్యాయవేత్తలు న్యాయ సమ్మతమైన తీర్పు చేప్పేవారు. విడాకుల పద్ధతి న్యాయ సమ్మతమే అయినను అది చాలా అసహ్యకరమయినదని మహమ్మదు ప్రవక్త చెప్పిరి. తప్పనిసరి అయిన గాని విడాకులకు పూనుకోకూడదని వారు బోధించిరి. దాంపత్య జీవితములో కలిగే తగాదాలను న్యాయశాస్త్రజ్ఞుల ఎదుట పెట్టవలెనని ఖురాన్‌లో నిబంధన ఉన్నను దానిని పాటించెడివారు ఈ రోజులలో కరవయిరి. పవిత్ర వివాహమును తన ఇచ్ఛా విలాసమునునుసరించి తనంతట తానే రద్దుచేయగల నిరంకుశాధికారమును పురుషుడు చేత చిక్కించుకొన్నాడు. పరిస్థితులు ఈ విదముగా తారుమారయిన యీ రోజులలో పురుషుల నిరంకుశాధికారము వల్ల స్త్రీలకు ఒక్కొక్కప్పుడు కలిగే ఘోర బాధలను తప్పించి స్త్రీ జాతిని రక్షించుటకు న్యాయ చట్టముల సహాయమును అర్థించుట అవసరమయినది.'

మహిళా సభ రెండవ రోజు మధ్యాహ్నం సుమారు రెండు వేల మంది ప్రేక్షకులతో ('అత్యధిక సంఖ్యాకులైన పురంధ్రీమణులతో') జిల్లా బోర్డు భవనము 'కిక్కిరిసిపోయి' ఉండగా స్త్రీల విషయాలను కూడా కలుపుకొని 'సుమారు 40 తీర్మానములు సభవారిచే చర్చించబడి ఆమోదింపబడినవి.'

'కడపలో సమవేశమైన ఆంధ్ర రాష్ట్ర మహిళా సభకధ్యక్షత వహించిన బేగం అమీరుద్దీన్ సాహెబాగారి అధ్యక్ష వాక్యములను, ఆహ్వాన సంఘాధ్యక్షులగు శ్రీమతి రామసుబ్బమ్మ గారి స్వాగత వచనములను ఆంధ్ర స్త్రీ లోకమున అంతర్వీక్షణమును గలుగజేసి స్త్రీ సమస్యలెట్టివో, వారి బాధ్యత యెట్టిదో ఆలోచనల పురిగొల్పునని నమ్ముచున్నాను' అని ఆంధ్ర పత్రిక సంపాదకీయంలో ప్రకటించింది.

రాయలసీమ మహిళోద్యమంలో ఈ సభకున్న ప్రాశస్త్యాన్ని గృహలక్ష్మి వాస్తవికంగా ఈ కింది విధంగా స్పష్టపరిచింది:

'కడపయందు జరుగుటకు ఇదియే మొదటి మహిళా మహాసభయైనను ఆహ్వాన సంఘం వారు అత్యంత శ్రద్ధతో నేర్పాటు గావించి పురజనుల సహకారముతో సభను విజయవంతముగ జరిపిరి. ఈ మహాసభకై గత రెండు, మూడు మాసముల నుండియు జరుగుచున్న ఏర్పాటులతో కడప, పరిసర ప్రదేశములలోను, యావత్ రాయలసీమ మహిళా లోకములోను నూతన చైతన్యము, కార్యదీక్ష కలిగి సమావేశము జరుగు (జరిగిన) రెండు దినములు ప్రతినిధుల, పౌరుల ఉత్సాహ సంభ్రమములు కడపలో వెల్లివిరిసినవి. ఈ సమావేశముతో దత్త మండల మహిళా చరిత్రలో ప్రారంభమగు నిర్మాణ కార్యదీక్షాబద్ధమైన ఒక నూతన శకారంభ సృష్టికి కారణ భూతులైన ఆహ్వాన సంఘము వారెంతయును అభినందనీయులు.'

(అయిపోయింది)

అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి మృతి

మిసిమి పూర్వ సంపాదకుడు, బౌద్ధ సాహితీవేత్త అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి (88) ఇకలేరు. హైదరాబాద్‌లోని మదీనాగూడలోని స్వగృహంలో మార్చ్ 9న కన్నుమూశారు. ఆయన 1933, ఫిబ్రవరి 22న ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా తెనాలి తాలూకా తూములూరులో జన్మించారు. ఆంధ్ర యూనివర్సిటీలో తత్వశాస్త్రంలో మాస్టర్ డిగ్రీ చేశారు. తెనాలి వివిఎస్ఆర్ కాలేజీలో తర్కశాస్త్రం బోధించారు. సిగ్మండ్ ఫ్రాయిడ్ సిద్ధాంతంపై లోతైన పరిశోధన చేసి 'స్వప్న సందేశం', 'మనసు మర్మం', 'మనసు గతినే మార్చిన ఫ్రాయిడ్' తదితర పుస్తకాలు రాశారు. 'ఎ ఫిజిక్స్ ఫర్ ది మోడ్రన్ వరల్డ్' పుస్తకాన్ని 1964లో తెలుగులోకి అనువదించారు. బౌద్ధ సాహిత్యాన్ని లోతుగా అధ్యయనం చేసి పాళీ భాష నుంచి పలు రచనలను తెలుగులోకి అనువదించారు. 'బుద్ధుని ధర్మోపదేశం', 'మానవీయ బౌద్ధ', 'అంగుత్తర నికాయం' తదితర పుస్తకాలు రాశారు. 'మిసిమి' మాస పత్రికకు 15 సంవత్సరాలు సంపాదకుడుగా వ్యవహరించారు. బౌద్ధం, తర్కం, తత్వం, మానసిక శాస్త్రాలలో దాదాపు 80 పుస్తకాలు రాశారు.

కాకరాల సూర్యకాంతం ఇకలేరు

సీనియర్ నటుడు, అమరుల బంధు మిత్రుల సంఘం గౌరవాధ్యక్షుడు కాకరాల సహచరి సూర్యకాంతం(82) అనారోగ్య కారణాలవల్ల హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో గల చంద్ర రాజేశ్వర రావు ఓల్డ్ ఏజ్ హోంలో మార్చ్ 18న మరణించారు. సూర్యకాంతం కోరికమేరకు ఆమె భౌతిక కాయాన్ని వారి కుటుంబ సభ్యులు, మిత్రులు కోఠిలోని ఉస్మానియా మెడికల్ కాలేజీకి అప్పగించారు. కళ్లను ఎల్‌వి ప్రసాద్ కంటి ఆస్పత్రికి ఇచ్చారు. సిఆర్ ఫౌండేషన్ ప్రాంగణంలో జరిగిన కాకరాల సూర్యకాంతం సంతాప సభలో పలువురు సామాజిక, ప్రజా సంఘాల కార్యకర్తలు, బంధు మిత్రులు వారితో తమకున్న అనుభవాలను పంచుకున్నారు. 'జీవిత కాలం ప్రత్యామ్నాయ రాజకీయ విలువలు, సంస్కృతిని శ్వాసిస్తూ సూర్యకాంతం జీవించారని' అన్నారు. అభ్యుదయ సాహిత్యం చదవడంతో పాటు ఆ విలువలను తమ పిల్లలకు నేర్పించారన్నారు. 'తన ఇద్దరు కూతుళ్లు అజ్ఞాతంలోకి వెళ్లడం వల్ల కుంగిపోకుండా వారి స్నేహితులు కలిసినప్పుడు మాతృహృదయంతో స్పర్శిస్తూ స్పందించేవార'న్నారు.

వీక్షణం రచయితల సమావేశం

7 మార్చ్, 2021, హైదరాబాద్

మార్చ్ 7న వీక్షణం రచయితల, మిత్రుల సమావేశం హైదరాబాద్ దోమలగూడలోని ఎమెస్కో సమావేశ ప్రాంగణంలో జరిగింది. సమావేశానికి వచ్చిన రచయితలు, శ్రేయోభిలాషులకు వీక్షణం ఎడిటోరియల్ కలెక్టివ్ సభ్యులు కె. బాల్‌రెడ్డి ఆహ్వానం పలికారు.

వీక్షణం సంపాదకులు ఎన్. వేణుగోపాల్ సమావేశ ఉద్దేశాలను, వీక్షణం స్థితిగతులను వివరించారు. "వీక్షణం పత్రిక 2003లో ఎబికె ప్రసాద్ గౌరవ సంపాదకులుగా, వి. హనుమంతరావు సంపాదకులుగా ప్రజాపక్ష సమీక్షగా ప్రారంభమైంది. ఈ పద్దెనిమిది ఏళ్లలో దాదాపు నాలుగు వందల మంది రచయితలు వీక్షణంకు నాలుగు వేలకు పైగా వ్యాసాలు అందించారు. వీక్షణంలో రచనలతోనే రచయితలుగా గుర్తింపు పొందిన అనేక మంది రచయితలున్నారు. క్రమం తప్పకుండా దాదాపు ముప్పై మంది రచయితలు వీక్షణంకు రాస్తున్నారు. వీక్షణంలో మహిళా ప్రాతినిధ్యం లేకపోవడం, స్త్రీల సమస్యలపై తగినన్ని వ్యాసాలు రాకపోవడమనే పరిస్థితిని అధిగమించాల్సిన అవసరం ఉంది. ప్రత్యేకంగా మహిళా పత్రికలు ఉండడం వల్ల కూడా వీక్షణంకు రచనలు తక్కువ వస్తున్నాయని అనుకుంటున్నాం. అయినా మహిళా ప్రాతినిధ్యం పెంచడానికి ప్రయత్నిస్తాం. ఉమ్మడి రాష్ట్ర విభజన తరువాత ఆంధ్రప్రదేశ్ నుంచి వ్యాసాలు రావడం తగ్గింది. ఇటీవలి వ్యవసాయ చట్టాలపైన చర్చ నడుస్తోంది. కార్మిక చట్టాలపైన కూడా చర్చ జరగాల్సి ఉంది. సంస్కృతిని గురించిన విషయాలు, సినిమా తదితర అంశాలపై సమీక్షలు ఉండాలని అడుగుతున్నారు. విరివిగా పుస్తక సమీక్షలు రావాల్సిన అవసరం ఉంది. వీక్షణం చర్చా సంప్రదాయానికి వేదిక కావాలి. వీక్షణంలో వచ్చే రచనలపై చర్చ జరగాలి. ఉత్తరాలు ఇంకా రావాల్సి ఉంది. ఇక ఆర్థిక విషయానికొస్తే చిన్న పత్రికలకు సమాచార శాఖ ఇచ్చే ప్రకటనలు 2003 నుంచి 2009 మధ్య పత్రికకు క్రమం తప్పకుండా ఉండేవి. కాలక్రమంలో చిన్న పత్రికలకు ప్రోత్సాహం తగ్గిపోయింది. ఎటువంటి ప్రకటనలు రావడం లేదు. ఆర్థిక ఇబ్బందులు ఏటా పెరిగిపోతున్నాయి. వీక్షణంకు ఏడాదికి రు. 10 నుంచి 12 లక్షలు ఖర్చవుతోంది. సగానికి పైగా చందాల ద్వారా, ఇంకో 15 నుంచి 20 శాతం పుస్తకాల అమ్మకాల ద్వారా వస్తున్నాయి. మిగతా 30 శాతాన్ని ప్రకటనల ద్వారా విరాళాల ద్వారా పూడ్చుకోవాల్సిందే. అందువల్ల పాఠకులు, దాతలు, అభిమానుల సహకారంతోనే వీక్షణం ముందుకు నడుస్తోంది. ఆర్థిక అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఒక ట్రస్ట్ ఏర్పాటు చేస్తే బాగుంటుందనే సూచనలు ఉన్నాయి. ఇవాళ వీక్షణం రచయితలు, శ్రేయోభిలాషుల సమావేశానికి హాజరు కాలేకపోయిన మిత్రులు తమ సందేశాలను పంపించారు. అవి వీక్షణంలో అచ్చువేస్తాం. అని సంపాదకులు వివరించారు.

సమావేశంలో ఎ. నర్సింహారెడ్డి, కె. వేణుగోపాల్, సతీష్ బైరెడ్డి, కె. బాల్‌రెడ్డి, ఎన్. భీమార్జున్‌రెడ్డి, చిమ్మె. జాన్ బర్నబాస్, బి.ఎస్. రాజు, ఎ. రాజేంద్రబాబు, ఎం. రాఘవాచారి, విద్యాభూషణ్, జి. అమర్‌నాథ్, టి. రోహిత్, పి. ముఖేష్, పి. సృజన, రామ్ మోహన్, పి. చిన్నయ్య, శంకర ప్రభాకర్, మోత్కూరు శ్రీనివాస్, ఎస్. వెంకటేశ్వర్లు, కె. వెంకటేశ్వర్లు, ఎ. అప్పారావు, నర్సిమ్, ఎం.డి. నజీర్, పొన్నూరు నీరజ, సి.ఎచ్. రమణాచారి, మెరుగు రాజయ్య, వై. రామచంద్రం, డి. రాజయ్య, డి.వి. రామకృష్ణారావు, డా. ఎ. పున్నయ్య, కె. మహేష్, యెల్చాల నర్సింలు, దమ్మన జ్యోతి, జి. సుదర్శన్‌రావు, మార్వాడి సుదర్శన్, ఏనుగు మల్లారెడ్డి, ముత్తన్నగారి రాజేందర్‌రెడ్డి, డా.ఎస్. వెంకన్న, ఇ. శంకర్, ఏలేశ్వరం వెంకటేశ్, మమత, వి. వెంకట రమణ, ఎస్, వెంకటేష్, డి.ఎస్.ఎస్.ఆర్. కృష్ణ, కె. సజయ, అగ్నిమిత్ర, ఎం. సత్యం, జి. సత్యనారాయణరెడ్డి, బి. రామకృష్ణ పాల్గొని తమ అభిప్రాయాలు, సూచనలు, సలహాలు చెప్పారు. వాటిలో కొన్ని:

- వీక్షణం పత్రికను తప్పకుండా కాపాడుకోవాలి. పత్రిక మనతో పాటు పెట్టుకొని చందాలు కట్టించాలి. ఉద్యమించి సాధించిన తెలంగాణలో ప్రశ్నించే వారిపై ఉపా కేసులు పెడుతున్నారు. మహిళా రచయితలను పెంచుకోవాలి. పత్రికను నిలబెట్టుకోవడానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలి.
- డిజిటల్ సబ్‌స్క్రిప్షన్ ద్వారా కాన్‌ట్రిబ్యూషన్ పెరుగుతుంది. స్కాలర్స్‌కు మంచి వేదిక. హ్యూమానిటీస్, జెఆర్ఎఫ్ విద్యార్థులతో కలిసి విస్తృతపరుచుకోవాలి. టాపిక్స్ వారీగా వ్యాసాలు సేకరించుకోవాలి. కోవిడ్ పై, రాజకీయార్థిక విషయాలపై వ్యాసాలు ఇంగ్లిష్‌లో వచ్చాయి. తెలుగులో రాలేదు. ప్రజారోగ్యం మీద వ్యాసాలు రావాల్సిన అవసరం ఉంది.
- విపుల, చతుర లాంటి పత్రికలు కూడా మూతపడిన పరిస్థితి నేడు ఉంది. కోర్టుల తీర్పులు చూస్తే చాలా లోపాలతో ఉంటున్నాయి. న్యాయవ్యవస్థను గురించి కూడా రాయాలి. వ్యవసాయం గురించి కూడా రచనలు రావాలి. రియల్ ఏస్టేట్ చాలా పెద్దఎత్తున నడుస్తోంది. దీనివల్ల భూమి సాగుచేయకుండా పోతోంది. దీనిపై అధ్యయనం చేయాలి. నీటి పారుదలపై వ్యాసాలు రావాలి.
- రెవెన్యూ ట్రిబ్యునల్స్ నెల రోజుల్లోపు తీర్పులు రాయమని ఆదేశిస్తే చాలా సమస్యలు మొదలయ్యాయి. జిల్లా కేంద్రాల్లో ఉపాధ్యాయులతో కలిసి మీటింగ్ పెట్టాలి. ప్రకటనలు సేకరించాలి.
- రవీష్ కుమార్ రైతుల ఉద్యమంపై 40–50 ఎపిసోడ్‌లు చేశాడు. ప్రభుత్వాలకు కంటిలో నలుసుగా ఉన్నారు. అలాంటి వారిని ప్రభుత్వాలు అణచివేస్తున్నాయి. అలాంటి పని వీక్షణం చేస్తోంది. ఇన్ని ఇబ్బందుల మధ్య నడిపిస్తున్నారు. పత్రికను కాపాడుకోవడం మీద ప్రధానంగా దృష్టి పెట్టాలి. పత్రికకు కార్టూన్స్‌తో పాటు వ్యాసాలు రాసే ప్రయత్నం చేస్తాను.
- మహిళలపై జరుగుతున్న అత్యాచారాలపై వ్యాసాలు రావాలి. కళ్యాణ లక్ష్మి, ప్రభుత్వ పథకాలు ఎలా చేరుతున్నాయి. నా వంతుగా పత్రిక గురించి పది మందికి అవగాహన కల్పిస్తాను.
- హైదరాబాద్‌లో ఏడు విశ్వవిద్యాలయాలు ఉన్నాయి. రోజుకో యూనివర్సిటీకి వెళ్లే ప్రయత్నం చేస్తే పత్రిక చందాలు పెంచుకోవచ్చు, అందుకు సహకరిస్తాను.

- డిజిటల్ సబ్‌స్క్రిప్షన్, యూ ట్యూబ్ చానల్ నిర్వహించడం ఆదాయం పెరుగుతుంది.
- వ్యాసాల నిడివి ఎక్కువగా ఉంటుంది. ఎక్కువ సమాచారంతో ఉంటున్నాయి. ఎడిటింగ్ పెరగాలి. వ్యాసం రెండు లేదా మూడు పేజీలు ఉంటే సరిపోతుంది. టైటిల్ చూడగానే లెఫ్ట్ ఓరియంటెడ్ పత్రిక అనే అభిప్రాయం ఉంటుంది. భాష సరళంగా ఉండేలా చూడాలి. రచన ప్రక్రియకు సంబంధించి తరగతులు నిర్వహిస్తే బాగుంటుంది.
- న్యూట్రల్‌గా ఉండే పత్రిగా వస్తే ఎక్కువ మందిని చైతన్యం చేసే అవకాశం ఉంది. లేఔట్‌లో విడి భాగాలు రాకుండా చూడాలి.
- రాజ్య హింస, నిషేధాలపై విశ్వవిద్యాలయాల్లో ఉద్యమాలు, చర్చలు లేవు. విషయాలను అర్థం చేసుకోవడానికి ఇష్టంలేని ఉపాధ్యాయులు ఉన్నారు. విద్యార్థులను చైతన్యపరచవలసిన అవసరం ఉంది.
- నేడు మీడియా భ్రష్టుపట్టిపోయింది. మనం ప్రభుత్వాన్ని విమర్శిస్తే అక్రమ కేసులు, అరెస్టులు అవుతున్నా ఒక చుక్కానిలా వీక్షణం నిలబడింది. వి. హనుమంతరావు గారు ఏ లక్ష్యంతో వీక్షణాన్ని నడుపాలనుకున్నారో అలాగే నడుపుతున్నందుకు అభినందనలు. అనేక అంశాలు భిన్న కోణాలతో అందిస్తున్నాం. నూరు ఆలోచనలు సంఘర్షించుకోవడానికి దోహదం చేస్తుంది. అంతర్జాతీయ విషయాలు రాసేటప్పుడు ఇంట్రో ఇస్తే బాగుంటుంది. పుస్తక పరిచయాలు, సమీక్షలు చేద్దాం. కశ్మీర్ రగులుతూనే ఉంది. అలాంటి విషయాలు తెలియని యువత నేడు ఉంది. విద్యార్థులను, యువతను చైతన్యం చేయాలి.
- ప్రజల గొంతుకగా వీక్షణం వస్తోంది. దాన్ని ప్రత్యామ్నాయంగా ప్రజల్లో నిలపాలి, కాపాడుకోవాలి.
- పత్రిక ప్రారంభం నుంచి పాఠకుడిని. పత్రికకు ప్రజా ఆదరణ ఉంది. ఆర్థిక అంశాలు కీలకం, పత్రికను బతికించుకోవాలి. ఈ గొంతును కాపాడుకోవాలి.
- పత్రిక ఎడిటోరియల్ కలెక్టివ్ అని కాకుండా సమిష్టి అనే వెలుగులో నడిస్తే బాగుంటుంది. మన సమాజంలో రావాల్సిన మార్పు ఎందుకురావడం లేదు ఆలోచించాలి. 20 ఏళ్ల సందర్భంగా ప్రత్యేక సంచిక తేవాలి.
- ప్రజారోగ్యం-మహిళల ఆరోగ్యంపై ఎక్కువ వ్యాసాలు రావాలి. విద్య, వైద్యం నుంచి ప్రభుత్వం ఎలా తప్పుకుంటుందో రాయాలి. ఆహార కల్తీని పట్టించుకోవడం లేదు. మతతత్వ శక్తులు మహిళలు, యువతపై దృష్టిపెట్టి పనిచేస్తున్నారు. మంచి పుస్తకాలను పరిచయం చేయాలి. వీక్షణం డ్రైగా అనిపిస్తోంది. మామూలు వాళ్లకు అర్థమవుతుందా? సరళంగా ఉండాలి. పత్రిక ఆగిపోకుండా రావడానికి ఎవరు ఇవ్వగలిగినంత వాళ్లు ప్రతినెల ఇచ్చే ఏర్పాటు చేస్తే బాగుంటుంది.
- పత్రిక వరుసగా రావడానికి రెగ్యులర్‌గా ఇవ్వగలిగే వాళ్లను చూడగలిగితే మంచిది. ప్రతినెల నేను రు. 200 పంపిస్తాను. అలాగే ఇంకొంత మంది చేస్తే బాగుంటుంది. టెలికమ్, ఇండస్ట్రియల్ పాలసీ వచ్చింది. సింగిల్ విండో వచ్చేస్తున్నాయి. ఎన్నో ఇబ్బందులున్నాయి. విధాన విమర్శ చేయాలి. ఫార్మా సిటీతో చాలా సమస్యలున్నాయి. క్షేత్ర పర్యటన చేయడం, ప్రత్యేక సంచికలు కూడా తేవాలి.
- సామాజిక మాధ్యమాలను విస్తృతంగా ఉపయోగించుకోవాలి. పత్రికను ఆర్థికంగా ఆదుకోవాలి.
- సమాజంలో మార్పు రావాల్సిన అవసరం రోజురోజుకు పెరుగుతుంది. మల్లన్నసాగర్ ప్రాజెక్టుపై రాశాం. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల గురించి రాయాలి. చట్టాలు ఉన్నవాళ్లకు ఎలా ఉపయోగ పడుతున్నాయో రాయాలి.
- పత్రిక విస్తరణకు ఒక ప్రచార వాహనాన్ని తీసుకొని అన్ని జిల్లాలు తిరగాలి. అప్పుడు చందాలు పెరుగుతాయి. అవినీతిపై, ఆత్మహత్యలపై వ్యాసాలు రావాలి.
- కొత్త వారిని పత్రిక చదివించడంలో ఫెయిల్ అవుతున్నాం. పత్రిక నిలబడడానికి నా వంతుగా నేను కృషి చేస్తాను. ఆర్థిక, రాజకీయ విషయాలపై వ్యాసాలు ఉంటున్నాయి. కాని సాహిత్యానికి ఏమైనా అవకాశం ఉంటుందా ఆలోచించండి.
- ఇ పత్రికగా మారాలి. 5-10 నిమిషాలు విడియోలాంటిది బాగుంటుంది. సామాజిక మాధ్యమాన్ని మనం విస్తృతంగా వినియోగించుకోవాలి. గోదావరిఖనిలో ఓపెన్ కాస్ట్ తవ్వకాలు మొదలుపెట్టబోతున్నారు. ప్రజల నుంచి అలజడి లేదు. మొత్తం దుమ్ము లేచిపోతోంది. పత్రికను డిజిటల్ పద్ధతిలో తేవాలి.
- రోజు వారిగా జరుగుతున్న అంశాలపై తెలుసుకోవడం కోసం వెతుకుతున్నప్పుడు వీక్షణం పరిచయం అయింది. ఇంగ్లిష్ నుంచి మంచి వ్యాసాలు అనువాదం చేసి వేస్తే బాగుంటుంది. సోషల్ మీడియాలోకి వెళితే బాగుంటుంది. సైన్స్ గురించిన వ్యాసాలు వస్తే బాగుంటుంది. ఈ సమావేశంలో యువకులు కనబడడం లేదు. జనాలు ఉన్నారు. వాళ్లకు సరయిన ఎక్స్‌పోజర్ కలుగచేయాలి.
- ట్రస్ట్ ఏర్పాటు చేసే ప్రయత్నం చేయండి. ఆ దిశగా ఆలోచించమని కోరుతున్నాను. ఆంధ్రా ప్రాంతం నుంచి వ్యాసాలు రావడంలేదు అనే దానిపై నా అభిప్రాయం ఈ రోజు ఉద్యోగులను ప్రభావితం చేయలేకపోతున్నాం. మాది కూడా అదే పరిస్థితి. అనేక ఉద్యమాలు జరుగుతున్నాయి కానీ వాటిని స్పర్శించలేకపోతున్నాం.
- వీక్షణంకు ఒక దృక్పథం ఉంది. పాఠకులు 100 కిలోమీటర్ల దూరం నుంచి వచ్చారు. మామూలు విషయం కాదు. రచన చేయాలంటే అధ్యయనం చేయాలి. దృక్పథం ఏర్పరుచుకోవాలి. సమస్యలు ఎలా అధిగమించాలో సమీక్షించుకొని ముందుకు పోవాలి. చదివేవాళ్లు తక్కువ అయిపోతున్నారు.
- వీక్షణం గురించే కాదు.. మిగతా అన్ని కలిసి ముందుకు వెళ్లవలసి ఉంది. పత్రిక అందజేసే మార్గాలు ఆలోచించాలి. కేవలం బుక్ ఫెయిర్, నగరాల దృష్టితో పత్రికలు అచ్చువేస్తే కుదరదు. సామాన్య పాఠకుడిని ఎలా చేరాలో అలోచించాలి. కొత్త తరం ఏమి ఆలోచించాలి. ఆలోచించే తరం ఇంగ్లిష్‌లోకి వెళ్లిపోయింది. అందరం కలిసి ఆలోచించాలి. డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ ఎలా పెంచుకోవాలో ఆలోచించాలి. భవిష్యత్‌లో రిఫరెన్స్ ఉండదు. ఫిజికల్ ఉత్పత్తి లేకుంటే సాక్ష్యం, రెఫరెన్స్ ఉండదు. గూగుల్ కైనా మనమే ఇవ్వాలి. విశాలాంధ్ర లాంటి వాళ్లు బస్సు తిప్పారు. ఖర్చుతో కూడిన మాధ్యమం. మిత్రులు గ్రామాల్లో ఉన్నారు. చదివాక ఇవ్వడం, పంపడం చేయాలి. చదువరులను చేరుకునే ప్రయత్నం చేయాలి.

- భారతి పత్రికలా వీక్షణం వస్తోంది. దిశానిర్దేశం చేయాలి. సామాజిక దృష్టి లేకుండా అయిపోతున్నారు. ఇలాంటి పత్రిక మనకు ఉన్నందుకు సంతోషం. కోవిడ్ అయినా పత్రిక తెచ్చాం. పత్రికలు పెట్టుబడికి దాసోహం అయిపోయాయి. ప్రజా పక్షంగా వస్తున్న వీక్షణంను ముందుకు తీసుకువెళ్లాల్సిన బాధ్యత మనందరిపైనా ఉంది.
- వీక్షణం రచయితల సమావేశంకు వచ్చిన రచయితలు, శ్రేయోభిలాషుల నుంచి వీక్షణం ఆర్థిక పరిస్థితిని మెరుగుపరచడానికి కొంత మందితో ఒక కో-ఆర్డినేషన్ కమిటీ ఏర్పాటు చేసుకోవాలి. ఆ కమిటీ ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల్లోని వీక్షణం పాఠకుల, అభిమానుల సహకారాన్ని పత్రిక కొనసాగింపు కోసం ప్రోదిచేయాల్సిన అవసరం ఉంది.
- సైద్ధాంతిక అంశాలపై లోతైన చర్చకు వీక్షణం వేదిక కావాలి. ఇప్పుడు దేశంలో ఉన్నది ఫాసిజమా, నిరంకుశత్వమా అనే అంశాలపై వ్యాసాలు రావాలి. పరస్పర భిన్నమైన అభిప్రాయాలు సంఘర్షించడానికి వీక్షణం వేదిక కావాలి.
- స్కూళ్లల్లో వీక్షణం అధ్యయన బృందాలను ప్రోత్సహించాలి. లైబ్రరీలలో వీక్షణం అందుబాటులో ఉండేలా చూడాలి.

సమావేశానికి హాజరైన మిత్రులు ప్రతి ఒక్కరూ తమ అభిప్రాయాలు పంచుకున్న తర్వాత వీక్షణం కలెక్టివ్ తరఫున బిఎస్ రాజు, అర్విణి రాజేంద్రబాబు, ఎ నిర్సంహారెడ్డి స్పందించారు.

రచయితల సమావేశం ఎప్పుడూ వినూత్నమైన ఆలోచనలను అందిస్తోందని, పనిచేసే వారి ఉత్సాహాన్ని పెంచడమే కాకుండా ముందు చూపుకు దోహదపడుతోందని బి.ఎస్. రాజు అన్నారు.

వీక్షణంలో వ్యాసాలు సాధారణ పాఠకులు అందుకోవడంలో కాస్తా కష్టం ఉంటోందన్న అభిప్రాయంపై స్పందిస్తూ వ్యాసాలకున్న గాఢత, లోతు వలన ఆ పరిస్థితి ఉంటుందని అర్విణి రాజేంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఇది అంతిమంగా పాఠకుల వివేచనను పెంచడానికి దోహదపడుతుందని అన్నారు. మూడు తరాల ప్రాతినిధ్యంతో వీక్షణం రచయితల సమావేశం జరగడం దానికదే ఒక గొప్ప బలమని అన్నారు. యువతను అందుకోవడంలో ఉన్న వెనుకబాటును ఇంకా అధిగమించాల్సి ఉందని అన్నారు. మీ సలహాల బలంతో వీక్షణం మరింత ముందుకు పోతుందని నమ్ముతున్నట్లు చెప్పారు. ఒక మలయాళ పత్రిక ఎటువంటి ప్రకటనలు లేకుండా కేవలం అభిమానుల సహకారంతో సుదీర్ఘకాలం కొనసాగిన అనుభవాన్ని గుర్తుచేస్తూ అలాంటి సహకారాన్ని, తోడ్పాటును తెలుగు పాఠకులు కూడా అందిస్తారనే ఆశను వ్యక్తం చేశారు.

గట్టి ప్రయత్నమే చేస్తున్నా వీక్షణం పత్రికలో రావాల్సిన అనేక అంశాలు నమోదు చేయడంలో ఇంకా వెనుబడే ఉన్నామని ఎ. నర్సింహారెడ్డి అన్నారు. రాయవలసిన ఒత్తిడి చాలా ఉంటోందని అన్నీ అందుకోలేకపోతున్నామని అన్నారు. వీక్షణం వంటి పత్రికల అధ్యయనానికి పాఠకులు కూడా కొంత కృషి చేయవలసి ఉంటుందని అన్నారు. అయినా సాధ్యమయిన దగ్గర సరళతకోసం ప్రయత్నిస్తామని అన్నారు. మాకున్న పరిమితుల్లో సమాజ మార్పు కోసం అసమానతలు, దోపిడీ లేని సమాజం కోసం ప్రయత్నిస్తున్నామని చెప్పారు. సైద్ధాంతిక ఘర్షణ తెచ్చే వ్యాసాలు వీక్షణంలో వచ్చాయి. తృణీకరించవద్దనీ, చర్చకు అవకాశం ఉండాలనీ వ్యాసాలు అచ్చువేశాం. మీరు చెప్పిన సూచనలు ఆచరణలోకి తేవాలంటే మీ అందరి సహకారం కావాలి. పత్రిక మెరుగుదలకు మీ విమర్శ కూడా కావాలి. తప్పులు పునరావృతం కాకుండా ప్రజల పక్షాన నిలువడానికి కృషి చేస్తున్నాము. సమాజం కూడా మమ్మల్ని ప్రోత్సహిస్తోందని అన్నారు. ఆశావహ దృక్పథంతో వీక్షణం నడుస్తోందని అన్నారు. సామాజిక చలనం చాలా సంక్లిష్టతతో ఉందని అన్నారు. ఆ సంక్లిష్టతను అర్థం చేసుకొని అందించడానికి మరింత కృషిచేయాల్సి ఉందని అన్నారు. మీ అందరి సహకారం, సూచనలతో వీక్షణం నాలుగు కాలాలు ఉంటుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

సంపాదకులు స్పందిస్తూ మీ అందరి సూచనల్లో కొత్త చూపు ఉందని అన్నారు. 'ఎలా ఉంది అని కాకుండా ఎలా మారుతోందో చెప్పాల'ని అన్న ప్రొ. ఆర్.ఎస్. రావు గారి మాటలను గుర్తుచేశారు. ఈ సమాజ గతి ఎలా మారుతోందో చెప్పడానికి వీక్షణం కృషి చేస్తోందన్నారు. దాదాపు 40కి పైగా సూచనలు వచ్చాయని ఇవన్నీ తీసుకోదగినవి, శక్తిమేరకు అనుసరించవలసినవని అభిప్రాయపడ్డారు. సోషల్ మీడియాలో ఉండడం వీక్షణానికి ఏమీ అభ్యంతరం కాదని అయితే అది మిత్రుల సహకారంతోనే సాధ్యమవుతుందని అన్నారు. భాష విషయంలోనూ మూస రచనా పద్ధతిని మార్చే ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. కొంత మంది ఆయా ప్రాంతాలకే సంబంధించిన ప్రత్యేకమైన స్థానిక సమస్యల గురించి ప్రస్తావించారు. అటువంటి వాటిపై చొరవతో రాస్తే తప్పక వీక్షణంలో ప్రచురిస్తామని అన్నారు. ఇది ప్రజల పత్రిక. ప్రజా దృక్పథంతో వస్తున్న పత్రిక. అనేక ఛాయలు ఉన్నాయి. పత్రికని మెరుగుపరచడంలో మీ అందరి సహకారం ఉంటుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. చాలా దూర భారాలతో శ్రమతీసుకొని వచ్చిన మిత్రులందరికి పేరు పేరున కృతజ్ఞతలు తెలియజేశారు. సమావేశానికి పత్రిక సహాయ సంపాదకులు యాటెల్లి రామచంద్రం వందన సమర్పణతో ముగించారు. ఈ సందర్భంగా సమావేశంలో రచయితలు, మిత్రులు చేసిన సలహాలను, సూచనలను అన్నింటిని తీసుకొని మీ సహకారంతో ముందుకు వెళదామన్నారు. రెండు రాష్ట్రాల నుంచి చాలా శ్రమకోర్చి వచ్చిన మిత్రులందరికీ, అట్లాగే అడగగానే ఎమెస్కో సమావేశపు హాలు ఇచ్చిన యాజమాన్యానికి, సహకరించిన వారి సిబ్బందికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

సందేశాలు

ఈ నెల 7న హైదరాబాదులో ఏర్పాటు చేసిన వీక్షణం రచయితల, అభిమానుల సమావేశానికి రాలేకపోతున్నాను, మన్నించండి. మిత్రులందరినీ కలిసి కలబోసుకుని, అభిప్రాయాలు మార్పిడిచేసుకునే అవకాశాన్ని పోగొట్టుకున్నందుకు బాధగానే ఉంది. నా అభిప్రాయాలని ఉత్తరం రూపంలో రాస్తున్నాను.

వీక్షణం నిర్వాహణ ఎప్పటిలాగానే బాగా జరుగుతోంది. అప్పుడప్పుడు కొన్ని వ్యాసాలు కొంత పేలవంగా ఉన్నప్పటికీ, మొత్తంమీద రాజకీయార్థిక విశ్లేషణతో కూడిన సమాచారాన్ని అందిస్తున్న ఏకైక తెలుగు పత్రికగా వీక్షణం తన స్థానాన్ని ఇప్పటికీ పదిలంగానే ఉంచుకోగలగడం ఆనందాన్ని కలిగిస్తున్న విషయం.

కొన్ని సంఘటనలు జరిగినప్పుడు వాటిమీద రెండు మూడు వ్యాసాలు కూడా వస్తున్నాయి. అయితే అవి కొంతమేరకు చర్విత చర్వణంగా ఉంటున్నాయి. బహుశా దీనికి కారణం, ఆయా రచయితలు విశ్లేషణకంటే వివరాల మీద ఎక్కువ దృష్టి కేంద్రీకరించడమే అనుకుంటున్నాను. కొత్తవాళ్లు రాయడం ప్రారంభించినప్పుడు సహజంగా ఇది జరుగుతుంది. తప్పులేదు. అలాంటప్పుడు సంపాదక బృందం కొంత శ్రమ తీసుకుని వాటిని సరిచేస్తూ రచయితలకు సూచనలు చేస్తే బాగుంటుంది.

అదే విధంగా పత్రిక తన రచయితలను తానే తయారుచేసుకోవడం వీక్షణం లాంటి పత్రికకు అవసరం. కొత్తగా రాస్తున్న కొద్దిమందినైనా గుర్తించి, వాళ్లకు ఒకటి రెండు రోజులైనా కేటాయించి, చిన్న పాఠశాలలాంటిది నిర్వహిస్తే ప్రయోజనం ఉంటుందేమో అనిపిస్తోంది. ఆలోచించండి. ఇలాంటి పాఠశాల నిర్వహణ ఖర్చుతో కూడుకున్నది.

అయితే దానికి సంబంధించిన ఆర్థిక భారాన్ని వీక్షణం మిత్రులం పంచుకుని అయినా ఏర్పాటు చేద్దాం. రాజకీయార్థిక కోణం నుండి, చారిత్రక దృక్పథంతో రాయడానికి సంబంధించిన అభ్యాసాన్ని ఆ పాఠశాలలో అందించడం మంచిది. ఒకరకంగా జర్నలిస్టులకు ఇచ్చే శిక్షణలాంటిది అనుకోవచ్చు.

మరొక ముఖ్యమైన విషయం తాత్విక సంబంధమైన స్వతంత్ర వ్యాసాలు, అనువాదాల గురించి. ఈ మధ్యకాలంలో ఇలాంటి వ్యాసాలు ఎక్కువగానే వస్తున్నాయి. ఇది మంచి పరిణామం. అయితే ఇలాంటి వ్యాసాలలో క్లిష్టమైన తాత్విక అంశాలను వివరించడంలో మెలకువ పాటించకపోతే పాఠకులు పేజీలు తిప్పివేసే పరిస్థితి ఏర్పడుతుంది. భాషా సారళ్యంతోపాటు, క్లిష్టతలేని విశ్లేషణ ఇలాంటి వ్యాసాలకు ఎంతో అవసరం. కొన్ని వ్యాసాలలోనైతే ఏవి రచయిత అభిప్రాయాలో, ఏవి ఉల్లేఖనాలో అర్థం కావడంలేదు. ఉల్లేఖనాలను కోట్స్‌లో పెట్టడం తప్పనిసరిగా చేయాలి. దానితోపాటు ఏ పుస్తకం నుండి చేస్తున్నారో కూడా ఉండాలి. అలానే సాధ్యమైన మేరకు సోదాహరణంగా ఉంటే మంచిది. మన పత్రిక కేవలం సమాచారాన్ని అందించేది కాదు. ఇది భావజాల చైతన్యాన్ని కలిగించేది. అలా చేయాలంటే తప్పనిసరిగా తాత్విక వ్యాసాలు రావడం ఎంతైనా అవసరం. వాటిని సాధ్యమైనంత వరకు ముందుగా చదివి మార్పులూ చేర్పులూ చేస్తే మంచిది. మాసపత్రికలో సుదీర్ఘకాలం పాటు ఇంతటి సీరియస్ వ్యాసాలు అచ్చు అయితే వాటిని ఆసక్తిగా చదవడంలో కూడా కష్టం ఉంటుందని అనుకొంటున్నాను. నవలలాగా "గత సంచికలో" అని జరిగినదాన్ని జ్ఞప్తికి తెచ్చే అవకాశం ఇందులో ఉండదు. పరిష్కారం ఆలోచించండి.

మరొక ఆలోచన. సామాజిక శాస్త్రాలలో వాడే కొన్ని ఇతర భాషా పదాలకు తగిన తెలుగుపదాల సూచికను తయారు చేద్దాం. అది వ్యాసాలు రాసేవాళ్లకి, అనువాదకులకు, పాఠకులకు కూడా ఉపయోగంగా ఉంటుంది. కొన్ని పదాలకైతే రకరకాల అనువాదాలు జరుగుతున్నాయి. ఉదా: 'ఫినామినా' అనే పదానికి సందర్భాన్నిబట్టి అనువైన తెలుగుపదాన్ని వాడకపోతే గందరగోళం ఏర్పడుతుంది. అలానే 'ఆబ్జెక్టివ్' అంటే వస్తుగతమా లేక నిష్పక్షపాతమా. 'యూనివర్సల్' అనే పదానికి కొందరు సార్వజనీనం అని, కొందరు సార్వకాలికమని రాస్తున్నారు. ఇంతేకాక 'వర్చువల్', 'వర్చువల్ రియాలిటీ', 'బైనల్' లాంటి కొత్తపదాలు కూడా వస్తున్నాయి. లోగడ లెఫ్టిస్టు స్టడీసర్కిల్ వాళ్లు తాత్విక పదకోశాన్ని అచ్చువేశారు. అంతస్థాయిలో కాకపోయినా ప్రతినెలా వీక్షణంలో 25 పదాలు చొప్పున ముఖ్యమైన ఒక వంద పదాలని పరిచయం చేస్తే మంచిది.

ఆర్థిక నిర్వహణకు సంబంధించి నిరంతరం విజ్ఞప్తులు చేయడం తప్ప ఇంకేం చేయగలం. కాకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వీక్షణం అభిమానులం కొంతమందిమైనా ఒక బృందంగా ఏర్పడి కొంత ఆర్థిక సహాయం చేయగలమేమో ఆలోచించండి. ఇలా వచ్చే పైకం పత్రిక నిర్వహణకు కాకపోయినా, కనీసం రెండు రాష్ట్రాలలోని వివిధ ప్రాంతాలలో వీక్షణం పాఠకుల, రచయితల సమావేశాలు, వర్క్‌షాపులు అప్పుడప్పుడు నిర్వహించడానికైనా ఉపయోగపడతాయి కదా. దీని గురించి కూడా చర్చించండి. గతంలోలానే భవిష్యత్తులో కూడా వీక్షణం నిర్వహణలో అన్ని రకాలుగా సహరిస్తానని వాగ్దానం చేస్తూ అభినందనలతో....

– సి.యస్.ఆర్. ప్రసాద్
గుంటూరు

మొత్తం భారతీయ సమాజం ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ సంక్షోభాలకు చెందిన అనేక అంశాలపై నిరంతరం అద్భుతమైన ఫోకస్ పెట్టగలుగుతున్నందుకు తద్వారా పాఠకుల ఆలోచనా శక్తిని విశాలం చేయడంలో వీక్షణం బాధ్యులందరూ తమ వంతు పాత్ర నిర్వర్తిస్తున్నందుకు అభినందనలు. మార్చ్ నెల సంచికలో షాగిర్ద్ ఉత్తరం, మన రాతల్లో ఎంత జాగ్రత్తగా ఉండాలో స్పష్టం చేయడం బాగుంది. పత్రికను మెచ్చుకునే ఉత్తరాలతో పాటు, ఇలాంటి ఉత్తరాల ఆవశ్యకతను, పాఠకులు, రచయితలు గుర్తించేటట్లు (ఒక బాధ్యతగా) చేయడం చాలా అవసరం. ఫిబ్రవరి సంచికలో 'ఒక నేల అనేక ఆకాశాలు' మార్చ్ సంచికలో 'రొమిలా థాపర్ అసమ్మతి స్వరం' లాంటి సమీక్షలు, వ్యాసాలు రెగ్యులర్‌గా వచ్చేటట్లు చేస్తే, చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. రష్యా విప్లవంపై నాగభూషణ్ గారి వ్యాసాల లాగే, చైనా, వియత్నాం, క్యూబా తదితర దేశాల విప్లవ పోరాట చరిత్రల్లో ముఖ్యమైన ఘట్టాలు, సంఘటనలు, ప్రత్యామ్నాయ రాజకీయాలపై చర్చలు నేటి తరానికి అందించాల్సిన బాధ్యత మనందరిమీదా ఉందనుకుంటున్నాను. సలహాలు చెప్పడం సులువే కాని ఆచరణలో ఎదుర్కొంటున్న సమస్యల గురించి నాకు తెలుసు. అయినా మన ప్రయత్నం మనం చేద్దాం. అసహజ మరణాల సూచి ప్రారంభించలేమా ఆలోచించండి.

– పి.వి. రమణ
విశాఖపట్నం

వీక్షణం పత్రిక సమకాలీన, సిద్ధాంతపరమైన అంశాలపై విస్తృత సమాచారాన్ని అందిస్తుంది. కాని ఇంకా వివిధ అంశాలపై వ్యాసాలు త్వరితగతిన రావాల్సి ఉంది. ఆయా విషయాలపై సమగ్రమైన విషయ పరిజ్ఞానం ఉన్న వారితో వ్యాసాలు రాయిస్తే బాగుంటుంది. రోజువారి ప్రముఖ పత్రికలే తమ జిల్లా ఎడిషన్లను ముద్రించలేకపోతున్నాయి. అయినా వీక్షణం క్రమం తప్పకుండా రావడం ముదావహం. ఈ అప్రహతితను కొనసాగించడానికి అందరూ కృషి చేయాల్సిన అవసరం ఉంది.

– ఎం.కె. కుమార్,
తిరుపతి, చిత్తూరు

గత కొన్ని సంవత్సరాలుగా వీక్షణం పత్రిక ఉభయ తెలుగు రాష్ట్రాలలోనూ ప్రజాస్వామిక వాదులకు చక్కని ప్లాట్ ఫామ్‌లా నిలిచి, పాలకుల దుష్కృత్యాలను పాఠకులకు తెలియజేస్తోంది. అయితే బూర్జువాయేతర పత్రికల మనుగడ ఈ మధ్యకాలంలో అటు రాజకీయ వత్తిళ్లకూ, ఇటు ఆర్థిక వత్తిళ్లకూ మధ్య తీవ్రంగా నలిగిపోయే పరిస్థితులలో పత్రిక మనుగడ ఎంతకష్టమో తెలియంది కాదు. కొత్త పత్రికలు స్థాపించాల్సిన అవసరం ఎంతో ఉండగా, నేడు ఉన్న పత్రికలను నిలబెట్టుకోవడమే అత్యంత కష్టసాధ్యంగా ఉంది. వీక్షణం పత్రికను నిలబెట్టుకోవడం మనచేతుల్లోనే ఉంది. పత్రిక ఆయా గ్రూపు రాజకీయాలకు అతీతంగా పలు అభిప్రాయ భేదాలతోనే నడుపుతుండడాన్ని బట్టి, దీన్ని నిలబెట్టడం అనేది ఏ ఒక్క గ్రూపుకో, లేక కొందరికో గాక ప్రతిఒక్క ప్రజాస్వామిక వాది యొక్క కర్తవ్యంగా భావించాలి. కనుక అందరూ తమ తమ విభిన్నాభిప్రాయాలతో పాటు, ఆర్థికంగానూ పత్రికను ఆదుకోవడం అవసరం. అదే సందర్భంలో ఒక సీరియస్ పాఠకుడిగా పత్రికా సంపాదకులకు నా విజ్ఞప్తి ఏమంటే, ఒకే

అంశంపై నాలుగైదు వ్యాసాలు వస్తుండడం వల్ల పాఠకుడికి విసుగు జనించే అవకాశం ఉంది. అయితే విభిన్న కోణాల్లో ఒకే అంశం పైనైనా విభిన్న వ్యాసాలు ఉండవచ్చు గానీ, అలాంటి వాటిని పరిమితంగా క్లుప్తంగా ఇస్తే బాగుంటుంది. మరొక అంశం ఏమంటే ఇటీవలి కాలంలో మనం విభేదించే అంశాలపైన విమర్శలు సంయమనంతో ఉండడం. లోగడ ఇలాంటి సందర్భాల్లో కొంత కొందరు సంయమనం కోల్పోవడం జరిగింది గానీ, ఇప్పుడు ఇది సంతృప్తిగా ఉందనవచ్చు.

పత్రిక అభివృద్ధికి రష్యన్ విప్లవ పరిశోధకునిగా నాదొక సూచన ఏమంటే, పత్రికలో ఉత్తరాలు పొగడ్తల వైపుగా గాక, అభిప్రాయ భేదాలుంటే వాటిని తెలిపే వైపుగా ఉంటే మంచిది. దాంతో పాటు నా ముఖ్య సూచన, సమస్యలను పత్రిక దృష్టికి తీసుకొచ్చే వైపుగా ఉత్తరాలుండడం. ఇలాంటి ఉత్తరాలు ఎన్ని డజన్లున్నా గానీ, అవసరమైతే వ్యాసాల్ని తగ్గించి అయినా ఇలాంటి ఉత్తరాల ప్రచురణ సాగాలి. లోగడ విప్లవపూర్వ రష్యాలో బోల్షివిక్ పార్టీ కార్మిక పత్రికలలో ఉత్తరాల శీర్షికకే అత్యంత ప్రాధాన్యతనిచ్చేవారంటే, అవి ఎంత అవసరమో తెలుసుకోవచ్చు. ఇలాంటి ఉత్తరాలు అతి క్లుప్తంగా ఉండడం అవసరం.

– నాగభూషణా చార్యులు
తూర్పు గోదావరి

వీక్షణం కాంప్లిమెంటరీ కాపీ నాకు రెగ్యులర్‌గా పంపుతున్నందుకు మీకు అభినందనలు. దాదాపు ఒక సంవత్సర కాలంగా మీకు వ్యాసాలు పంపలేకపోయాను. మీకు తెలియనిది కాదు ఆర్గనైజేషన్ పనుల ఒత్తిడి కారణంగానే. సమకాలీన స్థానిక రాజకీయాలు మొదలుకుని జాతీయ, అంతర్జాతీయ రాజకీయ పరిణామాలపై సునిశితమైన విశ్లేషణలను అందిస్తున్నందుకు మీ సంపాదక వర్గానికి అభినందనలు. కొన్ని ముఖ్యమైన అంశాలపై చర్చా వేదికలకు అవకాశం ఇవ్వడం బాగుంది. ముఖ్యమైన ప్రజా ఉద్యమాలకు ప్రాధాన్యతనివ్వడం, ఉద్యమాలపై జరుగుతున్న నిర్బంధాన్ని ఖండించడం, విరసం సీనియర్ నాయకులు వరవరరావు గారు లాంటి వారిపై కొనసాగుతున్న తీవ్ర నిర్బంధంపై, ఉపా లాంటి నిర్బంధ చట్టాలపై వివిధ రూపాలలో కొనసాగుతున్న నిరసన ఉద్యమాలకు, కలాలకు చోటు కల్పించడం చాలా బాగుంది. వీక్షణం సంపాదక వర్గానికి మరోసారి అభినందనలు....

– ముప్పాళ్ళ భార్గవ శ్రీ,
విజయవాడ

కోవిడ్ కాస్తా తగ్గిన ఈ సమయంలో నేను రాగలిగి ఉంటే ఎంతోమంది మిత్రులు కలిసేవారు. అనివార్య కారణాల వలన ఈ వార్షిక సమావేశానికి రాలేకపోతున్నాను. వీక్షణానికి నేను ఇవ్వగలిగే సలహాలు సుమారు ఏమీలేవు. పత్రిక క్రమం తప్పకుండా వస్తుంది. కోవిడ్ పీరియడ్‌లో కూడా ఆన్‌లైన్ పత్రికను తేవడమే కాక మొట్ట మొదటి అవకాశంలోనే ప్రింట్‌లో తీసుకువచ్చారు. ఎడిటోరియల్ బోర్డుకు, మేనేజింగ్ టీమ్‌కు అభినందనలు చెప్పాలి. వీక్షణం పత్రికలో రాష్ట్ర స్థాయి, అఖిల భారత, అంతర్జాతీయ స్థాయిలలో సుమారు ప్రతి ప్రధానమైన విషయంపైనా తగిన వివరాలతోనూ, విశ్లేషణతో వ్యాసాలు వస్తున్నాయి. వ్యాసాలు చాలా వరకు సాధికారికంగా ఉంటున్నాయి. వీక్షణం ఒక నమ్మదగ్గ మిత్రుడు. సమావేశం విజయవంతం కావాలని కాంక్షిస్తూ....

– రమేష్ పట్నాయక్,
గుంటూరు

ప్రస్తుత తరుణంలో వీక్షణంను ఆగిపోకుండా చూడాల్సిన బాధ్యత మనందరిది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 'వీక్షణం'ను పరిచయం చేస్తున్నాను, సభ్యత్వం కోసం ప్రయత్నిస్తున్నాను.

పత్రికలో అచ్చవుతున్న వ్యాసాలు బాగానే ఉన్నవి. ఇంకా రచయితలను ప్రోత్సహిస్తూ రాయిస్తే బాగుంటుంది. అందుకు గాను ఉమ్మడి జిల్లాలో కొన్ని జిల్లాలను కలిపి 'వీక్షణంతో ఒకరోజు' లాంటి కార్యక్రమాలను తీసుకుంటే ఆయా ప్రాంతాల రచయితలు, పాఠకులు, అభిమానులకు ప్రోత్సాహంగా ఉంటుంది. పైగా పత్రికకు ఆర్థికంగా విరాళాలు రావచ్చు, సభ్యత్వం పెరగచ్చు. ప్రధానంగా పత్రిక కొన్ని వర్గాల వరకే పరిమితమయింది. విస్తృతంగా విద్యార్థి లోకంలోకి పరిచయం కావాలి. అందుకు జిల్లాలోని డిగ్రీ, పిజి కళాశాలల్లో 'వీక్షణం'ను పరిచయం చేస్తే బాగుంటుంది. దేశంలోని వివిధ యూనివర్సిటీలల్లో చదువుతున్న విద్యార్థుల నుండి వ్యాసాలను రాయించి ప్రోత్సహిస్తే బాగుంటుంది. ఉదాహరణకు జెఎన్‌యు, ఢిల్లీ, హెచ్‌సియు లాంటివి. మహిళల, కార్మికులకు సంబంధించి ప్రత్యేకంగా వ్యాసాలు ప్రచురిస్తే బాగుంటుంది. (అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవం, మేడే లాంటివి).

'నేను చదవాల్సిన మంచి పుస్తకాల' శీర్షికను మరోసారి ప్రచురించండి. (వీలయితే ఈ మధ్యకాలంలో వచ్చిన వాటిని కలిపి). ప్రస్తుతం కొన్ని జిల్లాల్లో జిల్లా పేజీ ప్రచురితమవుతున్నందుకు అసహజ మరణాల సూచిని ఎంతో కొంతమేరకైనా ప్రచురిస్తే బాగుంటుంది. రాష్ట్రంలోని అన్ని గ్రంథాలయాలకు మన పత్రిక పరిచయం కోసం జిల్లా గ్రంథాలయ చైర్మన్, కార్యదర్శి పేర ఎడిటర్‌చే సభ్యత్వానికి సంబంధించి లేఖలు రాస్తే బాగుంటుంది. ఆయా జిల్లాల్లోని మన అభిమానులు గ్రంథాలయాలకు చేరే విధంగా చూడగలరు. పోస్టు ద్వారా వచ్చే పత్రికలు కొన్నిచోట్ల అందడం లేదు. నేను చాలా సందర్భాల్లో పోస్టు ఆఫీసులో కలిసి ఈ సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేశాను. వీలైతే హైదరాబాద్‌లో పోస్టల్ డిపార్ట్‌మెంట్‌కు చెప్పించి సరియైన సమయంలో అందరికి పత్రిక అందేటట్లు చూడగలరు. ఉమ్మడి జిల్లాలో సభ్యత్వం, విరాళాల కోసం ప్రయత్నించగలను. ధన్యవాదములతో.

– శ్రీమన్నారాయణ మూర్తి
మంచిర్యాల

వీ

మోహన్‌రావు మృతి

రిటైర్డ్ కానిస్టేబుల్, నవలా రచయిత మోహనరావు(68) మరణించారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మార్చ్ 21 అర్ధ రాత్రి తెనాలిలో మృతిచెందారు. మోహనరావు నరసరావుపేట, చేబ్రోలులో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించారు. హెడ్ కానిస్టేబుల్‌గా ప్రమోషన్ పొందాక... పోలీస్ వ్యవస్థలో కింది స్థాయి కానిస్టేబుళ్ల జీవితాలు ఎంత దుర్భరంగా ఉంటాయోననే అంశం ఇతివృత్తంగా 'ఖాకీ బతుకులు' నవల రాయడం ఫలితంగా 13 ఏళ్లపాటు ఉద్యోగానికి దూరమైనారు.

ఊపా చట్టం రద్దు కోరుతూ నిరసన సభ

ప్రజాస్వామ్య వ్యతిరేకమైన చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టాన్ని(ఊపా) రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాల నాయకులు కడప పట్టణంలోని హోచిమిన్ భవన్‌లో ఫిబ్రవరి 28న ఊపా రద్దు పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిరసన సభ నిర్వహించారు. ఊపా చట్టం రద్దుతో పాటు, అక్రమంగా అరెస్ట్ చేసిన ప్రజా సంఘాల బాధ్యులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ప్రజల హక్కుల కోసం మాట్లాడుతున్న మేధావులను, రచయితలను, సామాజిక కార్యకర్తలను, పౌర హక్కుల నాయకులను దేశ ద్రోహం కేసులు పెట్టి నిర్బంధిస్తున్నారని, ఆంధ్రప్రదేశ్‌లో 40 మంది దాకా సామాజిక కార్యకర్తల పై చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేసి ఇప్పటికీ 10 మందిని అరెస్ట్ చేసిన తీరు పై ఊపా చట్టం ఎట్లా అప్రకటిత ఎమర్జెన్సీని తీసుక వచ్చిందో వివరించారు.

నిర్బంధంలోనే మల్లన్నసాగర్ ముంపు గ్రామాలు

సిద్దిపేట జిల్లా తొగుట మండలంలోని మల్లన్నసాగర్ రిజర్వాయర్ ముంపు గ్రామాలైన ఏటిగడ్డకిష్టాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని తిరుమలగిరి, మొగిలిచెరువు తండా గ్రామాల్లో పోలీసు నిర్బంధం ఇంకా కొనసాగుతోంది. ఆయా గ్రామాలకు వెళ్లే రహదారులను పూర్తిగా పోలీసులు ఆధీనంలోకి తీసుకున్నారు. మార్చ్ 6న మొగిలి చెరువు తండాలో పోలీసు పహారాలో సిద్దిపేట ఆర్‌డిఓ, తహసీల్దార్, గ్రామ సర్పంచ్‌తో పాటు రెవెన్యూ, పోలీసులు గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. గ్రామస్తులు ఇల్లు ఖాళీచేసి పునరావాస కాలనీకి వెళ్లాలని సూచించగా కొందరు నిర్వాసితులు వ్యతిరేకించారు. తమకు ఇంతవరకు ఆర్‌అండ్ఆర్, స్ట్రక్చర్‌తో పరిహారం డబ్బు అందలేదని అధికారులకు చెప్పారు. దీంతో ఇల్లు ఖాళీ చేసి పునరావాస కేంద్రాలకు వెళ్లిన వారికే ముందుగా పరిహారం అందిస్తామని అధికారులు అన్నారు. దాంతో కొంతమంది నిర్వాసితులు పరిహారం ఇచ్చిన తర్వాతనే వెళ్లిపోతామని తెలిపారు.

విప్లవ కవి వరవరరావుకు షరతులతో కూడిన బెయిల్

భీమా కోరేగాం కేసులో అరెస్టై అనారోగ్యంతో ముంబైలోని నానావతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విప్లవ కవి వరవరరావుకు కోర్టు మంజూరు చేసిన షరతులతో కూడిన బెయిల్ కింద మార్చ్ 6న ఆస్పత్రి నుంచి విడుదలయ్యారు. ఈ షరతుల్లో భాగంగా ఆయన ముంబై వదిలి వెళ్లకూడదనీ, దగ్గరలోని పోలీస్ స్టేషన్‌లో రెండు వారాలకొకసారి సంతకం చేయాలనీ, ఆయన్ను కలువడానికి కుటుంబ సభ్యులను మాత్రమే అనుమతించారు.

బైంసా ఘర్షణల్లో హిందూ వాహిని

నిర్మల్ జిల్లా బైంసా పట్టణంలో మరోసారి ఘర్షణలు జరిగాయి. మార్చ్ 7న జుల్ఫికర్ కాలనీలో కొందరు యువకులు సైలెన్సర్లు తీసేసిన బైకుపై పెద్ద శబ్దం చేసుకుంటూ జుల్ఫికర్ కాలనీలో తిరిగారు. దాంతో స్థానికులు తాము నిద్రపోయే సమయమని, శబ్దం చేస్తూ తిరగవద్దని అనడంతో ఇరు వర్గాల మధ్య గొడవ జరిగి దాడులకు దిగారు. కొద్దిసేపట్లోనే బట్టీగల్లీ, పంజేషా చౌక్, కోర్బగల్లీ, బస్టాండ్ ఏరియాతో పాటు పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఘర్షణలు జరిగాయి. ఓ వర్గం ప్రత్యర్థి వర్గానికి చెందిన వారి వాహనాలు తగులపెట్టారు. కత్తులతో కాలనీల్లో తిరుగుతూ, ఇల్లపై రాళ్లు రువ్వుతూ ఇల్లను తగులబెట్టారు. రిపోర్టింగ్‌కు వెళ్లిన మీడియా ప్రతినిధులపై కత్తులతో దాడిచేయగా ముగ్గురు గాయపడ్డారు. రాళ్ల దాడిలో పోలీసులు, స్థానిక యువకులు గాయపడ్డారు. దాడికి పాల్పడిన వారిలో హిందూ వాహిని వారు ఉన్నారని పోలీసు అధికారులు తెలిపారు.

'తెలుగు సాహిత్యం-రైతాంగ సమస్యలు' సదస్సు

భారతదేశ చరిత్రలో జరిగిన అన్ని పోరాటాల్లో, ఉత్పత్తి ప్రక్రియల్లో మహిళల భాగస్వామ్యాన్ని పక్కనబెట్టి చరిత్ర లేకుండా చేయడం సరికాదన్నారు అల్లం రాజయ్య. వరంగల్ అర్బన్ జిల్లా కేంద్రంలోని పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాలలో ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక(ప్రరవే), పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో మార్చ్ 6,7 తేదీల్లో జాతీయ సదస్సు నిర్వహించారు. ప్రరవే జాతీయ అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో అల్లం రాజయ్య కీలకోపన్యాసం చేశారు. 'నూతన ఆర్థిక విధానాలు–వ్యవసాయ సంక్షోభం', 'తెలుగు సాహిత్యం–నూతన ఆర్థిక సంస్కరణలు భిన్న పార్శ్వాలు', భారతదేశ వ్యవసాయ విధానాలు–చట్టాలు–ఆచరణ పరిణామాలు', తెలుగు సాహిత్యం–రైతాంగ సమస్యల ప్రతిఫలనం', 'హరిత విప్లవం–పరిణామాలు', 'తెలుగు సాహిత్యంలో హరిత విప్లవ పరిణామాల ప్రతిఫలనం' అనే అంశాలపై వక్తలు ప్రసంగించారు.

ఉధృతమవుతున్న ఉక్కు రక్షణ ఉద్యమం

ఉక్కు కార్మికులు, నిర్వాసితులు ఒక్కటై కేంద్రంపైనా... రాష్ట్ర ప్రభుత్వంపైనా తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. 'నూరు శాతం ఉపసంహరణ' చేస్తామన్న కేంద్రం ప్రకటనతో మార్చ్ 9 రాత్రి నుంచే తీవ్ర ఆగ్రహానికి లోనయ్యారు. కేంద్రంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి దిష్టి బొమ్మలు తగులబెట్టారు. ఉద్యోగులు, కార్మికులు, నిర్వాసితులు విశాఖ స్టీల్ ప్లాంట్ వద్దకు వెళ్లి రోజంతా ఉద్యమించగా, వారికి మద్దతుగా నిర్వాసితులు ప్లాంటుకు దారితీసే అన్ని ప్రధాన మార్గాలను మూసేసి రోజంతా రోడ్లను బ్లాక్ చేశారు. స్టీల్ ప్లాంట్ పరిరక్షణకోసం సమరానికి సిద్ధమవ్వాలని విశాఖ ఉక్కు పోరాట కమిటీ నిర్ణయించింది.

తెలంగాణ విద్యావంతుల వేదిక నాయకుడి అరెస్టు

తెలంగాణ విద్యావంతుల వేదిక గౌరవ అధ్యక్షుడు, తెలంగాణ జన సమితి మాజీ నాయకుడు గురిజాల రవీందర్ రావును మార్చ్ 22న పోలీసులు అరెస్టు చేశారు. మంచిర్యాల జిల్లా రామకృష్ణాపూర్ క్యాతనపల్లిలోని ఆయన ఇంటికి స్థానిక పోలీసులతో పాటు హైదరాబాద్ నుంచి వచ్చిన ప్రత్యేక పోలీసులు వెళ్లి అరెస్టు చేస్తున్నట్లు ప్రకటించారు. ఆర్‌కెపి పోలీసు స్టేషన్‌లో రామగుండం పోలీస్ కమిషనర్ వివరాలు వెల్లడించారు. రవీందర్‌రావుకు మావోయిస్టులతో సంబంధాలు ఉన్నాయని, ఇంట్లో సోదాలు నిర్వహించగా విప్లవ సాహిత్యం లభించాయని ఆయనపై 120, 120బితో పాటు ఇతర సెక్షన్లకింద కేసు నమోదు చేసి అరెస్టు చేశామని తెలిపారు.

వేరుశనగ మద్దతు ధర కోసం రోడ్డెక్కిన రైతులు

వేరుశనగకు మద్దతు ధర ఇవ్వాలని కోరుతూ రైతులు నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం కేంద్రంలో రోడ్డుపై బైటాయించారు. అచ్చంపేట వ్యవసాయ శాఖ మార్కెట్ యార్డులో ట్రేడర్స్ అందరూ సిండికేట్‌గా మారి వేరుశనగకు ధర తగ్గించారు. బొమ్మన్‌పల్లి, ఐనోల్, లింగాల, బ్రాహ్మణపల్లి, లింగోటం, బొల్గట్‌పల్లి, హాజీపూర్ గ్రామాల రైతులు మార్కెట్ యార్డు చైర్మెన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ మార్చ్ 22న భారీ ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా చేశారు.

ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థుల చలో అసెంబ్లీ

ప్రభుత్వ ఉద్యోగుల పదవి విరమణ కాలాన్ని పొడగించడాన్ని నిరసిస్తూ ఓ.యు విద్యార్థి సంఘాలు మార్చ్ 25న చేపట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల నుంచి విద్యార్థులు పెద్ద సంఖ్యలో అసెంబ్లీకి బయలుదేరగా పోలీసులు వారిని అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. విద్యార్థి సంఘాల నాయకులు ముఖ్యమంత్రి ఉద్యోగుల వయోపరిమితిని పెంచి నిరుద్యోగుల పొట్టకొట్టారని, ఈ నిర్ణయాన్ని విరమించకపోతే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. వీ

భారత్ బంద్

పెరిగిన పెట్రోల్ ధరలకు వ్యతిరేకంగా, కొత్త ఈ-వేబిల్లు, జిఎస్‌టి నిబంధనలను వ్యతిరేకిస్తూ అఖిల భారత వ్యాపార సమాఖ్య(సిఎఐటి) ఫిబ్రవరి 25న దేశవ్యాప్త బంద్‌కు పిలుపునిచ్చింది. దీనికి అఖిల భారత రవాణా సంక్షేమ సంఘం, అఖిల భారత వాహనదారుల సంక్షేమ సంఘం కూడా మద్దతు తెలిపింది. దీంతో లక్షలాది ట్రక్కులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. 40 వేల వ్యాపార సంస్థలకు చెందిన 8 కోట్లకు పైగా వ్యాపారులు బంద్‌లో పాల్గొన్నట్లు సిఎఐటి తెలిపింది. అత్యవసర సర్వీసులకు మినహాయింపు ఇచ్చారు. ఈ కామర్స్ సంస్థలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు

పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అసోం రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిల్లో అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు కేంద్ర చీఫ్ ఎలక్షన్ కమిషనర్ సునీల్ అరోడా ఫిబ్రవరి 26న షెడ్యూల్ విడుదల చేసింది. కేంద్ర పాలిత ప్రాంతం పుదుచ్చేరి సహా తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో ఒకే విడత ఏప్రిల్ ఆరో తేదీనే పోలింగ్ పూర్తి కానుంది. అసోం అసెంబ్లీకి మాత్రం మూడు విడతల్లో (మార్చ్ 27, ఏప్రిల్ 1, ఏప్రిల్ 6) ఎన్నికలు జరుగనున్నాయి. ఇక సమస్యాత్మక ప్రాంతాలు ఎక్కువగా ఉండే పశ్చిమ బెంగాల్‌లో ఎనిమిది విడతల్లో పోలింగ్ నిర్వహించాలని ఎన్నికల కమిషన్ నిర్ణయించింది. బెంగాల్‌లో మార్చ్ 27న మొదలై నెల రోజులపాటు కొనసాగి ఏప్రిల్ 29న పోలింగ్ ముగియనుంది. దేశ వ్యాప్తంగా 824 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు జరిగి కౌంటింగ్ మే 2న జరుగనున్నట్లు ప్రకటించారు.

మహిళలకు జీన్స్, పురుషులకు షార్ట్స్ నిషేధం

ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ జిల్లాలోని ఒక ఖాప్ పంచాయతీ (కొన్ని గ్రామాల సముదాయం కలిసి నిర్వహించే పంచాయతీ) మహిళలు జీన్స్, పురుషులు షార్ట్స్ వేసుకోవడాన్ని నిషేధించింది. అవి పాశ్చాత్య సంస్కృతిలో భాగమని తెలిపింది. ప్రజలంతా భారతీయ సంప్రదాయ దుస్తులను మాత్రమే ధరించాలని పేర్కొంది. రాజ్‌పుట్ కమ్యూనిటీ పంచాయతీ కూడా ఈ ఆదేశాలను ఉల్లంఘించినట్లయితే శిక్షకు గురవుతారని, బహిష్కరణను ఎదుర్కోవలసి ఉంటుందని హెచ్చరించింది. చార్తావాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పిపాల్సా గ్రామంలో మార్చ్ 2న ఈ పంచాయతీ సమావేశం ఈ నిర్ణయాన్ని ప్రకటించింది.

ఉత్తరాఖండ్‌లో ముఖ్యమంత్రి మార్పు

ఉత్తరాఖండ్ సిఎం త్రివేంద్రసింగ్ తన పదవికి రాజీనామా చేస్తూ ఆ పత్రాన్ని రాష్ట్ర గవర్నర్ బేబిరాణి మౌర్యకి మార్చ్ 9న సమర్పించారు. త్రివేంద్ర సింగ్‌పై అవినీతి, బంధుప్రీతి ఆరోపణలు, పలువురు ఎంఎల్ఏలు అసంతృప్తి వ్యక్తం చేయడంతో ముఖ్యమంత్రిగా వైదొలిగారు. కొత్త సిఎంగా బిజెపి సీనియర్ నేత, ఎంపి తీరథ్‌సింగ్ రావత్‌తో గవర్నర్ మార్చ్ 10న ప్రమాణ స్వీకారం చేయించారు. ముఖ్యమంత్రి పదవికి త్రివేంద్రసింగ్ రాజీనామా చేసిన నేపథ్యంలో మార్చ్ 10న బిజెపి శాసనసభాపక్షం సమావేశమై తమ నేతగా తీరథ్‌సింగ్ రావత్‌ను ఎన్నుకుంది.

బ్యాంకుల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్త సమ్మె

ప్రభుత్వ బ్యాంకుల ప్రైవేటీకరణను వ్యతిరేకించడంతో పాటు మరో 14 డిమాండ్ల సాధనకోసం అఖిల భారత జాతీయ బ్యాంకుల అధికారుల సంఘం ఇచ్చిన పిలుపుతో దేశవ్యాప్త సమ్మె ప్రభావం బ్యాంకింగ్ సేవలపై పడింది. బ్యాంకు ఉద్యోగుల సంఘాలు, పలు ట్రేడ్ యూనియన్ల ఆధ్వర్యంలో మార్చ్ 15, 16న సమ్మెలో పాల్గొన్నారు. ర్యాలీలు నిర్వహించారు. బ్యాంకింగ్ సేవలు నిలిచిపోవడంతో కోట్లలో లావాదేవీలు నిలిచిపోయాయి. దేశవ్యాప్తంగా సమ్మెలో దాదాపు 10 లక్షల మంది బ్యాంకు ఉద్యోగులు, అధికారులు పాల్గొంటున్నట్లు యుఎఫ్‌బియు పేర్కొంది. ఉన్నత స్థాయిలోని ఉద్యోగులు మినహా మిగతా బ్యాంకు ఉద్యోగులందరూ సమ్మెలో పాల్గొంటున్నట్లు అఖిల భారత బ్యాంకు అధికారుల అసోసియేషన్ జనరల్ సెక్రటరీ తెలిపారు. ప్రభుత్వం ఉద్యోగుల డిమాండ్లను పట్టించుకోకపోతే ప్రస్తుతం ఆందోళన చేస్తున్న రైతుల మాదిరిగా నిరవధిక సమ్మెకు దిగే అవకాశం ఉందన్నారు.

కొనసాగుతున్న రైతు ఉద్యమం

కొత్త వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతులు నిరసన చేపట్టి మార్చ్ 6 నాటికి 100 రోజులైంది. ఈ సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు రైతులు మార్చ్ 6న కుండ్లి-మనేసర్-పల్వాల్(కెఎంపి) ఎక్స్‌ప్రెస్ రహదారిని దిగ్బంధించారు. ఆరు గంటలపాటు రాకపోకలు నిలిపేశారు. రైతు సంఘాల జెండాలు, నల్ల జెండాలతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. తాము అన్నిటికి సిద్ధంగా ఉన్నామని, డిమాండ్లు అంగీకరించేవరకు నిరసన కొనసాగిస్తామని రాకేశ్ తికాయత్ తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా రైతులు ఢిల్లీ పొలిమేరల్లో ఆందోళన చేస్తున్న రైతు సంఘాలు మార్చ్ 8 మహిళలకే నాయకత్వం అప్పగించారు. వేదికతో పాటు ఆహారం, భద్రత అన్నింటినీ వారి ఆధ్వర్యంలోనే నడిపారు. టిక్రీ సరిహద్దు పాయింట్ వద్దకు పంజాబ్, హర్యానాల నుంచి 50,000 మంది మహిళలు తరలివచ్చారు. మార్చ్ 13న రైతులు, కార్మికులు దేశవ్యాప్తంగా రైల్వే ట్రాక్‌లను దిగ్బంధిస్తారని భారతీయ కిసాన్ యూనియన్ అధికార ప్రతినిధి దర్శన్‌పాల్ సింగ్ వెల్లడించారు.

మహారాష్ట్ర హోం మంత్రిపై అవినీతి ఆరోపణలు

మహారాష్ట్ర హోం మంత్రి అనిల్ దేశ్‌ముఖ్ నెలకు రు. 100 కోట్ల మామూళ్లు వసూలు చేయాలని టార్గెట్ పెట్టారని ముంబై నగర మాజీ పోలీసు కమిషనర్ పరమ్‌వీర్ సింగ్ ఆరోపణలు చేశారు. బార్లు, రెస్టారెంట్లు, పబ్‌లు, ఇతర మార్గాల్లో ఈ టార్గెట్ సాధించాలని సస్పెండయిన ఇన్‌స్పెక్టర్ ఎసిపి సంజయ్ పాటిల్ సచిన్ వాజేను పురమాయించినట్లు సిఎం ఉద్దవ్ ఠాక్రేకు రాసిన లేఖలో తెలిపారు. ఈ విషయాన్ని ఇదివరకే సిఎం ఠాక్రే, డిప్యూటి సిఎం అజిత్ పవార్, ఎన్‌సిపి ఛీఫ్ శరత్ పవార్‌కు పలుసార్లు తెలియజేసినట్లు పేర్కొన్నారు. ఈ ఆరోపణలను హోం మంత్రి ఖండించారు. పరమ్ వీర్ సింగ్ కొన్ని తప్పిదాలు చేశారని పేర్కొంటూ ఆయనను ముంబై పోలీస్ కమిషనర్ పదవి నుంచి హోం గార్డు విభాగానికి బదిలీ చేసిన తరువాత ఈ లేఖ రాశారు.

ఛత్తీస్‌గఢ్‌లో బస్సు పేల్చివేత - ఐదుగురు జవాన్ల మృతి

ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో 27 మంది జిల్లా రిజర్వు గార్డ్స్‌తో వెళుతున్న బస్సును మావోయిస్టులు పేల్చివేశారు. ఈ ఘటనలో ఐదుగురు జవాన్లు మృతిచెందగా, 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మార్చ్ 23న కడేనార్ మండోడ దండకారణ్యంలో ఓ బ్రిడ్జ్ వద్ద జరిగిందని బస్తర్ ఐజి సుందర్‌రాజ్ తెలిపారు. కడేనార్, కన్హర్‌గావ్ దండకారణ్యంలో డిఆర్‌జి జవాన్లు కూంబింగ్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ఘటన జరిగిందన్నారు.

వీ

భారత రైతుల నిరసన స్వేచ్ఛపై బ్రిటన్ పార్లమెంట్‌లో చర్చ

భారత రైతుల ఆందోళనపై మార్చ్ 8న బ్రిటన్ పార్లమెంట్‌లో చర్చ జరిగింది. రైతుల భద్రత, పత్రికా స్వేచ్ఛపై సుమారు 90 నిమిషాల పాటు చర్చించారు. రైతుల నిరసనల పట్ల ప్రభుత్వం వ్యవహరించిన తీరును లేబర్ పార్టీ, లిబరల్ డెమోక్రాట్స్, స్కాటిష్ నేషనల్ పార్టీ ఎంపిలు తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం తన ప్రజలపైనే తీసుకున్న అణచివేత చర్యలపై ప్రపంచం విస్తుపోయిందని శామ్ ట్యారీ అనే ఎంపి అన్నారు. శాంతియుతంగా ప్రదర్శన చేస్తున్న వారిపై బాష్పవాయు గోళాలు, జల ఫిరంగులు ప్రయోగిస్తారా? దీనిపై బ్రిటిష్ ప్రభుత్వం భారత ప్రభుత్వంతో చర్చిస్తుందా? అని విపక్ష లేబర్ పార్టీ నేత స్టీఫెన్ కినోక్ ప్రశ్నించారు. ఎంపిల మూకుమ్మడి దాడితో స్పందించిన బ్రిటన్ ప్రభుత్వం–బోరిస్ జాన్సన్ భారత్‌లో జరపబోయే పర్యటనలో ఈ విషయాన్ని మోడీతో ప్రస్తావిస్తారని తెలిపింది.

మయన్మార్‌లో ప్రజాందోళనలపై సైన్యం కాల్పులు

మయన్మార్‌లో పాలన పగ్గాలను తమ చేతుల్లోకి తీసుకున్న సైన్యం ఆందోళనకారులను పదుల సంఖ్యలో కాల్చిచంపుతోంది. మార్చ్ 3న ఒక్క రోజే ఫేస్‌బుక్, స్థానిక మీడియా బయట పెట్టిన ఆధారాల మేరకు పోలీసులు 38 మంది ఆందోళనకారులను కాల్చి చంపారు. పలు ప్రాంతాల్లో ఆందోళనకారులపై పోలీసులు టియర్‌గ్యాస్, రబ్బర్ బుల్లెట్లతో విరుచుకుపడ్డారు. పోలీసులు రబ్బర్ బుల్లెట్లను ప్రయోగిస్తుండగా..సైనికులు ఎలాంటి హెచ్చరికలు చేయకుండానే ఆటోమేటెడ్ గన్స్‌తో కాల్పులు జరిపారు. ఒక యాంగాన్‌లోనే 18 మంది మృతిచెందినట్లు సోషల్ మీడియా, స్థానిక మీడియాలో ప్రసారమైన కథనాలు, వీడియో ఫుటేజీలు వెల్లడిస్తున్నాయి. ఈ మారణకాండను 'రక్తపాత దినం' అని ఐక్యరాజ్య సమితి మయన్మార్ అధికార ప్రతినిధి క్రిస్టిన్ స్కారనర్ అభివర్ణించారు. మార్చ్ 15న సైనిక పాలనను నిరసిస్తూ యాంగాన్ నగరంలో ఆందోళన చేస్తున్న పౌరులపై సైన్యం కాల్పులు జరపడంతో 34 మంది మృతిచెందారు.

భారత్‌లో అమ్నెస్టీ మూసివేతపై బ్రిటన్ ఆందోళన

అమ్నెస్టీ ఇంటర్నేషనల్ భారత్ విభాగాన్ని మూసివేసి, బ్యాంకు ఖాతాలను స్తంభింపజేయడంపై బ్రిటన్ ఎగువ సభ హౌస్ ఆఫ్ లార్డ్స్‌లో సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. భారత్‌లో స్వచ్ఛంద సంస్థలు, మేధావులు, ఇతర వర్గాలపై రోజురోజుకి నిర్బంధం పెరిగిపోతోందన్నారు. ఏప్రిల్‌లో భారత్ పర్యటన సందర్భంగా ప్రధాని మోడీతో ఈ అంశాన్ని లేవనెత్తాలని బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్‌కు పిలుపునిచ్చారు. మార్చ్ 16న లార్డ్ రిచర్డ్ హారిస్ ఈ అంశంపై చర్చను ప్రారంభించారు.

భారత్‌లో తగ్గిన స్వేచ్ఛ - అధ్యయన నివేదిక వెల్లడి

భారత్‌లో స్వేచ్ఛ తగ్గుతూ వస్తోంది. అత్యంత స్వేచ్ఛాయుత దేశాల్లో భారతదేశ స్కోరు 71 నుంచి 67కు తగ్గింది. స్వేచ్ఛా సూచీ ప్రకారం స్కోరు 100 ఉంటే పూర్తి స్వేచ్ఛ ఉన్నట్లు! వాషింగ్టన్ కేంద్రంగా పనిచేసే 'ఫ్రీడం హౌస్' అనే మేధో బృందం అనేక అంశాలను పరిశీలించి ఈ స్కోరును నిర్దేశిస్తుంది. తాజా వివరాల ఆధారంగా ఈ బృందం భారత్ స్థాయిని 'స్వేచ్ఛాయుత దేశం' నుంచి 'పాక్షిక స్వేచ్ఛ' ఉన్న దేశంగా తగ్గించింది. ఫిన్లాండ్, నార్వే, స్వీడన్లు అత్యంత స్వేచ్ఛాయుత దేశాల కిందకు వస్తున్నాయి. ఇదే విషయానికి సంబంధించి 211 దేశాల్లో మన ర్యాంకు 83 నుంచి 88కి పడిపోయింది. "2014లో నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచీ పౌరహక్కుల అణచివేత కొనసాగుతూనే ఉంది. ఆయన సారథ్యంలోని హిందూ జాతీయవాద ప్రభుత్వం అనేక మానవ హక్కుల సంఘాల కార్యకలాపాలపై తీవ్ర ఒత్తిడి పెంచింది. మేధావులు, జర్నలిస్టులు, హక్కుల కార్యకర్తలపై దాడులు, అరెస్టులు, బెదిరించడం వంటి ఘటనలు పెచ్చరిల్లాయి. ముస్లింలే లక్ష్యంగా హత్యలు పెరిగాయి. 2019లో మోదీ తిరిగి ఎన్నికయ్యాక ఈ హక్కుల హననం మరింత పెరిగింది. కరోనా ఉధృతంగా ఉన్న సమయంలో లక్షల మంది వలస కూలీల బతుకు చితికిపోవడానికి మోదీ సర్కారు అనుసరించిన లాక్‌డౌన్ విధానం కారణం. ముస్లింలు వైరస్‌ను వ్యాప్తి చేస్తున్నారన్న ప్రచారం ఎక్కువైంది" అని ఆ నివేదిక పేర్కొంది. భారత్ స్థాయిని స్వేచ్ఛాయుత నుంచి పాక్షిక స్వేచ్ఛాయుత దేశంగా తగ్గించడం వల్ల ప్రపంచంలో 20 శాతం ప్రజలు మాత్రమే అన్ని అంశాల్లో పూర్తి స్వేచ్ఛ కలిగి ఉన్నారన్నది తేలిందని వివరించింది.

భారత్‌లో పెరుగుతున్న నియంతృత్వం


భారతదేశంలో ప్రస్తుతం నియంతృత్వం కొనసాగుతోందని, ఇక్కడి పరిస్థితి బంగ్లాదేశ్ కంటే అధ్వాన్నంగా ఉందని స్వీడన్‌కు చెందిన వి–డెమ్ (వెరైటీస్ ఆఫ్ డెమోక్రసీ) సంస్థ పేర్కొంది. 'విస్తృతమవుతున్న నియంతృత్వం' శీర్షికన ఐదో వార్షిక ప్రజాస్వామ్య నివేదికను ఆ సంస్థ విడుదల చేసింది. పరువు నష్టం, దేశ ద్రోహ చట్టాల మితిమీరి వినియోగం, మీడియాపై బల ప్రయోగం వంటి అంశాలను ఉటంకిస్తూ... భారత్ అతిపెద్ద ప్రజాస్వామ్యం నుంచి ఎన్నికల నిరంకుశత్వంలోకి వెళ్లిందని వ్యాఖ్యానించింది. 2014 తరువాత కేంద్రంలో ఎన్‌డిఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విమర్శకుల నోళ్లు మూయించేందుకు దేశ ద్రోహం, పరువు నష్టం కేసుల బనాయింపు పేరుతో 7 వేల మందికి పైగా కేసులు నమోదు చేసిందని పేర్కొంది.

ఫ్రాన్స్ మాజీ అధ్యక్షుడు సర్కోజీకి జైలుశిక్ష

అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఫ్రాన్స్ మాజీ అధ్యక్షుడు నికోలస్ సర్కోజీకి జైలుశిక్ష పడింది. ఓ కేసులో ఆయన అవినీతికి పాల్పడినట్లు ఆధారాలు లభించడంతో దోషిగా తేల్చిన పారిస్ న్యాయస్థానం మూడేళ్ల జైలు శిక్ష విధించింది. తనపై ఉన్న కేసు విచారణకు సబంధించిన సమాచారాన్ని అక్రమంగా సంపాదించేందుకు న్యాయమూర్తిని సర్కోజీ ప్రలోభపెట్టాడనే ఆరోపణలున్నాయి. దీనిపై విచారణ జరిపిన న్యాయస్థానం...సర్కోజీ తన అధికారాన్ని దుర్వినియోగం చేసినట్లు తేల్చి.. శిక్షను ఖరారు చేసింది.

ఇజ్రాయిల్ స్థావరాల విస్తరణను ఆపాలి

అమెరికాలో కొత్తగా బైడెన్ ప్రభుత్వం ఏర్పడినందున దాన్ని అవకాశంగా తీసుకొని ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో ఇజ్రాయిల్ స్థావరాల విస్తరణను అడ్డుకోవాలని 400 మందికి పైగా యురోపియన్ పార్లమెంటేరియన్లు తమ దేశాల నేతలను కోరారు. వారు ఉమ్మడిగా ఒక లేఖను విడుదల చేశారు. యురోపియన్ పార్లమెంట్ లేదా సెనెట్, జాతీయ చట్టసభల్లో పనిచేసిన వీరు యురోపియన్ యూనియన్ విదేశాంగ విధాన చీఫ్ జోసెప్ బొరెల్‌ను ఉద్దేశించి లేఖ రాశారు. మధ్యప్రాచ్య దౌత్యంపై దిద్దుబాటు చర్యలకు బైడెన్ ప్రభుత్వం చొరవ చూపినందున దాన్ని ఉపయోగించుకోవాలని ఆ లేఖలో కోరింది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌తో సాధారణ సంబంధాలు నెలకొల్పుకునేందుకు గాను వెస్ట్ బ్యాంక్‌లో ఆక్రమిత భూ భాగంలో స్థావరాల నిర్మాణాన్ని ఆపేస్తామని ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు అన్నారు. వీ



కవిత్వం

చర్చనీయాంశాలు

పేజీలు: 364

జి. లక్ష్మీనరసయ్య


వెల: రు. 380

కవిసంగమం బుక్స్ ప్రచురణ

ప్రతులకు: **నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్ బ్రాంచెస్**

హైదరాబాద్ - చిక్కడపల్లి, బాగ్‌లింగంపల్లి (ఎస్‌వికె), ఇసిఐఎల్, నల్లగొండ, హన్మకొండ, ఖమ్మం, కరీంనగర్, నిజామాబాద్; ప్రజాశక్తి బుక్ హౌస్ ఆంధ్రప్రదేశ్ బ్రాంచీలలో...

Advt.



తొలి పార్లమెంట్‌లో డాక్టర్ రామారావు

సంపాదకులు డా. సి. కృష్ణ మోహనరావు

డా. చెలికాని రామారావు మెమోరియల్ కమిటీ ప్రచురణ

ప్రతులకు:

రామచంద్రపురం, తూర్పు గోదావరి జిల్లా, 533255,

పేజీలు: 232

ఫోన్ : 9849348162

వెల: అమూల్యం

Advt.


మానవ పరిసరాలు - జీవావరణము

ముత్తన్నగారి రాజేందర్‌రెడ్డి

సహాయోపాధ్యాయుడు (తెలుగు), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
లచ్చపేట్, మం. దుబ్బాక, జిల్లా సిద్దిపేట - 502103,
సెల్ : 9908240768

వెల: రు. 85

పేజీలు: 60



Advt.


పవిత్ర కుటుంబం

వెల: రు. 325


(విమర్శనాత్మక విమర్శపై విమర్శ)

అనువాదం : వై.వి. రమణారావు

పేజీలు: 432



Advt.



మార్క్స్, ఎంగెల్స్‌ల ఉమ్మడి రచన

జర్మన్ భావజాలం

(సంపుటి-1, అధ్యాయం-1)

పేజీలు: 160

అనువాదం : వై.వి. రమణారావు

వెల: రు. 130

వై.వి. రమణారావు

ఇ.నెం. 15-8-967, 4-2-724 (పాతది), మమత హాస్పిటల్ రోడ్,
వరదయ్య నగర్, ఖమ్మం - 507002, ఫోన్ : 9441816881

Advt.

VEEKSHANAM Telugu Monthly Journal of Political Economy and Society - 234 - April 2021 ● **ISSN 2231-6892**
● RNI Regn.No.APTEL/2003/11482 ● Published on 27/03/2021 ● Postal Regn. No. HD/1100/2020-22

Date of Posting : 29th, 30th

If undelivered please return to:

VEEKSHANAM
Mytri Residency, 3-6-394, St. No. 3,
Himayatnagar, Hyderabad - 500 029.
Phone: 040 66843495

To:
Mr./Mrs. ____________________

____

____

____

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Charitha Impressions, Azamabad, Hyderabad - 500 020
and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao